
ఏప్రిల్ 2016 ఫాల్గుణము - చైత్రము | శాలివాహన శకం 1937-38 ₹ 5

# ఆంధ్రప్రదేశ్



## 2016-17 బడ్జెట్

# సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లు





ఇది అభివృద్ధిని అందలం ఎక్కించే బడ్జెట్. రెండంకెల వృద్ధిని నిలకడగా నిలిపే బడ్జెట్. సమాజంలో అన్ని వర్గాలకూ కొత్త అవకాశాల తలుపులు తెరిచే బడ్జెట్. రైతులు, స్త్రీలు, యువత, దళిత, గిరిజన, వెనకబడిన, అల్పసంఖ్యాక వర్గాలు, నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలతోపాటు పౌరులందరికి సాధికారత కల్పించే బడ్జెట్. ఉగాది ముంగిట నవయుగాదికి ఆశలు మోసులెత్తించిన బడ్జెట్!

# నిన్న స్వప్నం... నేటి సత్యం!

## అమరావతిలో ప్రభుత్వ భవన సముదాయం నమూనాలు



శాసనసభా ప్రాంగణం



రివర్ బండ్ రోడ్



హైకోర్టు భవనము



సచివాలయ సముదాయం



కృష్ణా తీరం మీదుగా ప్రభుత్వ భవనాల దృశ్యం

నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి డిజైన్స్ పోటీలో ఎంపికైన జపాన్ సంస్థ మాకీ అండ్ అసోసియేట్స్ అందించిన నమూనాలు.

# ఈ సంచికలో...





తాజా బడ్జెట్.. అభివృద్ధి వేగాన్ని పెంచడంతోపాటు భవిష్యత్‌లో రెండంకెల వృద్ధిని నిలకడగా నిలుపుతుంది. సమాజంలో అన్ని వర్గాలకూ కొత్త అవకాశాలకు తలుపులు తెరుస్తుంది.













ఆంధ్రప్రదేశ్

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితం

సంపుటి 59 సంచిక 10

శాలివాహన శకం 1937–38 ఫాల్గుణము–చైత్రము



## సంపాదకీయం

# వ్యర్థవివాదాలకు సమయం కాదు!

విభజన ద్రోహం వల్ల ఆంధ్రప్రదేశ్ అతలాకుతలమైంది. ఆర్థికంగా కుదేలైంది. పాలనాపరంగా ఛిన్నాభిన్నమైంది. ఈ ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్రమంతా ఒక్కతాటి మీద నిలబడాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల అస్తిత్వానికి, భవిష్యత్తుకు సంబంధించిన అంశంగా ఇవాళ మన ముందుంది.

ఈనాడు రాష్ట్రాన్ని పాలిస్తున్న ప్రభుత్వం సర్వసాధారణంగా ప్రతి ఎన్నికల తర్వాత ఏర్పడే ప్రభుత్వం కాదు. ఇది ఒక విభిన్న సందర్భంలో ఒక అసాధారణ బాధ్యతను తలకెత్తుకున్న ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో వందేళ్లు దిశానిర్దేశం చేయడానికి పూనుకున్న ప్రభుత్వం. ఈ నేపథ్యంలో అభిప్రాయభేదాలూ, వ్యక్తిగత స్పర్థలూ పక్కనబెట్టి ఒక్కతాటి మీద నిలబడాల్సిన సమయమిది. ప్రతిపక్షం కూడా ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూనే, రాష్ట్ర ప్రగతిని అనుక్షణం గమనంలో ఉంచుకోవాల్సిన కాలమిది. పార్టీల స్వప్రయోజనాలను పక్కనబెట్టి, విశాల ప్రజాప్రయోజనాల మీద దృష్టి ఉంచాల్సిన సందర్భమిది.


రాజధాని భూముల మీద ప్రధాన ప్రతిపక్షం రేపిన దుమ్మును ఈ నేపథ్యంలో చూడాలి. అమరావతిలో రాజధాని ఏర్పాటును అన్ని వర్గాలూ స్వాగతించాయి. ఇందుకోసం అవలంబించిన భూసేకరణ విధానానికి దేశ, విదేశాల్లో ప్రశంసలు కురిసాయి. మసకబారిన ప్రతిష్ఠ మళ్లీ వెలుగులీనడానికి అమరావతి రాజధాని నిర్మాణం ఒక ప్రేరణగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పడుతున్న తపనను సామాన్య ప్రజానీకం కూడా గుర్తించింది.

ఆంధ్రప్రదేశ్‌కి ఇంత కీలకమైన రాజధాని నిర్మాణాన్ని తొలి నుంచి వ్యతిరేకించిన ప్రతిపక్షం ఇప్పుడు తన సొంత పత్రికను అడ్డం పెట్టుకొని, అవాకులుచెవాకులు పేలడం మీద అందుకే ముఖ్యమంత్రి అంత ఆగ్రహావేశాలు ప్రదర్శించింది. రాష్ట్ర భవిష్యత్తు మీద కించిత్తు కూడా మమకారం లేని ఈ వైఖరినే ఆయన దునుమాడింది. తమ పార్టీ అభిమానాలతో నిమిత్తం లేకుండా, రైతులు తరతరాల వారసత్వంగా వచ్చిన భూములను రాజధాని కోసం త్యాగం చేసిన వైనం మరువలేనిది. రైతుల పాటి సంస్కారం కూడా మీకు లేదు, అని ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించింది అందుకే. అధారాలు చూపిస్తే, మంత్రులను బర్తరఫ్ చేస్తా అని సభాముఖంగా విసిరిన సవాలుతోనైనా ఇటువంటి వ్యర్థవివాదాలకు స్వస్తి పలుకుతారని ఆశిద్దాం.

కందుల రమేష్

**కందుల రమేష్ బాబు**
ఎడిటర్

Printed and Published by **RAMESH BABU KANDULA** on behalf of Director/Commissioner, Information and Public Relations Dept.; Printed at **M/s Caxton Offset Pvt. Ltd.**, 11.5.416/3, Red Hills, Hyderabad - 500 004; Published at Office of Director/ Commissioner , I&PR Dept, Govt of Andhra Pradesh, Samachar Bhavan, AC Guards, Hyderabad - 500028. Editor: Ramesh Babu Kandula, Ph: 040-23300258.




## రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కరదీపిక

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని పాఠకులకు అక్షరరూపంలో కనుల ముందు సాక్షాత్కరింపగల ఒక అద్భుత కరదీపిక ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక. మార్చి 2016 సంచికలో తెలుగు భాషా వికాసానికి అగ్రతాంబూలం ఇస్తూ, ప్రతి ఒక్కరూ తమ జీవితాల్ని చక్కదిద్దుకునేలా వ్యక్తిత్వం శీర్షికలో మానసిక అవసరాల ప్రాధాన్యతను చక్కగా విశ్లేషించిన శ్రీ సి నరసింహారావుకి, జీవన మార్గం శీర్షికలో మనసుని దైవంగా మార్చుకోవటం ఎలా అని మార్గదర్శనం చేసిన శ్రీ. వి.యస్. ఆర్. మూర్తికి, ఇంతటి అపూర్వ అంశాలను మాకు అందిస్తున్న సంపాదకుల వారికి విశేష అభినందనలు.

– మండా శ్రీధర్, శ్రీకాకుళం

## సాష్టాంగ నమస్కారం సిఎం సంస్కారం

ఆంధ్రప్రదేశ్ మార్చి 2016 సంచికలో సాష్టాంగ నమస్కారం, అనగా ఎటువంటి గర్వం లేకుండా తనువు, మనస్సును భక్తితో అర్పించడాన్ని పత్రికలో చూశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు సచివాలయ నిర్మాణ శంకుస్థాపనకు సాష్టాంగ నమస్కారం చేయడం ఫోటో చూసి ఆశ్చర్యపోయాము. రాజధాని నిర్మాణానికి ఎంతో భక్తి భావంతో విశేష కృషి చేస్తున్నందులకు దైవ బలం కూడా తోడవ్వాలని త్రికరణ శుద్ధిగా కోరుకుంటున్నాము. కులం, మతం పేర్లతో స్వార్థ రాజకీయాలతో జనాలను రెచ్చగొడ్తున్న వార్కి ముఖ్యమంత్రి గారు 7వ పేజీలో చెప్పిన హితవులు చెంపదెబ్బలాగా వున్నాయి.

– గుగ్గిలం శ్రీహరి, వేటపాలెం

## మరింత అందుబాటులో ఉండాలి

ఆంధ్రప్రదేశ్ సమగ్ర ముఖ చిత్రాన్ని అక్షర రూపంలో ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక – ప్రతిమండలం, జిల్లా పరిషత్, ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తప్పక ఉండవలసిన పత్రిక. ప్రభుత్వ పథకాలు – విలువైన జి.ఓలు, ఆధ్యాత్మిక, భాషా వికాస వ్యాసాలు మనసులోని ఆర్ద్రతను తట్టిలేపే కథలు ఇవన్నీ ఒకే దగ్గర దొరికే 'ఆంధ్రప్రదేశ్' ని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మరింత అందుబాటులోకి తేవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఎ.ఆర్.ఎల్ శర్మ, విశాఖ

## కాపులకు రిజర్వేషన్లు – నిజానిజాలు

కాపులకు రిజర్వేషన్లు – ఇవీ వాస్తవాలు ద్వారా నిజా నిజాలు తెల్సుకున్నాం. ఇలాంటి సున్నిత విషయాలను స్పష్టంగా తెలియజేయడం బాగుంది. పేదలకు పెద్ద వైద్యం మరింత ఉచితం – వ్యాసం బాగుంది. ప్రభుత్వ వైద్యశాలలను కార్పొరేట్ స్థాయికి ధీటుగా తీర్చిదిద్దుతూ, పేదలను కూడా మనుషులుగా గుర్తించినందుకు ప్రభుత్వానికి మీ తరపున వందనం.

– ఎంకెవివి సత్యనారాయణమూర్తి, కాకినాడ

## 'ఆంధ్రప్రదేశ్' ఏడాది చందా 50 రూపాయలే

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికకు చందాదారులుగా చేరాలనుకుంటున్న వారు వార్షిక చందా నిమిత్తం 50 రూపాయల మనియార్డరును 'అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్' పేరిట పంపాలి. (మీరు డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) తీసుకునేట్లయితే, బ్యాంకు నిబంధనల ప్రకారం రూ. 60 కి డిడి పంపాలి.) తమ పూర్తి చిరునామాను, తాము 'ఆంధ్రప్రదేశ్ ' పత్రికను ఏ భాషలో కోరుకుంటున్నారో కూడా ఆ మనియార్డరులో రాయాలి. ఆ మనియార్డర్‌ను ఈ క్రింది చిరునామాకు పంపాలి.

అకౌంట్స్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్, ఏ.సి.గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ – 500 028.

చందాదారులు తమ చిరునామా మార్పు, కాపీలు అందకపోవడం గురించి ఈ ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు కనుక్కోవచ్చు: 91-9989662462.

### రచయితలకు గమనిక

'ఆంధ్రప్రదేశ్' పత్రికపై అభిమానంతో రచనలను పంపుతున్న రచయితలు రచనతోపాటు తమ బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ ఫోటో కాపీ గానీ, బ్లాంక్ చెక్కు కొట్టేసి పంపితేనే, ప్రచురితమైన రచనలు పారితోషికం ఆయా అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని అకౌంట్స్ అధికారి తెలియజేస్తున్నారు. రచయితలూ, రచయిత్రులు దీని ప్రాధాన్యత గ్రహించి, మాతో సహకరించవలసిందిగా కోరుకుంటున్నాం.

– సంపాదకులు

## ప్రభుత్వానికి మహిళల కృతజ్ఞతలు

మార్చి 2016 ఆంధ్రప్రదేశ్ సంచికలో పలు శీర్షికలు బాగున్నాయి. ఇప్పటికే డ్వాక్రా గ్రూపుల ఋణాల ద్వారా మహిళలకు ఆత్మ విశ్వాసాన్ని కల్పించి వారి జీవితాలలో వెలుగులు నింపిన ప్రభుత్వం, "షి ఆటో" ల ద్వారా మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు మహిళలు కృతజ్ఞతలు తెల్పుతున్నారు. కోనసీమ సిగపువ్వు. మరో కేరళ అన్పించే "దిండి" టూరిస్ట్ ప్లేస్ ఫోటో / విశేషాలు చదివి ఆశ్చర్యపోయాం. దిండి టూరిస్ట్ ప్లేస్ వద్ద వుండే రూమ్స్ బుకింగ్ మరియు ఇతర వివరాలను తెల్సుకునే వారికి అధికారుల సెల్ నెంబర్లు ప్రచురిస్తే బాగుంటుంది.

– కొత్త కనకదుర్గ, తెనాలి

## కిడ్స్ కార్నర్ మెరుగు పరచండి

కిడ్స్ కార్నర్‌లో పిల్లల జి.కె ను పెంపొందించుటకు క్వశ్చన్స్ మరియు వేరే పేజీలో లేదా అదే పేజీలో రివర్స్‌గా ఆన్సర్స్ అందించగలరు. కంప్యూటర్ పరిజ్ఞానం, రేడియో, టి.వి కనుగొన్న వారిపేర్లు, పిల్లలకు టీకాలు, పోషక ఆహారం అనగా? ఎత్తుకు తగ్గ బరువు, టివిని ఎంత దూరం నుంచి చూడాలి, పిల్లలు కార్టూన్ బొమ్మలను చూడటమే కాకుండా ఇతరత్రా ఆటలు, తెలుగు పద్యాలు, నెహ్రు గురించి, గాంధీ గురించి, పిల్లల మ్యూజియంల గురించి తెలియజేసేలా మార్పులు చేయగలరు.

– డి.చాంద్ బాష, కర్నూలు

ఆంధ్రప్రదేశ్ (తెలుగు, ఇంగ్లిష్) పత్రికను పాఠకులు ఇంటర్నెట్‌లో www.andhrapradeshmagazine.org లో కూడా చదువుకోవచ్చు.




2016-17 బడ్జెట్.. అభివృద్ధి వేగాన్ని పెంచడంతోపాటు భవిష్యత్‌లో రెండంకెల వృద్ధిని నిలకడగా నిలుపుతుంది. సమాజంలో అన్ని వర్గాలకూ కొత్త అవకాశాలకు తలుపులు తెరిచి.. నిర్మాణ రంగ వికాసానికి ముందడుగు వేయిస్తుంది. ఆర్థికంగా, సామాజికంగా బలహీనవర్గాల గృహనిర్మాణానికి, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, రాజధాని నిర్మాణానికీ సహకరిస్తుంది. రైతులు, స్త్రీలు, యువత, దళిత, గిరిజన, వెనకబడిన, అల్పసంఖ్యాక వర్గాలు, కాపు, బ్రాహ్మణ కులాల్లోని నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలతోపాటు పౌరులందరి సాధికారతకు మా బడ్జెట్ అవకాశాన్నిస్తుంది అంటూ ఈ ఏడాది బడ్జెట్‌ని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో ప్రవేశపెట్టారు.

## 2016- 17 బడ్జెట్

# సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు



# సంక్షేమానికి పెద్దపీట

- ప్రజల అవసరాలు, ఆశలు తీర్చేలా బడ్జెట్ రూపకల్పన
- రెండంకెల వృద్ధి దిశగా పయనం
- గతేడాది కంటే 20.03% పెరిగిన అంచనాలు

నవ్యాంధ్ర ఆదర్శం - అభివృద్ధి. ఆదర్శవంతమైన సమగ్రాభివృద్ధి. అయితే, రాష్ట్రం సంక్షేమాంధ్ర కానిదే, ఆదర్శాలు, అభివృద్ధీ అందుకోలేమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిశ్చితాభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని తాజా బడ్జెట్ పూర్తిగా ప్రతిబింబించింది. సంక్షేమ విభాగానికి జరిగిన కేటాయింపులు ముఖ్యమంత్రి ఆదర్శాన్ని అమలు చేసేవే. సంక్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లోనూ రూ. 1.35 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి భవిష్యత్తుపై బడ్జెట్ ఆశలు రగిల్చింది. సమైక్యరాష్ట్రంలో నాలుగేళ్ల క్రితం ప్రణాళిక పద్దు కింద కేటాయించిన మొత్తానికి సమానమైన కేటాయింపులను ఈసారీ జరిపి రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతోందన్న సందేశాన్ని ఇవ్వగలిగింది.

## సామాజిక వర్గాలకు చేయూత

అన్ని సామాజిక వర్గాలకూ ఈసారి ప్రభుత్వం కేటాయింపులు పెంచింది. కాపులకు ఇచ్చిన మాట ప్రకారం కాపు కార్పొరేషన్‌కు రూ.వెయ్యికోట్లు పెట్టింది. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ. 65 కోట్లు కేటాయించింది. మిగతా సామాజిక వర్గాల కార్పొరేషన్లకూ ఎంతోకొంత మొత్తాన్ని పెంచి ఉన్న వనరులను అందరికీపంచిపెట్టే ప్రయత్నం చేసింది. సామాజిక సేవలరంగానికి పెద్దపీట వేసింది. నిరుడు జరిపిన కేటాయింపుల వ్యయంలో వెనుకబడినప్పటికీ ఈసారి ఆ పొరపాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకొంది. ఈసారి ప్రణాళిక వ్యయంలో 43% మొత్తాన్ని సామాజిక సేవల రంగానికే కేటాయించింది.

"క్షేత్రస్థాయి అవసరాలకు, ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా బడ్జెట్ రూపొందించాం. ప్రజల సలహాలు, సూచనలూ స్వీకరించి సముచితమనిపించినవి పరిగణనలోకి తీసుకొన్నాం. ప్రపంచవ్యాప్తంగా నిరుత్సాహకర పరిస్థితి, జాతీయ స్థాయిలో గొప్ప ఆశావహ దృక్పథం, స్థానికంగా కట్టలు తెంచుకొంటున్న ఉత్సాహం నెలకొన్న వాతావరణంలో బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నాం. 2016-17 బడ్జెట్.. అభివృద్ధి వేగాన్ని పెంచడంతోపాటు భవిష్యత్‌లో రెండంకెల వృద్ధిని నిలకడగా నిలుపుతుంది. సమాజంలో అన్ని వర్గాలకూ

కొత్త అవకాశాలకు తలుపులు తెరిచి.. నిర్మాణ రంగ వికాసానికి ముందడుగు వేయిస్తుంది. ఆర్థికంగా, సామాజికంగా బలహీనవర్గాల గృహనిర్మాణానికి, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, రాజధాని నిర్మాణానికీ సహకరిస్తుంది. రైతులు, స్త్రీలు, యువత, దళిత, గిరిజన, వెనకబడిన, అల్పసంఖ్యాక వర్గాలు, కాపు, బ్రాహ్మణ కులాల్లోని నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలతోపాటు పౌరులందరి సాధికారతకు మా బడ్జెట్ అవకాశాన్నిస్తుంది," అని యనమల ప్రకటించారు.

## కలకాలం నిలిచేలా అభివృద్ధి

"పౌరులందరికీ గుణాత్మక విద్య, ఆరోగ్య రక్షణ, ఆహారభద్రత అందిస్తాం. కలకాలం నిలిచే అభివృద్ధి వ్యూహం అములతో మానవాభివృద్ధి సూచికల్ని పెంపొందిస్తాం. మధ్యలోనే బడి మానేసే పిల్లల సంఖ్యను తగ్గించగలిగాం. ఈసారి పాఠశాల, ఉన్నత, కళాశాల, సాంకేతిక విద్యలకు కేటాయింపులు పెంచాం. మధ్యాహ్నభోజన పథకానికి రూ.750 కోట్లు, ఐసీడీఎస్‌కు రూ.772 కోట్లు ఇస్తున్నాం. ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.2702.20 కోట్లు ఖర్చవుతుందని అంచనా. 2029 నాటికి రాష్ట్రంలో దారిద్ర్య నిర్మూలనకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతోపాటు ఇతర కులాల్లో ఆర్థికంగా వెనకబడినవారి కోసం కేటాయింపులు పెంచాం. కాపు కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.65 కోట్లు కేటాయించాం. యువత సాధికారతకు సంస్థాగత నిర్మాణాన్ని ప్రతిపాదించాం. దేశంలో నైపుణ్య రాజధానిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం. గృహనిర్మాణ వ్యయం సాధారణ తరగతికి 6 రెట్లు, దళిత, గిరిజన లబ్ధిదారులకు 8 రెట్లు పెంచాం. వారికి ముడిసరకుల్ని, తక్కువ ధరకు సిమెంటు అందేలా చూస్తున్నాం," అని యనమల వివరించారు.

## కేటాయింపులు – ముఖ్యాంశాలు

**సాంఘిక సంక్షేమ శాఖ:**

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2016-17 సంవత్సరానికి గాను సాంఘిక సంక్షేమ శాఖకు రూ. 3236.01 కోట్లు కేటాయించింది.
- ఇది గత సంవత్సరం బడ్జెటు అనగా రూ.2692.62 కోట్లు కన్నా రూ.543.39 కోట్లు, అనగా 20.18 శాతం ఎక్కువ.
- ఇందులో ప్రణాళికేతర పద్దు కింద రూ. 853.74 కోట్లు కేటాయించింది. ఇది 2015-16 ప్రణాళికేతర కేటాయింపులు రూ.829.88 కోట్లు కన్నా రూ.23.86 కోట్లు, అనగా 2.87 శాతం ఎక్కువ.
- ప్రణాళిక కేటాయింపుల కింద రూ. 2382.27 కోట్లు కేటాయించింది. ఇది 2015-2016 కేటాయింపులు రూ. 1862.74 కోట్లు కన్నా రూ. 519.53 కోట్లు, అనగా 27.89 శాతం ఎక్కువ.
- కేంద్రప్రభుత్వం ప్రాయోజిత పథకాలు కింద రూ.305.91 కోట్లు కేటాయించారు.
- సాంఘిక సంక్షేమ శాఖ బడ్జెటులో 2016-17 కు గాను కేటాయించిన మొత్తంలో సాంఘిక విద్యాకార్యక్రమాలకు అన్నింటికీ కలిపి రూ. 1465.30 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది మొత్తం బడ్జెటులో 45.28 శాతం.
- హాస్టళ్ళ నిర్వహణకు గాను రూ. 389.55 కోట్లు కేటాయించడం జరిగింది.
- షెడ్యూల్డు కులాల విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం కోసం నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకులాలకు మొత్తం రూ. 920.64 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది 2015-16 కంటే రూ. 357.52 కోట్లు, అనగా 63.48 శాతం ఎక్కువ.
- మొత్తం ఉపకార వేతనాల నిమిత్తం రూ. 761.53 కోట్లు కేటాయించడం జరిగింది. అందులో పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల నిమిత్తం రూ.598.72 కోట్లు కేటాయించింది. ప్రీమెట్రిక్ ఉపకారవేతనాల నిమిత్తం రూ.162.81కోట్లు కేటాయించడం జరిగింది.
- ఆర్థికాభివృద్ధి పథకాల కోసం రూ. 546.64 కోట్లు కేటాయించింది.
- వివిధ రకాల నిర్మాణ కార్యక్రమాలు చేపట్టడానికి మొత్తం రూ.534.84 కోట్లు వివిధ పథకాల కింద కేటాయించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నిర్మాణం కోసం రూ. 324.84 కోట్లు కేటాయించడం జరిగింది.
- హాస్టళ్ళను గురుకుల పాఠశాలలగా మార్చడం కోసం రూ.299.84 కోట్లు కేటాయించడం జరిగింది.
- నెలకు 50 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం చేస్తున్న షెడ్యూల్డు కులాల

| శాఖ | కేటాయింపు రూ.కోట్లలో |
|---|---|
| గ్రామీణాభివృద్ధి శాఖ | 2606.36 |
| సాంఘిక సంక్షేమ శాఖ | 1840.00 |
| గృహ నిర్మాణం | 614.67 |
| సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ | 542.27 |
| పాఠశాల విద్య | 429.26 |
| వ్యవసాయం | 336.46 |
| స్త్రీ శిశు సంక్షేమం | 297.58 |
| పురపాలక | 259.86 |
| పంచాయితీరాజ్(ఇంజనీరింగ్) | 221.00 |
| పరిశ్రమలు | 181.40 |

కుటుంబాలకు విద్యుత్ చార్జీలు చెల్లింపు కోసం రూ. 159.23 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది గత సంవత్సరం కేటాయింపు కన్నా రూ. 109.23 కోట్లు ఎక్కువ.

- షెడ్యూల్డు కులాల విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షల నిమిత్తం శిక్షణ నిచ్చే ఎన్.టి.ఆర్ విద్యోన్నత కార్యక్రమం కింది రూ. 14 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ సంవత్సరం లక్ష్యంగా పెట్టుకున్న 350 మందికి గాను 320 మంది విద్యార్థులు ఇప్పటికే శిక్షణ పొందుతున్నారు. రానున్న ఏడాదిలో 700 మందికి శిక్షణ ఇవ్వటానికి ప్రభుత్వం ఉత్తర్వులు అంగీకరించింది.

## షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక


- షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక కింద రూ. 8724.26 కోట్లు కేటాయించింది.
- 2015-16 కేటాయింపులు రూ. 5877.96 కోట్లు కన్నా ఈ కేటాయింపులు రూ.2846.30 కోట్లు, అనగా 48.42 శాతం ఎక్కువ.
- ఉపప్రణాళిక కింద మొత్తం 42 శాఖలకు కేటాయింపులు చేయడం జరిగింది.
- ఇందులో ఎక్కువ శాతం కేటాయింపులు పొందుతున్న మొదటి 10 శాఖలు వాటి కేటాయింపులు ఈ విధంగా ఉన్నాయి.

| శాఖ | కేటాయింపు రూ.కోట్లలో |
|---|---|
| గ్రామీణాభివృద్ధి శాఖ | 1021.69 |
| గిరిజన సంక్షేమ శాఖ | 980.06 |
| పాఠశాల విద్యాశాఖ | 138.82 |
| రహదారులు (ఆర్.బి, పంచాయితీరాజ్) | 119.64 |
| స్త్రీ శిశు సంక్షేమ శాఖ | 119.03 |
| గృహ నిర్మాణం | 100.00 |
| వ్యవసాయ శాఖ | 86.46 |
| వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం | 70.00 |
| ప్రణాళిక | 57.02 |
| గ్రామీణ మంచినీటి సరఫరా | 55.89 |

- షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికను రూపకల్పన చేయటానికి, ఉపప్రణాళిక అమలును ఎప్పటికప్పుడు సమీక్షించడానికి అడ్మినిస్ట్రేటివ్ మరియు టెక్నికల్ మానిటరింగ్ యూనిట్ (కన్సల్టెన్సీ ప్రాతిపదన) మరియు రీసెర్చి సెల్ ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం అనుమతి నిచ్చింది. ఇందుకు గాను సాంఘిక సంక్షేమ శాఖలో బడ్జెటులో రూ.21.94 కోట్లు కేటాయించింది.
- షెడ్యూల్డు ప్రాంతాల్లోని షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు పథకాల గురించి జాగృతి కలిగించడం కోసం కార్యక్రమాలు చేపట్టడానికి రూ. 5.8 కోట్లు సాంఘిక సంక్షేమ శాఖ పద్దులో కేటాయించింది.

## గిరిజన సంక్షేమశాఖ

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2016-17 సంవత్సరానికి గాను గిరిజన సంక్షేమ శాఖకు రూ.1563.37 కోట్ల బడ్జెటు కేటాయించింది.
- ఇది గత సంవత్సరం బడ్జెటు అనగా రూ. 1115.30 కోట్ల కన్నా రూ.448.07 కోట్లు, అనగా 40 శాతం ఎక్కువ.
- ఇందులో ప్రణాళికేతర పద్దు కింద రూ. 583.31 కోట్లు కేటాయించింది. ఇది 2015-16 ప్రణాళికేతర కేటాయింపులు రూ.496.88 కోట్లు కన్నా రూ.86.42 కోట్లు, అనగా 17.39 శాతం ఎక్కువ.
- ప్రణాళిక కేటాయింపుల క్రింద రూ. 980.06 కోట్లు కేటాయించింది. ఇది 2015-16 కేటాయింపులు రూ.618.42 కోట్లు కన్నా రూ.361.64 కోట్లు, అనగా 58.47 శాతం ఎక్కువ.
- కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకాల క్రింద రూ. 325.82 కోట్లు కేటాయించింది. ఇది 2015-16 బడ్జెటు కేటాయింపులో రూ. 128.00 కోట్లు కన్నా రూ.197.82 కోట్లు,అనగా155 శాతం ఎక్కువ.
- గిరిజన సంక్షేమ శాఖ బడ్జెటులో 2016-17కు గాను కేటాయించిన మొత్తంలో గిరిజన విద్యాకార్యక్రమాలకు అన్నింటికీ కలిపి రూ.1073.49 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది మొత్తం బడ్జెట్‌లో 69 శాతం.
- ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ళ నిర్వహణకు గాను రూ. 516.34 కోట్లు కేటాయించడం జరిగింది.
- గిరిజన విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం కోసం నిర్వహిస్తున్న గిరిజన గురుకులాలకు మొత్తం రూ.207.88 కోట్లు కేటాయించడం జరిగింది.
- మొత్తం ఉపకార వేతనాల నిమిత్తం రూ. 236.17 కోట్లు కేటాయించడం జరిగింది. అందులో పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల నిమిత్తం రూ.120 కోట్లు కేటాయించింది. ప్రీమెట్రిక్ ఉపకారవేతనాల నిమిత్తం రూ.116.17 కోట్లు కేటాయించడం జరిగింది.
- ఆర్థికాభివృద్ధి పథకాల కోసం రూ. 132.66 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.30 కోట్లు ప్రత్యేకంగా పిటిజిల కోసం



గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకు, గిరిజన ఉపప్రణాళిక గురించి చైతన్యం కలిగించడం కోసం కార్యక్రమాలు చేపట్టడానికి రూ.5 కోట్లు గిరిజన సంక్షేమ శాఖ పద్దులో కేటాయించింది.

కేటాయించింది.

- వివిధ రకాల నిర్మాణ కార్యక్రమాలు చేపట్టడానికి మొత్తం రూ.151.10 కోట్లు వివిధ పథకాల కింద కేటాయించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా గిరిజన గురుకుల పాఠశాలల నిర్మాణం కోసం రూ.47 కోట్లు కేటాయించారు..
- హాస్టళ్ళను గురుకుల పాఠశాలలగా మార్చడం కోసం రూ.22 కోట్లు కేటాయించారు..
- గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు చిన్నతరహా అటవీ ఫలసాయం సేకరిస్తున్నందుకు అటవీ శాఖకు చెల్లించవలసిన రెంటల్స్ నిమిత్తం రూ.28 కోట్లు కేటాయించడం జరిగింది. దీనివల్ల దీర్ఘకాలంగా అటవీశాఖకు బకాయిపడ్డ చెల్లింపులు చెల్లించడానికి వీలవుతుంది.
- నెలకు 50 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం చేస్తున్న గిరిజన కుటుంబాలకు విద్యుత్ చార్జీలు చెల్లింపు కోసం రూ.25 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది గత సంవత్సరం కేటాయింపు కన్నా రూ.10 కోట్లు ఎక్కువ.
- కాఫీ తోటల పునరుద్ధరణకు మరియు కాఫీ కొనుగోలుకు రూ.15.64 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది గత సంవత్సరం కేటాయింపుల కన్నా రూ.10 కోట్లు ఎక్కువ.
- మైదాన ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధి కోసం రూ.5.30 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది గత సంవత్సరం కేటాయింపుల కన్నా రూ.2.30 కోట్లు ఎక్కువ.
- గిరిజన యువతులకు వివాహ సందర్భంగా ఇచ్చే ప్రోత్సాహకం "గిరి పుత్రికా కళ్యాణ పథకం" కింద రూ.7.50 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది గత సంవత్సరం కన్నా రూ.2.5 కోట్లు ఎక్కువ.
- గిరిజన విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షల నిమిత్తం శిక్షణ నిచ్చే ఎన్ టి ఆర్ విద్యోన్నత కార్యక్రమం కింద రూ.3.5 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ సంవత్సరం లక్ష్యంగా పెట్టుకున్న 100 మందికి గాను 92 మంది విద్యార్థులు ఇప్పటికే శిక్షణ పొందుతున్నారు. రానున్న ఏడాదిలో 150 మందికి శిక్షణ ఇవ్వటానికి ప్రభుత్వం ఉత్తర్వులు మంజూరు చేసింది.
- గిరిజన ప్రాంతాల విద్యుద్దీకరణకు, వ్యవసాయ పంపుసెట్ల విద్యుద్దీకరణకు రూ.20 కోట్లు కేటాయించడం జరిగింది.
- విశాఖపట్నంలో గిరిజన పరిశోధనా సంస్థ భవనం నిర్మించడం కోసం రూ.1 కోటి కేటాయించారు..
- గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తల వేతనాలు చెల్లింపుల కోసం రూ. 5 కోట్లు కేటాయించడం జరిగింది. దీని ద్వారా ఇంతవరకు వారికి బకాయి ఉన్న వేతనాలు కూడా సత్వరమే విడుదల చేయడానికి వీలవుతుంది.
- గిరిజన సహకార సంస్థకు ప్రత్యేక సహాయ నిమిత్తం రూ.7.92 కోట్లు కేటాయించారు..
- గిరిజన ప్రాంతాల్లో అటవీ హక్కుల పరిరక్షణ చట్టం అమలు కోసం రూ. 3.5 కోట్లు కేటాయించారు..
- గిరిజన యువతీ యువకులకు శిక్షణా నైపుణ్యాలు మెరుగు పరచడం కోసం రూ. 6.50 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది గత సంవత్సరం కేటాయింపుల కన్నా రూ.3 కోట్లు ఎక్కువ.

## గిరిజన ఉపప్రణాళిక

- గిరిజన ఉపప్రణాళిక కింద రూ. 3099.96 కోట్లు కేటాయించింది.
- 2015-16 కేటాయింపులు రూ.1908.48 కోట్లు కన్నా ఈ కేటాయింపులు రూ. 1191.48 కోట్లు, అనగా 62.43 శాతం ఎక్కువ.
- ఉపప్రణాళిక కింద మొత్తం 45 శాఖలకు కేటాయింపులు చేయడం జరిగింది.
- గిరిజన ఉపప్రణాళికను రూపకల్పన చేయటానికి ఉపప్రణాళిక అమలును ఎప్పటికప్పుడు సమీక్షించడానికి అడ్మినిస్ట్రేటివ్ మరియు టెక్నికల్ మానిటరింగ్ యూనిట్‌ని కన్సల్టెన్సీ ప్రాతిపదికన ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇందుకు గాను గిరిజన సంక్షేమ శాఖలో బడ్జెటులో రూ.5 కోట్లు కేటాయించింది.
- గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకు, గిరిజన ఉపప్రణాళిక గురించి జాగృతి కలిగించడం కోసం కార్యక్రమాలు చేపట్టడానికి రూ.5 కోట్లు గిరిజన సంక్షేమ శాఖ పద్దులో కేటాయించింది.

❖

# అభివృద్ధి వేగాన్ని పెంచుతున్న బడ్జెట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో సాగునీటి పారుదలకి, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, అలాగే ఐటి, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. రాజధాని నిర్మాణానికి, యువతలో నైపుణ్యాభివృద్ధికి, పల్లెసీమల ప్రగతికి బాటలు వేశారు. నిరుద్యోగ యువతకు 20 వేల ఉద్యోగాలు కల్పిస్తామంటూ వారి భవిష్యత్‌పై మంత్రి యనమల విశ్వసనీయత కలిగించగలిగారు. యువత స్వయం ప్రతిపత్తి దిశగా అధునాతన ఆలోచనలతో ముందుకు పయనించాలన్న ప్రధాన లక్ష్యంతో రూ.250 కోట్లు కేటాయించి యువత సాధికారత పట్ల ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకున్నది.



## రూ.5 వేల కోట్లతో 'అమరావతి' నిర్మాణం

అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో అత్యంత అధునాతన, సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించబోతున్న నూతన రాజధాని అమరావతి మహానగరానికి నవ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2016 -17 వార్షిక బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యం కల్పించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ రాజధాని నిర్మాణానికి రూ.5,000 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేయగా, ఇందుకోసం ఈ బడ్జెట్‌లోనే రూ.1,500 కోట్లు కేటాయించి, రాజధానిపట్ల ప్రభుత్వానికి ఉండే చిత్తశుద్ధిని రుజువు చేసుకున్నది. ఈ అంచనా వ్యయంలో కేంద్రప్రభుత్వం నుంచి మరో వెయ్యి కోట్ల మేరకు ఆర్థిక సహాయం అందవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది.

మొత్తం కేటాయింపు రూ.1500 కోట్లు, ఇందులో రాజధాని సామాజిక భద్రతానిధికి రూ.70.50 కోట్లు, రాజధాని కోసం భూముల సమీకరణ కోసం రూ.1017.87కోట్లు, అమరావతి నగర అభివృద్ధి ప్రాజెక్టు కోసం రూ.పదికోట్లు, అమరావతి మెట్రోరైలు ప్రాజెక్టుకు రూ.300కోట్లు వంతున కేటాయించారు.

## పోలవరం ప్రాజెక్టుకు ప్రాధాన్యం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం భారీ నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణానికి ఈ కొత్త బడ్జెట్‌లో ఎంతో ప్రాధాన్యం కల్పించారు. కేంద్రప్రభుత్వంచే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించబడిన దీనికి బడ్జెట్‌లో ఏకంగా రూ.3,387 కోట్లు కేటాయించడం విశేషం. రాష్ట్రం అనేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా...గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో భాగంగా దీని నిర్మాణానికి అంత ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. ఒక పక్క కేంద్రప్రభుత్వం దీనికి ఆర్థికంగా ఆశించినంత సహకరించకపోయినా, రాష్ట్ర ప్రభుత్వమే దీన్ని 2018 నాటికి పూర్తిచేయాలన్న సత్సంకల్పంతో ఈ బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించడంతో రైతులకిచ్చిన మాటను నిలబెట్టుకోవడంపై ముఖ్యమంత్రికి ఉండే చిత్తశుద్ధిని రుజువు చేస్తున్నది.

కేంద్రప్రభుత్వం గత బడ్జెట్‌లో కేవలం రూ.100కోట్లే ఇవ్వగా, ఈ కొత్త బడ్జెట్‌లో ఆ లోటును భర్తీ చేస్తుందని అందరూ గంపెడాశతో భావించారు. కానీ కేంద్రం మళ్లీ ఈ సారి బడ్జెట్‌లో కూడ కేవలం వందకోట్లే కేటాయించడం రాష్ట్ర ప్రజలకు నిరుత్సాహం కలిగించింది. 2015 - 16 బడ్జెట్‌లో పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టు పనులకోసం రూ.1032 కోట్లు కేటాయించగా, దీనికి రెట్టింపు నిధులు ఖర్చుచేయాల్సి వచ్చింది. గోదావరి వరద నీటిలో 80 టీఎంసీల నీటిని

కృష్ణానదికి తరలించాలన్న లక్ష్యంతో చేపట్టిన పట్టిసీమఎత్తిపోతల పథకానికి రూ.1202.86 కోట్లు ఇంతవరకు వ్యయం చేసింది. దీనితోపాటు పోలవరం కుడి కాలువ, సంబంధిత పనులకోసం మరో రూ.1522.12 కోట్లు ఖర్చుచేసింది. ఈ నిధులన్నీ రాష్ట్ర ప్రభుత్వమే భరించింది. ఈ నిధులను కేంద్రం సర్దుబాటు చేస్తుందని ప్రభుత్వం ఆశాభావంతో ఉన్నది.

## సాగునీటి పారుదలకు పెద్దపీట

రాష్ట్రప్రభుత్వం ఈ సారి బడ్జెట్‌లో సాగునీటి పారుదల ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఏడు ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో 2018 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకే రాబోయేమూడేళ్లలోనే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి తీరాలని ముఖ్యమంత్రి పట్టుదలతో ఉన్నారు. గత ఏడాది సాగునీటి పారుదల ప్రాజెక్టులకు రూ.4,678.13 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం ఈ కొత్త బడ్జెట్‌లో రూ.8,326 కోట్లు, అంటే దాదాపు రెట్టింపు చేయడం, ఈ బడ్జెట్‌లోనే పోలవరం కోసం రూ.7,325 కోట్లు కేటాయించడం శుభపరిణామం.

రానున్న మూడేళ్లలో ప్రాధాన్యతా క్రమం కింద గుర్తించిన ఏడు ప్రాజెక్టులను పూర్తి చేయాలంటే కనీసం రూ.23 వేల కోట్లు అవసరం ఉంటుందని అధికారుల అంచనా. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇంత భారీ మొత్తాన్ని రానున్న మూడేళ్లలో సమకూర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. కాగా మధ్యతరహా నీటిప్రాజెక్టులకు రూ.100.58 కోట్లు, చిన్ననీటిపారుదల ప్రాజెక్టులకు రూ.679.62 కోట్లు, ఆయకట్టు అభివృద్ధి పనులకోసం రూ.137 కోట్ల వంతున కేటాయించారు.

## రూ.2,398కోట్లతో ఈ-ప్రగతి

నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రజలకు పారదర్శకమైన సత్పరిపాలన అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ-ప్రగతి, ఈ-కార్యాలయ ప్రాజెక్టులు ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పరిపాలనలో ఈ ప్రక్రియలే కీలకం కాబోతున్నాయి. ఇందుకోసం రూ.2,398 కోట్లు వ్యయం చేయబోతున్నట్లు బడ్జెట్‌లో పేర్కొనడం హర్షణీయం. ఈ ప్రాజెక్టులను కార్యరూపంలో పెట్టడం ద్వారా అవినీతి రహిత పాలన, లబ్ధిదారులకు పారదర్శకమైన సేవలు అందించనున్నారు. ఈ-ప్రగతి పరిపాలనకోసం రాబోయే మూడేళ్లలో రూ.1,528 కోట్లు ఖర్చుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా సమీకృత సమాచార నిధి (డేటాబేస్) తో అర్హులకు ప్రభుత్వం అమలు చేసే పథకాల ఫలాలను అందించనున్నారు. పౌరుల వివరాలతో సమగ్ర సమాచార నిధిని సిద్ధం చేస్తున్నారు. ఈ వివరాలను నమోదు చేయడానికి క్షేత్రస్థాయిలో లక్ష ట్యాబ్‌లను అధికారులకు సరఫరా చేశారు. ఓటరు నమోదు, వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, నైపుణ్య శిక్షణ నమోదు, ఉద్యోగాలు, పాస్‌పోర్టు, ఆదాయపు పన్ను చెల్లింపులు తదితర ప్రక్రియలన్నీ నమోదు చేయనున్నారు. ఈ-ప్రగతి ద్వారా మనిషి జననం నుంచి మరణం దాకా తమ దైనందిన జీవనంలో కావలసిన సేవలన్నింటినీ ఆన్‌లైన్లో పొందడానికి వీలుపడుతుంది. ఈ-ప్రగతి ద్వారా ప్రస్తుతం 103 రకాల సేవలు అందిస్తున్నారు.

## దేశంలోనే అగ్రగామి కానున్న ఏపి 'ఐటి'

రాష్ట్రంలో ఐటి రంగాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్ర ఐటి మంత్రి డా.పల్లె రఘునాథరెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఐటి అభివృద్ధికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.360.21 కోట్లు కేటాయించింది. నవ్యాంధ్రలో ఐటి కార్యకలాపాలను మరింత వృద్ధిలోకి తీసుకురావడానికి వీలుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రైవేటు భవనాలను డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్కు (డీటీపీ)లుగా ప్రభుత్వం గుర్తించింది. ఐటి సంస్థలు ఈ పార్కుల్లో తమ కార్యకలాపాలను తక్షణమే ప్రారంభించేందుకు వీలుగా ప్రభుత్వం వాటికి ప్రోత్సాహకాలు ప్రకటించింది. డీటీపీలు ప్రోత్సహించి, ఐటీరంగాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. ఇందుకోసం రూ.123.65 కోట్లు కేటాయించారు. ఇంజినీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులకు నైపుణ్యతలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి బడ్జెట్‌లో రూ.4 కోట్లు కేటాయించారు.

నవ్యాంధ్ర ఐటి హబ్‌గా రూపాంతరం చెందబోతున్న విశాఖపట్నం నగరంలో 600 ఎకరాల విస్తీర్ణంలో ఐటి మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించారు. అలాగే విజయవాడలో 500 ఎకరాలు, తిరుపతిలో 225 ఎకరాలలో ఐటి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.3 కోట్లు కేటాయించారు. అలాగే ఏపి ఎంటర్‌ప్రైజెస్ ఆర్కిటెక్చర్‌కు (ఈ-ప్రగతి) రూ.17.53 కోట్లు కేటాయించగా, ఎలక్ట్రానిక్స్ ఐటీ ఏజెన్సీకి రూ.146.87 కోట్లు, జాతీయ ఈ-పరిపాలనాప్రణాళికకు రూ.49.40 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.

చిత్తూరు జిల్లాను మొబైల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే ఐదు ఎలక్ట్రానిక్ తయారీ పరిశ్రమల స్థాపనకు కేంద్రం నుంచి అనుమతులు లభించాయి. డిజిటల్ ఇండియాలో భాగంగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టు ఐటి రంగంలో ప్రధాన భూమిక వహించబోతున్నది.

ఏప్రిల్ నెల నుంచి ఇంటింటికీ నెలకు రూ.150 కే అంతర్జాలం, కేబుల్ సేవలు అందించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుని ఆ మేరకు చురుకుగా సన్నాహాలు చేస్తున్నది. రెండోదశ ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్రం పరిశీలనలో ఉన్నాయి. 2019 నాటికి ఐటి రంగంలో ఈ-ప్రగతికి రూ.2,400 కోట్లు ఖర్చుచేయాలని నిర్ణయించారు.

## యువత ఉజ్వల భవిష్యత్‌కు ప్రత్యేక నిధులు

యువతలో అంతర్లీనమై ఉండే విజ్ఞానాన్ని వెలికితీసి, వారిలో నైపుణ్యత పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది. యువతలో ఉన్న విజ్ఞానాన్ని వినియోగించి, వారిని భవిష్యత్ మానవ వనరుగా రూపొందించి, రాష్ట్ర సమగ్ర, ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని ప్రభుత్వం నిర్ణయించింది. శాస్త్ర సాంకేతిక రంగాలలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నది. నైపుణ్యా శిక్షణ, స్టార్టప్‌లకు 2016-17బడ్జెట్‌లో రూ.376.39 కోట్లు కేటాయించారు.

అనంతపురం, తిరుపతి , కాకినాడ, విశాఖపట్నం నగరాలలో ఇంక్యుబేషన్ కేంద్రాలను నెలకొల్పాలని నిర్ణయించారు.. వీటిలో 177

స్టార్టప్ ప్రాజెక్టులు నెలకొల్పడానికి అవకాశం ఉంది. ఇప్పటికే విశాఖపట్నంలో స్టార్టప్ విలేజీ నుంచి మూడు ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయి. ప్రతీ జిల్లా కేంద్రంలోనూ స్టార్టప్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ స్టార్టప్‌ల ద్వారా నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం త్వరలో ఎంటర్‌ప్రెన్యూర్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. నైపుణ్యతలో యువతీయువకులకు శిక్షణ ఇచ్చి మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా భవిష్యత్‌లో ఉద్యోగాలను కల్పించేందుకు ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.

## రాబోయే రోజుల్లో 20 వేల ఉద్యోగాలు భర్తీ

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఇరవై వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. ప్రభుత్వ నిర్ణయం నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు రేపింది. ఈ ఉద్యోగాల భర్తీకోసం త్వరలో ప్రకటనలు జారీ చేయనున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. మంత్రి యనమల ప్రకటనతో ఇక ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ కావలసిన పోస్టులకు, పోలీసుశాఖలో ఖాళీగా ఉన్న 8,500 పోస్టులు, మరికొన్ని ఎస్ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశాలు దగ్గరపడుతున్నాయి. గ్రూప్-1 ద్వారా 189 పోస్టులు, గ్రూపు-2 ద్వారా మరో 890 పోస్టుల భర్తీకి అవకాశాలున్నాయి. అలాగే కళాశాల విద్యాశాఖ పరిధిలోని డిగ్రీ కాలేజీలు, ఇంటర్ విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీ జరగవలసి ఉన్నది. ప్రభుత్వం నుంచి ఉద్యోగ ఖాళీల వివరాలు అందిన వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీచేయడానికి ఏపిపీఎస్సీ సిద్ధంగా ఉన్నది. ఇవికాకుండా నవ్యాంధ్ర ఏర్పాటైన వెంటనే ప్రభుత్వం ప్రభుత్వోద్యోగుల పదవీవిరమణ వయోపరిమితిని 58 నుంచి 60 ఏళ్లకు పెంచింది. దీంతో 58 సంవత్సరాలకు పదవీవిరమణ చేయాల్సిన ఉద్యోగులంతా వచ్చే జూన్‌లో పదవీ విరమణ చేయనున్నారు. ఈ పదవీ విరమణ పోస్టులను కూడా తదనంతరం భర్తీ చేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీచేయనున్నది. ఏదైతేనేమి రాబోయే రోజుల్లో అర్హతలున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వ కొలువుల్లో భారీగా చోటు లభించే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక 10,500 ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేయడానికి 2014లోనే డీఎస్సీ ప్రకటన జారీచేశారు. ఇందులోభాగంగా 8,500 పోస్టులను త్వరలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. అయితే వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల కారణంగా మిగతా పోస్టులను భర్తీ చేయడానికి కొంత సమయం పడుతుంది. కోర్టుల నుంచి స్పష్టత వచ్చాక ఆయా పోస్టులు భర్తీ చేయనున్నారు. కాగా గిరిజన ప్రాంతాలలో ఉపాధ్యాయుల పోస్టులను గిరిజనశాఖ ఆధ్వర్యంలో నేరుగా భర్తీ చేశారు.

## పల్లెల ప్రగతికి పెట్టపీట

రాష్ట్ర ప్రభుత్వం పల్లెసీమల ప్రగతికి ఈ బడ్జెట్‌లో పెట్టపీట వేసింది. బడ్జెట్‌లో గ్రామీణ అభివృద్ధికి రూ.16,115 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ కేటాయింపులు దాదాపు 35.6 శాతం ఎక్కువ కావడం విశేషం. పల్లెలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చూపుతున్న ప్రేమకు ఇదో నిదర్శనం. పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.4,467 కోట్లు సహాయం అందించాలని నిర్ణయించారు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇవ్వాల్సిన వాటాను 75 శాతానికి పెంచారు. ఈ పద్దు కింద ప్రభుత్వం రూ.4,764 కోట్లు కేటాయించింది. గత ఏడాది కేంద్రప్రభుత్వం ఈ పథకం కింద రూ.2,800 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.3,400 కోట్లు ఖర్చు చేసింది.

గ్రామాలలో సిమెంట్ రహదారులు, నీరు-చెట్టు, వ్యవసాయ కుంటల తవ్వకం, శ్మశానాల అభివృద్ధి ....మొదలైన పనులకోసం ఈ పథకం నిధులు వెచ్చించనున్నారు. సమీపభవిష్యత్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మరికొన్ని అదనపు పనులు కూడ చేపట్టనున్నారు. ఈ పథకం ద్వారా అన్ని గ్రామాలకూ పూర్తిస్థాయిలో సిమెంట్ రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉన్నది. కాగా 275 గ్రామాలను బహిరంగ మలవిసర్జనలేని గ్రామాలుగా రూపుదిద్దగా, ఈ ఏడాది కనీసం మరో 1300 గ్రామాలను బహిరంగ మలవిసర్జనలేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. అందుకే ఈ సారి బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా కేటాయించింది.

## పట్టణాలకు కూడ అగ్రతాంబూలం

రాష్ట్రంలో పట్టణ, నగర ప్రాంతాల సమగ్రాభివృద్ధిపట్ల ప్రభుత్వంప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఈ బడ్జెట్‌లో పట్టణాల అభివృద్ధికి 49.1శాతం నిధులు అదనంగా కేటాయించడం ఇందుకు నిదర్శనం. ఇందులో ప్రణాళికా వ్యయం కింద రూ.3,141.13 కోట్లు కేటాయించగా, గత ఏడాది బడ్జెట్‌లో కేవలం 1,733.66 కోట్లే కేటాయించారు. ఇపుడు ఈ కేటాయింపును రెట్టింపు చేశారు.

అమరావతి మెట్రో రైలుప్రాజెక్టుకు రూ.300 కోట్లు కేటాయించారు. స్మార్ట్ నగరాలకు రూ.161.94 కోట్లు, అమృత్ పట్టణాలకు రూ.,125 కోట్లు వంతున కేటాయించారు. మునిసిపాలిటీల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మౌలిక వసతుల కల్పనకోసం రూ.269.86 కోట్లు వెచ్చించారు. భవిష్యత్ అభివృద్ధి నిధి కింద రూ.126 కోట్లు కేటాయించగా, ఏపీఎండీపీ ప్రాజెక్టులకు రూ.288.44 కోట్లు కేటాయించారు.

## భోగాపురం విమానాశ్రయానికి రూ.76 కోట్లు

విజయనగరంజిల్లా, భోగాపురంలో నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో మొత్తం రూ.76 కోట్లు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున విమానాశ్రయం కోసం రూ.67 కోట్లు కేటాయించగా, పెట్టుబడుల కింద మరో మూడుకోట్లు, ప్రణాళికేతర వ్యయం కింద అదనంగా రూ.6.39 కోట్లు కేటాయించారు. ఈ లెక్కన మొత్తం రూ.76 కోట్లు కేటాయించారు. ప్రాంతీయ విమానాశ్రయాలకు బడ్జెట్‌లో రూ.60.36 కోట్లుకేటాయించారు. ఇందులో విజయవాడ విమానాశ్రయానికి రూ.5 కోట్లు, తిరుపతి విమానాశ్రయానికి రూ.5 కోట్లు కేటాయించారు.

## కృష్ణా పుష్కరాలకు రూ.250 కోట్లు

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న కృష్ణా పుష్కరాలకు బడ్జెట్‌లో రూ.250 కోట్లు

**తాజా బడ్జెట్‌లో ఉప ప్రణాళికల కింద పెద్ద మొత్తాలను కేటాయించి, చంద్రబాబు ప్రభుత్వం దళిత వర్గాల ప్రయోజనాలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించింది.**

కేటాయించారు. వచ్చే ఆగస్టు 12న ప్రారంభం కానున్న ఈ పుష్కరాలను కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో 12 రోజులపాటు నిర్వహించనున్నారు. గత ఏడాది ఎంతో వైభవంగా జరిగిన గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించగా, కృష్ణా పుష్కరాలకు అదనంగా రూ.50 కోట్లు పెంచడం విశేషం. కాగా భక్తులకు సమకూర్చే వసతుల కోసం సంబంధిత శాఖలు విడిగా పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేయనున్నాయి. పుష్కరాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు, వివిధ శాఖలు తమతమ పరిధిలో ఖర్చుచేయనున్న నిధులకు అదనం.

## రహదారుల భద్రతకు ప్రాధాన్యం

నవ్యాంధ్రప్రదేశ్ తాజా బడ్జెట్‌లో రహదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం కల్పించారు.ఇందుకోసం ప్రత్యేకంగా రూ.10 కోట్లు కేటాయించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. కాగా రవాణాశాఖకు ఈ బడ్జెట్‌లో రూ.150.78 కోట్లు కేటాయించింది.

## గృహనిర్మాణానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. గత ఏడాది కంటే ఈ సారి కొత్త బడ్జెట్‌లో గృహనిర్మాణానికి అదనంగా రూ.235 కోట్లు కేటాయించడం విశేషం. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.1132.83 కోట్లు కేటాయించగా, గత ఏడాది రూ.895.70 కోట్లు కేటాయించారు. అయితే ఈ సారి ఇళ్ల నిర్మాణంతోపాటు వాటికి మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి గూడు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గృహనిర్మాణ కార్యక్రమానికి పెద్దపీట వేస్తున్నది. 2016 నుంచి 2022 నాటికి రాష్ట్రంలో దాదాపు 40 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో పట్టణ ప్రాంతాలలో పది లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో 30 లక్షల ఇళ్లను కట్టాలని నిర్ణయించింది. ఈ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన నిధులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది.

ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఒక్కో ఇంటికి రూ.2.75 లక్షలు వ్యయం చేయాలని నిర్ణయించారు. నాణ్యమైన ఫ్లోరింగ్, వంటగదిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ నాణ్యతా ప్రమాణాలతో ఇళ్లు నిర్మిస్తే, నిధుల సమస్య తలెత్తుతుంది. అందుకే కేంద్రప్రభుత్వం కూడ గృహనిర్మాణంలో ఆర్థికంగా సహాయపడాలని ప్రభుత్వం కోరుతోంది.

ఇదిలావుంటే, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద బలహీనవర్గాలవారికి 1.2 లక్షల ఇళ్లు, అలాగే లబ్ధిదారులే సొంతంగా నిర్మాణ నిర్వహణ చేపట్టే పథకం కింద మరో 73 వేల ఇళ్లను మంజూరు చేయడానికి కేంద్రప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. కాగా 59 పట్టణ, స్థానిక సంస్థల పరిధిలోఈ ఇళ్లను నిర్మించవలసి ఉన్నది. ఈ ఇళ్ల నిర్మాణానికి దాదాపు రూ.10,623 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. ఈ ఇళ్లతో పాటే పేదలకోసం నిర్మించనున్న ఇళ్లకు అవసరమైన ఆర్థిక వనరులను సమీకరించుకునే అవకాశం ఆ శాఖకు ప్రభుత్వం కల్పించింది.

## కాపులకు ఇచ్చిన హామీకి కార్యరూపం

రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన కాపు కులస్తులను ఆర్థికంగా సహాయపడేందుకు 2016-17వార్షిక బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయిస్తూ కాపులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. కాపుల కార్పొరేషన్‌కు ఈ తాజా బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించినట్లు ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించారు. అన్నమాటకు కట్టుబడి నిధులు బడ్జెట్‌లో సంపూర్ణంగా కేటాయించడంతో కాపుల నేత ముద్రగడ పద్మనాభం మార్చి11వ తేదీ నుంచి చేయతలపెట్టిన తన రెండవ దశ ఆమరణదీక్షను విరమించుకోవడం అనివార్యమైంది. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కూడ ఈ బడ్జెట్‌లో రూ.65 కోట్లు కేటాయించారు.

## సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగానికి పెద్దపీట వేసింది. ఎస్సీఎస్టీ ఉపప్రణాళిక కింద ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు మొత్తాలను బాగా పెంచడం హర్షణీయం. సాంఘిక, గిరిజన, మహిళ, వెనుకబడిన వర్గాలు, అల్పసంఖ్యాక వర్గాల ప్రజల సంక్షేమానికి గత బడ్జెట్ కంటే ఈ కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులను ఎక్కువగా కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యాభివృద్ధికి, ఉపాధికల్పనకు సమ ప్రాధాన్యం కల్పించింది. తాజా బడ్జెట్‌లో ఉప ప్రణాళికల కింద పెద్ద మొత్తాలను కేటాయించి, దళిత వర్గాల ప్రయోజనాలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఎస్సీ ఉప ప్రణాళిక కింద రూ.8,724 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపు గత ఏడాది కంటే 48 శాతం ఎక్కువ. గత బడ్జెట్ కంటే రూ.2,846 కోట్లు ఎక్కువగా నిధులు కేటాయించడతో ప్రభుత్వానికి దళితవర్గాల అభ్యున్నతిపై ఉన్న చిత్తశుద్ధి రుజువవుతోంది.

## గిరిజనం సంక్షేమానికి రూ.3099 కోట్లు

గిరిజన ఉప ప్రణాళిక కింద రూ.3099.96 కోట్లు కేటాయించారు. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత శాతాన్ని పెంచడం, ఆ విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో విద్యను అందించడానికి ప్రాధాన్యం కల్పించారు. గిరిజన విద్యాభివృద్ధి కోసం రూ.1073 కోట్లు కేటాయించారు. వసతి గృహాలను గురుకుల పాఠశాలలుగా మార్చేందుకు రూ.22 కోట్లు కేటాయించారు. ఉపకార వేతనాల కోసం రూ.236.17 కోట్లు కేటాయించారు.

గిరిజన కుటుంబాలు వినియోగించే గృహవిద్యుత్‌కు సంబంధించిన విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే చెల్లించేందుకు రూ.25 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కంటే ఇపుడు రూ.10 కోట్లు పెంచారు. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద ఎస్టీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ ఇప్పించేందుకు రూ.28 కోట్లు కేటాయించారు.

– దబ్బీరు రామకృష్ణ పట్నాయక్

❖



# ఆధారాలు చూపించు... డిస్మిస్ చేస్తా

## రాజధాని భూవివాదంపై సిఎం సవాల్

ముఖ్యమంత్రి బినామీలుగా అడ్డదారిలో మంత్రులు భూములు కొన్నారంటూ ప్రతిపక్షనేత జగన్ మోహన్‌రెడ్డి చేసిన ఆరోపణలు అసెంబ్లీలో పెను దుమారానికి దారి తీశాయి. దీనిపై మంత్రులు ధీటుగా స్పందించి వేల ఎకరాలు కొన్నట్లు నిరూపిస్తే వారికే రాసివ్వటానికి సిద్ధమంటూ సవాల్ చేశారు. అంతేగాకుండా స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్పందించి, విజయవాడ–గుంటూరు పరిసర ప్రాంతాల్లో రాజధాని ఏర్పాటు ప్రకటించిన దగ్గర నుంచి ఆ ప్రాంతంపై ప్రతిపక్షనేత విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని భూములపై ప్రతిపక్షనేత చేస్తున్న ఆరోపణలకు సంబంధించి సర్వే నంబర్లతో సహా అన్ని ఆధారాలు బయటపెడితే వెంటనే మంత్రులను డిస్మిస్ చేస్తానని సవాల్ విసిరారు. లేకపోతే సభా ముఖంగా ప్రతిపక్షనేత క్షమాపణ చెప్పాలని అన్నారు. అంతేగాకుండా మంత్రులపై చేసిన ఆరోపణలను రుజువు చేయలేకపోతే ప్రతిపక్షనేతకు ఎలాంటి శిక్ష విధించాలో నిర్ణయించాలని సభాపతికి సిఎం చంద్రబాబు సూచించారు.

రాజధాని ఏ ప్రాంతంలో వస్తుందో తెలిసిన మంత్రులు బినామీ పేర్లతో భూములు కొనుగోలు చేసి ఇన్సైడర్ ట్రేడింగ్ కు పాల్పడ్డారని ఆరోపించి, దీనిపై సిబిఐ విచారణ చేయించాలని జగన్ డిమాండ్ చేయడంతో సిఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో స్పందించారు. రాజధాని భూములపై విపక్షాల ఆరోపణలపై సిబిఐ కాదు, ఏ విచారణకు ఆదేశించే ప్రశ్నే లేదని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రానికి రాజధాని రాకుండా రాష్ట్రాన్ని తగులపెట్టాలని ప్రతిపక్షం చూస్తోందని విమర్శించారు. రాజధానిపై విపక్షం విషం చల్లుతూ వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందని, ఈ దుష్ప్రచారంతో రాజధానిలో భూముల విలువ పడిపోతే రైతులు నష్టపోతారని అన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలని, రైతులు నష్టపోవాలని ప్రతిపక్ష నేత పన్నుతున్న కుట్రలో ఇదంతా భాగమని చంద్రబాబు ఆరోపించారు. ఈ వైఖరితో భూముల ధరలు తగ్గిపోతున్నాయని రైతులు ఆందోళనలు చేస్తున్నారని. తప్పుడు కథనాలు రాసిన పత్రికపై రైతులు కోర్టుకు వెళ్ళేందుకు సిద్ధమయ్యారన్నారు.

రాష్ట్రం ఏమైపోయినా పర్వాలేదు. ప్రతిపక్షనేతకి రాజకీయాలే ముఖ్యమని, ఆయన నీచ రాజకీయాలు చేస్తున్నారని, ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆయనకే అలవాటని సిఎం చంద్రబాబు అన్నారు. సిబిఐ విచారణ మిషతో రాజధాని ఆగిపోవాలన్నదే ఆయన రహస్య ఎజెండా అని, రైతుల్లో అభద్రతాభావాన్ని కల్పించి వారిలో తిరుగుబాటు తేవాలన్నది ఆయన ఉద్దేశమని అన్నారు. 'సిబిఐ కాదు ఏ విచారణ వెయ్యం, రాజధాని కట్టి తీరుతాం' అంటూ పునరుద్ఘాటించారు. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తన మీద నమ్మకంతో భూములు ఇచ్చారని, రైతులుకున్న సంస్కారం ప్రతిపక్ష నేతకి లేదని చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని భూములు ప్రభుత్వం ఆధీనంలోనే వున్నాయన్నారు. రాజధానిలో ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా భూములు కొన్నారని, ఎవరెన్ని కుట్రలు చేసినా రాజధాని నిర్మాణం ఆగదని అన్నారు. 'కాంగ్రెస్ హయాంలో 20 సార్లు నాపై కోర్టుకు వెళ్లారు. నీతి, నిజాయితీగా వున్నాను కాబట్టే, ఎవ్వరూ ఏమి చెయ్యలేకపోయ్యారు. అవినీతి పేపర్ వుందని పేజీలకు పేజీలు కట్టుకథలు వ్రాయిస్తున్నారు ఆ పత్రిక ఈడీ అటాచ్‌మెంట్లో వున్న ఆస్తి,' అని సిఎం వ్యాఖ్యానించారు. అట్లాగే కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని అన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులు అధైర్య పడవద్దని, తనపై నమ్మకం వుంచిన వారికి న్యాయం చేసే బాధ్యత తనదేనని సిఎం భరోసా ఇచ్చారు. 'రాజధాని రాకూడదని ప్రతిపక్షం దుర్మార్గపు ఆలోచన చేస్తోంది. గతంలో ఎంతో మంది ప్రతిపక్ష నాయకులను, సిఎంలను చూశాను కానీ ఇలాంటి ప్రతిపక్ష నాయకుడిని ఎప్పుడు చూడలేదు,' అన్నారు చంద్రబాబు. వేల ఎకరాలు మంత్రులు భూములు కొన్నట్లు ఆధారాలు చూపిస్తే ఆ మంత్రులను సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి సవాల్ చేశారు.



# ఇదిగో... అమరావతి తుది రూపం

◆ రాజధాని డిజైన్‌కి తుదిరూపు ◆ జపాన్ ఆకృతికి ఆమోదముద్ర

రాజధాని అమరావతి నిర్మాణంలో మరో ముందడుగు పడింది. రాజధానిలో 900 ఎకరాల్లో నిర్మించే ప్రభుత్వ భవనాల సముదాయ స్వరూపం సిద్ధమైంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ముగ్గురు భవన నిర్మాణ శిల్పుల మధ్య రాష్ట్ర ప్రభుత్వం పోటీ నిర్వహించగా వాటిలో జపాన్‌కు చెందిన మకీ అండ్ అసోసియేట్స్ రూపొందించిన డిజైన్ ఉత్తమమైనదిగా ఎంపికైంది. ఆరుగురు అంతర్జాతీయ ప్రముఖులతో కూడిన జ్యూరీ దీన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. శాసనసభ, హైకోర్టు భవనాల్ని రాజధానికే తలమానికంగా, ఐకానిక్ భవనాలుగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రెండు భవనాలకు వివరణాత్మక ఆకృతులు సిద్ధం చేయడంతో పాటు, మొత్తం ప్రభుత్వ భవనాల సముదాయానికి 'అర్బన్ డిజైన్ గైడ్‌లైన్స్' రూపొందించే బాధ్యతను కూడా మకీ అసోసియేట్స్‌కే ప్రభుత్వం అప్పగించింది. పోటీలో భవన నిర్మాణ శిల్పులు రిచర్డ్ రోజర్స్ (బ్రిటన్)- రోజర్స్ స్టిక్ హార్బర్ అండ్ పార్ట్‌నర్స్, బి.వి.దోషి (భారత్)-వాస్తుశిల్ప కన్సల్టెన్స్, ఫ్యుమిహికో మకీ (జపాన్)-మకీ అండ్ అసోసియేట్స్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలోని ఒక హోటల్‌లో ప్రభుత్వ భవనాల సముదాయ డిజైన్ల ఎంపిక కమిటీ సభ్యులతో సమావేశమై, ముగ్గురు రూపశిల్పులు రూపొందించిన త్రీడీ నమూనాలను పరిశీలించారు. అనంతరం జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన ఆకృతిని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ దీన్ని ఒక చరిత్రాత్మక దినంగా అభివర్ణించారు. జ్యూరీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిని ప్రపంచంలోని 10 అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా నిర్మిస్తామన్నారు.

ఒక్కో ఆకృతి పరిశీలనకు జ్యూరీ సభ్యులు 7-8 గంటల సమయం వెచ్చించారని, ప్రతి అంశాన్నీ ఎంతో క్షుణ్ణంగా పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చారని ఆయన పేర్కొన్నారు. ఫైనాన్షియల్ బిడ్ తెరిచిన తర్వాత... ఉత్తమ రూపశిల్పిని ఎంపిక చేశారని తెలిపారు. జ్యూరీ సభ్యులంతా ఏకగ్రీవ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. శాసనసభ, హైకోర్టులను ఐకానిక్ భవనాలుగా నిర్మిస్తామని, సచివాలయం విషయంలో ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు.

"అమరావతి నిర్మాణంలో ఇది మరో మైలురాయి. ఇదో చారిత్రక ఘట్టం. రాష్ట్ర ప్రభుత్వం తరపున, ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల తరపున జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మీరు ఉత్తమ ఆకృతిని ఎంపిక చేశారు. అసలు పని ఇప్పుడే మొదలైంది. అమరావతిని అత్యుత్తమ నగరంగా, పర్యావరణ హితంగా, హరిత-నీలి నగరంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. ముగ్గురు రూపశిల్పులు ఇచ్చిన ఆకృతుల్లో చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. వాటిలో పనికొచ్చేవన్నీ తీసుకుంటాం. రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగం పంచుకోవాలన్నదే నా ఆలోచన. మీరు ఎంపిక చేసిన ఆకృతులపై ప్రజల సలహాలూ తీసుకుంటాం. ఇంజినీరింగ్ కళాశాలలు, ఐఐటీల వంటి ప్రముఖ సాంకేతిక విద్యా సంస్థల నుంచి సలహాలు ఆహ్వానిస్తాం. దేశంలోని ప్రముఖ రూపశిల్పుల అభిప్రాయాలూ తెలుసుకుంటాం. అవన్నీ సమీకృతం చేసుకుని ముందుకు వెళతాం" అని చంద్రబాబు తెలిపారు.

# ఇది పేదల సంక్షేమ బడ్జెట్



లక్షా 35 వేల 688 కోట్లతో ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ పేద, కార్మిక, కర్షక, మహిళ, మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సాగిందని రాష్ట్ర సమాచార, ఐటి శాఖ మంత్రి డా.పల్లె రఘునాథరెడ్డి అన్నారు. సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంత్రి మాట్లాడుతూ, బడ్జెట్‌పై ప్రతిపక్ష నేతలు విమర్శలు అసూయ, అజ్ఞానంతో కూడుకున్నవని విమర్శించారు. సాగునీటికి, రైతు రుణమాఫీ, విద్యుత్ రంగానికి, బీసీ, ఎస్టీ, కాపుల సంక్షేమానికి నిధులు తగ్గాయనడం బడ్జెట్‌పై పతిపక్ష నేతల అవగాహన లేమికి నిదర్శనమన్నారు.

'ప్రతిపక్ష నేతలు విద్యుత్ రంగానికి కేటాయింపులు తగ్గాయంటున్నారు. గతేడాదితో పోలిస్తే 3 వేల కోట్లు తగ్గిందని గగ్గోలు పెడుతున్నారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడుతుందని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా విష ప్రచారం. వ్యవసాయ రంగానికి పూర్తిగా 7 గంటల విద్యుత్ సరఫరాకు కట్టుబడి ఉన్నాం. గృహ, వాణిజ్య రంగాలకు పారిశ్రామిక రంగానికి ఇప్పటికే 24×7 విద్యుత్ అందిస్తున్నాం. జూన్ 2016 నాటికి రాష్ట్రంలో 4.6 లక్షల గృహాలకు విద్యుద్దీకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రానున్న మూడేళ్లలో 4800 మెగావాట్ల అదనపు సామర్థ్యం సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నాం. 2016-17లో లక్ష వ్యవసాయ పంపుసెట్లను విద్యుచ్ఛక్తి ఆదా చేయగల సామాగ్రితో మార్చనున్నాం. ఇప్పటికే 93.5 లక్షల గృహాలకు 1.87 కోట్ల ఎల్ఈడి బల్బులను సరఫరా చేశాం. ఒక పక్క విద్యుత్‌ను గణనీయంగా ఆదాచేస్తూ.. మరోపక్క ఉత్పాదకతను, సోలార్ పవర్‌ను పెంచుకుంటూ, తద్వారా ఆదాయాన్ని కూడా పెంచుకుంటుంటే, కేటాయింపులతో పనేంటి? ఈ మాత్రం విషయ పరిజ్ఞానం లేకుండా ప్రతిపక్ష నేతలు నోరుంది కదా అని మాట్లాడితే జనం నవ్విపోరా?" అంటూ మంత్రి ధ్వజమెత్తారు.

సాగునీటి ప్రాజెక్టులకు గత ఏడాదితో పోలిస్తే నిధులు తగ్గాయంటున్నారని, అవసరాలను బట్టి కేటాయింపులు ఉంటాయిగానీ... వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో చేసినట్లు కమిషన్ల కోసం కేటాయింపులు చేసే ప్రభుత్వం కాదు మాది అని ప్రతిపక్ష నేతలు గుర్తు పెట్టుకోవాలన్నారు. రైతు రుణమాఫీకి నిధులు తగ్గాయంటున్నారని, గత ఏడాది 35 లక్షల 15 వేల రైతు కుటుంబాలకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదని అన్నారు. అర్హత ఉన్న రైతుల సంఖ్య 35.95 లక్షలు అయితే, 22.42 లక్షల మంది రైతులకు ఒకేసారి 50 వేల లోపు రుణమాఫీ ఉపశమనం కలిగించామని పల్లె గుర్తు చేశారు. ఇప్పుడు చేస్తున్న రుణమాఫీ కేటాయింపులు కేవలం రెండో విడత రుణమాఫీకి మాత్రమే అన్నది కూడా తెలుసుకోలేనంత అజ్ఞానంలో ప్రతిపక్ష నేత ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టంగా భావించాలి అని విమర్శించారు. రైతులకు ఎంతో చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైఎస్ తన హయాంలో పావలా వడ్డీకి విదిలించింది కేవలం 22 కోట్ల రూపాయలేనన్న విషయం పతిపక్ష నేత జగన్ గుర్తు పెట్టుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ❖

# జూన్ 15కల్లా సచివాలయ సిబ్బంది తరలింపు


## జులై, ఆగస్టుల్లో శాఖాధిపతులు

## అమరావతి తరలివెళ్లే ఉద్యోగులు 8 వేలపైనే

ఉద్యోగుల తరలింపుపై స్పష్టత వచ్చింది. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులను రాజధాని ప్రాంతానికి మూడు విడతలుగా తరలించాలని మంత్రి నారాయణ నేతృత్వంలోని కమిటీ నిర్ణయించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీటక్కర్, తాత్కాలిక సచివాలయ భవనాలు నిర్మిస్తున్న ఎల్అండ్‌టీ ప్రతినిధులు, వివిధ ఉద్యోగసంఘాల నాయకులతో చర్చలు జరిపి, మూడు విడతలుగా తరలించాలని నిర్ణయించారు. జూన్ 15కల్లా సచివాలయ సిబ్బంది, జులై, ఆగస్టుల్లో హెచ్‌ఓడీలు అమరావతికి తరలివెళ్లే అవకాశముంది.

అంతకుముందు జరిగిన సమావేశంలో హెచ్‌ఓడీల కార్యాలయాల స్థలాలపై స్పష్టత ఇవ్వాలని అశోక్‌బాబు బృందం కోరిన నేపథ్యంలో మంత్రి నారాయణ తాజా మీటింగ్‌కు ఎల్అండ్‌టీ, షాపూర్‌జీ పల్లోంజీ ప్రతినిధులను పిలిపించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల తీరును వివరించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఆరుబ్లాకులను జూన్ 15 నాటికి సిద్ధం చేస్తామని ఈ ప్రతినిధులు చెప్పారు. ప్రభుత్వం ప్రతి బ్లాక్‌లోనూ మరో రెండు ఫ్లోర్లకు టెండర్లు పిలుస్తామని చెబుతోంది, అలా అయితే జులై 15 నాటికి రెండోఫ్లోర్, ఆగస్టు చివరి నాటికి మూడో ఫ్లోర్ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. 1, 2, 3 బ్లాక్‌లు సచివాలయ సిబ్బందికి, 4, 5 బ్లాక్‌లు పూర్తిగా హెచ్‌ఓడీలకు కేటాయించాలని నిర్ణయించారు.

తొలి మూడు బ్లాకుల్లో కొత్తగా నిర్మించే 2, 3 అంతస్తుల్లో ముఖ్యమంత్రి, మంత్రులకు అవసరమైన కార్యాలయాలు కేటాయించనున్నారు. ఏయే కార్యాలయాలను ఎప్పుడు తరలించాలన్నదానిపై త్వరలో స్పష్టత ఇస్తామని మంత్రి నారాయణ చెప్పారు. అన్ని భవనాల్లో సెంట్రల్ ఏసీ సౌకర్యం ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. సచివాలయం, హెచ్‌ఓడీ సిబ్బంది కలిపి 8 వేల మంది తరలివెళ్తారని అంచనావేశారు. వీరుకాకుండా మరో 1,500 మంది ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది ఉంటారని తేల్చారు. ఒక్కో ఉద్యోగికి సగటున వంద చదరపు అడుగుల కార్యాలయ స్థలం వస్తుందని లెక్కగట్టారు. ప్రతి బ్లాక్‌లో ఒక ఫుడ్‌కోర్ట్ ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. హైదరాబాద్ నుంచి తరలివెళ్లే ఉద్యోగులకు 30% హెచ్ఆర్ఏ కొనసాగించడంతోపాటు, కొన్ని ప్రోత్సాహకాలు అందించే అంశంపై ఈ నెలాఖరున కానీ, వచ్చేనెల మొదటివారంలోకానీ ఏర్పాటుచేసే సమావేశంలో స్పష్టత ఇస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు వెల్లడించారు. ఉద్యోగులు రాజధానికి వచ్చేనాటికి సచివాలయానికి వెళ్లే అన్ని రకాల రహదారులను పూర్తిస్థాయిలో నిర్మిస్తామని కూడా చెప్పారు. ఈ చర్చల్లో ఉద్యోగసంఘాల తరుపున అశోక్‌బాబు, మురళీకృష్ణ, బొప్పరాజు వెంకటేశ్వర్లు, కేవీకృష్ణయ్య, ఏపీపటేల్ తదితరులు పాల్గొన్నారు. ❖



అంతర్జాలం (ఇంటర్నెట్) ప్రపంచాన్నే ఒక కుగ్రామం చేసిందంటారు. అయితే, ఆ గ్రామంలోకి సామాన్యుడికి ప్రవేశం కల్పించిన తొలి నాయకుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. శాస్త్ర సాంకేతిక జ్ఞానాలు అందరాని చందమామలు కావనీ, అవి పేదవాడి ఇంటి ముంగిట్లో దీపాలు కావాలని ఆయన కన్న కలలకు ప్రతిరూపం ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు. ఆ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు తొలి దశను ఇటీవల విశాఖపట్నంలో ప్రారంభించడం ద్వారా స్వప్నం సాకారం కానుంది. ఆదర్శం ఆచరణ కాబోనుంది.

# సామాన్యుడి ముంగిట్లో సాంకేతికతా దీపం

## ఫైబర్ గ్రిడ్ ప్రారంభంతో సాకారం కానున్న చంద్రన్న స్వప్నం

ప్రపంచంలో అత్యంత చౌక ధరకు ఇంటర్నెట్‌ను అందించే రాష్ట్రంగా ఏపీని నిలపనున్నారు ముఖ్యమంత్రి. కనీస అవసరాలైన తిండి-బట్ట- గూడు- ల సరసన ఇంటర్నెట్‌ను జోడించడం, అంతకుమించి, అదే ఇంటర్నెట్ సాంకేతికతో కనీస అవసరాలను లబ్ధిదారులకు మరింత ఫలవంతంగా అందించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యాలు.

నవ్యాంధ్రలో సమాచార సాంకేతిక విప్లవం మొదలైంది. ప్రపంచంలో అత్యంత చౌక ధరకు ఇంటర్నెట్‌ను అందించే రాష్ట్రంగా ఏపీ నిలవబోతుంది. ఈ ఘనతను సాధించే దిశగా ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు తొలి దశను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖపట్నంలో ప్రారంభించారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక విప్లవాత్మకమైన మార్పని, అందరికీ డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. ఎన్నో ఏళ్ల నాటి కల ఇన్నాళ్లకు సాకారమైందని, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఈ రోజు చిరస్థాయిగా నిలిచి పోతుందని ఆయన తెలిపారు. ప్రముఖ ఐటీ దిగ్గజం, సిస్కో దీనికి సాంకేతిక సహకారం అందించింది. విశాఖ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి సిస్కో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జాన్ టి.ఛాంబర్స్ కూడా హాజరై సీఎం దూరదృష్టిని, చొరవను ప్రశంసించారు.

నవ్యాంధ్రలో ప్రతి పౌరుడు శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకొనే విధంగా ఏపీ ప్రభుత్వం మెరుగైన పౌర సేవలు అందించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. దీంతో ప్రజలకు అందించే సేవల స్వరూపమే మారిపోనుంది. సుపరిపాలన, అరమరికలు లేని పారదర్శకమైన జవాబుదారిపాలనను హక్కుగా పొందేందుకు ప్రజలు కూడా ఎదురు చూస్తున్న పరిస్థితుల్లో వారి ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు.

అందుకే కేంద్రం మూడేళ్ల తరువాత చేపట్టాలనుకున్న ఈ ప్రాజెక్టును ఏపీలో ముందుగా అమలు చేయాలని నిర్ణయించి బీబీఎన్ఎల్ సహకారంతో దీన్ని చేపట్టామని సిఎం వివరించారు. ఫైబర్ కేబుల్‌ను భూగర్భం నుంచి వేయాలని కేంద్రం నిర్ణయించిందని, దీనికి సుమారు రూ.5 వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేయగా, అంతకంటే వేగంగా, తక్కువ వ్యయంతో కేబుల్ వేయాలని నిర్ణయించి, వినూత్నంగా విద్యుత్తు స్తంభాల ద్వారా ఆప్టికల్

విశాఖలో ఏపి ఫైబర్‌నెట్ తొలి దశ ప్రారంభోత్సవం సందర్భంగా సిస్కో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జాన్ టి చాంబర్స్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి.



ఇంటర్నెట్ వినియోగానికి, వృద్ధి రేటుకు సంబంధం ఉందని.. ఇప్పుడు రెండంకెల వృద్ధిని సాధించిన ఏపీ వచ్చే ఏడాది 15 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు.

ఫైబర్ కేబుల్‌ను రన్ చేస్తున్నామన్నారు. దీనికి కేవలం రూ.333 కోట్లే వ్యయం అయిందని పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లను ఉపయోగించుకొని, 3.75 లక్షల విద్యుత్ స్తంభాల ద్వారా కేబుల్ రన్ చేసి, మాస్టర్ సిగ్నల్ ఆపరేటర్లు, లోకల్ కేబుల్ ఆపరేటర్ల ద్వారా ఈ కేబుల్‌ను ప్రతి ఇంటికీ చేరుస్తున్నామన్నారు. ఈ కేబుల్ ద్వారా 15 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్‌తో పాటు 100 (ఉచిత) చానల్స్‌తో కేబుల్ ప్రసారాలు, గ్రిడ్ పరిధిలో ఉచితంగా ఫోను సేవలు కల్పిస్తామన్నారు. ఈ కనెక్షనుకు నెలకు కేవలం రూ.149 మాత్రమే వసూలు చేస్తామన్నారు. ఏప్రిల్ నెలాఖరుకు ఉత్తరాంధ్ర అంతటా, జూలై నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు విస్తరిస్తామన్నారు. ఏపీ ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ కూడా ఒక స్టార్టప్ కంపెనీయే అని, ఇది భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకు అవసరమైన సహకారం అందిస్తుందన్నారు.

ఈ ప్రాజెక్టు వల్ల టెలీ మెడిసిన్, రైతులకు ఆధునిక వ్యవసాయం, పిల్లలకు ఇ-లెర్నింగ్, ఆన్‌లైన్ బిల్లింగ్ ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గృహాలకు 15 ఎంబీపీఎస్ బ్యాండ్ విడ్త్, పాఠశాలలు, కళాశాలలకు 50 ఎంబీపీఎస్, వ్యాపార సంస్థలకు 100 ఎంబీపీఎస్ ఇస్తామన్నారు. ఇంటర్నెట్ వినియోగానికి, వృద్ధి రేటుకు సంబంధం ఉందని.. ఇప్పుడు రెండంకెల వృద్ధిని సాధించిన ఏపీ వచ్చే ఏడాది 15 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని ఆయన చెప్పారు. దేశంలో టెలికాం లైసెన్స్ తీసుకున్న తొలి రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశేనని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇంటర్నెట్‌ను ప్రపంచంలో ఇంత తక్కువ ధరకు ఏ రాష్ట్రం అందించడం లేదని, ఆ ఘనత ఆంధ్రప్రదేశ మాత్రమే సాధించిందని సీఎం గర్వంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీఎస్ఎఫ్ఎల్ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించి ప్రతి ఇంటికీ కనెక్షన్ ఇచ్చాక అందరితో నేరుగా టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడే అవకాశం తనకు దక్కుతుందని ఆయన చెప్పారు. ఏపి ఫైబర్ గ్రిడ్ ఎండీ సాంబశివరావు మాట్లాడుతూ ఫైబర్ గ్రిడ్ ద్వారా ఇంటర్నెట్, 100 ఉచిత చానళ్లు, ఉచిత ఫోన్‌సేవలు పొందాలంటే సెట్ టాప్ బాక్స్ లాగానే దీనికి 'టిక్ బాక్స్' అవసరమవుతుందన్నారు. ఆపరేటర్లు అంతా మాట్లాడుకుని మంచి నాణ్యతతో పెద్ద సంఖ్యలో తయారు చేయించుకుంటే తక్కువ ధరకే లభిస్తాయన్నారు.

## 'శ్రమయేవ జయతే- నా సిద్ధాంతం'

'నిత్యం శ్రమించడంలో నాకు అలసట తెలియదు. నేను చేపట్టిన కార్యక్రమాలతో మంచి ఫలితాలొస్తే నా బలం మరింత పెరుగుతుంది' అన్నారు ముఖ్యమంత్రి. ఫైబర్ గ్రిడ్ ప్రారంభంలో భాగంగా విశాఖలోని ఒక హోటల్ నుంచి ముఖ్యమంత్రి పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థినులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎలాంటి అలసట లేకుండా నిరంతరం శ్రమించడం వెనుక ఆరోగ్య రహస్యం ఏమిటని విద్యార్థినులు ప్రశాంతి, సుష్మిత సీఎం చంద్రబాబును ప్రశ్నించగా, ఆయన సమాధానమిస్తూ... కష్టపడి పని చేస్తే ఎలాంటి అలసట ఉండదన్నారు. ఈ సందర్భంగా పలువురితో చంద్రబాబు, ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు చైర్మన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైబర్ గ్రిడ్ ద్వారా కలిగే ప్రయోజనాలను చెప్పాలని సీఎం చంద్రబాబు ఓ విద్యార్థినికి సూచించారు. దానికి ఆ విద్యార్థిని ప్రపంచంలో ఎక్కడి వారితోనైనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించవచ్చని సమాధానమిచ్చింది. దీని ద్వారా మీ టీచర్ నవ్యాంధ్ర రాజధాని అమరావతి నుంచే మీకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాఠాలు కూడా చెప్పొచ్చని, మీరు కూడా ఇళ్లలో ఉండే చదువుకోవచ్చని సీఎం చంద్రబాబు చెబుతూ... అలా అని స్కూళ్లకు రాకుండా దుమ్మా కొట్టకూడదంటూ జోక్ చేశారు. ఫైబర్ గ్రిడ్ ద్వారా దాదాపు కోటి ముప్పయ్ లక్షల కుటుంబాలకు చౌక ధరకే ఇంటర్నెట్‌ను అందిస్తామని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా చెప్పారు.

## సిస్కోతో ఒప్పందం.. అనుబంధం

ఏపీ ఫైబర్ గ్రిడ్ లిమిటెడ్, సిస్కో ఈ సందర్భంగా అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా సిస్కో ఎగ్జిక్యూటివ్ చైర్మను జాన్ టి.చాంబర్స్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దూరదృష్టి, చొరవ కలిగిన నాయకుడని ప్రశంసించారు. ఆకాశమే హద్దుగా టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందని, దాన్ని అన్ని రంగాల్లోను ఉపయోగించుకోవచ్చునని ఆయన అన్నారు. ఇక, ఈ ప్రాజెక్టులో సిస్కో భాగస్వామ్యంతో పనిచేయడం ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. జాన్ టి.ఛాంబర్స్‌తో తనకు 16 ఏళ్ల అనుబంధం ఉందని ఆయన తెలిపారు. తన కోడలు బ్రాహ్మణి అమెరికాలో చదువుకుంటున్నపుడు ఆయన ఆ కాలేజీకి వెళ్లి యువతలో ఆలోచనలు రేకెత్తించే ప్రసంగాలు చేశారని, ఈ విషయాన్ని బ్రాహ్మణి తనకు చెప్పిందని పేర్కొన్నారు. సిస్కో సహకారాన్ని ప్రధాని మోదీ కూడా ఆహ్వానిస్తున్నారన్నారు. ఏడాది తరువాత విశాఖలో ఈ ప్రాజెక్టుపై సమీక్షిస్తామని, అప్పుడు కూడా జాన్ టి.ఛాంబర్స్‌ని ఆహ్వానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వేయి కోట్లతో క్యాడ్‌బరీ కర్మాగారం

## శ్రీసిటీ సెజ్ లోని 134 ఎకరాల్లో సిద్ధమైన ప్లాంట్

- ఏప్రిల్ 25న ప్రారంభోత్సవం
- ముఖ్యమంత్రిని ఆహ్వానించిన కంపెనీ ప్రతినిధులు
- అంతరపంటగా కోకోను సాగుచేయాలన్న సీఎం చంద్రబాబు




చిత్తూరు జిల్లా శ్రీసిటీ సెజ్‌లో రూ.1000 కోట్ల పెట్టుబడితో నెలకొల్పిన మాండలీజ్ ఇంటర్నేషనల్ (క్యాడ్‌బరీ) చాక్లెట్ ఫ్యాక్టరీ తొలిదశ ఏప్రిల్ 25న ప్రారంభం కానుంది. కంపెనీ ప్రతినిధులు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి, ఈ ప్రారంభోత్సవానికి ఆయనను ఆహ్వానించారు. బ్రిటన్‌కు చెందిన క్యాడ్‌బరీస్ కంపెనీని అమెరికాకు చెందిన మాండ్‌లీజ్ ఇంటర్నేషనల్ కొనుగోలు చేసింది.

కంపెనీ విస్తరణ, అభివృద్ధి, ఉపాధి అవకాశాలను వారు ఆయనకు  వివరించారు. 134 ఎకరాల్లో ఏర్పాటైన ఈ కర్మాగారం ఆసియా–పసిఫిక్‌లో అతిపెద్ద చాక్లెట్ కర్మాగారం అని తెలిపారు. 'మేకిన్ ఇండియా–మేడిన్ ఆంధ్రప్రదేశ్' విధానంలో భాగంగా ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్నామని, ఆహార పరిశ్రమలలో భారీగా పెట్టుబడులు పెడుతున్నామని మాండలీజ్ ఇంటర్నేషనల్ (క్యాడ్‌బరీ) ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏప్రిల్ 25న కర్మాగారం మొదటి దశ ప్రారంభోత్సవం వుంటుందని తెలిపారు.

క్యాడ్‌బరీ చాక్లెట్లు, బిస్కెట్లు, గమ్ అండ్ క్యాండీ, బెవరేజెస్, క్యాడ్‌బరీ డెయిరీ మిల్క్, క్యాడ్‌బరీ సెలబ్రేషన్స్, సీడీఎం సిల్క్, బోర్న్‌విటా, పెర్క్ ఫైవ్ స్టార్ చాక్లెట్, జెమ్స్, క్యాడ్‌బరీ బోర్నవిల్లే తదితర ఉత్పత్తుల తయారీకోసం శ్రీసిటీలో ప్లాంట్ నిర్మాణం చేపట్టామని తెలిపారు.

నాలుగుదశల్లో ప్రాజెక్టు పూర్తిచేసి 2020 నాటికి 2,50,000 టన్నుల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. మాండలీజ్ ఇంటర్నేషనల్ (క్యాడ్‌బరీ) కర్మాగారం వల్ల 1,600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశం లభిస్తుందని, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి ఏర్పడుతుందన్నారు.

అత్యాధునిక సాంకేతికతతో, సురక్షిత ప్రమాణాలతో ఉత్పత్తులను తయారుచేసేందుకు వీలుగా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని మాండలీజ్ ఇంటర్నేషనల్ (క్యాడ్‌బరీ) ప్రతినిధులు వివరించారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా తమ యూనిట్ కార్యకలాపాలు సాగుతాయని, ప్లాంటులో సౌర విద్యుత్తును ఉపయోగిస్తామని తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద తమ కంపెనీ 'శుభ్ ఆరంభ్' పేరుతో ప్లాంటు చుట్టుపక్కల ప్రాంతాలలో సామాజిక అభివృద్ధికి భారీ స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు.

### అంతర పంటగా కోకో – ముఖ్యమంత్రి

రాష్ట్రంలో క్యాడ్‌బరీ ప్లాంట్ ఏర్పాటుతో కోకో పంట సాగుకు ప్రాధాన్యం ఏర్పడిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మాండలీజ్ ఇంటర్నేషనల్ (క్యాడ్‌బరీ) కంపెనీ ప్రతినిధులతో భేటీ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

పదమూడు జిల్లాలలో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా కోకోను సాగు చేసే విధంగా రైతాంగాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కోకో ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ ఎదగాలని ఆకాంక్షించారు.

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలలో దాదాపు 10 వేల ఎకరాలలో కోకో పంట సాగులో ఉందని తెలిపారు. కోకో సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతుల్ని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కోకో నీడలో పెరుగుతుందని, అందువల్ల కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో అంతరపంటగా వేయటం మంచిదన్నారు. మూడే ఏట నుంచే దిగుబడి వస్తుందని, ఐదో ఏట పూర్తి స్థాయి దిగుబడి వస్తుందని చెప్పారు.

తాము త్వరలో కొబ్బరి, ఆయిల్ పామ్ రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, కోకో సాగుపై వారికి అవగాహన కల్పిస్తామని సీఎం చెప్పారు. ఈ సమావేశంలో మాండలీజ్ ఇంటర్నేషనల్ (క్యాడ్‌బరీ) గ్రూప్ కంట్రీ హెడ్ వెంకటేశం చంద్రమౌళి, గవర్నమెంట్ సర్వీసెస్ హెడ్ అమిత్ కుమార్ సింగ్, సీఎంఓ ముఖ్యకార్యదర్శి సతీష్‌చంద్ర, ముఖ్యమంత్రి కార్యదర్శి జి. సాయిప్రసాద్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి గిరిజా శంకర్, ఓఎస్‌డీ సన్నీబాబు తదితరులు పాల్గొన్నారు.

❖




# త్వరలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్

## రాయలసీమ నుంచి శ్రీకారం

## వ్యవసాయాన్ని లాభసాటిగా మర్చడమే ధ్యేయం: సీయం చంద్రబాబునాయుడు

ఏప్రిల్ నెలలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న తన కలను సాకారం చేసే ఈ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్‌కు రాయలసీమ నుంచి శ్రీకారం చుడతామని ఆయన ప్రకటించారు. వ్యవసాయాధారిత పరిశ్రమల సీఈవోలు, రీజనల్ హెడ్స్, ఇతర ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు.

25 నుంచి 30 వ్యవసాయ ఉత్పత్తులను ఎంపికచేసి సమర్ధ సాగు నిర్వహణ, యంత్రీకరణ, ఉత్పాదకత పెంపు, అంతర్జాతీయ మార్కెటింగ్ వంటి అంశాలలో రైతులకు అడుగడుగునా సహాయ సహకారాలు అందించేలా చూడటమే ఈ ఆర్గనైజేషన్స్ ఏర్పాటు లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. వీటి ఏర్పాటు, నిర్వహణలో అంతర్జాతీయ సంస్థల సహకారం తీసుకుంటున్నామని చెప్పారు. మిషన్ అప్రోచ్‌తో ప్రైమరీ సెక్టారులో వృద్ధి సాధించడం, వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా మార్చేలా చేయడమే ఉద్దేశమని అన్నారు.

త్వరలో అందుబాటులోకి రానున్న ఫైబర్ గ్రిడ్‌ను వ్యవసాయరంగంలో సమర్ధంగా వినియోగించుకుంటామని సీయం చెప్పారు. ఇటు రైతులు, విస్తరణాధికారుల నుంచి, అటు వ్యవసాయ శాస్త్రవేత్త వరకు అందరినీ ఏక కాలంలో అనుసంధానం చేస్తూ సాగుపై సలహా సంప్రదింపులు అందేలా చేయడంలో ఫైబర్ గ్రిడ్ దోహదపడుతుందని అన్నారు. పంట ఇటు పొలంలో వుండగానే రైతులు మార్కెట్‌లో తమ సరుకుకు తామే ధర నిర్ణయించుకునేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ కృషిచేస్తాయని సీయం చెప్పారు. ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటుకు పూర్తిస్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. త్వరలో మరో సమావేశం ఏర్పాటుచేసి ఫార్మర్స్ ఆర్గనైజేషన్స్‌కు పూర్తిస్థాయిలో రూపకల్పన చేస్తామని చెప్పారు. ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ ద్వారా రాయలసీమను ఉద్యానసీమగా మార్చుతామని, 10 లక్షల పంట-కుంటలను ఏర్పాటుచేయడం ద్వారా ఏపీని కరవురహిత రాష్ట్రంగా మార్చుతామని సీయం ఈ సందర్భంగా చెప్పారు. ఈ రాష్ట్రంలో వ్యవసాయాన్ని గిట్టుబాటుగా మార్చడంలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ముందుకువచ్చి సహకరించాలని ఆయన కంపెనీల ప్రతినిధులను కోరారు. ముఖ్యంగా యువతను వ్యవసాయరంగం వైపు మళ్లించేందుకు పెద్దఎత్తున ప్రయత్నం జరగాలని సూచించారు. సేద్యపు విధానాల్లో సరికొత్త విధానాలు, వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తే ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ టక్కర్, వ్యవసాయ మంత్రి పత్తిపాటి పుల్లారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి విజయ్ కుమార్, ఉద్యానశాఖ కార్యదర్శి మన్మోహన్ సింగ్, వ్యవసాయశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, ఇక్రిశాట్ అధికారి వాణి తదితరులు పాల్గొన్నారు.

❖

# రేషన్ సరకులు తీసుకెళ్లండి

## ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం

ఈ-పోస్ విధానం అమల్లోకి తెచ్చి నిత్యావసర సరకుల పంపిణీలో పారదర్శకత పెంచింది రాష్ట్ర ప్రభుత్వం. ఇప్పుడు దేశం మొత్తం మన రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈ-పోస్ విధానం వైపు చూస్తోంది.

ఇంత చక్కగా అమలు చేస్తున్నప్పుడు, చివరి రోజుల్లో చౌక దుకాణాల వద్ద సరకుల పంపిణీకి హడావుడి ఎందుకు. ప్రతినెలా 30 వ తేదీలోపు సరకుల డీలర్ల వద్దకు చేరుతున్నాయి కదా. ప్రతినెలా 1 నుంచి 10 వ తేదీలోగా సరకులు ఠంఛనుగా కార్డుదారులకు అందించలేరా! పౌరసరఫరాల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి.

రేషన్ డీలర్లు సమయ పాలన పాటించక పోవడంతో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని పౌరసరఫరాల శాఖ వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రేషన్ షాపుల పరిధిలో జిల్లా కలెక్టర్ల పేరిట ఎస్సెమ్మెస్ పంపనుంది.

రేషన్ దుకాణాలకు సరకులు ఎప్పుడొస్తాయా అని రేషన్ కార్డుల లబ్ధిదారులు ఇంతకాలం ఎదురు చూసేవారు. ప్రతిరోజూ వెళ్లి రేషన్ సరుకు వచ్చాయా అని డీలర్లను అడిగేవారు. వచ్చినప్పుడు ఇస్తాం కదా..అంటూ వారు దురుసుగా సమాధానం చెప్పేవారు. సరుకులు కోసం పేదలు నానా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంతో వాటికి బ్రేక్ పడింది. రేషన్ కార్డుల లబ్ధిదారుల చరవాణికి సరకులు వచ్చిన సమాచారాన్ని సందేశం (ఎస్సెమ్మెస్) రూపంలో చేరవేస్తున్నారు. అది చూసి వెంటనే వారు సరుకులు తీసుకెళ్లడానికి వీలు కల్పించింది ప్రభుత్వం.

ఈ-పోస్ విధానం అమల్లోకి వచ్చాక రేషన్ పంపిణీలో మార్పులు జరిగాయి. దీనివల్ల సరకుల్లో కూడా చాలా వరకు మిగులు కనబడుతోంది. ఇపుడు సరకులు సకాలంలో, నిర్ణీత గడువులోపు పూర్తవడానికి వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా మార్చికి సంబంధించి రేషన్ దుకాణాల్లో పంపిణీ



చేస్తోన్న సరకుల వివరాల్ని లబ్ధిదారుల చరవాణిలకు ఫిబ్రవరి 29వ తేదీ సాయంత్రం ఎస్సెమ్మెస్ చేశారు. దీనిలో 'మీకు రావాల్సిన సరకులు మీ రేషన్ దుకాణానికి చేరాయి. మీరు వచ్చి తీసుకు వెళ్లవచ్చు అని సందేశం ఉంటుంది. దీనివల్ల ఒకేసారి రెండు రకాల ప్రయోజనాలు నెరవేరతాయి. ఒకటి సరకుల్ని సకాలంలో తీసుకెళతారు...మరొకటి వాటి పంపిణీ వేగంగా పూర్తవుతుంది. ఈ విధంగా ఆధునిక సమాచార వ్యవస్థని అధికారులు వినియోగించుకుని ప్రజా పంపిణీ ద్వారా పేదలకు మెరుగైన సేవలందిస్తున్నారు.

### పంపిణీపై నిఘా

ఈ-పోస్ విధానంలో ప్రభుత్వం రేషన్ సరకుల్ని లబ్ధిదారులకు సత్వరం పంపిణీ చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రతినెలా 10 వ తేదీ లోపు ముగించడానికి ప్రణాళిక

## ఒకటో తేదీనే రేషన్ తెచ్చుకున్నా...

మాది తెనాలి మండలం బుర్రిపాలెం. నా చరవాణికి ఫిబ్రవరి 29 వ తేదీన ఎస్.ఎం.ఎస్ వచ్చింది. దీనిలో ప్రభుత్వం మంజూరు చేసిన కార్డుకి రేషన్ సరుకులు దుకాణానికి వచ్చాయని ఉంది. మర్నాడే వెళ్లి తెచ్చుకున్నా. ఈ సదుపాయం బావుంది. ఒకటికి పదిసార్లు రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన పని తప్పింది.

– సౌమ్య, బుర్రిపాలెం, గుంటూరు జిల్లా.

రూపొందించింది. దీనిలో భాగంగా ప్రతినెలా 1 వ తేదీ నుంచి దుకాణాలన్నీ తెరిచి ఉంచాలని ఆదేశించారు. ఉన్నత స్థాయిలో జిల్లా సంయుక్త కలెక్టరుల నుంచి క్షేత్రస్థాయిలో వీఆర్వోలు వరకు అందరూ సరకుల పంపిణీపై నిఘా పెంచారు. ఏ రోజు ఎంతమంది లబ్ధిదారులు తీసుకెళ్లారనే సమాచారాన్ని ట్యాబ్‌ల ద్వారా సేకరిస్తున్నారు. ఒక్క తెల్లరంగు రేషన్ కార్డుపై కూడా సరకులు ఇచ్చినట్లు ట్యాబ్‌లలో నమోదు కాకుంటే వెంటనే ఆ డీలర్లని ఫోన్‌లో అడుగుతున్నారు. ఈ-పోస్ విధానంలో లోపం తలెత్తిందా, దుకాణం తీయలేదా అని తెలుసుకొని ఆ సమస్యని వెంటనే నివారిస్తున్నారు.

### సరకుల ఎగవేతకు స్వస్తి

రేషన్ లబ్ధిదారుల సెల్‌ఫోన్ నంబర్లను ఆధార్ కార్డులకు అనుసంధానం చేసిన నేపథ్యంలో ఆయా నెంబర్లకు సరుకులు పంపిణీ సమాచారాన్ని చేరవేస్తున్నారు. దీనివల్ల వారు దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకొంటున్నారు. దుకాణానికి వెళ్ళినా సరకులు ఇవ్వని పరిస్థితి ఉత్పన్నం కాదు. రేపురా, ఎల్లుండిరా అని డీలరు వాయిదాలు వేయడానికి కుదరదు. ప్రతినెలా తీసుకెళుతోన్న కార్డుదారుల వివరాలు ట్యాబ్‌ల ద్వారా తెలిసిపోతాయి. అలానే తీసుకెళ్ళని వారి వివరాలు తేట తెల్లమవుతాయి. అంతిమంగా అర్హులకు సకాలంలో పంపిణీ పూర్తివుతుంది.

ప్రతి నెలా ఒకటి నుంచి ఐదు తేదీలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ముఖ్యమైనవి. మధ్యతరగతి కుటుంబాల్లో ప్రైవేట్ ఉద్యోగులకు వేతనాలు అందేది ఆ రోజుల్లోనే. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కూడా వేతనాలు అప్పుడే అందుతాయి. సామాజిక భద్రత పింఛన్ల రూపంలోనూ నగదు చేతికి అందుతుంది. చేతిలో డబ్బులున్నా మొన్నటి వరకు ఒకటి నుంచి ఐదో తేదీలోపు మధ్యతరగతి కుటుంబాలకు డీలర్ల నుంచి బియ్యం, ఇతర సరకులు అందని పరిస్థితి ఉండేది. నూతన ప్రజా పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చాక ఈ ప్రతి నెల 10 వ తేదీలోపు నిత్యావసర సరకుల పంపిణీ పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని



డీలర్లకు అధికారులు నిర్దేశించారు.

### అనుమతి లేకుండా దుకాణం మూస్తే జరిమానా


ఉదయం నుంచి రాత్రి వరకు నిర్దేశించిన వేళల్లో ప్రతినెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు డీలర్లు కార్డుదారులకు సరకులు పంపిణీ చేయాలి. ఈ-పోస్ తెరచుకోలేదంటే ఆ డీలరు పనిచేయనట్లుగా భావిస్తారు. ముందస్తు అనుమతి తీసుకోకుండా దుకాణం మూస్తే రోజుకు రూ. 500 చొప్పున డీలర్లకు జరిమానా విధిస్తారు. ఐదు రోజులు తెరచుకోని దుకాణాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. ఏఏ దుకాణాలు తెరచుకున్నాయి. ఏవి అమ్మకాలు చేపట్టలేదని విషయం ఈ-పోస్ విధానంలో అధికారులకు సులభంగా తెలిసిపోతుంది. దీంతో డీలర్ల ఆటలు ఇక సాగవు.

చివరి రోజుల్లో హడావుడిగా రేషన్ సరకులు పంపిణీ చేయడం, మిగిలిన రేషన్ సరకు నల్లబజారుకు తరలించడం. ఇదీ నిత్యావసరాల పంపిణీపరంగా గతంలో జరిగేది. దీన్ని అరికట్టేందుకు ప్రతి నెలా 1 నుంచి 10 వరకు రేషన్ సరకుల పంపిణీపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు.

అంతే కాకుండా వృద్ధులు, వికలాంగులు, ఒంటరిగా, కదలలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ సరుకుల పంపిణీ బాధ్యతను జన్మభూమి కమిటీలకు అప్పగించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులు వంటి వారు ఎంత మంది ఉన్నారు అనేది గ్రామాల వారిగా నెలకొల్పిన ఐకెపి కమిటీలు గుర్తించాయి.

సామాజిక పింఛన్లు పొందుతున్న వారి వివరాలు పరిశీలించి అర్హుల జాబితాను ఈ కమిటీలు తయారు చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల మందికి వృద్ధాప్య, వితంతువు పింఛన్లు అందుతున్నాయి. వీరిలో దాదాపు 2 లక్షల మందికి పైగా తోడు లేకుండా ఒంటరి జీవితం గడుపుతున్నారని ఈ కమిటీలు గుర్తించాయి. ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపించాలని ప్రభుత్వ ఆలోచనపై వృద్ధులు, వికలాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇతరులపై ఆధారపడుతున్న తమ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించినందుకు సంతోషంగా ఉందని ప్రభుత్వానికి, తామంత ఋణపడి ఉంటామంటున్నారు.

– నీరుకొండ ప్రసాద్



# 'ప్రత్యేక హెూదా' హామీని నిలబెట్టుకోండి

## 'విభజన' హామీలన్నీ అమలు చేయాలి

## కేంద్రాన్ని కోరుతూ ఏపీ శాసనసభ, మండలి ఏకగ్రీవ తీర్మానం

సమైక్యాంధ్ర విభజన సందర్భంగా పార్లమెంటు ఆమోదించిన పునర్విభజన చట్టంలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నీ కచ్చితంగా అమలు చేయడంతోపాటు, ఆనాటి భారత ప్రధాని 2014 ఫిబ్రవరి 2న నవ్యాంధ్రకు ప్రకటించిన ప్రత్యేక హెూదా హామీని కూడ సత్వరమే అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవంగా తీర్మానించాయి. శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, శాసనమండలిలో రాష్ట్ర శాసనసభా వ్యవహారాలు, ఆర్థిక శాఖల మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టారు. ఉభయ సభల సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ తీర్మానంలో మొత్తం 17 అంశాలపై ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కేంద్రానికి ఈ తీర్మానంలో విజ్ఞప్తి చేశారు.

పొరుగు రాష్ట్రాలు ఏ మేరకు అభివృద్ధిని సాధించాయో, అదే స్థాయి వరకు నవ్యాంధ్ర రాష్ట్రం అభివృద్ధిని సాధించేవరకు కేంద్రప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలవాలని కోరారు.

పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2018 లోపు పూర్తి చేయడానికి ఆర్థికంగా సహకరించాలని, అలాగే నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రత్యేకంగా ఆర్థిక సహకారం అందించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానించారు.

రాయలసీమ జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, షెడ్యూలు 13లో ప్రతిపాదించిన మేరకు అన్ని విద్యాసంస్థలను మౌలిక వసతులతో సహా వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానించారు.

విశాఖపట్నంలో రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

శాసనసభలో ప్రస్తుతం ఉన్న 175 సీట్లను 225కు పెంచాలని ఉభయసభలు కేంద్రాన్ని కోరుతూ తీర్మానించాయి.

విద్య ఉపాధి అవకాశాలను కల్పించడానికి అవసరమైన 'స్థానికత' అంశంపై రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణ చేపట్టాలని కోరారు.

కడపలో ఉక్కుకర్మాగారం, దుగ్గరాజుపట్నంలో ఓడరేవు నిర్మాణం, గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్సు ఏర్పాటు చేయాలని కోరారు.

గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న సెక్షన్ 8ని అమలు చేయాలని ఉభయ సభలు ఏకగ్రీవంగా తీర్మానిస్తూ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

9,10 షెడ్యూలులో పేర్కొన్న సంస్థల ఆస్తులు, అప్పులతోపాటు ఆయా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను సహేతుకంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాల మధ్య ప్రభుత్వ ఉద్యోగుల పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని కోరారు.

పన్ను రాబడులలో వ్యత్యాసాలను దిద్దుబాటు చేస్తూ పునర్విభజన చట్టానికి సవరణలు చేపట్టాలని ఉభయసభలు కేంద్రాన్ని కోరాయి.

**'విభజన హామీల అమలుకు భరోసా ఇవ్వండి'**

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా అమలుచేస్తామని మాకు భరోసా ఇవ్వండి. ఇచ్చిన హామీలు నెలబెట్టుకోవడంలో జరుగుతున్న జాప్యంవల్ల అనేక కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్రాన్ని ఆదుకోవడానికి కేంద్రం ఉదారంగా సహకరించాలి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అసెంబ్లీలో 'ప్రత్యేక హెూదా'పై తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర విభజన అనంతరం అనేక ఆర్థిక సమస్యలు తమను పట్టి పీడిస్తున్నా, ఎంతో కష్టపడి వృద్ధి రేటును పెంచగలిగామని చంద్రబాబు అన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో కొన్ని జటిల సమస్యలు ఉన్నాయన్నారు. రుణం తెచ్చుకోవడానికి ప్రస్తుతం ఉండే పరిస్థితుల్లో అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దక్షిణభారతంలో తలసరి ఆదాయాన్ని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే తక్కువన్నారు. నవ్యాంధ్రలో తలసరి ఆదాయం రూ.95,685 ఉంటే. తెలంగాణలో రూ.1,29,183లని తెలిపారు. అలాగే తమిళనాడులో రూ1,35,506లు అయితే, కర్ణాటకలో రూ.1,30,847లు, కేరళలో రూ.1,38,370ల వంతున తలసరి ఆదాయం ఉన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్ జనాభా ఎక్కువ, ఆదాయం తక్కువని తెలిపారు.

ప్రత్యేక హెూదా అంశాన్ని బిల్లులో పెట్టక పోయినప్పటికీ ఆనాటి ప్రధాని రాజ్యసభలో మౌఖికంగా హామీ ఇచ్చారన్నారు. నవ్యాంధ్రకు ప్రత్యేక హెూదా అవసరమన్నారు. 2015మార్చి నాటికి రెవెన్యూ లోటు రూ.16,079 కోట్లకు చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం ఈ లోటులో కేవలం రూ.2,303 కోట్లే ఇచ్చిందని, 2019 వరకు మనకు లోటు కొనసాగుతుందని 14వ ఆర్థిక సంఘం స్పష్టీకరించినట్లు చంద్రబాబు గుర్తు చేశారు.

ఎన్ని ఇబ్బందులున్నా, పోలవరం ప్రాజెక్టును 2018 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు పోతున్నామని, ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును కేంద్రప్రభుత్వం ఇస్తుందన్న విశ్వాసం తమకున్నదన్నారు. ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విషయంలో తొలి సంవత్సరం ఉభయ రాష్ట్రాలు కలిసి కూర్చొని పరిష్కరించుకోవాలని, రెండో ఏడు కేంద్రమే ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు.

– పెరుమాళ్ళ నాగరాజు
మీడియా లైజన్ అధికారి

# అబలలు కాదు... ఆటో రాణులు




ప్రభుత్వం చేయూత, ప్రోత్సాహం పుష్కలంగా లభించడంతో పేద మహిళల జీవితాల్లో వెలుగు రేఖలు ప్రసరిస్తున్నాయి. సరికొత్త జీవనోపాధులు కల్పించి పేదరికంపై గెలుపుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. దీనికి నిదర్శనం అనంతపురము నగరంలోని మహిళా ఆటో డ్రైవర్లు. సమాజంలో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు హస్మత్‌బీ, హమిదాబాను, షాషాబీ, పర్వీన్, షాహీనా, సరస్వతి తదితరులు..

## ఆటో నడుపుతుంటే ఆశ్చర్యంగా చూస్తున్నారు - హస్మత్ బీ

తాను ఆటో నడుపుతుంటే అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారని, చాలా గర్వంగా వుందని చెప్తోంది ఆటో డ్రైవర్ హస్మత్ బీ (36). అనంతపురము నగరం ఏ. నారాయణపురానికి చెందిన హస్మత్ బీ పేదరికంపై గెలుపు సాధించిన మైనారిటీ మహిళ. మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొదుపు ఉద్యమంలో చేరినప్పటి నుండి ఆమె విజయాల పరంపర మొదలైంది. 2000 సంవత్సరంలో శ్రీ ఆంజనేయస్వామి మహిళ సంఘ సభ్యురాలిగా చేరినప్పటి నుంచి సంఘం, గ్రామ సమాఖ్య, మండల సమాఖ్య నాయకురాలిగా, సిఆర్‌పిగా శిక్షరాలిగా అంచెలంచెలుగా ఎదిగింది. నాకు జీవితాన్నిచ్చి, ఈస్థాయికి చేర్చిన సంఘం అంటే నాకెంతో ఇష్టం అని అంటుంది హస్మత్ బీ.

ఈ క్రమంలోనే ఆటో డ్రైవర్‌గా మారి మరోవిజయం సాధించింది. హస్మత్ బీ. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలోని రూడ్ సెట్ సంస్థలో ఆటో డ్రైవర్‌గా శిక్షణ పొందింది. ప్రభుత్వ సాయంతో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో రూ. 1.55 లక్షల రుణాన్ని పొంది ఆటో యజమానిగా మారింది. బ్యాంక్ రుణంలో మైనారిటి కార్పోరేషన్ ద్వారా రూ. 77,500 లు సబ్సిడీని అందించి, ప్రభుత్వం మరింత అండగా నిలవడంతో హస్మత్ బీ ప్రయాణం నల్లేరు మీద బండిలా సాగుతోంది..

ఆటో డ్రైవర్‌గా చాలా సంతృప్తి లభిస్తోందని చెప్తోంది హస్మత్ బీ. డీజిల్‌కు పోను,రోజుకు రూ. 600 ల నుండి 700 రూపాయిల ఆదాయం లభిస్తోందంటోంది. ఆటోను నడపగలనా అని తాను తొలుత కొంత సంశయ పడ్డానని, అయితే అధికారుల ప్రోత్సాహం, నైపుణ్యవంతమైన శిక్షణతో ప్రస్తుతం ఎంతటి ట్రాఫిక్‌లోనైనా, ఆటోను నడుపుతూ ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తానంటోంది హస్మత్ బీ. ఆటో డ్రైవింగ్‌తో పాటు స్వీయ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ లోనూ అధికారులు శిక్షణ ఇప్పించారని, దీంతో తామిప్పుడు బలీయమైన మహిళలుగా రూపుదిద్దుకున్నామంటోంది ఈమె. మహిళా ఉద్యోగులు ఎక్కువగా తన ఆటోలో ఎక్కుతూ వుంటారని చెప్పింది. డ్వాక్రా సంఘాల స్వావలంబనకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుకు మేమే నిదర్శనం అని సగర్వంగా చెప్పింది హస్మత్ బీ.

## నా భర్తతో పాటు నేనూ ఆటో నడుపుతున్నా - హమీదాబాను

నా భర్తతో పాటు నేనూ ఆటో నడుపుతున్నానని గర్వంగా చెప్పింది హమిదాబాను (34). గత 16 ఏళ్లుగా డ్వాక్రా సంఘ సభ్యురాలిగా ఆర్థికంగా, సామాజికంగా ఎంతో చైతన్యం పొందానంటోంది హమిదా. తన భర్త మసూద్ బాషా కూడా ఆటో డ్రైవరేనని, డిఆర్‌డిఏ అధికారుల ప్రోత్సాహంతో పాటు తన భర్త ఇచ్చిన ప్రోత్సాహం వల్ల రూడ్ సెట్ శిక్షణ పొంది ఆటో డ్రైవర్‌గా మారానంది. బ్యాంకు రుణం, మైనారిటి కార్పోరేషన్ ద్వారా రూ. 77,500 సబ్సిడీ వల్ల సులభంగా ఆటో యజమానినయ్యానంటోంది. నగరంలో తాము 8 మంది మహిళలం ఆటోలను నడుపుతున్నామని, త్వరలో ప్రభుత్వ ఆస్పత్రివద్ద మహిళల ఆటోస్టాండును స్థానిక శాసన సభ్యులచే ప్రారంభించబోతున్నామని తెలిపింది. ప్రభుత్వం మహిళాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల తాము ఈ స్థాయికి వచ్చామని సంతోషంగా చెప్పింది హమిదాబాను. వినూత్నమైన జీవనోపాధులను చూపించి మహిళలకు అండగా నిలిచి సమాజంలో తమకు మంచిస్థానాన్ని కల్పిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్తున్నారు ఆటో డ్రైవర్లుగా రాణిస్తున్న హస్మత్ బీ, హమిదాబాను, షాషాబీ, పర్వీన్, షాహీనా, సరస్వతి తదితరులు.


## జీవనోపాధుల్లో నూతన ఒరవడి

డ్వాక్రామహిళలకు రొటీన్ వ్యాపారాలకు భిన్నంగా సరికొత్త జీవనోపాధులను కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అనంతపురము జిల్లాలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టామని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. ఇందులో భాగంగానే జిల్లాలో 18 మంది మహిళలకు రూడ్ సెట్ శిక్షణా సంస్థలో ఆటో డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇప్పించామన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో బ్యాంకర్లను ఒప్పించి 18 మందికి రుణ సదుపాయం కల్పించి ఆటోలు కొని ఇవ్వడం జరిగిందన్నారు. బ్యాంకు రుణం, లైసెన్సులు, రిజిస్ట్రేషన్ వంటి కీలకమైన పనులన్నీ తమ అధికారుల ఆధ్వర్యంలో పూర్తిచేసి, శిక్షణ పొందిన మహిళలకు సహకారం అందించామన్నారు. శిక్షణ పొందిన మహిళలందరూ ఆటో డ్రైవర్లుగా రాణిస్తున్నారని, రోజుకు రూ. 600 ల నుండి వెయ్యి రూపాయల దాకా ఆదాయం పొందడం విశేషం అన్నారు. త్వరలో మరో బ్యాచ్ కు శిక్షణ ప్రారంభించనున్నామన్నారు. జిల్లాలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దినేష్ కుమార్, ప్రభుత్వ సలహాదారు సి.యస్. రామలక్ష్మీ అభినందించారని, వారు మహిళా ఆటో డ్రైవర్లతో సంభాషించి, నిర్భయకేసులను అరికట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారన్నారు. ఈ కార్యక్రమం విజయం వెనుక తమ డిపియం అన్నపూర్ణ కృషి అభినందనీయమని ప్రాజెక్ట్ డైరక్టర్ వివరించారు.

- కె.జయమ్మ
పౌర సంబంధాల అధికారి, అనంతపురము.

# శోభాయమానంగా కృష్ణా పుష్కరాలు

– సీయం చంద్రబాబు



**కృష్ణా పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ప్రభుత్వం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు సాంకేతికత, వైజ్ఞానిక, సామాజిక సాధికారతను ప్రతిబింబించేలా వుండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు.**

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా, తరాలుగా వస్తున్న మన ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని కళ్లకు కట్టేలా కృష్ణా పుష్కరాలను చక్కగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. రానున్న పుష్కరాలకు జరుగుతున్న ఏర్పాట్లపై హైదరాబాద్ సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి కూలంకషంగా చర్చించారు.

గోదావరి మహాపుష్కరం తరువాత ఇది వరుసగా వచ్చిన మరో అపూర్వమైన అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చడానికి చేస్తున్న కార్యక్రమాలపై ప్రజానీకానికి అవగాహన కల్పించాలని సూచించారు. కరవు అనే మాట వినిపించకుండా ఆంధ్రప్రదేశ్‌ను సస్యాంధ్రగా చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన కార్యక్రమాలను జనం ముందుకు తెచ్చి జల చైతన్యం తీసుకురావాలని చెప్పారు. ముఖ్యంగా కృష్ణా–గోదావరి పుణ్యనదుల్ని అనుసంధానం చేసి కృష్ణా డెల్టాలో పంటలు ఎండిపోకుండా కాపాడుకున్న వైనాన్ని, ఆ మేరకు కృష్ణాజలాల్ని రాయలసీమ జిల్లాలకు తరలించి అక్కడ ఉద్యాన పంటల్ని ప్రోత్సహిస్తున్న విధానాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. నీటికి పవిత్రంగా చూసి ఆరాధించే ఉత్సవాలలోనే నీటి ప్రాధాన్యం మనిషికి అర్థం అవుతుందని చెప్పారు. భూమ్మీద పారే నీటిని సద్వినియోగం చేసుకోవడం, భూమ్మీద పడే ప్రతి వర్షపు చుక్కని ఒడిసిపట్టుకోవడం, అట్టడుగు పొరల్లో దాగే భూగర్భజలాల్ని సంరక్షించుకోవడం చాలా ముఖ్యమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కృష్ణా–గోదావరి పవిత్ర సంగమం జరిపిన చోట పెద్దఎత్తున ఎగ్జిబిషన్ నిర్వహించి రాష్ట్రంలో ఏపీ ప్రాంతంలో ఎంతెంత వాటర్ టేబుల్ వున్నదీ విశదీకరించాలని కోరారు. రాష్ట్రంలో వున్న జల వనరులపై ఈ ప్రాంతంలో ఒక శాశ్వత ప్రదర్శనశాలను ఏర్పాటుచేయాలని, పవిత్ర సంగమ ప్రాంతాన్ని ఒక ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

కృష్ణా పుష్కరాల కోసం చేస్తున్న ఏర్పాట్లపై అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి ఒక ప్రెజెంటేషన్ ఇచ్చారు. మొత్తం కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో 229 ఘాట్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. దాదాపు మూడున్నర కోట్లమంది యాత్రికులు కృష్ణా పుష్కరాలకు వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తారని అంచనా వేస్తున్నట్లు వివరించారు. రహదారులు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, ఘాట్ల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తిచేసి తీరాలని ఆదేశించారు.

అలాగే, కృష్ణా నదీతీరంలోని పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ, అలంకరణ పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ పనులు కేవలం పుష్కరాల కోసం అన్నట్టు కాకుండా రాజధాని ప్రాంతాన్ని దృష్టిలో వుంచుకుని శాశ్వత ప్రాతిపదికపై పూర్తి చేయాలని కోరారు. నదీతీరాన నిర్మిస్తున్న ఘాట్లను కూడా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో వుంచుకుని శాశ్వత ప్రాతిపదికపై నిర్మించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో జూలై మాసాంతంకల్లా పుష్కర ఏర్పాట్లను, నిర్మాణ పనులను పూర్తిచేయాలని సీయం గడువు విధించారు. పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ప్రభుత్వం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు సాంకేతికత, వైజ్ఞానిక, సామాజిక సాధికారతను ప్రతిబింబించేలా వుండేలా చూడాలన్నారు.

ఈ ఏడాది జూన్ నాటికి ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులు పూర్తవుతున్నందున కృష్ణా పుష్కరాలలో అత్యుత్తమ బ్రాడ్ బ్యాండ్ సేవలు అందించాలని అధికారులకు సీయం సూచించారు. ఎక్కడికక్కడ నిరంతర పర్యవేక్షణ జరిపేలా పూర్తిస్థాయి సాంకేతిక సదుపాయాలను వినియోగించుకోవాలని చెప్పారు. మొత్తం కృష్ణా నదీ పరివాహక ప్రాంతమంతా నిఘా కెమెరాల పర్యవేక్షణ కింద తీసుకురావాలని ఆదేశించారు. గుంటూరు, విజయవాడ ప్రాంతాలలోనే కాకుండా చిన్నచిన్న పట్టణాలలో కూడా నిత్యం సాంస్కృతిక ప్రదర్శనలు సాగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా కృష్ణానదీ తీరాన వున్న కూచిపూడి ప్రాంతానికి పెద్దఎత్తున పర్యాటకులు విచ్చేసేలా అక్కడ ఏర్పాట్లు ఘనంగా, శోభాయమానంగా వుండితీరాలని అన్నారు. ప్రతి ఇంటినుంచి ఒకరైనా కూచిపూడి నేర్చుకునేలా ఎక్కడికక్కడ ప్రోత్సహించాలని కోరారు.

విజయవాడ, గుంటూరు మధ్య నిరంతర సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేశామని ఏపీయస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ సాంబశివరావు చెప్పారు. 500 నుంచి 600 సిటీ బస్సులను విజయవాడలో, 400 సిటీ బస్సులు గుంటూరు ప్రాంతంలో, మరో 200 బస్సులు ఇతర ప్రాంతాలలో అందుబాటులో వుంచి నిరంతర సర్వీసులను నడుపుతామని ఆయన ముఖ్యమంత్రికి చెప్పారు.

పెండింగ్ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తనకు ఒక కార్యాచరణ నివేదికను అందించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు.

❖

# ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు సర్కార్ అండ



- రూ. 1.5 లక్షలతో రుణాలన్నీ రద్దు చేస్తూ ధ్రువపత్రం
- నియమ నిబంధనలన్నీ సడలించి మరీ సంక్షేమ పథకాలు
- రూ. 3.5 లక్షలతో కనీస ఉపాధి

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నడుంకట్టింది.. కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేస్తోంది. గతంలో విడుదల చేసిన వాటిలోని లోపాలను సవరిస్తూ కొత్త విధానాన్ని తీసుకొస్తోంది. దీని ప్రకారం ఆ కుటుంబాలకున్న అప్పులన్నింటినీ నెల వ్యవధిలో రూ. 1.5 లక్షలతో ఒకేసారి పరిష్కరించాలి (వన్ టైం సెటిల్‌మెంట్). ఆపై ఆ కుటుంబం రుణ విముక్తం అన్న ధ్రువపత్రం ఇస్తారు. మరో రూ. 3.5 లక్షలతో కుటుంబానికి ఉపాధి లభించేలా మూడు మార్గాలను సూచిస్తోంది. వీటిల్లో ఏది ఎంచుకోవాలన్నది ఆ కుటుంబీకుల ఇష్టమే. ఆర్థికంగా స్థిరపడేంత వరకు జిల్లా కలెక్టర్ నియమించే కౌన్సెలర్ పూర్తి సహాయసహకారాలు అందిస్తారు. త్వరలో ఈ విధానం అమల్లోకి రానుంది.

### ముఖ్యాంశాలు...

ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాల్ని ఆదుకునేందుకు.. తెదేపా ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అంతకుముందున్న రూ. 1.5 లక్షల సాయాన్ని రూ. 5 లక్షలకు పెంచింది. అందులో రూ. 1.5 లక్షలతో అప్పులన్నీ ఓటీఎస్ చేయాలి.

మిగిలిన రూ. 3.5 లక్షలతో ఉపాధి కల్పించాలి.

తాజా మార్గదర్శకాల ప్రకారం రూ. 3.5లక్షలతో ఏం చేయాలంటే..

### మొదటి ప్రతిపాదన

డివిజనల్ కమిటీ, కౌన్సెలర్ సాయంతో మూడేళ్ల వ్యవధిలో ఈ మొత్తాన్ని వెచ్చిస్తూ పునరావాస ప్రణాళికను రూపొందించాలి. కుటుంబ సభ్యుడు, తహశీల్దార్‌తో సంయుక్త ఖాతాలో ఈ నిధి ఉంచాలి.

### రెండో ప్రతిపాదన

ఎనిమిదేళ్లపాటు నెలకు రూ. 5,000 అందేలా రూ. 3.5 లక్షల్ని ఉపయోగించాలి.

### మూడో ప్రతిపాదన

మొదటి ఏడాదిలో రూ. లక్ష వ్యయంతో పునరావాస ప్రణాళిక అమలుచేయాలి. మిగిలిన మొత్తాన్ని ఐదేళ్లపాటు అసలును తీయకుండా బ్యాంకులో జమచేసి నెలవారీగా వచ్చే వడ్డీని కుటుంబానికివ్వాలి. పునరావాసం ఎలా ఉండాలన్నది పూర్తిగా కుటుంబ ఇష్ట ప్రకారమే ఉండాలి. సాయం తీరును డివిజనల్ కమిటీ పర్యవేక్షించాలి.

- ఆర్డీఓ నేతృత్వంలోని డివిజనల్ కమిటీగాని, తహశీల్దార్ నేతృత్వంలోని మండల కమిటీగాని... ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రుణాలిచ్చిన బ్యాంకర్లు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారులతో సమావేశమవుతుంది. ఇందులో గ్రామ/సామాజిక వర్గ పెద్దలు, ఆ కుటుంబ సభ్యులూ పాల్గొంటారు. ఎంత అప్పులున్నా ఓటీఎస్ ద్వారా రూ. 1.5 లక్షలతో అందరికీ సర్దుబాటు చేస్తారు. చెల్లింపులన్నీ ఆన్‌లైన్ విధానంలో ఉంటాయి. గతంలో ఓటీఎస్ అంతగా విజయవంతం కాలేదు. కేవలం రూ. 50 వేలే ఉండటం అందుకు కారణం. ఈసారి నిధి పెరగటంతో వెసులుబాటు ఏర్పడుతోంది.
- అప్పులను తీర్చిన తరువాత ఆ కుటుంబం రుణ రహితమని ప్రకటించడంతోపాటు ధ్రువపత్రం కూడా కమిటీ ఇస్తుంది. ఆత్మహత్య తరువాత నెలలోపే ఇదంతా జరగాలి.
- ఆ తరువాత ఎవరైనా గత రుణాల విషయంలో ఒత్తిడి చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.
- తుది అనుమతి వచ్చేవరకు ఆగకుండా... ఆత్మహత్య తరువాత మూడు వారాలలోపే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు డివిజనల్ కమిటీ చర్యలు తీసుకోవాలి.
- ఆ కుటుంబాన్ని అంత్యోదయ అన్నయోజన పథకం (కేజీ రూపాయి చొప్పున నెలకి 35 కేజీల బియ్యం ఇస్తారు) పరిధిలోకి చేర్చాలి.
- జాతీయ కుటుంబ లబ్ధి పింఛన్ (ఎన్ఎఫ్‌బీఎస్) మంజూరు చేయాలి.
- పిల్లల్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్చాలి.
- ప్రైవేట్ పాఠశాలల్లో చేరిస్తే విద్యాహక్కు చట్టం కింద ఉచిత విద్య అందించాలి.
- నూరు శాతం రాయితీతో ఐఏవై ఇల్లు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో అంతకన్నా మేలైన పథకముంటే దానికింద పక్కా ఇల్లు కేటాయించాలి.
- ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేయాలి. పింఛను ఇవ్వాలి. అర్హత నిబంధనల్ని సడలించి ఇతర సంక్షేమ పథకాల్నీ అమలుచేయాలి.

ఆస్తుల బదలాయింపులో సమస్యల్లేకుండా.. ఆత్మహత్య చేసుకున్న రైతు పేరిట ఉన్న ఆస్తులు అతని వారసుల పేరిట మారే క్రమంలో వచ్చే సమస్యల్ని పరిష్కరించే బాధ్యతను సంబంధిత తహశీల్దార్‌కి అప్పగించాలి. ఆ రైతుకి వారసత్వంగా రావాల్సిన ఆస్తులున్నా... వాటిని సైతం వారసులకు దక్కేలా తహశీల్దార్ చూడాలి. దీనికోసం సెర్ప్ పరిధిలోని పారా లీగల్ నిపుణుల సేవలు ఉపయోగించుకోవాలి.

పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ 3 నెలల్లో పరిష్కరించాలి. ఇప్పటి వరకు వివిధ కారణాలతో విచారణ, అప్పీళ్లు, పునరావాస సాయం పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ మూడు నెలల్లోగా పరిష్కరించాలి.

# కృష్ణా డెల్టాలో పచ్చని పంటలా నవ్విన పట్టిసీమ

ఈసారి కృష్ణా డెల్టాలో చేతికొచ్చిన పంట పక్కున నవ్వింది– పట్టిసీమ పథకం మీద కువిమర్శకుల్ని చూసి. జల పర్యావరణం మీద ఏ దుష్ప్రభావం చూపకుండానే నదుల అనుసంధానానికి 'పట్టిసీమ' పరిష్కారాన్ని సాధించగలిగిన అపర భగీరథుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దక్షతకి దాఖలాగా విరగ్గాసిన చేలు వరికంకులై ఊగాయి.

ఈ ఏడాది కృష్ణా డెల్టా ఆయకట్టును గోదావరి జలాలే ఆదుకున్నాయి. డెల్టా రైతాంగం అడగక ముందే ప్రకాశం బ్యారేజి నుంచి జల వనరుల శాఖ నీటిని విడుదల చేసినా ఆ తరువాత కృష్ణా నది పరివాహక ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక, నాగార్జునసాగర్ జలాశయంలోకి నీరు రాక సాగర్ నుంచి చుక్కనీరు విడుదల కాలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి కేవలం ఏపీ, తెలంగాణలో త్రాగునీటి అవసరాలకే నీరు విడుదలయింది. సాధారణంగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 13 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు కృష్ణా డెల్టాలో ప్రకాశం బ్యారేజి ద్వారానే అందుతుంది. ఈ ఏడాది నాగార్జునసాగర్‌లో నీటిమట్టం కనీస స్థాయికి పడిపోయింది. ఎగువ నుంచి వచ్చిన కొద్దీ నీరు కర్నాటక ఆల్మట్టికే పరిమితమయింది. అయినా కృష్ణా డెల్టాలో 8 లక్షల 50 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను విరగ పండించారు. ఇంతకూ ఇది ఎలా సాధ్యమైంది?

## కృష్ణా గోదావరి అనుసంధానమే మంత్రం

వర్షాలు లేవు ఎక్కడా. నీటి ప్రవాహం లేదు, కృష్ణా డెల్టాలో వరి పంట పొట్ట దశలో వున్నది. ఈ పరిస్థితులో నీరు చాలా అవసరం. ఈ సమయంలోనే పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని రికార్డు స్థాయిలో పూర్తిచేసి కృష్ణా డెల్టాను ఆదుకున్నది ప్రభుత్వం. పట్టిసీమ పూర్తిచేసి పోలవరం కుడి కలువ ద్వారా రోజుకు 1500 క్యూసెక్కుల గోదావరి నీరు బుడమేరు డైవర్షన్ చానెల్ ద్వారా కృష్ణా నదిలో కలిపారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి రూ.1200 కోట్లు ఖర్చుచేసి ఆ నీటితో కృష్ణా డెల్టాలో 2400 కోట్ల విలువైన పంటను కాపాడింది ప్రభుత్వం. ఒకానొక దశలో పోలవరం కుడికాలువ పనులు, పట్టిసీమ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన కొనసాగించినా వివిధ కారణాల వల్ల కొంత ఆలస్యమై అనుకున్న సమయానికి డెల్టాకు నీరు చేరక, పులిచింతలలో నీరులేక, సాగర్ నుంచి చుక్క నీరు విడుదలయ్యే పరిస్థితి లేక ఆయకట్టు రైతులకు దిక్కు తోచలేదు. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లోనూ సార్వా పంటను దక్కించుకోవడమే కాక అధిక దిగుబడులు సాధించాం అన్న ఆనందం డెల్టా రైతుల్లో వ్యక్తం అవుతోంది. ఇన్ని ఇబ్బందుల మధ్య కూడా కృష్ణా డెల్టాలో రైతులు బంగారం పండించారు



డెల్టా పరిధిలోని 4 జిల్లాల్లో 8.5 లక్షల ఎకరాల వరి పంటను పట్టిసీమ ఎత్తిపోతల పథకమే ఆదుకున్నది.

సాగర్ ప్రాజెక్టు దిగువ భాగం నుండి పులిచింతల వరకు కృష్ణా నది పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా డ్యాంలోకి సుమారు 7 టీఎంసీల నీరు చేరింది. పులిచింతల దిగువ ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజి వరకు వున్న మున్నేరు, కట్టలేరు నదుల కారణంగా కేవలం 33 టీఎంసీల నీరు మాత్రమే చేరింది. ఈ నీటితోనే కృష్ణా డెల్టా అంతా సాగు అవ్వాలి. కానీ ఇది సాధ్యం కాని పని. డెల్టా పరివాహక ప్రాంతంలో 8.50 వేల ఎకరాల్లో వరి సాగు అయింది. ప్రతి ఏడాది మాదిరిగా అయితే ఈ మొత్తం సాగు కోసం కనీసం 100 టీఎంసీల నీరు కావాలి. ఈ ఏడాది అన్నీ కలుపుకొని 30 నుంచి 40 టీఎంసీల నీరు మాత్రమే వినియోగించారు రైతులు. అయినా సరే కృష్ణా డెల్టాలో రికార్డు స్థాయిలో 8.80 వేల ఎకరాలకు గాను 8 లక్షల ఎకరాల్లో అద్భుతమైన దిగుమతి వచ్చింది ఈ ఏడాది. ప్రతి ఎకరాకు 35 నుండి 40 బస్తాల దిగుబడి వచ్చింది. అదే సమయంలో ప్రక్కనే వున్న గోదావరి డెల్టాలో ఈ ఏడాది 9 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. గోదావరి డెల్టాకు వాడుకున్న నీరు 133 టీఎంసీలు. అంటే కృష్ణా డెల్టాతో పోలిస్తే దాదాపు 100 టీఎంసీల నీటిని అదనంగా వాడుకున్న గోదావరి రైతులు అదనంగా లక్ష ఎకరాలు మాత్రమే సాగు చెయ్యగలిగారు.

ఈ ఏడాది జూన్ నుంచి ప్రకాశం బ్యారేజికి వివిధ మార్గాల్లో ఇప్పటివరకు చేరిన నీరు 43 టీఎంసీలు కాగా సముద్రంలోకి వెళ్లింది 9 టీఎంసీలు. పట్టిసీమ ద్వారా ప్రకాశం బ్యారేజీలోకి ఇప్పటివరకు చేరిన నీరు 5.85 టీఎంసీలు. ఏది ఏమైనా డెల్టా పరిధిలోని 4 జిల్లాల్లో 8.5 లక్షల ఎకరాల వరి పంటను పట్టిసీమ ఎత్తిపోతల పథకమే ఆదుకున్నది. అంతేగాకుండా వున్న నీటిని పొదుపుగా వాడుకొని కృష్ణా డెల్టా రైతులు ఆదర్శంగా నిలిచారు.

❖



లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో అమరావతి శిల్పసంపదను వీక్షిస్తున్న ముఖ్యమంత్రి

# అమరావతి చరిత్ర తిరగరాద్దాం!

లండన్ బ్రిటిష్ మ్యూజియం అసాహీ షింబున్ గేలరీలో అమరావతి శిల్ప సంపద చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించిన తీరు కాకతాళీయం కాదు. రాజధాని చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని మళ్లీ మహోన్నతంగా పునప్రతిష్టించాలని పడుతున్న ప్రయాసకి అది ప్రతిరూపం. అమరావతి విశిష్టతను ప్రతిబింబించే వందల శిల్పాలు అక్కడికి ఎలా వచ్చిచేరాయని ఆరా తీయడమే కాదు.. వాటి చరిత్ర, విశిష్టత పైనా చర్చించారు. అమరావతికి వచ్చి.. పురాతోరణాల్ని ప్రతిష్టించేందుకు చేస్తున్న కృషిలో భాగస్వాములు కావాలని... చరిత్రాత్మక ప్రయత్నాలకి సహకరించాలని కూడా కోరారు.

ఒక్క లండన్ మ్యూజియంలోనే కాదు... చెన్నై ప్రభుత్వ మ్యూజియంలోనూ అపురూప కళాఖండాలు అమరావతి గురుతులు కొన్ని వందలున్నాయ్. వాటిని మన రాజధానికి మళ్లీ రప్పించేందుకు సన్నాహాలు సాగుతున్నాయ్. ఎందుకంటే... ఆంధ్రులు వేల ఏళ్లనాడే ప్రపంచాన్ని శాసించిన ప్రముఖులు. శాతవాహనుల కాలం నుంచి ఇప్పటి వరకూ ఇదీ మన ప్రయాణం అని తెలిసినప్పుడు కలిగే ఉత్తేజం వేరు! రాబోయే తరాలకి ఇదే అనుభూతి పంచేందుకు... ఆమరావతిని చారిత్రక కోణంలో ఆవిష్కరించేందుకు చంద్రబాబు విశ్వప్రయత్నమే చేస్తున్నారు. ఇది రాజధాని నిర్మాణంతోపాటు సాగుతున్న మహాయజ్ఞం.

## ఎందుకు..?

కేవలం రాజధాని అమరావతిని పునాదుల నుంచి నిర్మించడమే కాదు...అమరావతి చరిత్రను కూడా అదే స్థాయి నుంచి ప్రతిష్టించడం ఇపుడు అత్యవసరం. చరిత్ర గుర్తుచేస్తూ ప్రపంచానికి దిశానిర్దేశంచేసిన దివ్యత్వాన్ని మరోసారి ఆహ్వానిస్తూ, మానవీయ కోణాన్ని జోడించి... నరాలున్న నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయ్. ఇదంతా మూలాలతో ముడివేసే ప్రయత్నం. రాజధాని నిర్మాణం అంటే కాంక్రీట్ కట్టడం కాదు. అందులోనూ అమరావతి లాంటి వేల ఏళ్ల చరిత్ర ఉన్న నగరాన్ని ఠీవీగా తీర్చిదిద్దడం అంటే ఆషామాషీ వ్యవహారం అంతకన్నా కాదు. ఇది రెండు రకాలుగా జరుగుతోంది. ఓ వైపు నవ నగర నిర్మాణం. మరో పక్క కాలగతిలో కలిసిపోయిన చరిత్రను తిరగదోడి... వేల ఏళ్లనాటి తెలుగుజాతి పటిమను ప్రపంచానికి కొత్తగా పరిచయం చేయడం. మహోన్నత వారసత్వాన్ని కళ్ల ముందు ప్రతిష్టించుకునే సాంస్కృతిక పునరుజ్జీవం. అందుకే ముఖ్యమంత్రి అంతగా మనసు పెడుతున్నారు. తపన పడుతున్నారు. స్థూపాలు, శాసనాలు, కళా వైశిష్ట్యాలు... ఒక్కటేమిటి... దేశవిదేశాల్ని శాసించిన చారిత్రక సందర్భాలు... చరిత్రను మలుపుతిప్పిన ఘట్టాలు... దిశానిర్దేశం చేసిన ఆనవాళ్లు...ఇలా అన్నిటికీ ఒక్కచోటకి ఏర్చికూర్చే ఆలోచన ఇప్పటికే జరిగింది. రాజధానిలో ఈ చారిత్రక సన్నివేశాల్ని ప్రతిబింబించే నిర్మాణాలు...స్థల కేటాయింపులపై నిర్దిష్టమైన ప్రణాళికలు ఉన్నాయ్. భౌతికంగా నిర్మితమవుతున్న అమరావతితో ప్రతి ఆంధ్రుడి భావోద్వేగాన్ని కలపడంలో అపురూప ఘట్టాల పాత్ర నిజంగా అపూర్వం. తల్లీబిడ్డను కలిపే బొడ్డుతాడులా జాతిని... చరిత్రను అనుసంధానించే ప్రాణధారం ఇదే! ఇది తక్షణ అవసరం. దేశంలో ఇపుడు అతి కొద్ది రాష్ట్రాలకి మాత్రమే ఉన్న అద్భుత అవకాశం మనకి వచ్చింది.

## అమరావతి చరిత్ర మనకెంత తెలుసు...?

నిజానికి మనకి మొఘల్ సామ్రాజ్యం గురించో... ఘజనీ, ఘోరీ మహ్మద్‌ల గురించో తెలిసినంతగా అమరావతి గురించి, మనల్ని ఏలిన రాజుల గురించి తెలీదు. దానికి చాలా కారణాలు ఉన్నాయ్. నిర్లక్ష్యమో... కాలగమనమో... అంతకు మించిన సంఘర్షణల ప్రభావమో కానీ తెలుగు జాతి చరిత్రకి రావాల్సినంత ప్రాధాన్యం... మన చారిత్రక ఘట్టాలకి ఇవ్వాల్సినంత ప్రాముఖ్యత ఇవ్వలేదనే చెప్పాలి. అందుకే వేల ఏళ్లనాటి విశిష్టత కాలగర్భంలో కలిసిపోయింది. మిగిలిన మరికొన్ని మైలురాళ్లు కూడా శిథిలాలుగా మిగిలిపోయాయ్.

ఆర్యుల ఆగమనానికి సంబంధించి మన దగ్గర సాక్ష్యాలు పదిలంగా ఉన్నాయ్ కానీ... మన జాతిని, దక్షిణాదినే కాదు... ఏకంగా 40కిపైగా దేశాల గమ్యాన్ని గమనాన్నీ నిర్దేశించిన అమరావతికి సంబంధించిన మూల విలక్షణ సంప్రదాయాల్ని మనం నిర్లక్ష్యం చేశాం. నిశీధికి వదిలేశాం. కాలక్రమంలో అవన్నీ సమాధి అయిపోయాయ్. ఇపుడు వాటన్నిటికీ వెలికి తీయాల్సిన సమయం. మరుగున పడిన చరిత్రకి మళ్లీ ప్రాణం పోయాల్సిన తరుణం.

అమరావతి ఆంధ్రుల వైభవానికి ఆయువుపట్టు. నాగరికతకు కేంద్ర బిందువు. ఇక్కడి చైత్యాలు జాతిని ప్రభావితం చేసిన కేంద్రాలు. 2500 ఏళ్లనాడు శాతవాహనులతో మొదలైన చరిత్ర అటు తర్వాత ఇక్ష్వాకులు, పల్లవులు, చాళుక్యులు, కోట రాజుల వరకూ వర్ధిల్లింది. కొంత విరామం తర్వాత ఢిల్లీ సుల్తాన్ల ప్రభావం, ముసునూరి నాయకరాజులు, బహమనీ సుల్తానులు, విజయ నగర వీచికలు దాటి... గోల్కొండ నవాబుల కాలం వరకూ సుదీర్ఘంగా సాగింది మన వైభవం. ఈ వందల వేల ఏళ్ల ప్రస్థానంలో ప్రాభవం రాళ్లపాలైంది. ప్రభావం మరుగున పడింది. పునరుద్ధరించాలనే ఆలోచన... ఆకాంక్ష కూడా తక్కువే అయ్యేసరికి అమరావతి చరిత్ర సమస్తం సమాధుల్లో కలిసిపోయింది. అమరావతి అంటే ఇప్పటికీ కనిపిస్తున్న స్థూపాలే అనే భావన గూడుకట్టుకుపోయింది. బ్రిటిష్ కాలంలో 1825 తర్వాత, 1926, 1955లలో కొన్ని తవ్వకాల్లో చారిత్రక ఆధారాలు బయల్పడ్డాయ్. అవన్నీ ఇపుడు చెన్నై, లండన్ మ్యూజియాల్లో మిగిలాయ్. మరికొన్ని మనదగ్గర ఉన్నాయ్. నిజానికి చరిత్ర వీటికన్నా సువిశాలం. మన ప్రశస్తి అనంతం.

## ది ఎటర్నల్ స్పిరిట్ ఆఫ్ అమరావతి

అమరావతి ముందు నుంచి చరిత్ర, సంస్కృతికే కాదు అధ్యయనానికి... జ్ఞానానికి కూడా ఆలవాలం. బౌద్ధానికి సంబంధించిన ఆనవాళ్లు ఇక్కడున్నంత లోతుగా...ఇక్కడున్నంత తీక్షణంగా మరెక్కడా లేవంటే ఆశ్చర్యం కాదు. బౌద్ధంలో హీనయాన మహాయానాలే కాదు... థేరవాద, వజ్రాయన లాంటి శాఖలు కూడా బలంగా ఉండేవని చూపించేది అమరావతి ఒక్కటే.

మామూలుగా శిల్పాలంటే ఆకారాలు మాత్రమే ఉంటాయ్. కానీ అమరావతి శైలి అలా కాదు... ఓ దృశ్యాన్ని వివరిస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఇదే శిల్పరీతి అమరావతి స్కూల్ ఆఫ్ ఆర్ట్. శ్రీలంకలోని అనురాధాపురా లాంటి ప్రాంతాలతోపాటు ఇండోనేషియా లాంటి దేశాల్లోనూ ఇప్పటికీ సజీవంగా కనిపిస్తోందీ కళ. అంటే ఇదంతా అమరావతి ముద్ర. ఇలాంటివన్నీ ఓ చోట గుదిగుచ్చితే అమరావతి విశిష్టత దానంతట అదే అర్థమవుతుంది.

## భావితరాలకి కానుక

రాజధాని అమరావతిని చారిత్రక పునర్నిర్మాణానికి వారధిగా మలిచేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. తరాలు ముందుకెళ్లి ఆలోచించే నాయకత్వం కాబట్టే... శతాబ్దాల నాటి మన చరిత్రకి ప్రాణం పోయాలనుకుంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం అపూర్వం అనిపిస్తుంది. చరిత్రను ఆవిష్కరించడం అంటే బలమైన భవిష్యత్‌ని... అబేధ్యమైన తెలుగుజాతిని నిర్మించడమే !

– కామేశ్ గూటాల



# నవ్యాంధ్ర ప్రగతికి బ్రిటన్‌లో బీజం

## ఫలప్రదమైన సీఎం లండన్ పర్యటన

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లండన్‌లో ఇటీవల జరిపిన మూడ్రోజుల పర్యటన పూర్తిగా ఫలవంతమయ్యింది. నవ్యాంధ్రలో పెట్టుబడుల్ని ఆహ్వానిస్తూ ఆయన బ్రిటన్ వ్యాపార దిగ్గజాలను కలిశారు, వారి నుంచి హామీలూ పొందారు. గ్రేటర్ లండన్ అథారిటీ, రాయల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ సర్వేయర్స్ (ఆర్ఐసీఎస్) వంటి సంస్థల ప్రతినిథులతో భేటీ అయ్యారు. ప్రవాసాంధ్రుల సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రగతిపథంలో నవ్యాంధ్రని నిలిపిన పలు అంశాల మీద పవర్ పాయింట్ ప్రజంటేషన్లు ఇచ్చారు. భారత స్వాతంత్ర్య పూర్వ, అనంతర పరిణామాల తలపోతలో అక్కడి మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. జాతి సంస్కృతికి, సంస్కారం మహాప్రవాహమైన థేమ్స్ నది మీద చేసిన పడవ ప్రయాణంలో మన కృష్ణవేణి తీరాన సాకారం కానున్న ఆంధ్రుల స్వప్నం అమరావతిని తలుచుకున్నారు. థేమ్స్ నదీ తీరాన 'లండన్ ఐ' తరహా పర్యాటక కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని అక్కడ అధికారులను కోరారు.

### అమరావతి అభివృద్ధికి లండన్ చేయూత

నవ్యాంధ్రలో పెట్టుబడులు ఆహ్వానించేందుకు పెట్టుబడిదారులతో సమన్వయం చేసేందుకు లండన్‌లో అమరావతి కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బ్రిటన్‌లోని పెట్టుబడిదారులు, సంస్థలు, వాణిజ్య పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి ఏపీకి పెట్టుబడులు సమకూర్చడంలో ఈ కార్యాలయం సహకరించనున్నది. ఆర్థిక అభివృద్ధి బోర్డు (ఈ.డి.బి) పర్యవేక్షణలో  ఇది పనిచేయనున్నది. ఈడిబి సిఈవో జె కృష్ణకిశోరు ఈ వ్యవహారాలను చూసుకోనున్నారు. లండన్‌లో అమరావతి అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటుకు సింఘానియా అండ్ కో సంస్థ భాగస్వామి అయిన న్యాయవాది విజయగోయల్ ముందుకు వచ్చారని  బ్రిటిష్ బిటిష్ పారిశ్రామికవేత్తల సమావేశంలో సీఎం చెప్పారు. అమరావతిలో పెట్టుబడులు పెట్టాలని ఆసక్తి ఉన్న బ్రిటిష్ కంపెనీలకు ఇందుకు అవసరమైన వ్యాపార వ్యూహాన్ని కన్సల్టింగ్ కంపెనీ ప్రైస్‌వాటర్‌హౌస్ కూపర్ తయారు చేసింది. రాష్ట్రంలో ఉన్న వనరులు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అక్కడి పెట్టుబడిదారులకు వివరించారు. స్మార్ట్ సీటీ అంశంపై 22 కి పైగా అత్యున్నత కంపెనీలతో సమావేశమయ్యారు. ఆ కంపెనీల ప్రతినిధులంతా నవ్యాంధ్ర అభివృద్ధికి సహకరించేందుకు సంసిద్దత వ్యక్తం చేశారు. అట్లాగే బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడు లార్డ్ బిలిమోరియాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బిటన్‌లోని వైద్య రంగానికి చెందిన పారిశ్రామిక వేత్తలతోనూ సీఎం చంద్రబాబు భేటి అయ్యారు.

ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సమస్యలపై పనిచేస్తున్న స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకుడు సీన్ కిడ్నీ చంద్రబాబుతో భేటి అయి పలు అంశాలపై చర్చించారు. పర్యావరణ సమస్యల పరిష్కారానికి కావాల్సిన విధులు కోసం పనిచేసిన కామన్‌వెల్త్ సెక్రటేరియట్ నిపుణుల కమిటిలో సభ్యుడిగా సీన్ కిడ్నీ పనిచేశారు.

అమరావతి నిర్మాణానికి నిధులు పోగుచేసేందుకు తాము తోడ్పడతామని లండన్ స్టాక్ ఎక్చేంజ్ సిఈఓ నిఖిల్ రాఠీ హామీ ఇచ్చారు.

> లండన్ లోని మ్యూజియంలో 33వ గ్యాలరీలోని అమరావతి శిల్పసంపదను సీఎం చంద్రబాబు వీక్షించారు. అమరావతి చరిత్ర, పురాతన కట్టడాల అవశేషాలు, ఇతర వస్తువులు పరిశీలించిన చంద్రబాబు అవి బ్రిటిష్ మ్యూజియంకి చేరిన వైనంపై ఆరా తీశారు. యుగాలనాటి మానవ చరిత్ర, కళా సాంస్కృతిక వికాసాన్ని పట్టి చూపేదిగా బ్రిటిష్ మ్యూజియంను అభివర్ణించారు.



**లండన్‌లో చారిత్రక బిగ్‌బెన్ గడియారం స్తంభం ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు.**

## ప్రవాస 'శ్రీమంతుల'తో ఆత్మీయ సమావేశం

బ్రిటన్‌లో ఉంటున్న 200 మంది ప్రవాసాంధ్రులతోను సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వారంతా గ్రామాలను దత్తత తీసుకుంటామని ముందుకు వచ్చారు. దాదాపు 60 వేల మంది తెలుగువారు బ్రిటన్‌లో ఉన్నారని, వారంతా పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వారిలో ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. యూకె స్మార్ట్ సీటి నైపుణ్యంపై 20 కంపెనీల ప్రతినిధులు చంద్రబాబు బృందానికి ప్రజేంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో గ్రేటర్ లండన్ అధారిటీ, ఆర్ఐసిఎస్, రోల్స్ రాయిస్, ఐకామ్, బెనాయ్ అరూప్, మోట్ మెక్ డోనాల్డ్, క్యాటపుల్ట్, స్టాడివ్ ఏరీనా, వోడాఫోన్, హెర్బర్ట్ స్మిత్ ఫ్రిహీల్స్, జేసీబి, యూకె ఎక్స్‌పోర్ట్ ఫైనాన్స్, ఏఆర్ఎమ్, గ్లీడ్స్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


## లండన్ 'అమరావతి' సందర్శనం

లండన్ లోని మ్యూజియంలో 33 వ గ్యాలరీలోని అమరావతి శిల్పసంపదను సీఎం చంద్రబాబు వీక్షించారు. అమరావతి చరిత్ర, పురాతన కట్టడాల అవశేషాలు, ఇతర వస్తువులు పరిశీలించిన చంద్రబాబు అవి బ్రిటిష్ మ్యూజియానికి చేరిన వైనంపై ఆరా తీశారు. యుగాలనాటి మానవ చరిత్ర, కళా సాంస్కృతిక వికాసాన్ని పట్టి చూపేదిగా బ్రిటిష్ మ్యూజియంను అభివర్ణించారు. తీరిక లేని పనుల్లో ఉండి కూడా మ్యూజియంను సందర్శించిన ముఖ్యమంత్రి, అమరావతి నగరంలో లండన్ తరహా పర్యటక కేంద్రం ఏర్పాటుపై పరిశీలన చేశారు.

## అమరాతిలో కింగ్స్ కాలేజ్ ఆసుపత్రి

బ్రిటన్‌లో అతిపెద్ద బోధనాసుపత్రుల్లో ఒకటైన కింగ్స్ కాలేజీ హస్పటల్ ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో 1000 పడకల ఆసుపత్రిని తక్షణమే ఏర్పాటు చేసేందుకు అంగీకరించిందని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కేసీహెచ్ భారతదేశంలో మొత్తం 11 ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నదని, అమరావతిలో ఆస్పత్రి అన్నిటికి కేంద్రం కార్యాలయంగా ఉంటుందని తెలిపారు. భారతదేశంలో ఆసుపత్రులకు అవసరమైన పరికరాలను ఇక్కడ ఉత్పత్తి చేయనున్నారు. ప్రపంచ స్థాయి ఆసుపత్రిని ఏర్పాటు చేయటానికే పరిమితం కాకుండా, భారతదేశంలో ఆరోగ్య పర్యాటకానికి ఈ సంస్థ దన్నుగా నిలవనున్నదని, జూన్ మొదటివారంలో ఆసుపత్రికి శంకుస్థాపన జరగనున్నదని సీఎం వెల్లడించారు.

అమరావతిలో ఏర్పాటు చేస్తున్న 6,387 ఎకరాల ఆరోగ్యనగరంలో కేసీహెచ్‌కు అవకాశం కల్పిస్తారు. ఆరోగ్యనగరంలో ఆరోగ్యానికి సంబంధించిన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు ఆరోగ్య అకాడమి పరిశోధన సంస్థలు ఏర్పాటు చేస్తారు.



# న్యాయమే గెలిచింది!

## జనాభా నిష్పత్తి ప్రకారమే ఆస్తుల పంపకం
## ఉన్నత విద్యామండలి కేసులో సుప్రీంకోర్టు తీర్పు

భౌగోళికంగా తెలంగాణా (హైదరాబాద్) లో ఉన్న అన్ని ఆస్తులు తమకే చెందుతాయన్న తెలంగాణా ప్రభుత్వ వాదనను దేశంలోని అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఖాతాల స్తంభన కేసులో సుప్రీం కోర్టు ఈ స్పష్టత ఇచ్చింది. విభజన చట్టంలోని సెక్షన్ 75ను పరిగణనలోకి తీసుకొని అవశేష ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్‌లోని చట్టసంబంధమైన సంస్థలపై హక్కు లేదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు తోసిపుచ్చింది.

ఏపీ ఉన్నత విద్యామండలి ఖాతాలను స్తంభింపజేసే అధికారం తెలంగాణ ప్రభుత్వానికి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విభజనకు ముందు మండలి ఖాతాల్లోని నిధులను.. జనాభా నిష్పత్తి ప్రాతిపదికన (58: 42 ప్రకారం) రెండు రాష్ట్రాలు పంచుకోవాలని పేర్కొంది. అలాకాని పక్షంలో సెక్షన్ 47 నిరుపయోగం అవుతుందని తెలిపింది. విభజన చట్టంలోని సెక్షన్ 75 ప్రకారం ఖాతాలు తమకే చెందుతాయన్న తెలంగాణ ప్రభుత్వ వాదనతో కోర్టు విభేదించింది. విభజన అనంతరం ఏపీలోని 13 జిల్లాల్లో తెరిచిన నూతన ఖాతాలను ఏపీ ఉన్నత విద్యామండలి నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. ఏపీ ఉన్నత విద్యామండలి ఉనికిలో లేదన్న హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ఉన్నత విద్యామండలి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జస్టిస్ గోపాలగౌడ, జస్టిస్ అరుణ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఉన్నత విద్యామండలి ఖాతాల స్తంభన కేసు తీర్పును వెలువరించింది.

### ఏపీ, ఏపీ ఉన్నత విద్యామండలి వాదనలు

విభజన చట్టంలోని సెక్షన్ 75ను సరిగా అర్థం చేసుకోవాలంటూ ఏపీ ఉన్నత విద్యామండలి తరపు సీనియర్ న్యాయవాది పీపీ రావు కోర్టుకు తెలిపారు. చట్టంలోని పదో

- 58: 42 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణలకు వాటా.
- ఖాతాలు స్తంభింపజేసే అధికారం తెలంగాణకు లేదు.
- సుప్రీం కోర్టు తీర్పుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆస్తులన్నిటిని జనాభా నిష్పత్తి ప్రకారమే జరగాలన్న ఆంధ్రప్రదేశ్ వాదన న్యాయబద్ధమైనదని తేలిపోయింది.

షెడ్యూలులో పేర్కొన్న సంస్థలకు సేవల కొనసాగింపునకు మాత్రమే సెక్షన్ 75 వర్తిస్తుందని.. ఆస్తులు, అప్పులకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. సెక్షన్ 47 నుంచి 67 వరకు ఉన్న ఆరో భాగం మాత్రమే ఆస్తులు, అప్పుల గురించి చెబుతుందన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పులకు సంబంధించిన ఆర్థిక సర్దుబాటు సముచితంగా జరగాలని సెక్షన్ 47 చెబుతోందన్నారు. ఎటువంటి వివాదం తలెత్తినా పరస్పర ఒప్పందం ద్వారా పరిష్కరించుకోవాలి, లేకపోతే కాగ్ సలహా మేరకు కేంద్రం ఇచ్చే ఆదేశాలనుసారం రెండు రాష్ట్రాలు నడుచుకోవాలి. అప్పాయింటెడ్ డే (2014 జూన్ 2) కన్నా ముందు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఖజానాలు, నగదు నిల్వలు, ఏపీ తెలంగాణల మధ్య జనాభా నిష్పత్తిలో పంచుకోవాలని సెక్షన్ 49 చెబుతోందని పీపీ రావు వివరించారు. 2014 విభజన చట్టాన్ని తప్పుగా నిర్వచించి హైకోర్టు తీర్పు ఇచ్చిందని ఏపీ ప్రభుత్వ తరపు న్యాయవాది బసవప్రభు పాటిల్ తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏపీ ఉన్నత విద్యామండలి సమీకరించిన నిధులను సైతం వాడుకొనే అధికారం తెలంగాణకే ఉందని హైకోర్టు చెప్పడం సమంజసం కాదన్నారు. ఇలా చెప్పడం వల్లే ఏపీ ఉన్నత విద్యామండలి నిధులను వాడుకోకుండా తెలంగాణ ఆపగలిగిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

### తెలంగాణ వాదన ఇదీ..

సెక్షన్ 75 ప్రకారం సదుపాయాలు అంటే సంబంధిత ఆస్తులు, అప్పులు కూడా వస్తాయని తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అంధ్యార్జున తెలిపారు. తెలంగాణలో ఏదైనా సంస్థ ఉంటే దానిలో జోక్యం చేసుకోవద్దని చట్టం చెబుతోందన్నారు. విభజన చట్టం ప్రకారం పదో షెడ్యూలులో పేర్కొన్నవి లాభాపేక్ష లేని సంస్థలనీ, ఎలాంటి వ్యాపార అంశాలు లేవని తెలంగాణ అడ్వొకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. పంజాబ్ విభజన చట్టాన్ని గుర్తు చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకే ఉన్నత విద్యామండలిపై అధికారం ఉందని, ఈ ప్రకారమే ఉన్నత విద్యామండలి ఖాతాలను స్తంభింపజేయాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని తెలిపారు. ఇది చట్టవిరుద్ధమని, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమంటూ ఏపీ ఉన్నత విద్యామండలి హైకోర్టును ఆశ్రయించింది. ఏపీ ఉన్నత విద్యామండలికి నిధులు డ్రా చేసుకొనే అధికారం లేదంటూ తెలంగాణ ప్రభుత్వం రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

### హైకోర్టు తీర్పు

తెలంగాణకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఉన్నత విద్యామండలి తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్నందున అది తెలంగాణకే చెందుతుందని పేర్కొంది. విభజన చట్టం 2014 ప్రకారం ఏ ప్రాంతంలో ఉన్న సంస్థలు ఆ రాష్ట్రానికే చెందుతాయి కాబట్టి ఏపీ ఉన్నత విద్యామండలిపై తెలంగాణకే అధికారం ఉంటుందని తీర్పు వెలువరించింది. తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్న ఏపీ ఉన్నత విద్యామండలి ఖాతాల నుంచి నిధులు డ్రా చేసుకొనే అధికారం ఏపీ ఉన్నత విద్యామండలికి లేదు కాబట్టి బ్యాంకులు ఖాతాలను స్తంభింపజేయడం సమంజసమేనని హైకోర్టు స్పష్టం చేసింది" అని తెలంగాణ తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు.

### కేంద్రం వైఖరి

ఏపీ ఉన్నత విద్యామండలి ఉనికిలో లేదని చెప్పడం సరికాదని, హైకోర్టు తీర్పును పక్కనపెట్టాలని కేంద్రం కోర్టును కోరింది. జనాభా నిష్పత్తి ప్రకారమే ఆస్తులు, అప్పుల పంపకాలు జరగాలని విభజన చట్టం చెబుతోందని స్పష్టం చేసింది.

సుప్రీం కోర్టు తీర్పుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆస్తులన్నిటిని జనాభా నిష్పత్తి ప్రకారమే జరగాలన్న ఆంధ్రప్రదేశ్ వాదన న్యాయబద్ధమైనదని తేలిపోయింది. ఏపి మొదటి నుంచి చెబుతున్న ఈ మాటను ఇప్పుడు దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ధృవీకరించింది.

### సుప్రీంకోర్టు తీర్పులో వ్యాఖ్యలు

జస్టిస్ గోపాలగౌడ, జస్టిస్ అరుణ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం వెలువరించిన 29 పేజీల తీర్పులో కొన్ని ముఖ్య వ్యాఖ్యలు.

- విభజన చట్టంలోని సెక్షన్ 75ను పరిగణనలోకి తీసుకొని అవశేష ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్‌లోని చట్టసంబంధమైన సంస్థలపై హక్కు లేదంటూ హైకోర్టు తీర్పు ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. పదో షెడ్యూలులోని సంస్థలు ఇరురాష్ట్రాలకు పంపిణీ చేయనక్కరలేదన్నట్లుగా హైకోర్టు భావించినట్లు కనిపిస్తోంది.దీనితో విభేదిస్తున్నాం. దీన్ని అంగీకరిస్తే విభజన చట్టంలోని సెక్షన్ 47 ఎందుకు?
- ఏపీ ఉన్నత విద్యామండలి బ్యాంకు ఖాతాల స్తంభన చట్టబద్ధం కానేకాదు. హైకోర్టు తీర్పును పక్కన పెట్టాల్సిందే. విభజనకు ముందు ఖాతాల్లోని నగదునే కాకుండా 13 జిల్లాల్లో ఏపీ ఉన్నత విద్యామండలి కొత్తగా తెరచిన ఖాతాలను స్తంభింపజేయడంసరికాదు.
- అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలికి సంబంధించిన ఆస్తులు జనాభా నిష్పత్తి 58: 42 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పంచుకోవాలి. 13 జిల్లాల్లోని ఖాతాలను ఏపీ ఉన్నత విద్యామండలి నిర్వహించుకోవచ్చు.

❖

# ఇంక్యుబేషన్స్, ఇన్నోవేషన్స్ కేంద్రంగా ఏపీ



పదివేల స్టార్టప్ (అంకుర) సంస్థలు నెలకొల్పే సంకల్పంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్న నాస్కామ్ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్.

- నాస్కామ్ ఆధ్వర్యంలో విశాఖలో ఐటీ స్టార్టప్స్ వేర్‌హౌస్
- ఆగస్టులో సాగరతీరంలో మరో అంతర్జాతీయ వేడుక

వినూత్న ఆవిష్కరణలు, అంకుర సంస్థలకు రానున్న రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ వేదిక అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు. హైదరాబాద్‌లో నాలేడ్జ్ ఎకానమిని ఎలాగైతే ప్రోత్సహించామో అదేరీతిలో ఇన్నోవేషన్లు, ఇంక్యూబేషన్లకు నవ్యాంధ్రప్రదేశ్‌ను చిరునామాగా తీర్చిదిద్దుతామని అన్నారు. రాష్ట్రంలో వుండే యువతీ యువకులే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వున్న మరో 50 లక్షల మంది తెలుగువారు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని, దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపొందుతోందని ఆయన తెలిపారు.

రాష్ట్ర శాసనసభ మీటింగు హాలులో నాస్కామ్‌తో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసుకున్న సందర్భంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశవ్యాప్తంగా 10 వేల అంకుర సంస్థలను ఏర్పాటు చేయాలని నాస్కామ్ తలపెట్టింది. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని విశాఖ నుంచి ఆరంభిస్తోంది. తొలిదశ 10 కె ఇంక్యుబేషన్స్ కార్యక్రమంలో భాగంగా విశాఖనగరంలో ఒక వేర్ హౌస్ ఆరంభించారు. ఔత్సాహికులకు అంకుర సంస్థల ఏర్పాటుకు అవసరమైన సాధనసంపత్తిని, సాంకేతిక సహాయ సహకారాలను ఈ వేర్‌హౌస్ నుంచి అందిస్తారు. నాస్కామ్ 10కె స్టార్టప్స్ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ నుంచి అమలు కావడం మనకు గర్వకారణమని ముఖ్యమంత్రి అన్నారు. రెండుమాసాల్లో విశాఖలో నాస్కామ్ 10 కే ఇంక్యుబేషన్స్ వేర్‌హౌస్ సిద్ధంగా వుంటుందని సీయం ఈ సందర్భంగా చెప్పారు. స్థానికంగా ఎంటర్‌ప్రెన్యూర్లను తయారుచేయడమే 10కె స్టార్టప్స్ కార్యక్రమ లక్ష్యమని నాస్కామ్ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ తొలుత ముఖ్యమంత్రికి వివరించారు. దేశవ్యాప్తంగా 10వేల స్టార్టప్స్ ఏర్పాటును ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు.

ఐటీరంగంలో స్వయంగా ఎదగాలనుకునేవాళ్లకు అన్నివిధాలుగా ప్రభుత్వం సహకరిస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ముఖ్యంగా వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే యువతీయువకుల్ని కళాశాల స్థాయి నుంచి ప్రోత్సహిస్తామని తెలిపారు. వారు భవిష్యత్తులో సొంత కాళ్లపై నిలబడేలా ఆర్థికంగా వెన్నుదన్నుగా వుంటామని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా పెట్టుబడులు సమకూర్చుకునేలా ప్రోత్సహిస్తామని అన్నారు. అవసరమైతే వెంచర్

కేపిటలిస్టులతో సమన్వయం చేసి సొంతంగా కంపెనీ ఏర్పాటుచేసుకునే స్థాయికి తీసుకువెళతామని తెలిపారు. ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ ప్రొఫెషనల్స్‌లో ఒకరు భారతదేశం నుంచి వస్తుంటే, అలా వచ్చిన ప్రతి ఐదుగురిలో ఇద్దరు తెలుగువారేనని అన్నారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్, గణితంలో మన తెలుగువారికి వున్న మేధా సంపత్తులే ఇవాళ వారిని అత్యున్నతస్థాయికి ఎదిగేలా చేశాయని చెప్పారు. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాల సహకారంతో విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా నైపుణ్యాభివృద్ధిలో మన విద్యార్థుల్ని సుశిక్షితుల్ని చేసే కార్యక్రమాన్ని ఇటీవలే ఆరంభించామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విశాఖ తీరం అంతటి ఆహ్లాదభరిత నగరం దేశంలో మరొకటి లేదని, ఇక్కడే శాశ్వత చిరునామా చేసుకుని పనిచేస్తే 10 వేల అంకుర సంస్థల ఏర్పాటు లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకోవచ్చునని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా నాస్కామ్ అధ్యక్షునికి సూచించారు. ఆంధ్రప్రదేశ్‌పై మరింత దృష్టి పెట్టి ఇక్కడి యువతను ప్రోత్సహించి మాతృభూమి రుణం తీర్చుకోవాలని ఆయన కోరారు. రానున్న రెండునెలల్లో రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ విప్లవాన్ని తీసుకొస్తున్నామని, రూ.150లకే కేబుల్ కనెక్షన్ ఇవ్వడమే కాకుండా10-15 ఎంబీపీయస్ స్పీడుతో ఇంటర్నెట్ అందించి దానికి అదనంగా టెలిఫోన్ మాట్లాడుకునే సౌకర్యం కూడా కల్పిస్తున్నామని చెప్పారు.

### ఆగస్టులో విశాఖలో ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్స్ సమ్మిట్

స్టార్టప్స్ ప్రోత్సాహం కోసం ఔత్సాహికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం సృష్టించాలని, ముందు వారికి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టి తరువాత వారి మేధస్సుకు పరీక్ష పెట్టేలా పోటీలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఐటీ అధికారులకు సూచించారు. తుది ఎంపిక పూర్తిచేసి ఈ పోటీలలో చివరిగా నిలిచే వారితో వచ్చే ఆగస్టులో విశాఖలో భారీఎత్తున ఇంటర్నేషనల్ ఇంక్యుబేషన్స్ సమ్మిట్ నిర్వహించాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్ఫూర్తిదాయకమైన విజయగాథలు వినిపించి మన యువతలో ఉత్తేజం నింపాలని ఆయన అభిప్రాయపడ్డారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యార్థులు ఎవరైనా వినూత్న ఆలోచనలు, విలక్షణమైన ప్రయోగాలతో ముందుకొస్తే వారికి అవసరమైన ప్రోత్సాహం కల్పిస్తామని చెప్పారు.

ఒకప్పుడు కాల్ సెంటర్లుగా మొదలై, వర్క్ స్టేషన్లుగా వుండిపోయిన మన కంపెనీలు రానున్న కాలంలో సొంతంగా సాంకేతిక ఉత్పత్తుల్ని తయారుచేసుకునే స్థాయికి ఎదగాలని బలంగా కోరుకుంటున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. నాస్కామ్ ఆరంభించిన తొలినాళ్లలో స్వయంగా తాను దాని ప్రమోషన్ కోసం ప్రయత్నించిన వైనాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. ఏపీ నుంచి వెళ్లి ఢిల్లీ స్థాయిలో కార్యదర్శులుగా ఎదిగి ఐటీ, టెలికమ్యూనికేషన్స్ రంగానికి విశేష సేవలందిస్తున్న వ్యక్తులు తమతో కలిసి పనిచేయడం తమకు సంతోషదాయకంగా వున్నదన్నారు.

విశాఖ సన్‌రైజ్ టవర్స్‌లో మరో రెండు మాసాల్లో నాస్కామ్ 10కే స్టార్టప్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు సమావేశంలో పాల్గొన్న ఐటీ అధికారులు తెలియజేశారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి పల్లెరఘునాథరెడ్డి, నాస్కామ్ అధ్యక్షుడు రెంటాల చంద్రశేఖర్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసుకున్నారు. గూగుల్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్స్, మైక్రోసాఫ్ట్ వెంచర్స్, కోటక్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, ఐబీఎం వంటి అంతర్జాతీయ కంపెనీలు 10కే స్టార్టప్ కార్యక్రమానికి సహకరిస్తున్నాయి..

విశాఖలో 8500 చదరపు అడుగుల వైశాల్యంతో  ఏర్పాటుచేస్తున్న స్టార్టప్స్ వేర్‌హౌస్ ద్వారా 85 నుంచి 100 సీట్లకు అవకాశం వుంటుందని, తద్వారా 30కి పైగా అంకుర కంపెనీల ఏర్పాటుకు అవకాశం ఏర్పాడుతుందని నాస్కామ్ అధ్యక్షుడు తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని ఏపీని నాలెడ్జ్ ఎకనామీ స్టేట్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి పల్లె రఘునాథరెడ్డి చెప్పారు. సమావేశంలో ఐటీ ఎడ్వైజర్లు జే సత్యనారాయణ,  జేఏస్ చౌదరి, ఐటీ కార్యదర్శి ఫణికిశోర్, ఇంకా, నిఖిల్ అగర్వాల్, నీనా పహుజా, ముఖ్యమంత్రి కార్యదర్శులు  సాయి ప్రసాద్, ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు.

❖

# 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' సాంకేతిక సహకారం

ఆంధ్రప్రదేశ్‌ను సాంకేతిక రంగంలో ఆదర్శంగా, ఉత్తమ నమూనా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తమకు తోడ్పడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఛాంబర్‌లో తనతో భేటీ అయిన 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' బృందాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కారాల్లో మిగిలిన రాష్ట్రాలకు ఏపీ మార్గదర్శనం చేసేలా సహకారం అందించాలని  ముఖ్యమంత్రి కోరారు. 'మేం సమ్మిళిత వృద్ధిని సాధించాలని, ప్రజానీకంలో సంతృప్తి శాతాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలో రెండంకెల వృద్ధిని సాధించటానికి మేం సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కారాలను ఉపయోగించుకోదలిచాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అమెజాన్ ప్రతినిధి బృందంతో చెప్పారు. 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' మేనేజింగ్ డైరెక్టర్ పీటర్ మూర్ మాట్లాడుతూ 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' ప్రత్యేకతలను వివరించారు. అత్యంత వేగంగా, సమర్థంగా కంప్యూటింగ్ సేవలు అందించే సత్తా తమ సంస్థకు ఉందన్నారు. తమ సంస్థకు ప్రపంచంలో 190 దేశాలలో పది లక్షలమంది వినియోగదారులున్నారని వివరించారు. ప్రస్తుతం వేయి ప్రభుత్వ సంస్థలు 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' సేవలను పొందుతున్నాయని తెలిపారు.

విశ్వవ్యాప్తంగా అంకుర సంస్థలు స్థాపించటానికి వాణిజ్య, వ్యాపారవేత్తలు 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' ను విశ్వసనీయమైనదిగా భావిస్తున్నారని మూర్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అంకుర సంస్థలను ప్రోత్సహించటానికి తాము రాష్ట్ర ప్రభుత్వానికి క్రియాశీలక సహకారం అందిస్తామని తెలిపారు. 'మీ విజన్ అమలుకు తోడ్పాటు అందించటానికి, ప్రయోగాత్మకంగా పని చేసేందుకు మాకు ఇదొక సదవకాశం' అని మూర్ అన్నారు.

ముఖ్యమంత్రి స్పందిస్తూ  రాష్ట్రంలో ఉన్న అవకాశాలను, ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభిస్తే చేకూరే ప్రయోజనాలను వివరించారు. తగిన ప్రతిపాదనలతో వస్తే కలసి పనిచేయటానికి సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' అంతర్జాతీయ కార్యనిర్వాహకులతో భేటీ అయ్యేందుకు అమెరికా రావాల్సిందిగా డైరెక్టర్ మూర్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించారు.

'అమెజాన్ వెబ్ సర్వీసెస్' పబ్లిక్ పాలసీ విభాగ అధిపతి రోజర్ సోమర్ విల్లే,  రీజినల్ మేనేజర్ ఆశిష్ బూబ్, రాష్ట్ర ప్రభుత్వ ఐటి సలహాదారు జేఏ చౌదరి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

❖

# ఆధునిక సాంకేతికతతో పేదలకు ఎన్టీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు



చైనా టెక్నాలజీ



కాంపోజిట్ టెక్నాలజీ



ఇపిఎస్ టెక్నాలజీ

రాష్ట్రంలో నిరుపేదలకు గృహ నిర్మాణం కొత్తరూపు సంతరించుకోబోతుంది. నిర్మాణ సామాగ్రి అందుబాటులేకపోవడం సిమెంట్ ధరలు ఆకాశాన్ని అంటడం, నిర్మాణాల్లో జ్యాప్యం నేపధ్యంలో సరి కొత్త పరిజ్ఞానంతో గృహాలు నిర్మించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో విదేశాలల్లో చేపడుతున్న టెక్నాలజీ ఉపయోగించి గృహనిర్మాణాలను నాణ్యంగా, వేగంగా లబ్దిదారుడికి అనువైన, ఇళ్లు నిర్మించాలన్నదే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమని రాష్ట్ర గృహనిర్మాణ, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి డా. కిమిడి మృణాళిని తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు ఇలా మూడు భాగాలుగా గృహనిర్మాణం చేపట్టనున్నారు. సింగపూర్, చైనా, హాంకాంగ్‌ల్లో ప్రజా గృహ నిర్మాణరంగంలో అక్కడి విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో ఉంటుంది. ఇక్కడ కూడా మన విశ్వవిద్యాలయాల్లోని నిపుణుల సలహాలు తీసుకుంటూ గృహనిర్మాణాలు చేపట్టడానికి చర్యలు తీసుకోనున్నారు. సింగపూర్, చైనా తరహాలో రహదారులు, త్రాగునీరు, విద్యుదీకరణ, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పచ్చదనం వంటి మౌలిక వసతులు కల్పించి టౌన్‌షిప్‌లను నిర్మించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశించారు.

### ప్రీకాస్ట్, ప్రీఫ్యాబ్ అంటే?

ఇంటినిర్మాణానికి అవసరమయ్యే అవసరమైన అనేక భాగాలను శ్లాబులు, గోడలు ఇతర వస్తువులను ముందుగా తయారుచేసుకొని తీసుకువచ్చి దానిని మన గృహనిర్మాణానికి సిద్దంగా ఉన్న ప్రాంతంలో పునాదులపై వీటిని అమరుస్తారు, ఈ సాంకేతికతనే ప్రీకాస్ట్ టెక్నాలజీ అంటారు. దీని వల్ల కూలీల సమస్య, నాణ్యత సమస్య, సమయాభావం వంటివన్నీ తీరిపోతాయి. ఒక నిర్మాణం సాంప్రదాయ పద్ధతుల్లో చేసే కంటే 65 శాతం వేగంగా ప్రీకాస్ట్ టెక్నాలజీతో పూర్తి చేయవచ్చు, తక్కువ వ్యవదితో పాటూ ఈ కొత్త పరిజ్ఞానం వలన ఇంటి నిర్మాణం 50 ఏళ్ల పాటు మన్నిక ఉంటుంది.

అయితే సాంప్రదాయ నిర్మాణాలకు అలవాటుపడ్డ ప్రజలకు ప్రీకాస్ట్ విధానంపై పలు అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయాలనే ఉద్దేశంతో కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలోని సీబీఆర్ అకాడమీ సమీపంలో 33 ఎకరాల్లో తొమ్మిది రకాల పరిజ్ఞానాన్ని వినియోగించి అధునాతన ఇళ్ల నమూనాలను గృహనిర్మాణ శాఖ ఏర్పాటు చేస్తోంది. ఈ పరిజ్ఞానంతో అందరికీ అందుబాటులో ఉండేలా కేవలం రూ.2.75 లక్షలతోనే సొంతింటి కలను నిజం చేసుకోవచ్చని గృహనిర్మాణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. షియర్‌వాల్, స్టీల్ స్ట్రక్చర్, ప్రీకాస్ట్, కాంపోజిటివ్ స్ట్రక్చర్, ఈపీసీ ప్యానెల్ పరిజ్ఞానంతో పాటు మలేషియా, చైనా, టర్కీ, రాజస్థాన్‌లలో ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న అత్యాధునిక గృహ నమూనాలు కేతనకొండలో సిద్దమయ్యాయి. వీటిని త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించనున్నారు. అనంతరం ఓ నమూనాను ఎంపిక చేసి రాష్ట్రమంతా ఆదర్శ గృహాల పేరుతో సామాన్యుల కోసం వీటిని నిర్మించనున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ పధాకాల కిందనిర్మించే ఇళ్లకు ఎంత ఖర్చువతుంది, ఎన్నేళ్లు పడుతుందనే అంచనాలను ముందుగా చెప్పడం చాలా కష్టం. ఈ ఆధునిక పరిజ్ఞానంతో ఎంత ఖర్చువుతుంది, ఎప్పటిలోగా పని పూర్తవుతుంది వంటివి పక్కాగా నిర్ణయించి. అనుకున్న సమయం కంటే ముందేగానే గృహనిర్మాణాన్ని పూర్తి చేసే వీలుంది. ఈ నేధ్యంలో ఈ తొమ్మిది రకాల ఆధునిక గృహ నిర్మాణ పరిజ్ఞానంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### పటిష్టమైన "షియర్ వాల్"

షియర్‌వాల్ టెక్నాలజీలో కాంక్రీట్‌తోనే మొత్తం నిర్మాణాన్ని చేపడతారు. గోడలు శ్లాబులు, ఫ్లోర్ అన్నీ కాంక్రీట్‌తోనే ఉంటాయి. కాంక్రీట్‌ను నిర్మాణ ప్రాంతం వద్ద ఒకేసారి కలిపి వేగంగా ఈ నిర్మాణాన్ని చేపడతారు. వారం వ్యవధిలోనే నాలుగు లేక ఎనిమిది ఫ్లాట్లు ఉన్న ఓ అంతస్తును నిర్మించే వీలుంది. ఆరునెలల్లో ఐదంతస్తుల అపార్ట్ మెంట్‌ను నిర్మించవచ్చు. సాధారణ పద్ధతిలో కనీసం ఏడాదిన్నర పడుతుంది. ప్రస్తుతం నిర్మాణరంగంలో కూలీల వ్యయం కూడా భారీగా పెరిగిన నేపథ్యంలో సమయం ఆదాతోపాటు, వృధా ఖర్చు చాలావరకు తగ్గుతుంది. పటిష్టత, నాణ్యత విషయంలో తిరుగుండదు. పగుళ్లు రావడం వంటివి ఉండవు రెండువారాలల్లో

ఇల్లు కట్టేయవచ్చు.

## స్టీల్ స్ట్రక్చర్ (ఎల్‌జీయస్)

నిర్మాణరంగంలో అత్యంత వేగంగా పూర్తయ్యే ఆధునిక పరిజ్ఞానమిది. దీనినే లైట్ గేజ్ స్టీల్ (ఎల్‌జీయస్) పరిజ్ఞానం అంటారు. కేవలం రెండునెలల్లో ఐదంతస్తుల అపార్ట్ మెంట్‌ను నిర్మించవచ్చు, గోడలకు స్టీల్ పార్టిషన్స్ చేసి వాటిపై జిప్సమ్, సిమెంట్ కప్పి తుది మెరుగులు దిద్దుతారు. బయట నుంచి వేడి, శబ్దాలు రాకుండా గోడల మధ్యలో ఇన్సులేషన్ చేసుకునేందుకు వీలుంది. చాలా తేలికగా, పటిష్టంగా ఉంటాయి, ఖర్చు తక్కువ, సమయం ఆదా అవుతుంది. అమెరికాలో ఇళ్లని చాలా వరకూ ఈ పరిజ్ఞానంతోనే నిర్మిస్తారు. ఫ్లోరింగ్, గోడలు, తలుపులు అన్నీ వారం వ్యవధిలో బిగించేయవచ్చు.



మలేషియన్ టెక్నాలజీ

## ఈపీఎస్ (ఎక్స్‌పెండెండ్ పాలిస్టైరిన్) ప్యానెల్ నిర్మాణాలు

కాంక్రీట్, పటిష్టమైన తీగలతో కూడిన మెష్, స్టీల్ ఫ్రేమ్స్‌ను ఉపయోగించి అత్యంత వేగంగా ఇళ్లను నిర్మిస్తారు. ఎక్స్‌పెండెండ్ పాలిస్టైరిన్ (ఈపీఎస్) ప్యానెళ్లను ముందుగా సిద్ధం చేసి తెచ్చి గోడలు, పైకప్పులుగా అమరుస్తారు. ప్యానెళ్లకు మధ్యలో థర్మాకోల్ షీట్స్‌ను అమర్చడం వల్ల తేలికగా ఉంటాయి. పై భాగంలో కాంక్రీట్‌తో ఫినిషింగ్ ఇవ్వడం వలన పటిష్టత విషయంలో ఢోకా లేదు. ఖర్చు చాలా తక్కువ. మెక్సికో, నైజీరియా, ఖతర్, కెన్యా వంటి దేశాలల్లో పేద వారి కోసం ఈ సాంకేతికతతో కూడిన ఇళ్లను ఎక్కువగా నిర్మిస్తున్నారు. అమెరికా, బ్రిటన్ లాంటిదేశాల్లోనూ ఈపీఎస్ పరిజ్ఞానంతో ఇళ్లు వేగంగా నిర్మిస్తుంటారు.



ప్రీ క్యాస్ట్ ఆర్ సి సి

## కాంపోజిటివ్ స్ట్రక్చర్

స్టీల్, కాంక్రీట్ కలిపి కాంపోజిటివ్ స్ట్రక్చర్‌తో ఇళ్ల నిర్మాణం చేపడతారు. దీనినే స్మెల్ సాంకేతికత లేదా ఇటాలియన్ సాంకేతికత అని కూడా అంటారు. స్టీల్, కాంక్రీట్ రెండురకాల మెటీరియల్ లను కలిపి కట్టడం వల్ల కాంపోజిట్ అని పిలుస్తారు. ఇదికూడా చాలా తేలిక తక్కువ సమయంలో నిర్మించే పటిష్టమైన పరిజ్ఞానం. ఖర్చు కూడా తక్కువే , ఒక్కోఫ్లోర్ లో ఎనిమిది అపార్ట్‌మెంట్లు ఉండే ఐదంతస్తుల భవనాన్ని మూడునెలల్లో కట్టొచ్చు.ఈ పరిజ్ఞానాన్ని వినియోగించి నాలుగు వేల ఇళ్లను రెండేళ్లలో కట్టేసి ప్రజలకు అందుబాటులోనికి తెచ్చే వీలుంది.

## మలేషియా, టర్కీ టెక్నాలజీ

మలేషియా నిర్మాణాల్లో బేస్ నుంచి అల్యూమినియం రాడ్లను వేసి శ్లాబ్ క్రింద కాంక్రీట్, ఇనుమును మలేషియా పరిజ్ఞానంలో వాడుతున్నారు.టర్కీ నిర్మాణాల్లో పునాదులు దృఢంగా వేసి దానిపై ఇనుము, సిమెంట్‌తో పటిష్టమైన బేస్ ఏర్పాటు చేసి దానిపై ఫైబర్ లాంటి తేలికైన ప్రేములతో ఇంటిని నిర్మిస్తారు.



షియర్ వాల్ టెక్నాలజీ

## చైనా స్టీల్ కన్‌స్ట్రక్షన్

చైనా కంపెనీ నిర్మిస్తున్న ఇళ్లు పూర్తి స్థాయిలో స్టీల్ నిర్మాణాలు, నాలుగు వైపులా వేసిన పెద్దపెద్ద స్టీల్ స్థంబాలు ఈ నిర్మాణ పటిష్టతను ఇనుమడింపచేస్తాయి.ఇక్కడ నిర్మిస్తున్న కట్టడాల్లో చైనా కంపెనీ అత్యదిక స్టీల్ ను ఉపయోగిస్తుంది. కాంక్రీట్, స్టీల్, థర్మాకోల్ మిక్స్ చేసి తయారుచేసిన ఫలకల్ని శ్లాబ్ కోశం వినియోగిస్తున్నారు, అదే మెటల్‌తో చైనా లో ప్రత్యేకంగా తయారుచేసిన ప్యానల్ ను గోడలకింద ఉపయోగిస్తున్నారు.

## 300 చదరపుఅడుగుల్లో ఇంటినిర్మాణం

ఒకొక్క గృహానికి రూ. 2.90 లక్షలు వ్యయం చేయనున్నారు. 300 చదరపు అడుగుల్లోనే గృహాన్ని నిర్మిస్తున్నారు, 150 చదరపు అడుగులల్లో రెండు పడక గదులు , 150 చదరపు అడుగులు వంటగది, హాల్, స్నానాల గదితో కూడిన మరుగు దొడ్డితో నిర్మాణం చేస్తున్నారు, పక్కా భవనంపైకి వెళ్లేందుకు మెట్లు, టాప్ పైన చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు చేస్తున్నారు. 10 లైట్లు, మూడు ఫ్యాన్‌లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గృహాల్లో వైరింగ్ జరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు 1.75 లక్షల సబ్సిడీ, 1 లక్ష బ్యాంకు ద్వారా రుణసదుపాయం కల్పిస్తారు. ఇతరులకు 1.25 లక్షల సబ్సిడీ, 1.50 లక్షల రుణసదుపాయం కల్పిస్తారు. స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి కోసం 15 వేలు ఇస్తారు.



టర్కీ టెక్నాలజీ

- శ్రీనాథ్

మీడియా లైజన్ అధికారి, గృహనిర్మాణ శాఖ

## ఏపీ 'పర్యాటకం'పై ఎస్సెల్ గ్రూపు ఆసక్తి

- అమరావతిలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఎస్సెల్ గ్రూపు ఆసక్తి చూపింది. కొత్త రాజధాని నగరంలో వినోద కార్యకలాపాల కోసం బహుళ అంతస్తుల భవనాలను నిర్మించడానికి ముందుకొచ్చింది. హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి ఎస్సెల్ వరల్డ్ ప్రతినిధులు తమ ప్రతిపాదనలను ఆయన ముందుంచారు. అమరావతి టూరిజం సర్క్యూట్‌లో భాగం అవుతామని ఎస్సెల్ వరల్డ్ వివరించింది. సమగ్ర ప్రతిపాదనలతో రావాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. ఏపీలో ఆకర్షణీయ ద్వీపాల్ని సుందర ప్రదేశాలుగా తీర్చిదిద్ది వాటిని పర్యాటక ప్రాంతాలుగా మలచుతామని ఎస్సెల్ వరల్డ్ వైస్ చైర్మన్ అశోక్ గోయెల్ చెప్పారు.

## పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌తో కలసి పనిచేస్తాం

- పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌తో కలసి పనిచేయటానికి మలేషియా సిద్ధంగా ఉందని మలేషియా రవాణా శాఖ మంత్రి లీవె షంగ్ లై స్పష్టం చేశారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ఆయన తన ప్రతినిధి బృందంతో వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, పట్టణాభివృద్ధిలో సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఏపీలో రవాణా రంగ అభివృద్ధికి తమ సహకారం ఉంటుందన్నారు. మలేషియా ప్రభుత్వం పరిపాలనలో అనుసరించే పారదర్శక విధానాలు తనకెంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.

## పుట్టపర్తిలో ఏవియేషన్ అకాడమీ

- మరో మూడునెలల్లో పుట్టపర్తిలో ఏవియేషన్ అకాడమీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సీయం చంద్రబాబునాయుడు తెలిపారు. హైదరాబాద్ తాజ్ హోటల్‌లో 150కి పైగా ప్రముఖ విమానయాన పారిశ్రామికవేత్తలు, ఉత్పత్తిదారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఏరోస్పేస్, డిఫెన్స్, ఎయిర్ బస్, బోయింగ్, ఖతర్ ఎయిర్‌వేస్, చెక్ ఎయిర్ వేస్ సహా అంతర్జాతీయ విమానయాన సంస్థలు, తయారీదారులతో ఏపీలో వైమానిక రంగ ప్రగతి, విమానాశ్రయాల ఏర్పాటు, పరిశ్రమ అభివృద్ధికి గల అవకాశాలపై ముఖాముఖి చర్చలు, బృంద చర్చలు జరిపారు. నాగార్జునసాగర్, దొనకొండ, దగదర్తి, భోగాపురం, కుప్పంలలో విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు వివరించారు.

## 14 రోజుల్లోనే పారిశ్రామిక అనుమతులు

- పారిశ్రామిక అభివృద్ధిని మరింత ప్రోత్సహించేందుకు వీలుగా చంద్రబాబు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అనేక కీలకమైన నిర్ణయాలు తీసుకున్నది. ఏకగవాక్ష విధానంలో పారిశ్రామిక అనుమతులివ్వడానికి ఇప్పటివరకు 21 రోజుల కాలపరిమితి ఉండగా, ఈ పరిమితిని 14 రోజులకు కుదిస్తున్నట్లు ప్రకటించింది.

## అనంతపురంలో ఉపాధి గ్రీన్ ఆడిట్ ప్రాజెక్టు

- దేశ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో గ్రీన్ ఆడిట్ నిర్వహించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు పైలట్ ప్రాజెక్టుగా ఆయా రాష్ట్రాలలో ఒక్కో జిల్లాలో రెండు గ్రామాలను ఎంపిక చేసి అధ్యయనం చేయనున్నారు. ఇందులో భాగంగా ఏపీలోని అనంతపురం జిల్లాలోని కనగానపల్లి, కల్యాణదుర్గం మండలంలోని ఎంఎన్ పల్లిలో ఈ పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తారు.

## ఎయిమ్స్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన

- మంగళగిరిలో రూ.1620 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం కానున్న ఎయిమ్స్ ఆస్పత్రికి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కేంద్రప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఎయిమ్స్ నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం హాస్పిటల్ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌సీసీ) కు అప్పగించింది.

## ఇంటర్నెట్, టీవీ ప్రసారాలకు కేబుల్ వ్యవస్థ

- నవ్యాంధ్రప్రదేశ్‌లోని ప్రతీ గృహానికి హైస్పీడ్ ఇంటర్నెట్, టెలిఫోన్, కేబుల్ టీవీ ప్రసారాలు, వీడియో ఆన్ డిమాండ్ సేవలను అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్ నెట్ సంస్థ (ఏపీఎస్ఎఫ్ఎల్)ను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 23 వేల కిలోమీటర్ల పరిధిలో ఆప్టికల్ కేబుల్ నెట్‌వర్కును అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి 2,449 ప్రాంతాలలో ఎలక్ట్రానిక్ సబ్ స్టేషన్లు, పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్ (పీవోపీ)గా ఉంటాయి. ఈ కేంద్రాల ద్వారా ఎంఎస్ఓ, ఎల్‌సీవోలంతా అనుసంధానం చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ లో నెట్ వర్క్ ఆపరేషన్స్ సెంటర్ నెలకొల్పారు. రాష్ట్రంలో ఉండే ఎంఎస్‌వో, ఎల్‌సీవోలు ఈ నెట్ వర్క్ పరిధిలోకి వచ్చేందుకు తమ వివరాలను నమోదు చేసుకోవలసి ఉంటుంది. మార్చి 14వ, తేదీ నుంచి తమ వివరాలను http://apsfl.in/ వెబ్ సైట్‌లో ఎన్‌రోల్ చేసుకోవచ్చు.

## తాత్కాలిక రిజిస్ట్రేషన్ గడువు 48 గంటలే..

- నూతన వాహనం కొనుగోలు చేసే సందర్భంలో డీలర్ ద్వారా జరిగే తాత్కాలిక రిజిస్ట్రేషన్ కాలపరిమితి ఇక నుంచి కేవలం రెండు రోజులే (48గంటలు) ఉంటుంది. ఇప్పటివరకు కనీసం నెలరోజుల గడువు ఉండేది. డీలర్ వద్దనే శాశ్వత రిజిస్ట్రేషన్ విధానం అమలవుతున్న ప్రాంతాలలో ఏపీ రవాణాశాఖ ఈ నూతన పద్ధతిని ప్రవేశపెట్టింది. ఈ నూతన విధానం వల్ల శాశ్వత రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో రవాణాశాఖ కార్యాలయాలు, ఏజెంట్ల అవినీతి, అక్రమాలను నియంత్రించవచ్చన్నది ప్రభుత్వ లక్ష్యం.

## అమరావతి నుంచి గుంటూరుకు మెట్రో రైలు పొడిగింపు

- విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు పరిధిని అమరావతి నుంచి గుంటూరు వరకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) రూపొందించాలని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌పీ రామకృష్ణారెడ్డి లేఖ రాశారు. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టును డిఎంఆర్సీ, ఏపి ప్రభుత్వం ఉమ్మడిగా ఆమోదించినట్లు ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. రాజధానిని హైదరాబాద్ నుంచి రాబోయే ఆర్నెల్లలోపే అమరావతికి తరలించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లోపే డీపీఆర్ సిద్ధం చేయాలని ఆ లేఖలో ఆయన కోరారు.

## ఏపీ ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక మండలి

- నవ్యాంధ్రప్రదేశ్ సమగ్ర ఆర్థికాభివృద్ధి కోసం తగు కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనతోపాటు పెట్టుబడులను ఆకర్షించాలన్న ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్థికాభివృద్ధి మండలిని ఏర్పాటు చేసింది. ఈ మండలికి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్ ఛైర్మన్‌గా ఆర్థికశాఖ మంత్రి వ్యవహరిస్తారు. ప్రభుత్వం ప్రధాన కార్యదర్శితోపాటు పది మందికి పైగా సంబంధిత శాఖల ఉన్నతాధికారులను కూడ ఈ మండలిలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో సమ్మిళిత వృద్ధిలో పెరుగుదలకు, భవిష్యత్ పోకడల అధ్యయనంలో ఈ మండలి ప్రధాన భూమిక పోషించనున్నది.

## పరిశ్రమల అభివృద్ధిపై మంత్రిమండలి ఉపసంఘం

- రాష్ట్రంలోని కష్టాలలో ఉన్న జూట్, సుగర్, ఫెర్రో, టెక్స్‌టైల్ తదితర పరిశ్రమలకు మరింత చేయూత నివ్వాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా

చంద్రబాబునాయుడు మంత్రిమండలి ఉపసంఘాన్ని నియమించారు. పరిశ్రమల ఉద్దీపన కోసం ఈ కమిటీ అధ్యయనం చేయనున్నది. ఈ కమిటీలో మంత్రులు యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాటి పుల్లారావు, చింతకాయల అయ్యన్న పాత్రుడు, శిద్ధా రఘువరావు నియమితులయ్యారు.

## భోగాపురం విమానాశ్రయానికి 2వేల ఎకరాలు సేకరణ

- విజయనగరంజిల్లా గాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం కోసం తొలిదశ కింద రెండువేల ఎకరాలను ఏప్రిల్ నెలాఖరు నాటికే సేకరించనున్నట్లు భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కంపెనీ ఎండీ ఎం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. భూ సమీకరణ నిమిత్తం రూ.1700 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. ఈ మొత్తాన్ని హడ్కో నుంచి రుణం రూపంలో పొందనున్నట్లు తెలిపారు. ఈ విమానాశ్రయం కోసం మొత్తం 5311 ఎకరాల భూమి అవసరం ఉందని, అయితే దశలవారీగా భూములను సేకరించనున్నామని ఆయన వెల్లడించారు. 2018 నాటికి విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## కానిస్టేబుల్ లక్ష్మీదేవికి 'అంతర్జాతీయ' పతకాలు

- కర్నూలుజిల్లా పోలీసుశాఖ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ నెమ్మిపాటి లక్ష్మీదేవి శ్రీలంకలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్‌పోటీల్లో పలు పతకాలు సాధించి ఆ జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఆమె ఈ పోటీలలో అనేక పతకాలు కైవసం చేసుకున్నది. ఈ క్రీడాపోటీలు కొలంబోలోని డియోగామ మహింద్రా రాజపక్సే క్రీడా మైదానంలో జరగగా, దాదాపు 22 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. హ్యామర్ త్రోలో ఆమె ప్రథమ స్థానంతో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నది. డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానంతో వెండి పతకాన్ని దక్కించుకున్నది.

## రైతురుణ బకాయిల సమస్యకూ... ఏకమొత్తంలో పరిష్కారం

- రైతన్నలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించిన మొండి బకాయిల చెల్లింపును ఏకమొత్తంలో పరిష్కరించుకునే అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. 193వ బ్యాంకర్ల రాష్ట్రస్థాయి సలహాసంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు పేరుకుపోతే ఆ మొండి బకాయిల చెల్లింపునకు ఏక మొత్త పరిష్కారం (వన్ వన్‌టైం సెటిల్‌మెంట్) చూపుతున్నారని, అదే వెసులుబాటు రైతన్నలకు వర్తింపజేయాలని కోరారు. రూ.1.5 లక్షల వరకు ఉన్న నిరర్థక ఆస్తులు, గడువు ముగిసిన వాయిదాలన్నింటికీ ఏకమొత్త పరిష్కారం చూపాలని ఆయన బ్యాంకర్లకు సూచించారు. మొండి బకాయిల్లో రైతులు ఎంత కట్టగలిగితే ఆ మేరకే వసూలు చేయాలని కోరారు.

## జర్నలిస్టులకు హెల్త్ స్కీం అమలు

- రాష్ట్రంలోని 15వేల జర్నలిస్టు కుటుంబాలకు ప్రయోజనం కలిగించే విధంగా 'వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం' ను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ప్రభుత్వం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. 2016–17 ఆర్థిక సంవత్సరానికి ఇది వర్తిస్తుందని, దీని అమలుకు తదుపరి చర్యలు తీసుకోవాల్సినదిగా సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ డా.పి.కృష్ణమోహన్‌కు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ద్వారా ఈ పథకం అమలు అవుతుందని ఆయన తెలిపారు. దీంతో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేసినట్లు అయింది అని పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ఈ తరహా పథకం దేశంలోనే మొదటిదని మంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

## వేసవి ముందుజాగ్రత్తలపై సిఎం ఆదేశాలు

- రానున్న వేసవికి రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. 13 జిల్లాల కలెక్టర్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల అధికారులతో ముఖ్యమంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎండలు పెరుగుతున్నందున వడగాల్పులపై ప్రజలలో అవగాహన కల్పించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలని చెప్పారు. అవసరమైతే పని వేళలను మార్చడం, మంచినీళ్లు, మజ్జిగ సరఫరా చేయడం వంటి సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఎంత ఖర్చయినా భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా వున్నదని తెలిపారు.

## ఇసుక విధానంపై టోల్ ఫ్రీ నెంబరు

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నూతన ఇసుక విధానాన్ని సవరించి, ఎటువంటి రుసుము లేకుండా ప్రజలందరికి ఉచితంగా ఇసుకను అందజేయాలని నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీని ద్వారా రాష్ట్రంలోని ప్రజలందరికి ఇసుక ఉచితంగా లభిస్తుంది, తద్వారా నిర్మాణ రంగం మరింత పుంజుకోగలదు. ఈ ఉచిత ఇసుక విధానంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తొలగించేందుకు, ఎక్కడైనా అక్రమ త్రవ్వకాలు జరిగితే వాటిని అరికట్టేందుకు, ఇసుక రీచుల మీద గుత్తాధిపత్యం చెలాయించేవారి వివరాలు అందజేసేందుకు టోల్ ఫ్రీ నెం.18005994599 తో ఒక కాల్–సెంటర్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కాల్–సెంటర్‌కి రాష్ట్రంలోని ప్రజలు ఎవరైనా ఫోన్ చేసి ఏ రకమైన అక్రమాలు జరిగినా వివరాలు తెలుపవచ్చు.


## కాపులకు 700 కోట్ల రుణాలు

- కాపు కార్పొరేషన్ నుంచి ఈ నెల 31 నాటికి 1,15,000 మంది కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్థులకు రూ. 700 కోట్ల మేర రుణాలందించేందుకు చర్యలు చేపట్టినట్లు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ చలమలశెట్టి రామానుజయ అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 3,45,800 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 42 వేల దరఖాస్తులను పరిశీలించి రుణాలు మంజూరు చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. త్వరలో ప్రకాశం జిల్లాలో రుణమేళా నిర్వహిస్తున్నామన్నారు. కాపు సామాజికవర్గ మహిళలకు కూడా డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారికి ఇంటర్ నుంచి పీజీ వరకు ఉపకార వేతనాలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

## మారిషస్‌లో 108 అడుగుల శ్రీవారి విగ్రహం

- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 108 అడుగుల శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యమంగళ రూప విగ్రహాన్ని మారిషస్‌లో నిర్మిస్తున్నట్లు ఆ దేశంలోని హరిహర దేవస్థానం ఆలయ అధ్యక్షుడు, ప్రధాన అర్చకుడు బృందావనం పార్థసారథి చెప్పారు. తిరుమల శ్రీవారిని ప్రధాన అర్చకుడితోపాటు మారిషస్ ప్రధానమంత్రి ప్రధానకార్యదర్శి తమన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పార్థసారథి– 108 అడుగుల విగ్రహ నిర్మాణానికి రూ.38 కోట్ల వరకు వ్యయమవుతుందని, పనులు 80 శాతం పూర్తయ్యాయని చెప్పారు. జూన్‌లో ఆలయ కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

❖



# దక్షిణాది అక్షర వారధి ఎల్.ఆర్. స్వామి

2015 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు భాష అనువాదానికి పురస్కారం, విశాఖవాసులైన ఎల్.ఆర్. స్వామికి ప్రకటించినప్పుడు, దాదాపు ఇరవై ఒక్క ఏళ్ల తరువాత ఈ గౌరవం తిరిగి ఒక విశాఖ రచయితకు, తెలుగు అనువాద రంగంలో దక్కింది. 1990 లో సంస్కృత భాష నుంచి అనువాదానికి, విశాఖకు చెందిన చర్ల గణపతి శాస్త్రి, 1993లో ఆచార్య పి. ఆదేశ్వర రావు, 1994లో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌కు హిందీ నుంచి తెలుగు అనువాదాలకు లభ్యమైన తరువాత రెండు దశాబ్దాలపైగా ఒక సుదీర్ఘ విరామం. ఈసారి లభించిన పురస్కారం, కేవలం అనువాదక కృషి చేసే వ్యక్తికే కాక తెలుగు భాషలో, రెండు వందల పైగా కథలు రాసి, సంకలనాలుగా ప్రచురించిన ఒక సృజనాత్మక రచయిత కూడా అయిన స్వామికి దక్కడం విశేషం. అంతే కాక, ఇదే మొదటి సారిగా దక్షిణాది భాషల ఆదాన ప్రదానంలో భాగంగా (మలయాళ మూలం నుంచి తెలుగు అనువాదానికి ఇచ్చిన పురస్కారం) విశాఖ వాసి అయిన సాహిత్యవేత్తకు లభించిన గుర్తింపు కూడా. ఇలా రెండు దశాబ్దాల కాలం తర్వాత అవార్డ్ రావడం, సృజనాత్మక రచనలు కూడా చేసే రచయిత అవార్డు పొందడం, దక్షిణ భారత భాష నుంచి చేసిన అనువాదం గుర్తింపుకు అర్హం కావడం, వంటి విశేషాలు ఈ అవార్డ్ నేపథ్యంలో ఉన్నాయి.

అంతే కాక మాతృభాష తమిళం కాగా, మలయాళ మాధ్యమంలో విద్యాభ్యాసం చేసి, తెలుగు వారిగా విశాఖలో స్థిరపడి, తెలుగు సాహిత్య భాషగా ఎదిగిన స్వామి, ఒక బహుళ సంస్కృతికి ప్రతిబింబం. భారతీయత అన్న మాటకు కనీసం కొన్ని రాష్ట్రాల జీవన రీతులు, సాంస్కృతిక మేళవింపులు, పలుకుబడులు, ఆచార వ్యవహారాలు ఎరిగి ఉండడం అనేది, సాధారణ వ్యక్తులకైనా ఎంతగానో దోహదం చేస్తుంది. అటువంటిది, రచయిత కావడం వల్ల, తన బహుళాధార సాంస్కృతిక నేపథ్యం, తన రచనల్లో ప్రతిఫలించడం అనేది, ఒక సహజ పరిణామంగా స్వామి సాహిత్య రాశికి ముఖ్య లక్షణంగా క్రమేపీ బలపడుతూ వచ్చింది. ఒక నగర నివాసిగా, స్వామి కథా రచనల్లో, నాగరిక జీవితపు పేదలు, మధ్యతరగతి వారు, కనిపిస్తూ వచ్చి, కథ ద్వారా తాత్వికంగా, లోతైన వ్యాఖ్యానాలు చేసే శక్తిని స్వామి సంతరించుకున్నారు. వారి కథల్లో 'వాన వెలిసింది', 'నిద్ర పట్టని రాత్రి', 'దొర' 'పంతులుగారి మేడ'? ఇలా మంచి కథలుగా నిలబడేవి, సంఖ్య పెరుగుతూ వచ్చాయి. 'నిద్ర పట్టని రాత్రి కథ' చదివాక, కథకు ఒరవడి దిద్ది, ఒక బృహత్తర ఉద్యమంగా, కథ కోసం ఇల్లు కట్టి, కథను భుజాన వేసుకుని తిరుగుతున్న కాళీపట్నం రామారావు గారు స్వామికి ఫోన్ చేసి, అభినందించడం, స్వామి గుర్తు పెట్టుకునే ఒక వెచ్చని జ్ఞాపకం.

మలయాళ సాహిత్యం నుంచి పదిహేడు, తెలుగు సాహిత్యం నుంచి పదమూడు, ప్రముఖ రచనలు, స్వామి ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో అనువాదం చేశారు. కథలు, కవిత్వమూ, నవలలూ స్వామి కట్టిన అక్షరాల వంతెనపై, అటు మలయాళ సాహిత్యంలోకీ, ఇటు తెలుగు లోగిళ్ళలోకీ నడిచి వచ్చాయి. తమిళం నుంచి కూడా అనువాదం చేసిన "ఆటవిక రాజ్యం" కథల సంపుటికి తమిళ సాహిత్య సమాజం, మదురైలో "నల్లీ థిస్సై ఎట్టుమ్" గౌరవాన్ని లోగడ స్వామికి అందచేసింది. అకాడెమీ కోసం, "మలయాళ జానపద గీతాలు" తెలుగు అనువాదంతో తన అనువాద కృషి మొదలు పెట్టిన స్వామి, ఈ పాతికేళ్లలో, ప్రముఖ రచయితలు అయిన

అక్కిత్తమ్ అచ్యుతన్ నంబూదిరి దీర్ఘ కవిత "ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాసం", కె.సచ్చిదానందన్ కవిత్వం శరీరం ఒక నగరం, సేతు నవలలు పాండవ పురం, ముద్రలు, నారాయణ్ నవల కొండ దొరసాని, ఇంక అనువాద కథా సంపుటాలుగా కథా కేరళం, కథా వారధి, కథా దౌత్యం పేరిట, తొలి మలయాళ కథ మొదలుకుని, ఆధునిక కథా రచయితల శ్రేష్ఠమైన కథలతో, సమకాలీన మలయాళ కథల అనువాద సంపుటులు వెలువరించిన కృషిలో భాగం అయిన, ఒక రచన కే.పి. రామన్ ఉన్ని నవల."సూఫీ చెప్పిన కథ" అనువాదానికి 2015 లో కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కారం ప్రకటించింది.

తెలుగు నుంచి కూడా, గురజాడ, చాసో, కేతు విశ్వనాథ రెడ్డి, కే.శివారెడ్డి, డా.ఎన్. గోపి, శిఖామణి, సలీం, విజయలక్ష్మి పండిత్, మొదలగు వారి రచనలు మలయాళ పాఠకులకు అందించారు. శ్రీశ్రీ మోనోగ్రాఫ్, బూదరాజు రాధాకృష్ణ రచన, శ్రీశ్రీ శత జయంతి కార్యక్రమాల్లో భాగంగా, సాహిత్య అకాడెమీ కోసం, అలాగే, దివాకర్ల వేంకటావధాని రచనా సంప్రదాయ రచన "ఆంధ్ర వాఙ్మయ చరిత్ర" మలయాళ అనువాదం చేశారు.

పలు తెలుగు కథానికలకు బహుమతులు అందుకున్న చురుకైన తెలుగు కథా రచయిత కావడం వల్ల, స్వామి సాహిత్య సృజన కథా స్వామ్యం, గోదావరి స్టేషన్, కథాకాశం, కథా సంపుటాలుగా తెలుగు సాహిత్యానికి సుపరిచితం. ఒ.ఎన్.వి కురుప్ సమగ్ర కవితలు తెలుగు అనువాదం జరిగి అకాడెమీ ముద్రణ దశలో ఉన్నది. మలయాళ- తెలుగు భాషల నిఘంటు నిర్మాణ ప్రాజెక్ట్‌లో కూడా స్వామి ప్రస్తుతం కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒక క్రియాశీలమైన సాహిత్య విద్యార్థిగా, భాషల మధ్య సృజన వారధి అయి నిలిచిన స్వామికి ముందర, ఇటువంటి జీవన నేపథ్యం గల రచయిత, అలనాడు తెనాలిలో జీవించి, "శారద" పేరిట తెలుగులో కథలు రాసిన తమిళుడు నటరాజన్. విశాఖలో సహృదయ సాహితి, మొజాయిక్ సాహిత్య సంస్థల అధ్యక్షునిగా, వారంవారం జరిగే సాహిత్య సామావేశాల్లో, నిరంతరం పాల్గొంటూ, సాహిత్య అకాడెమీ, ద్రావిడ విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలతో అంతర్రాష్ట్రీయ సెమినార్లు, సభల్లో పత్ర సమర్పణలు చేస్తూ, సాహిత్య రంగ కృషిని ఒక విశిష్ట జీవన విధానంగా గల స్వామి సేవల ద్వారా, భారత భారతి మరింత బలపడ గలదు అన్న విశ్వాసాన్ని ఈ విలువైన పురస్కారం నిండుగా ప్రకటిస్తున్నది. ఆ కోవలో వారి నిర్మాణాత్మక కృషి కొనసాగాలని ఆకాంక్షిస్తూ, తద్వారా దక్షిణాది భాషల మధ్య ఒక "భవిష్యదుజ్వల భర్మ యుగానికి" స్వాగతం పలుకుదాము.

– రామతీర్థ

### రానున్న ఐదేళ్లలో నవ్యాంధ్రలో వంద ఐవోటీ కంపెనీలు

# 50వేల మందికి ఉపాధి అవకాశం

### ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) అంటే...

మనం నిత్యజీవితంలో వాడుకునే అన్ని వస్తువులు ఒకదానితో ఒకటి మాట్లాడుకోగలడం. అంటే, మనం వాడే వాషింగ్ మెషిన్ నుంచి కారు దాకా ప్రతి వస్తువులో ఎలక్ట్రానిక్స్, సెన్సార్ల నిక్షిప్తం ద్వారా సమాచార మార్పిడి ఉంటుంది. దీనివల్ల అనేకానేక కార్యకలాపాలను ఇంకా సులభంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఐఓటిని కంప్యూటర్ రంగంలో సరికొత్త విప్లవంగా వర్ణించవచ్చు.


ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వంద ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) కంపెనీలను కొత్తగా నెలకొల్పేందుకు నవ్యాంధ్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసం వంద కంపెనీల ఏర్పాటుకు పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఈ కంపెనీల స్థాపనవల్ల కొత్తగా దాదాపు 50 వేల మంది యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానం గల ఐవోటీ కంపెనీలను స్థాపించడం దేశంలోనే ప్రప్రథమం. ఈ కంపెనీల ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులను ఆకర్షించేందుకు నూతన విధానం అమలులోకి తెస్తూ రాష్ట్ర ఐటీశాఖ ప్రత్యేక కార్యదర్శి ఫణికిషోర్ ఉత్తర్వులు జారీచేశారు. 2020నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పది ప్రభుత్వ, ప్రైవేటు ఐవోటీ హబ్‌లను నెలకొల్పాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

**నూతన విధానంలో కీలకాంశాలు**

- దేశవ్యాప్తంగా ఐదు సంవత్సరాలలో ఐవోటీ మార్కెట్ 1.5 బిలియన్ డాలర్లకు చేరుతుందని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించగా, ఇందులో కనీసం 10 శాతం మార్కెట్‌ను నవ్యాంధ్రలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం 100 ఐవోటీ కంపెనీలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.
- ఐవోటీ అభివృద్ధి, పరిశోధన, పరికరాలు, అప్లికేషన్ల తయారీ కేంద్రాలను నెలకొల్పేందుకు అవసరమయ్యే ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు సమకూర్చాలని నిర్ణయించారు.
- ఈ కంపెనీలకు అవసరమైన భూములను కేటాయించే అధికారం ఏపీ పారిశ్రామిక మౌలిక వసతులకల్పనా సంస్థ (ఏపిఐఐసి) కు అప్పగించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో పది ఐవోటీ హబ్‌లను ప్రభుత్వ పర్యవేక్షణలో ఏర్పాటు చేయనున్నారు.
- బీటెక్, ఎంటెక్, కోర్సుల్లో ఐవోటీ టెక్నాలజీని సిలబస్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఆరు నుంచి రెండు వారాల కాలపరిమితితో సర్టిఫికేట్ కోర్సులను నిర్వహించనున్నారు. మార్కెట్ అవసరాల మేరకు సిలబస్‌లో ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులతో నవీకరిస్తారు.
- ఏడాది క్రితం నెలకొల్పిన ఐటి కంపెనీలు రెండేళ్ల పాటు ఐటీ రిటర్నులు దాఖలు చేస్తే వాటికి భూములు కేటాయించనున్నారు.
- ఈ ఐవోటీ కంపెనీలకు కేటాయించిన స్థల విస్తీర్ణం ప్రాతిపదికగా ఒక్కో ఎకరాకు 250 మంది వంతున ఉపాధి అవకాశాలు కల్పించాలన్న నిబంధన ప్రవేశపెట్టారు.
- మౌలిక సౌకర్యాల కల్పనలో అనేక రాయితీలు ఇవ్వనున్నారు.
- మూలధన పెట్టుబడులపై వడ్డీ రాయితీ, ఉద్యోగుల శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి అయ్యే ఖర్చు, ఆస్తిపన్ను, బీమా ప్రీమియంను తిరిగి చెల్లించనున్నారు.
- ఐవోటీ కంపెనీలను మరింత ప్రోత్సహించడానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనున్నారు.

ప్రకృతి – మనం

# మావిచిగురు తినగానే...



"వేములు పూసే వేములు కాసె ఓ మామిడి
వేములపళ్ళు పక్షులు మేసె ఓ మామిడి
పక్షులన్నీ గంగ చేరె ఓ మామిడి
గంగా చేరి నీరు తాగె ఓ మామిడి
నీరు తాగి ఒడ్డుకెక్కె ఓ మామిడి
ఒడ్డునున్న బొడ్డూమల్లె ఓ మామిడి
కోసిపెట్ట ఎవరు లేరు ఓ మామిడి
కోసిపెట్టు కృష్ణమూరితి ఓ మామిడి
పంచిపెట్ట ఎవరు లేరు ఓ మామిడి
పంచి పెట్టు శ్రీలక్ష్మి ఓ మామిడి"

ఈ జానపద గీతంలో మామిడి సాక్షాత్తూ ఆ కృష్ణమూర్తే! గుమ్మడైనా మామిడైనా తెలుగువాళ్లకు బాలకృష్ణుడి ముద్దుపేర్లే! సంతానాన్ని మాయింటి మామిడి అని ఘనంగా చెప్పుకుంటారు. పెరట్లో మామిడి పిందె పడగానే ఇంట్లో పసిబిడ్డ పుట్టినంత సంబరపడతారు తెలుగు వాళ్ళు! మా ఇంట మామిడి పండిందంటే పండంటి బాబు పుట్టాడని! మామిడి తెలుగు వారి అమృత ఫలం.

ఇంటికి పచ్చదనాన్ని ఇచ్చేది మామిడి తోరణాలే! సౌభాగ్యానికి గుర్తుగా మామిడాకులను భావించటం దాని ప్రాచీనతకు గుర్తు. మామిడి కోసం ఉగాది ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తాం మనం. మామిడి ఆకులనే ముంగిట ముగ్గుల్లో చిత్రిస్తుంటారు మన ఆడపడుచులు.

మామిడి ప్రస్తావన ఋగ్వేద కాలంలోనూ కనిపిస్తుంది. ప్రజాపతి స్వయంగా మామిడి వృక్షంగా అవతరించాడని మన నమ్మకం. ఒకసారి బుద్ధుడు మామిడి పండు తిని, దాని టెంకెని అక్కడ పాతి, చేతులు కడుక్కొన్నాడట. వెంటనే అక్కడ తెల్లని మామిడి మొక్క పూలూ, కాయలతో మొలకెత్తిందనీ, అప్పటి నుంచీ బౌద్ధులు మామిడిని పవిత్ర వృక్షంగా భావిస్తారనీ ఐతిహ్యం. భార్హత్ శిల్పాలలో ఈ ఘట్టాన్ని వివరించే దృశ్యాలున్నాయి. జైన దేవత అంబ, మామిడి చెట్టు క్రింద కూర్చుని ఉన్నట్టు వర్ణన కనిపిస్తుంది. మన్మథుడికి మామిడి మొక్కకీ అవినాభావ సంబంధం ఉంది.

మావిచిగురు తిని, కోయిల కూస్తుందని తెలుగువారి నమ్మకం. వైద్యపరంగా మామిడి చిగుళ్ళను తింటే గొంతు శ్రావ్యంగా అవుతుందని ఆయుర్వేద వైద్యశాస్త్రం చెప్తుంది. మామిడి కాయకూ, ఉగాదికీ ఒకేసారి స్వాగతం పలుకుతారు తెలుగువాళ్లు. ఉగాది పచ్చడికోసం ఆత్రంగా ఎదురు చూస్తారు. తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ ఆరు రుచులూ కలబోసిన ఉగాది పచ్చడి వలన ఆరోగ్యం మనకు దక్కాలంటే, ఉగాదితో ప్రారంభించి శ్రీరామనవమి దాకా రోజూ ఈ పచ్చడి తినాలనీ, అలా తింటే వేసవి వేడికి శరీరం తట్టుకో గలుగుతుందనీ శాస్త్రం.

మొఘల్ చక్రవర్తులు, సుల్తానులూ మామిడిని బాగా ఇష్టపడే వాళ్ళు. కానీ, తమ ఇష్టం కొద్దీ, మామిడి పళ్ళను రాజవంశీకులే తినాలని నిషేధం పెట్టారట. ప్రజల్లో ఇది తీవ్ర ఆగ్రహావేశాలకు దారితీయటంతో మామిడిమొక్కను జాతీయం చేసి అందరికీ దాన్ని

పండించే అవకాశం ఇచ్చారు. అక్బర్ చక్రవర్తి పూనుకొని లక్ష మామిడిమొక్కలు నాటించగా, మామిడి మొక్క అంటు కట్టడాన్ని రాజోద్యాన వనాల్లో మాత్రమే జరపాలనే నియమాన్ని తొలగించి, దేశం అంతటా మామిడిని పెంచుకొనే అవకాశం కల్పించిన వాడు షాజహాన్.

ఋగ్వేదంలో మామిడిమొక్కని "సహ" అని పిలిచారు. తరువాతి కాలంనాటి సంస్కృత గ్రంథాలలో చూత, రసాల పేర్లతో పాటు సహకార అనే పర్యాయ పదంకూడా కనిపిస్తుంది. బృహదారణ్యకోపనిషత్తు, శతపథ బ్రాహ్మణాలలో "ఆమ్ర" పదం తొలిగా కనిపించిందని పండితులు చెప్పారు. చరక సుశ్రుతాది వైద్య గ్రంథాలలో 'ఆమ్ర' ప్రముఖంగా కనిపిస్తుంది. మామిడి పండు రంగుని 'ఇండియన్ ఎల్లో' అంటారు. ఫిల్లిపైన్స్, పాకిస్తాన్ దేశాలలో దీని వాడకం ఎక్కువ. బంగ్లాదేష్ తమ జాతీయ వృక్షంగా మామిడి మొక్కని గౌరవించింది. రవీంద్రుడు ఆమ్రమంజరి కావ్యం వ్రాశాడు.

భారతీయ మామిడిని మాంగిఫెరా ఇండికా అంటారు. ప్రపంచ వ్యాప్తంగా దీనికే మార్కెట్ ఉంది! 'మానుచెట్టు' అని తెలుగువాళ్ళు పిలుస్తారు. మానుగ అంటే, పెద్దది, యోగ్యమైనది, ప్రకాశవంతమైనది, మనోజ్ఞమైనది అని! Duly, fitly అనే అర్థంలో ఈ పదాన్ని వాడేవారు. మాని లేక మ్రాని పదాలకు కూరగాయ అనే అర్థం కూడా ఉంది. దీన్నిబట్టే, మాను కాయ- మానుగాయ- మాన్గాయ- మాన్గో పదాలు ఏర్పడ్డాయి. Mango పదానికి తెలుగు 'మానుగాయ' మూలం. "ఓ" అనే అక్షరంతో అంతమయ్యే ఇంగ్లీషు పదాలు తక్కువ కాబట్టి mango

భారతీయ పదమేనని, పోర్చుగీసులే దాన్ని ఇంగ్లీషులోకి చేర్చారనీ పదాల మూలాలకు సంబంధించిన భాషావేత్తలు చెప్తారు. తమిళంలోకూడా మాన్-కాయ్, మాంగాయి పేర్లతో పిలుస్తారు.

పోర్చుగీసులు భారతదేశంలోకి వచ్చాక, క్రీ. శ. 15-16 శతాబ్దాల కాలంలో మామిడి రుచిని బాగా ఇష్టపడసాగారు. కానీ, ఆ రోజుల్లో సీజన్ కాని సమయాలలో మామిడి కాయని తినాలంటే, ఊరగాయ పెట్టుకోవటం తప్ప వేరే మార్గం లేదు. అందుకని, ముఖ్యంగా పోర్చుగీసులు ఆవకాయ, మాగాయ, తొక్కుడు పచ్చడి లాంటి ఊరగాయలన్నింటినీ తెలుగు వారితో తయారు చేయించి ఎగుమతి చేసుకోవటం ప్రారంభించారు. తెలుగు నేల ఆ విధంగా ఊరగాయల తయారీకి కేంద్ర స్థానం అయ్యింది. తెలుగువారు రెచ్చిపోయి, బెల్లం ఆవకాయ, ధనియాల ఆవకాయ, మెంతికాయ ఇలా లెక్కలేనన్ని ఆవకాయల్ని కనిపెట్టి తయారు చేసి ఎగుమతులు చేశారు. ఇది 18వ శతాబ్ది దాకా సాగింది. ఆ రోజుల్లో తెలుగు వారి ఆవకాయలకు అమెరికాలో బాగా గిరాకీ ఉండేది. మిరపకాయలను కన్నతల్లి కదా ఆ ఖండం! చివరికి మాంగో అంటే pickle

(ఊరగాయ) అనే అర్థంలో ఇది యూరప్ అంతటా చెలామణి అయ్యింది కూడా!

శ్రీనాథుడి కాలంలో కనిపించని అనేక రకాల ఊరగాయలు ఆధునిక యుగంలో విస్తృతంగా తయారు కావటానికి, తెలుగు ప్రజలు ఊరగాయల తయారీలో ప్రసిద్ధులు కావటానికి, ఈ నేపథ్యం ఉ ంది. ఆ రోజుల్లో అమెరికా తదితర పాశ్చాత్య దేశీ-యులకు మామిడి ఒక వింత. ఇప్పుడు వాళ్ళు మన మామిడి మీద ఆధార పడటంలేదు. బ్రెజిల్, వెస్ట్ ఇండీస్, మెక్సికో దేశాలలో మామిడి సాగుకు అనుకూలత గమనించి అక్కడ మామిడి విస్తారంగా పండించటం మొదలుపెట్టారు. వివిధ రకాల మామిడి చెట్లకు అక్కడి పేర్లు పెట్టుకున్నారు. Tommy Atkins రకం మామిడికాయలకు అమెరికాలో గిరాకీ ఎక్కువ. మన బంగినపల్లి మామిడి కాయని అక్కడ Benishaan లేదా Benisha అంటారు. అక్కడి మిరపకాయలు ఇక్కడికి చేరాయి. ఇక్కడి అమృతఫలం మామిడి అక్కడకు తరలి పోయింది.

మామిడి మొరబ్బా, ఆమ్'చూర్ చింతపండుకు బదులుగా వంటకాలలో పనికొస్తాయి. చింతపండునీ, మామిడికాయనీ కలిపి "మాంగోరిండ్" అనే కొత్తపదాన్ని అమెరికన్లు సృష్టించారు. మామిడి పండు జ్యూసులు, ఐస్ క్రీములు, చాకొలేట్లు, ఫ్రూట్ బార్లు, సాసులకు విదేశాల్లో వాడకం ఎక్కువ. మాంసాహారాలలో మామిడిని చేర్చి వండుకుని ఫిలిప్పిన్లు ఇష్టంగా తింటారు. శక్తి నందించే విషయంలో యాపిల్, మామిడి కాయలు సమానంగా పనిచేస్తాయి. మామిడిపండులో పీచుపదార్థాలు, 'ఎ', 'బి' "సి' విటమిన్లూ పొటాషియం, రాగితో పాటు కెరోటిన్ పదార్థం కూడా నిండుగా ఉంటుంది.

వేసవి ఆరంభానికే, ఉగాది నాటికే తెలుగు వంటిళ్లలోకి మామిడి కాయలు రంగప్రవేశం చేస్తాయి. వేడన్నం, తియ్యని చారు(ఎక్కువ పులుపులేని రసం), తిమ్మనం అంటే మజ్జిగ పులుసు, పలుచని అంబలి (రాగిజావ వగైరా), చెరకు రసాలు, కొబ్బరినీళ్ళు, ఇతర పళ్ల రసాలు, పళ్ళు, సుగంధిపాల వేళ్ళ బెరడును దంచిన పొడిని నీటిలో వేసి కాచిన నీళ్ళు, మంచి ద్రాక్ష కుండల్లో ఉంచిన చల్లని నీళ్ళు, వడ పిందెలంటే లేత మామిడి పిందెలు, నీరు చల్ల అంటే పలుచని మజ్జిగ లేదా మజ్జిగ మీద

తేరిన నీరు? వేసవి వస్తోందంటే వీటిని భోజనంలో తీసుకోవటం మొదలు పెడతారట. ఇది మన ప్రాచీనుల ఆహారం.

ఆరోజుల్లో మామిడి సీజనల్ పంట. కేవలం వేసవిలోనే దొరికేది. తక్కిన కాలాలలో కూడా మామిడిని తినేందుకు మామిడి ముక్కల్లో ఉప్పు కలిపి ఎండించిన ఒరుగులు, రకరకాల మామిడి ఊరగాయలూ అవసర మయ్యాయి. ఇప్పుడు మామిడి వివిధ ప్రాంతాలలో పండుతోంది. అన్ని సీజన్లలోనూ దొరుకుతోంది. ఒరుగులూ, ఊరగాయల అవసరం ఇప్పుడంతగా లేదు. కాబట్టి, ఊరగాయల వాడకం తగ్గించుకుంటే పులుపు, ఉప్పు, కారం, నూనెలు అనవసరంగా కడుపులోకి వెళ్ళటం కూడా తగ్గుతుంది.

పులుపు చేసే అపకారాలన్నీ మామిడి కాయల వలన కూడా ఉంటాయి కాబట్టి జీర్ణశక్తి బలంగా లేనివారు జాగ్రత్తగా తినాలి. మామిడి పండు కూడా కష్టంగా అరిగే పదార్థమే! మిరియాల పొడితో తింటే కాయైనా, పండైనా మామిడి అపకారం చేయకుండా ఉంటుంది.


మామిడి సొన విషపూరితం. ఉరుషియోల్ అనే విషరసాయనం (రెజిన్) మామిడి సొన, మామిడి తొక్క, మామిడి ఆకులు, మామిడి జిగురులతో పాటు, జీడిగింజల పైపొరలో కూడా ఉంటుంది కాబట్టి, వాటిని తొలగించి జీడి గుళ్ళు, జీడి పప్పు అమ్ముతారు. జీడి పప్పులో ప్రొటీన్లు, విటమిన్లు, రాగి, ఇనుము, మెగ్నీషియం, జింకు లాంటి ఖనిజాలతోపాటు గుండెకు మంచి చేసే కొవ్వు ఆమ్లాలు (monounsaturated-fatty acids) అధికంగా ఉన్నాయి. అన్ని వయసుల వారికీ మేలు చేస్తాయి. అతిగా తింటే హాని చేస్తాయి.

మామిడి పంటను తెలుగు వారే కాపాడుకోవాలి. కృష్ణా, ఉభయ గోదావరి, చిత్తూరు జిల్లాల్లో వివిధ రకాల మామిళ్ళు పండుతున్నాయి. తెలుగు నేలమీద వ్యవసాయం పట్ల అశ్రద్ధ పెరుగుతూ రావటంతో మామిడి తోటల విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతూ వస్తోందని గణాంకాలు చెప్తున్నాయి. దిగుబడి అంతంత మాత్రం అవుతోంది. పండుని పాతిక రూపాయలకు అమ్ముతున్నారు. సామాన్యుడికి 'అందని మామిడి' అయ్యింది పరిస్థితి. మామిడి పండుని కార్బయిడ్ వేసి కృత్రిమంగా పండు అయ్యేలా చేయటం వలన ఆ పండు విష తుల్యం అవుతోంది. దానిలోని మాధుర్యాన్ని మనం కోల్పోతున్నాం. కార్బయిడ్ తో పండించే ప్రక్రియ మీద ఉన్న నిషేధాన్ని గట్టిగా అమలు చేస్తేనే , ఆరోగ్యదాయకమైన మామిడి అందేలా గట్టి చర్యలు అవసరం.

– డా. జి వి పూర్ణచందు

మన పలుకు

# అక్షరాలా హత్యలే!




ప్రపంచ భాషల్లో దాదాపు అన్నిటికీ'లిపి' ఉన్నప్పటికీ, ఇంకా లిపి లేనివి ఉండనే ఉన్నాయి. వాటికి లిపి ఏర్పాటు చేసేందుకు భాషా శాస్త్రవేత్తల ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. లిపి ఉన్నా లేకపోయినా, ప్రతి భాషకూ వాడుకకు సంబంధించిన కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. వాటిని పాటించినప్పుడే ఆయా భాషలకు ఇంపు కలుగుతుంది. ఏ భాషకు సంబంధించిన సంప్రదాయం ఆ భాషదే. దేని అందం దానిదే.

'అ' నుండి 'క్షఱ' వరకూ ఉండే తెలుగు అక్షరాలు తక్కిన అన్ని భాషల అక్షరాల కన్నా ఎక్కువే. నిజానికి ఆ సంఖ్యలో సగమే ఉంటాయి ఆంగ్ల భాషాక్షరాలు. ఐతే ఆ భాషకు అధిక ప్రాధాన్యం/ప్రాముఖ్యత ప్రస్తుతం ఉన్నదనే నెపంతో తెలుగు అక్షరాలను కుదించేందుకు ప్రయత్నించడం వివేకం కాదు. అలా చేస్తే మన మాతృభాషకు ఉండే సొబగు మొత్తాన్నీ నాశనం చేసినట్లే అవుతుంది. భాషా సంప్రదాయాలను ధిక్కరించడం మొదలుపెడితే ఆ భాష అంతరించడానికి ఎంతో కాలం పట్టదు .'తేనెలొలుకు' తెలుగు భాషకు, అసలు అలాంటి కీర్తి ఎందుకు కలిగిందో మనం మర్చిపోతే, లేదా తెలుసుకునే ప్రయత్నం చేయకపోతే దేశభాషలందు తెలుగు'లెస్' అయిపోవడం ఖాయం.

'ఉదయం' అనే పదాన్ని 'వుదయం' అంటూ ఎందుకు వ్రాయకూడదనే వాళ్ళు పెరుగుతున్నారు. అచ్చులలో 'అ''ఆ'లను తప్ప తక్కిన వాటిని చంపేసే ప్రయత్నం జరుగుతోంది.'యి' 'యీ' 'వు' 'వూ' 'యె' 'యే' 'వొ 'వో' అంటూ ఎప్పుడు వ్రాయాలో, ఎప్పుడు వ్రాయకూడదో తెలుసుకోవాలన్న జిజ్ఞాస చాలా

ఆంగ్లంతో పోల్చుకొని, తెలుగు అక్షరాలను కుదించడం వల్ల మన మాతృభాషకు ఉండే సొబగు మొత్తాన్నీ నాశనం చేసినట్లే అవుతుందంటున్నారు రచయిత. తెలుగు లిపిని మరింత సులభతరం చేయాలన్న వాదన బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో ఈ అంశం మీద చర్చకు ఆహ్వానిస్తున్నాం.

– సంపాదకుడు

మందిలో కొరవడుతోంది. సౌలభ్యం పేరిట ఈ పాటికే మనం ఙ ఞ అనే అక్షరాల్ని అంతం చేసేశాం. ఇక 'శ' 'ఱ' అనే అక్షరాల్ని కూడా సమాధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామంటే అతిశయోక్తి కాదు. మనకు 'న' 'ల' అనే అక్షరాలు ఉన్నాయి కాబట్టి 'ణ' 'ళ' అనే అక్షరాలు అనవసరం అని కొంతమంది వాదిస్తున్నారు.

'శ' 'స' 'ష' అనే అక్షరాల్లో బేధాన్ని స్పష్టంగా గుర్తించినప్పుడే 'తేట తెలుగు' లోని తియ్యందనమేమిటో అర్థమౌతుంది. అలాంటి విభిన్న శబ్దాలను సొంతం చేసుకుంది గనుకనే మన తెలుగు'లెస్స' అయింది. నాలిక తిరగడం లేదని అక్షర సౌందర్యాన్ని పొగొట్టుకోవడం అనర్థదాయకమే. చదువులు తల్లిని 'షరస్వతి' అనీ,'షారదా' అనీ ఉచ్ఛరించడం వి'షా'దమే మరి!

మనకి 'ఋ' అనే అక్షరం ఉంది. అలాగే 'రు', ఇంకా 'ఱు' అనే అక్షరాలూ ఉన్నాయి. 'ఋ'–'రు'–'ఱు'ల మధ్య గల బేధం ఏమిటని అడిగితే, మొదటిది 'అచ్చు' అనీ, తక్కినవి రెండూ 'హల్లుల'కు చెందినవనీ జవాబు చెప్పవచ్చు. ఐతే దేని ప్రత్యేకత దానికే ఉన్నదనీ, అద్దానిని అలా ప్రయోగించినప్పుడే గుబాళింపు వస్తుందనీ కచ్ఛితంగా చెప్పగల వాళ్ళు తగ్గిపోతున్నారు.'ఋ' 'ఱు'లకు బదులుగా 'రు' ను ఉమ్మడిగా వాడేస్తున్నారు.

అక్షరమాలను నేర్చుకునే క్రమంలో చాలా మంది పిల్లలకు ఇబ్బంది కలిగించే అక్షరం అది.'బ'కి కొమ్మిస్తే 'ఋ' అనీ,'ఋ'కి కొమ్మిస్తే'ఋ' అనీ బండగుర్తుగా మెదళ్ళలో అట్టిపెట్టుకుంటారు. నిజానికి 'ఋ' అక్షరంతో మొదలయ్యే మాటలు పట్టుమని పాతిక కూడా ఉండవు. ఐతే 'అమృతం' వంటి మాటల్లో అంతర్లీనంగా ఉంటుంది. అలాంటి 'ఋ'కి ఉండే ప్రత్యేకత అంతా ఇంతా కాదు. ఏదో తెలియని పవిత్రతా భావం ఆ అక్షరాన్ని అంటిపెట్టుకుని ఉంటుంది. 'ఋ' తో మొదలయ్యే ఒక పదాన్ని చెప్పమంటే చాలామంది 'ఋషి' అంటూ ఠక్కున చెప్పేస్తారు. బహుశ అందువల్లే ఆ అక్షరానికి అలాంటి పవిత్రత వచ్చిందేమో!

ఋషుల్లో శుక, శౌనక, వ్యాస, వాల్మీకి వంటి మహర్షులున్నారు. జనకుడి వంటి రాజర్షులున్నారు. సప్తర్షులు అనబడే ఒక క్రమం ఉంది. అందులో మరీచి, అత్రి, అంగీరుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు ఉన్నారు. ఇంకో క్రమం కూడా ఉంది. దాని ప్రకారం కశ్యపుడు, అత్రి, భరధ్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వశిష్ఠుడు అనే ఋషులు ఏడుగురు. ఆ విధంగా 'ఋషి' అనే పదాన్ని చూసినా, విన్నా మన పూర్వులంతా తలపునకు వస్తారు. ఇంకో బలమైన కారణం కూడా ఉంది. 'ఋషి' అనే పదానికి'వేదము" వెలుగు' అనే అర్థాలు కూడా ఉన్నాయి.

'ఋక్కు' అనే మాటకు కూడా 'వేదం' అనే అర్థం. వేదభాగ విశేషాన్ని సూచించే పదమది. ఇక 'ఋత్విజుడు' అంటే ఎవరనుకున్నారు? ? యజ్ఞకర్త చేత, ధనం పుచ్చుకుని, యజ్ఞం చేయించేవాడు. 'ఒజ్జ' అని కూడా అంటారు. ఋత్విజులు మొత్తం పదహారు విధాలు– బ్రహ్మ, ఉద్గాత, హూత, అధ్వర్యుడు, బ్రహ్మణాచ్ఛంపి, ప్రస్తోత, మైత్రావరుణుడు, ప్రతిప్రస్థాత, పోత, ప్రతిహర్త, అచ్ఛావాకుడు, నేష్ట, అగ్నీధ్రుడు, సుబ్రహ్మణుడు, గ్రావస్తుతుడు, ఉన్నేత, వీరందర్నీ గుర్తు చేస్తుంది 'ఋ'.

'ఋభుక్షుడు' అంటే ఇంద్రుడు. 'ఋభువు' అంటే వేల్పు. ఋష్యకేతువు అంటే మన్మథుడు. అతడిని తలుచుకోగానే 'ఋతువులు' గుర్తొస్తాయి. వసంతం, గ్రీష్మం, వర్ష, శరత్తు, హేమంతం, శిశిరం అనేవి ఆరు ఋతువులు. ఇంకా'ఋతువు' అనే మాటకు 'ఆర్తవము', 'వెలుగు' అనే అర్థాలు కూడా ఉన్నాయి. 'ఋతము' అంటే సత్యవాక్కు. అలాగే జలము, పూజింపబడినది, ప్రకాశమొందినది అనే అర్థాలూ ఉన్నాయి. 'ఋక్షము' అంటే నక్షత్రము. ఇంకా ఒకానొక కొండ, ఎలుగుగొడ్డు అనే అర్థాలూ ఉన్నాయి.

'ఋష్యము' అంటే ఎనుబోతు. 'ఋష్యమూక' పర్వతం గురించి రామాయణంలో ప్రస్తావన ఉంది. 'ఋషభము' అంటే ఎద్దు. ఐతే ఆ పదానికి ఇంకా చాలా అర్థాలు ఉన్నాయి. ఓ ఆయుర్వేద ఉషధీ విశేషంగా చెప్తారు. చెవి రంధ్రాన్ని అలా పిలుస్తారు. సంగీతంలో అది ఒక స్వరం పేరు. శ్రేష్ఠుడు అనే అర్థమూ ఉంది. ప్రసిద్ధ క్షేత్రమైన తిరుమలకు కూడా 'ఋషభము' అనే పేరు ఉంది.

తిరువేంకటపతిని తలచుకోగానే కుబేరుడు ఇచ్చిన అప్పు వ్యవహారం గుర్తొస్తుంది. 'ఋణము' అంటే అప్పు. పుట్టిన ప్రతి వ్యక్తికీ 'ఋణం' ఏదో రకంగా తప్పదు. దేవ ఋణం, పితృఋణం, ఋషిఋణం...వీటిని ఋణత్రయం అంటారు.

'ఋణార్ణము' అంటే అప్పు తీర్చడానికి చేసిన మరో అప్పు. అప్పు చేసిన వాడిని 'ఋణి' లేదా 'ఋణికుడు' అంటారు. ఋతి అంటే త్రోవ, పోటీ, శుభము అనే అర్థాలున్నాయి. 'ఋతుమతి' అంటే పుష్పవతి అయిన స్త్రీ. 'ఋద్ధము' అంటే పెరిగిన లేక నూర్చిన ధ్యానము. 'ఋశ్యప్రోక్త' అంటే దూలగొండి మొక్క.'ఋష్యప్రోక్త' అంటే ఆముదం చెట్టు. 'ఋక్షగంధిక' అంటే నల్లనేల గుమ్మడి లేక పాలగుమ్మడి మొక్క. 'ఋక్షగంధ' అంటే బచ్చలి లేదా బొద్దికూర మొక్క. 'ఋజీషము' అంటే బూరెల మూకుడు లేదా పిండివంటలు చేసే పాత్ర అని. 'ఋజువు' అంటే నాణ్యమైనదీ, వంకరలేనిది అనే అర్థాలున్నాయి. 'ఋక్థము' అంటే ధనము. 'ఋద్ధి అంటే సమృద్ధి.'ఋ'తో ఇంతకన్నా పదాలు లేకపోగా 'ౠ' అక్షరంతో మొదలయ్యే ఒక్క తెలుగు పదమూ లేదు.

ఐనప్పటికీ అంతటి ప్రత్యేకత కలిగిన 'ఋ' అక్షరాన్ని కాపాడుకోవాలో లేదో నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్నమయింది. సరిగ్గా అలాంటి పరిస్థితే 'ఱ' అక్షరానికి కూడా ఉంది.'బండి ర' అంటూ పిలుచుకునే 'ఱ' అక్షరం లేదా గుణింతాలతో కలిసిన 'ఱ' అక్షరంతో మొదలయ్యే పదాలు మొత్తం మీద డబ్బై వరకూ ఉంటాయేమో. ఐతే 'ఋ' అక్షరంతో లేని సౌలభ్యం 'ఱ' తో ఉంది. దాన్ని ఒక పదంలో రెండవ లేక చివరి అక్షరంగా కూడా ప్రయోగించవచ్చు. అందువలన 'ఱ' పాముఖ్యతని అంత తక్కువగా అంచనా వేసేందుకు వీలులేదు. ఐనా కేవలం తక్కువ పదాల ప్రయోగానికి మాత్రమే ఉపయోగపడుతోంది గనుక ఒక అక్షరాన్ని, ఆ కారణంతో నిషేధించాలనుకుంటే, అది మాతృభాష మనుగడుకు మనవంతు ద్రోహం చేసినట్లవుతుందేమో ఆలోచించాలి.

**– తిరునగరి విజయ కిషోర్**

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు – ముఖ్య ప్రకటనలు



- ఉపాధి హామీ ద్వారా 3వేల కిలోమీటర్ల మేర సిమెంట్ రహదారులు ఏర్పడ్డాయి.
- ఉపాధి హామీ ద్వారా ఏటా 5వేల కి.మీల రహదారులు వేయాలన్నదే లక్ష్యం.
- ఏపీ కేంద్రంగా శ్రీసిటీ, తిరుపతిలో హార్డ్‌వేర్ ఎలక్ట్రానిక్స్ ఏర్పాటు.
- దేశంలో బ్యాంకు లింకేజ్‌లో అగ్రస్థానం ఆంధ్రప్రదేశ్‌దే.
- రాష్ట్రంలో కోటి 36 లక్షల మందికి ఈపాస్ ద్వారా సరకులు అందిస్తున్నారు.
- పీడీఎస్ కింద రాష్ట్రంలో 4 కోట్ల మందికి బియ్యం అందిస్తున్నారు. అందుకుగాను ఏటా రూ.4500 కోట్లు ఖర్చవుతోంది.
- రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ ఉపప్రణాళిక వంద శాతం అమలుజరుగుతోంది.
- జూన్ నుంచి నెలవారీగా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత.
- త్వరలో కొత్త గృహనిర్మాణ విధానం ఖరారు చేసి పెద్ద ఎత్తున ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం.
- వచ్చే ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో 2 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 1.93 లక్షల ఇళ్లు నిర్మాణం.
- ఇసుక విధానానికి సంబంధించి ఆదాయం కంటే ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి రూ.400 కోట్ల ఆదాయాన్ని వదులుకున్న ప్రభుత్వం.
- పోలవరం ప్రాజెక్టును 2018 నాటికి పూర్తిచేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. వచ్చే ఏడాదికి వెలిగోడు, వంశధార రెండోదశ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నిర్ణయం.

### రెండో విడత రుణమాఫీ

- రైతు రుణమాఫీ కింద రూ.4,563 కోట్లు ఏ క్షణమైనా వారి ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు. ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల వల్ల జమ చేయడం ఆలస్యమైందని వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రకటన. ఇందులో
- రెండో విడత కింద రూ.3,265 కోట్లు
- వడ్డీ కింద రూ.326 కోట్లు
- ఉద్యానశాఖకు సంబంధించి రూ.543 కోట్లు
- ఆప్కాబ్‌కు సంబంధించి రూ.59 కోట్లు
- మూడో దశ అభ్యంతరాల పరిష్కారం నిమిత్తం రూ.123 కోట్లు

ఈ మొత్తం ఖాతాలకు జమ చేయనున్నారు.

### కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం

- శ్రీకాకుళంలో జిల్లాలోని కొవ్వాడ వద్ద అణువిద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు 2074 ఎకరాల భూమిని గుర్తింపు.
- వాటిలో ప్రభుత్వ భూమి పోను, మిగతా 509 ఎకరాల భూమిని సేకరించేందుకు రూ.500 కోట్లు డిపాజిట్ చేసేందుకు కేంద్రం సిద్ధం

### తప్పుడు రిజిస్ట్రేషన్లపై చట్టసవరణ

- రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం.. తప్పుడు రిజిస్ట్రేషన్లనీ, డబుల్ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం లేదని శాసనసభకు తెలిపిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.ఇ.కృష్ణమూర్తి.
- రెండు రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వానికి గత ఏడాది కాలంలో వచ్చిన ఫిర్యాదులు 172. ఇలాంటి అవకతవకల్ని నిరోధించేందుకు చట్టంలోని 22(బి) భాగాన్ని సవరించేందుకు సన్నద్ధమవుతున్న ప్రభుత్వం.

❖



# దేశ వ్యవసాయ ముఖచిత్రంపై చెరగని పచ్చ సంతకం

డా. యం.వి. రావు

దేశ వ్యవసాయరంగానికి సంబంధించిన అత్యంత క్లిష్ట పరిస్థితులను అధిగమించటానికి అహరహంగా శ్రమించిన శాస్త్రవేత్తల బృందంలో ఒకరు డా. యం.వి. రావుగా లబ్ధప్రతిష్ఠులయిన డా. మంగిపూడి వెంకటేశ్వరరావు. పశ్చిమగోదావరి జిల్లా పేరుపాలెంలో 1928 జూన్ 21 న పుట్టిన వీరు, 2016 మార్చి 8 న హైదరాబాద్‌లో అనారోగ్యంతో 88 వ యేట మరణించేదాకా దేశ వ్యవసాయ రంగ ప్రగతికోసం సాయపడిన నిత్యకృషీవలుడు. 88 సంవత్సరాల జీవన ప్రస్థానంలో ఆరు దశాబ్దాల కాలంలో దేశ వ్యవసాయంతో ముడిపడిన జీవితం గడిపిన అసాధారణ ప్రతిభాశాలి డా. యం.వి. రావు.

దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుకు దారి తీసిన 'సస్య విప్లవం' కు శ్రీకారం చుట్టిన శాస్త్రవేత్తలు నార్మన్ బోర్లాగ్, స్వామినాథన్‌తో కలిసి డా. యం.వి రావు పనిచేశారు. తిండి గింజల ఉత్పత్తిలో స్వయం పోషకం కోసం నిరంతరం శ్రమించి, విజయాన్ని సాధించి, ఆ ఫలాలను ఆస్వాదించిన బృందంలో డా. యం.వి. రావు ఒకరు కావడం తెలుగు వారికి గర్వకారణం.

గోధుమ పంటకు సంబంధించి దేశ వ్యాప్తంగా ఒక ఆచరణాత్మక ప్రణాళిక రూపొందించి, రైతుల సమస్యలకు పరిష్కారం చూపించి, 'భారత వ్యవసాయ పరిశోధనా మండలి' అంటే 'రైతుల పరిశోధనా మండలి' అని సగర్వంగా నిరూపించిన శాస్త్రవేత్త డా.రావు. ప్రధానంగా 1955 లో గోధుమ పంటలో అసిస్టెంట్ బ్రీడర్ గా చేరి 1971 నాటి గోధుమ పంట జాతీయ కో-ఆర్డినేటర్‌గా ఎదిగారు. 1981 నుండి 1986 వరకు దాదాపు 5 సంవత్సరాల పాటు భారత వ్యవసాయ పరిశోధనా నుంచి డిప్యూటి డైరక్టర్ జనరల్‌గా తన విజ్ఞాననీచికల విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ప్రస్తుతం అందరూ చెప్తున్న అంశాలనే దాదాపు 3 దశాబ్దాల క్రితమే భారత వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటి డైరక్టర్ జనరల్ హోదాలో దేశ వ్యవసాయ రంగానికి సూచించిన శాస్త్రవేత్త డా. రావు.

## పసుపుపచ్చ విప్లవం

ఆనాటి భారత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 1986 నుండి 1989 వరకు శ్యాం పిట్రోడా నాయకత్వంలో తీసుకొచ్చిన "టేక్నాలజీ మిషన్" కార్యక్రమంలో నూనెగింజలలో స్వయం సమృద్ధికి ఏర్పాటు చేసిన "ఆయిల్ టెక్నాలజీ మిషన్"కు సారథ్యం వహించి, దేశంలో పసుపుపచ్చ విప్లవానికి (ఎల్లో రివల్యూషన్) కు సారథిగా నిలిచారు. స్వయం పోషకత్వం సాధించి, అప్పటివరకు నూనె గింజల దిగుమతికి ఖర్చవుతున్న వేలకోట్లు విదేశీ మారక ద్రవ్యానికి చెక్ పెట్టారు. దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన సేవలందించారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి ప్రత్యేక డైరక్టర్ జనరల్ హోదాలో ఆయిల్ టెక్నాలజీ  మిషన్‌ను నడిపించి యువ శాస్త్రవేత్తలకు, వ్యవసాయ రంగానికి నిలువెత్తు ఆదర్శంగా నిలిచారు.

భారత వ్యవసాయ రంగానికి వివిధ హోదాలలో అందించిన సేవలకు గుర్తుగా ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆహార సంస్థ వారిని ఆహ్వానించి, వారిని సలహాదారులుగా తీసుకోవడం జరిగింది. ఒక సంవత్సర కాలం పాటు ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆహార సంస్థకు సేవలందించిన డా. రావు సేవకు గుర్తింపుగా 1991 లో అప్పటి ప్రభుత్వం ఆయనను ఆంధ్రప్రదేశ్ ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా నియమించింది.

ప్రధానంగా డా. యం.వి. రావు పరిశోధనలు పంటపొలాలకు చేరాలని గట్టిగా నమ్మిన వ్యక్తి. దీని కోసం త్రికరణ శుద్ధిగా పనిచేసిన శాస్త్రవేత్త. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చరిత్రలో వారి హయాంలో జరిగినన్ని రైతుమేళాలు అంతవరకు ఎప్పుడూ జరగలేదు. ఆ తర్వాత కాలంలో వాటిని అందరూ ఇంకా విస్తృతంగా కొనసాగించేలా కృషి చేశారు.  రైతుమేళాలే రైతులకు, శాస్త్రవేత్తలకు పరిశోధన సంస్థలకు మధ్య వారధిలా పనిచేస్తాయని భావించి, వాటిని విశ్వజనీనం చేశారు. బోర్లాగ్ పురస్కారం, పద్మశ్రీలు వారి నిరుపమాన సేవకు గుర్తులు.

హరిత విప్లవ రథ సారథులతో పనిచేసి, ఎల్లో రెవల్యూషన్‌ను నడిపించి, "రైతుమేళాల" ద్వారా వ్యవసాయ పరిశోధనా సంస్థలను, విశ్వవిద్యాలయాలను రైతుల వద్దకు చేర్చిన డా. యం.వి. రావు తెలుగు వారు కావడం మన అందరి అదృష్టం. వారి బాటలో వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ వ్యవసాయ రంగంలో వున్నతంగా ఎదిగేలా శ్రమించటమే మనం వారికివ్వగల నిజమైన నివాళి.

– వలేటి గోపిచంద్



టి. శ్రీవల్లీ రాధిక

# నాన్న దగ్గరికి...

తాడేపల్లి శ్రీవల్లీ రాధిక- సాంకేతిక విద్యార్థికురాలిగా, దైనందిన జీవనపు ప్రశ్నలకి సమాధానాలు వెతుకుతూ రచనా ప్రస్థానాన్ని ప్రారంభించారు. వాటికి స్పష్టమైన సమాధానాలు రాబట్టుకోగలగటంలో కొంత కృషి, ఇంకొంత స్ఫురణ. ఆరోగ్యకరమైన ఉనికిని నెలకొల్పుకోవటంతో రాధిక అన్వేషణ ఆగింది కాదు, జిజ్ఞాసువుగా ఆధ్యాత్మికతలోకి దారి వేసుకున్నారు ('నాన్న దగ్గరకి' కథ ఒక ఉదాహరణ). సంప్రదాయ వైభవంతో ప్రకాశిస్తూ వస్తున్న రాధిక సృజన, ఇవాళా రేపూ – ఒక అతీత మధుకాంతికి తనదైన అవసర నైవేద్యం!

ఆ రోజు... రాత్రి పూట. ఎక్కడినుంచి బయల్దేరామో తెలియదు. వెళ్తోంది మాత్రం నాన్న దగ్గరికి. అది తెలుసు.

నా వయసెంత అప్పుడు! తప్పటడుగులు పోయి సరిగ్గా నడవడం వచ్చింది. చిలకలా మాట్లాడడమూ వచ్చింది. కానీ బాగా చిన్నదాన్ని. అప్పుడే కొంచెం కొంచెంగా ఊహ తెలుస్తోంది. వివేకం ఏర్పడుతోంది.

అవును.. చిలకలాగే మాట్లాడేదాన్ని అపుడు! “ఎంత ముచ్చటగా మాట్లాడుతోంది ఈ వయసులోనే!” అని పెద్దవాళ్ళందరూ మురిపెంగా చూసేవాళ్ళు. అన్నన్ని మాటలు... అర్థం తెలిసి మాట్లాడేదాన్నో! తెలీకుండానే మాట్లాడేదాన్నో! మావాళ్ళయితే ముచ్చట పడేవాళ్ళు కానీ బయటివాళ్ళు కొందరు మాత్రం “ఆ! నాపసాని మాటలు!” అని విసుక్కునేవారు.

ఇంతకీ ఆ రోజు రాత్రి ఏమయిందంటే...

ఒక ఊరి నుంచి ఇంకో ఊరికి నడుస్తున్నాం. అసలు ముందు కొంచెం సేపు నేనొక్క దాన్నే నడుస్తున్నట్లుగా నాలో నేనే మాట్లాడుకుంటూ నాబొమ్మతో కబుర్లు చెప్పుకుంటూ నడిచాను. నాకు బాగా గుర్తు. అప్పుడలాగే వుండేదాన్ని! లక్కపిడతలు పెట్టుకుని ఇంకొకరితో పనిలేకుండా నేనొక్కదాన్నే ఆడుకునేదాన్ని! అమ్మని మాత్రం అస్సలు విసిగించేదాన్ని కాదు. అమ్మ వద్దన్న పని చేసేదాన్ని కాదు.

అప్పుడు కూడా అలాగే నడుచుకుంటూ పోతూన్న దాన్ని కాసేపటి తర్వాత నాగోలలో నుంచి బయటపడి అమ్మవైపు చూశాను. అవును మరి! నేనొక్కదాన్నే పోవడం లేదు నాన్న దగ్గరికి. నాతో పాటు అమ్మ వుంది. అమ్మావాళ్ళ అన్నయ్య కూడా వున్నాడు. ఆయన అమ్మకి అన్నయ్యేనా! తమ్ముడవుతాడా! సందేహం వచ్చింది. ఆయన ముందు అడగడానికి సిగ్గు. అమ్మ చేయి పట్టుకుని లాగాను. అమ్మ కొద్దిగా వంగగానే రహస్యంగా అడిగాను.

అది రహస్యం అని నా ఉద్దేశ్యం. కానీ ఆయనకి నాప్రశ్న సుబ్బరంగా వినిపించింది. నవ్వాడు.

ఆయన నవ్వితే నవ్వాడు. అమ్మ కూడా నవ్వింది. అది చూసి నాకు కొంచెం కోపమూ దుఃఖమూ వచ్చాయి. అమ్మ గమనించి నన్ను దగ్గరికి తీసుకుంది. “ఇద్దరం ఒకేసారి పుట్టామమ్మా!” అంది నన్ను బుజ్జగిస్తున్నట్లుగా.

అప్పుడు గుర్తొచ్చింది నాకు. అవును, ఆ విషయం నాకు తెలుసు. వాళ్ళిద్దరూ ఒకేసారి పుట్టారు. అందరూ చెప్పుకుంటుంటే అంతకు ముందు విన్నాను. విని కూడా ఎందుకు అడిగాను! అబ్బా! అనుకున్నాను.

అమ్మని ఆనుకుని అస్సలు మాట్లాడకుండా నడవడం మొదలుపెట్టాను. చాలా పొడుగాటి దారి అది. ఎదురుగా చూస్తూ వుంటే దారి తప్ప ఇంకేమీ కనబడడం లేదు. ఇళ్ళు లేవు. చెట్లున్నాయి కానీ ఏమైనా అమ్మే కొట్లు లేవు.

ఒక వూరి నుంచి మరోవూరికి వెళ్తుంటే మధ్యలో ఇళ్ళు వుండవు కదా! చాలా చాలా దూరం ఖాళీగానే వుంటుంది. మళ్ళీ మధ్యలో ఏదైనా ఊరు వస్తే అప్పుడు కొంచెం సేపు ఇళ్ళు కనబడతాయి. అయినా ఇళ్ళు కనబడితే ఏమిటి? కనబడకపోతే ఏమిటి? మనమెలాగూ అక్కడ ఆగము కదా! తొందరగా నాన్న దగ్గరికి వెళ్ళాలని ఆగకుండా నడుస్తూనే ఉంటాము కదా! కాబట్టి వాటన్నిటి సంగతీ మనకి అనవసరం.

సరే.. అలా నడుస్తూ వెళ్తున్నాం. నేనూ నాతో పాటు వాళ్ళిద్దరూ! 'నీతో పాటు వాళ్ళిద్దరూ ఏమిటి!' అని నవ్వకండి. 'వాళ్ళు నీతో నడవడం లేదు.. నువ్వే వాళ్ళతో పాటు నడుస్తున్నావు' అని చెప్పకండి. నాకు తెలుసు. నేను సరిగ్గానే చెప్తున్నాను. ఇది నా కథ కదా! కాబట్టి నేను చెప్పేదే సరయిన పద్ధతి. ఏమైనా సరే ఇంక నాన్న దగ్గరికి వెళ్ళాలని అనుకున్నది నేను. పంతం పట్టి బయల్దేరింది నేను. కాబట్టి వాళ్ళే నాతో వస్తున్నట్లు.

ఇళ్ళూ కొట్లే కాదు.. అసలు ఆ దారిలో మాతోపాటు నడుస్తున్న మనుషులు కూడా ఎవరూ లేరు. మధ్య మధ్యలో కొంతమంది కలుస్తున్నారు కానీ ఎవరూ ఎక్కువదూరం మాతో పాటు రావడం లేదు. కొంతమంది మేము వెళ్తున్న చోటికే వెళ్ళాలని బయల్దేరారు కానీ మళ్ళీ తటపటాయించి “ఇప్పుడంత దూరం నడిచి వెళ్ళడం కంటే ఇక్కడే ఎక్కడో గడిపేయడం మంచిది. వెళ్ళాలంటే తర్వాత కాస్త తెల్లవారాక వెళ్ళచ్చు,” అనుకుని వెనక్కి వెళ్ళిపోయారు. ఇంకొంత మంది మధ్యలో కొన్ని ఊళ్ళు వచ్చాయి కదా, అక్కడ ఆగిపోయారు. మరికొంచెం మందేమో మమ్మల్ని దాటేసి వేగంగా ముందుకు వెళ్ళిపోతున్నారు. నావి చిట్టి చిట్టి అడుగులు కదా! అందుకే నేను మెల్లగా నడుస్తున్నాను. నాకు ఒకవైపున అమ్మ. మరొకవైపున ఆయన. వాళ్ళిద్దరూ కూడా నేను నడుస్తున్నంత మెల్లగానే నడుస్తున్నారు... నాతో పాటే.



నేను వాళ్ళ మోకాళ్ళ దాకా కూడా రాని బుజ్జిదాన్ని. వాళ్ళిద్దరి మొహాలూ నాకు కనబడడం లేదు. కానీ ఇద్దరూ చెరో పక్కనా నడుస్తున్నారు కాబట్టి చీకటిగా వున్నా నాకు భయం వేయడం లేదు.

నేను అలా మెల్లగా మెల్లగా ఇంకా మెల్లగా నడుస్తుంటే... నా నడకలో వేగం బాగా తగ్గిందని ఆయన గమనించినట్లున్నాడు. "ఏమిటి? నడవలేక పోతున్నావా!" అని అడిగాడు.

అబ్బ! ఎంత ప్రేమగా అడిగాడు! అనిపించింది. "నిద్రొస్తోందా!" ఈసారి ఇంకా ప్రేమగా వినిపించింది ఆయన గొంతు. అచ్చం అమ్మ అడిగినట్లే అడిగాడు కదా అని నేను కూడా అమ్మ వైపు చూసినంత ప్రేమగా చూడబోయాను ఆయనవైపు.

కానీ అంతలోనే ఆయన "ఇంకా చాలా దూరం వుంది మరి. మధ్యలో చాలా ఊళ్ళున్నాయి," అన్నాడు నన్ను ఏడిపించడానికి అంటున్నట్లుగా.

ఎప్పుడూ అంతే ఆయన! ఒక్కొక్కసారి ఎంత ముద్దు చేస్తూ మాట్లాడతాడంటే అమ్మా నాన్నల కంటే కూడా ఎక్కువ ప్రేమగా మాట్లాడుతున్నాడనిపిస్తుంది. అలాంటప్పుడు అమ్మ ఎంత దగ్గరో నాన్న ఎంత దగ్గరో ఈయన కూడా మనకి అంతే దగ్గర. ఈయన్ని కూడా మనం ఏమన్నా అడిగేయచ్చు అనిపిస్తుంది. మళ్ళీ అంతలోనే ఈయన్నెలా అడుగుతాం! ఈయన వెక్కిరించినట్లుగా, ఏమిటమ్మాయ్ నీ సంగతి! అన్నట్లుగా మాట్లాడుతాడు కదా! అనిపిస్తుంది. చెప్పాను కదా! నాకు అపుడపుడే వూహ తెలుస్తోంది. అందుకే ఆయనతో నాకు వున్న బంధుత్వం మీదా హక్కుల మీదా స్పష్టత లేదు.

"కాళ్ళు నెప్పి పుడుతున్నాయా! పాపం ఇంకా చాలా దూరం నడవాలే! ఏం చేస్తావ్?" ఆయన గొంతు మళ్ళీ వినిపించింది.

ఈసారి నిజంగానే ఏడిపిస్తున్నాడనిపించింది.

"మా అమ్మ ఏదన్నా బండి ఎక్కిస్తుంది." బింకంగా చెప్పాను.

"బండా!" ఆయన పెద్దగా నవ్వాడు. "ఇక్కడ బళ్ళు కనిపిస్తున్నాయా నీకు!" అన్నాడు.

నేను బిక్కమొహం వేశాను.

"ఇక్కడ బళ్ళు ఏమీ వుండవు. నడిచి వెళ్ళాల్సిందే."

ఆయన మాటలు నిజమో కాదో తెలీదు. అమ్మ వైపు చూశాను.

అమ్మ మాట్లాడలేదు. నవ్వుతూ చూస్తోంది. నాన్న గురించి ఆలోచిస్తోందనుకుంటా.

"వీళ్ళిద్దరూ ఒకేసారి పుట్టారు. చూడటానికి ఒకేలా ఉంటారు. కానీ ఈయనకీ అమ్మకీ తేడా వుంది..." అనుకున్నాను. తేడా ఉందని తెలిసింది కానీ ఆ తేడా ఏమిటో స్పష్టంగా తెలుసుకునేంత తెలివి లేదు మళ్ళీ.

నేనా మాట అనుకోగానే ఆయనకి ఎలా తెలిసిపోయిందో ఏమిటో! "తేడా వుంటుంది మరి! ఒకేసారి పుట్టాము కానీ ఒకేచోట పుట్టలేదు కదా మేము. నేను పట్నంలో పుట్టాను. మీ అమ్మ ఎక్కడో పల్లెటూర్లో పుట్టింది" వెక్కిరిస్తున్నట్లుగా అన్నాడు.

నాకు ఆయన చెప్తున్న విషయం తెలుసు. మేమిద్దరం ఒకేసారి పుట్టామని అమ్మ అన్నప్పుడే గుర్తొచ్చేసింది. అందుకే టకీమని అన్నాను. "కానీ నువ్వు పుట్టంగానే పల్లెటూరికి వెళ్ళిపోయావు. అమ్మేమో అక్కడి నుంచి పట్నం వచ్చింది."

"ఓహో అది తెలుసా నీకు!" ఆయన నవ్వాడు.

"ఆ.. తెలుసు. మీ నాన్న నిన్ను తీసుకొచ్చి మా అమ్మ వుండే చోట పెట్టి నీ బదులు మా అమ్మని ఎత్తుకెళ్ళి పోయాడు."

"అబ్బో.. నీకు చాలా విషయాలే తెలుసే!" ఆశ్చర్యపోయినట్లుగా చూశాడు. "ఇన్ని తెలుసు కదా మరి మీ అమ్మ నాలాగా ఎందుకు మాట్లాడదో చెప్పు!" అన్నాడు.

ఆయన కావాలని అలా నాతో వాగించాలని చూస్తున్నాడని ఎంత పసిదాన్నయినా నాకు అర్థమయింది. కానీ వాదన సగంలో ఆపడం.. ఓటమిని ఒప్పుకొని ఊరుకోవడం ఎలా! కొంచెం ఆలోచించి "ఎందుకంటే నువ్వు అబ్బాయివి కాబట్టి." అన్నా:


అమ్మ ఫక్కున నవ్వింది. ఆయన అంతకన్నా అందంగా నవ్వాడు. "కదా.. అబ్బాయిని కాబట్టి నాకు బలమూ ధైర్యమూ ఎక్కువ" అన్నాడు.

"కాదు కాదు .. బలమూ ధైర్యమూ మా అమ్మకే ఎక్కువ" అన్నాను నేను కంగారుగా.

"నేను ఎవరితోనయినా పోట్లాడగలను. రౌడీలూ దొంగలూ వస్తే వాళ్ళని కొట్టగలను."

"మా అమ్మ కూడా పోట్లాడగలదు. నువ్వు చేసేవన్నీ మా అమ్మ కూడా చేయగలదు."

"అవునా!" అన్నాడు ఆయన నెమ్మదిగా... ఏదో నేను



చెప్పిందంతా ఒప్పుకుంటున్న వాడిలాగా తలవూపాడు. నేను సంతోషంగా నవ్వబోయాను.

"సరే.. పోనీ నువ్వు చెప్పిందే నిజం అనుకుందాం. నేను చేసినవన్నీ మీ అమ్మ కూడా చేయగలదనీ చేసిందనీ అనుకుందాం. అంటే మీ అమ్మకి కూడా నాతో సమానంగా బలం వున్నట్లు. కానీ నువ్వు మీ అమ్మకి నాకన్నా ఎక్కువ బలం వుందన్నావు కదా! అదెలా! అది తప్పు కదా!" అన్నాడు.

ఆయన మాటలకి నేను మళ్ళీ బిక్కమొహం వేశాను. ఏదో ఒకటి చేసి ఎప్పుడూ చివరికి ఈయనే గెలుస్తాడా! అనిపించింది. అమ్మ వైపు చూశాను. అమ్మ మొహం వెన్నెలలో బంగారం లాగా మెరిసిపోతోంది. 'భయపడకు. చెప్పు. చక్కటి సమాధానం చెప్పు" అన్నట్లుగా చూస్తూ అమ్మ తల ఊపింది.

నేను ఒకసారి నాన్నని తల్చుకున్నాను. నా ఎదురుగా ఉన్నాయన ఎలా మాట్లాడతాడో కూడా గుర్తు చేసుకున్నాను.

ఆయన అడిగిన ప్రశ్నకి నేరుగా సమాధానం చెప్పకుండా అచ్చం ఆయన లాగానే ఎదురు ప్రశ్న వేశాను. "నువ్వు పుట్టినపుడు వెంటనే మీ నాన్న నిన్ను వేరే ఊరికి తీసుకు వెళ్ళాడు కదా... రాత్రిపూట. అప్పుడు నీకు భయమేయలేదా!"

"నాకా! భయమా! అస్సలు వేయలేదు."

"అప్పుడు వర్షం పడిందా! చాలా చలేసిందా!"

"అవును శ్రావణ మాసం కదా.. పెద్ద వర్షం పడింది."

"నిన్ను తీసుకెళ్ళేటపుడు పెద్ద పాము వచ్చి నువ్వు తడవకుండా నీమీద పడగ పెట్టిందా!"

"అవును." మరి నేనంటే ఏమనుకున్నావ్ అన్నట్లుగా చూస్తూ చెప్పాడు. "ఆ పాముకి నేనంటే చాలా యిష్టం. అందుకే వచ్చి నేను వర్షంలో తడవకుండా తన పడగని గొడుగులాగా పెట్టింది. ఆ పడగలమీద గొప్ప మణులు కూడా వుంటాయి. కాబట్టి మేము నడిచే దారంతా బోలెడంత కాంతి. నీకు తెలుసో లేదో ఆ పాము నన్ను అసలు ఎప్పుడూ వదిలి పెట్టదు. నా దగ్గరే వుంటుంది."

ఆయన అన్న చివరిమాట వినగానే నాకు చాలా సంతోషంగా అనిపించింది. ఎందుకంటే ఆయన ఆ జవాబు నాకు ఉపయోగపడేటట్లుగా చెప్పాడు కాబట్టి.

ఇంక చివరికి ఒకే ఒక్క ప్రశ్న మిగిలింది. చాలా ముఖ్యమైన ప్రశ్న. నిజంగా వాళ్ళిద్దరూ పుట్టిన రోజున ఏం జరిగిందో నాకు తెలీదు కానీ నా ప్రశ్నకి ఆయన నాకు కావలసిన సమాధానమే చెప్పాలని అనుకుంటూ అడిగాను.

"నిన్ను తీసుకెళ్ళేటపుడు వర్షం పడింది కదా! అది నిన్ను తీసుకెళ్ళగానే ఆగిపోయిందా! మళ్ళీ అమ్మని తీసుకుని వెనక్కి వెళ్ళేటపుడు కూడా పడుతూనే ఉందా!"

"పడుతూనే వుంది. ఆ రాత్రంతా జోరున వాన కురుస్తూనే వుంది."

హమ్మయ్య అనుకున్నాను. కళ్ళు మెరుస్తుంటే గడగడా చెప్పాను. "కానీ అమ్మ వెళ్ళేటపుడు పాము లేదు. పడగ గొడుగు లేదు. మణుల వెలుగు లేదు. అయినా అమ్మ భయపడలేదు. వర్షంలో తడిసిపోయినా చీకటిగా వున్నా ఏడవలేదు. కాబట్టి మా అమ్మకి నీకన్నా బలమూ ధైర్యమూ ఎక్కువ. నీకు చేసినట్లుగా మా అమ్మకి ఎవరూ సహాయం చేయలేదు కాబట్టి మా అమ్మ నీకంటే గొప్ప."

ఆయన ఆశ్చర్యంగా కళ్ళు తామర పువ్వుల్లాగా విప్పార్చి చూశాడు.

"ఓసినీ!" అంటూ ఒక్కసారిగా మోకాళ్ళ మీద కూర్చున్నాడు.... అక్కడే.... ఆ దారిమధ్యలోనే!

చుట్టూ చీకటిగా వున్నా నాకు ఆయన మొహం స్పష్టంగానే కనబడింది. అమ్మా నాన్నల ఇద్దరి ప్రేమా నాకు ఆ మొహంలో కనబడింది. కానీ దానితో పాటు నన్ను ఏడిపిస్తున్నట్లుగా వుండే చిరునవ్వూ కనబడింది. అమ్మకీ చెప్పను ఆయనకీ చెప్పను కానీ అసలు ఆ నవ్వంటే నాకు చాలా యిష్టం. అది రహస్యం. ఏం రహస్యమో! అనుకుంటాను కానీ నా రహస్యాలన్నీ నేను చెప్పకపోయినా అమ్మకి తెలిసి పోతూనే వుంటాయి. ఇది కూడా నేను చెప్పక పోయినా వాళ్ళకి తెలుసేమో!

ఆయన అలా నా అంత ఎత్తులో నాకు అందేలా కూర్చుని... నా మొహంలోకి పరీక్షగా చూశాడు.

"నువ్వు మీ అమ్మ పోలిక అనుకున్నాను కానీ కాదు. నిజానికి నువ్వు మీ నాన్న పోలిక." అన్నాడు.

"ఏం కాదు." అన్నాను నేను తల ఎగరేస్తూ. "నేను ఇద్దరి పోలికా.. సగం సగం" నామాటకి తిరుగు లేదన్నట్లుగా చెప్పాను.

"ఎక్కడ... మీ అమ్మ లాగా లేవు కదా నువ్వు! మీ అమ్మ మీ నాన్న కూర్చున్నట్లుగా ఒకేచోట కదలకుండా కూర్చోదు. అన్నిచోట్లకీ వెళ్ళి బోలెడన్ని పనులు చేసుకు వస్తుంది. నువ్వేం చేస్తున్నావు? ఏమీ చేయడం లేదు. ఎంతసేపూ నాన్నా నాన్నా అని కలవరించడం తప్ప ఇంకేమీ చేయవు కదా నువ్వు!" ఆయన ఎగతాళి చేస్తున్నట్లుగా అడిగాడు.

ఆయన మాట పూర్తిగాక ముందే "ఎప్పుడూ నాన్నని కలవరించడం అమ్మ పోలికే కదా!" అన్నాను నేను టక్కున, ఎవరో నాకు నేర్పించి పంపించినట్లుగా. ముందే చెప్పాను కదా మాటలకి తడుముకోను నేను.

ఆయన గలగలా నవ్వాడు. మురిపెంగా చూస్తూ చేతుల సాచాడు. ఆయన పసుపు పచ్చ ఉత్తరీయం నా చేతికి మెత్తగా తగిలింది.

నేను దగ్గరికి వెళ్ళగానే ఆప్యాయంగా అచ్చం అమ్మ లాగా భుజాల మీదికి ఎత్తుకున్నాడు.

నా కోపం పోయింది. బెరుకూ పోయింది. బోలెడంత సంతోషం గుండెల నిండా చిమ్మింది.

ఇందాకటి నుంచీ అప్పుడు.. ఆరాత్రి... అంటున్నాను కదా! నిజానికి ఇదంతా జరిగి ఎన్నాళ్ళో కాలేదు. మొన్న మొన్ననే జరిగింది.

అప్పటికీ ఇప్పటికీ పెద్ద తేడా ఏమీ లేదు. ఇంకా ప్రయాణం పూర్తి కాలేదు.

కాకపోతే ఇప్పుడు నేను కష్టంగా నడవడం లేదు. ఏనుగు అంబారీ ఎక్కిన యువరాణిలా ఆ ఆజానుబాహుడి మెడ చుట్టూ చేతులు వేసుకుని ఆయన గుండెల మీద ఊగుతూ సాగిపోతున్నా.

ఈ ప్రయాణం ఇంకెంత దూరమో తెలీదు. కానీ నాకు తెలుసు.. మేము వెళ్ళిపోతాం.

పక్కన నడుస్తున్న ఆమె శివాని. శివజ్ఞాన ప్రదాయిని. నన్ను ఎత్తుకుని మోస్తున్న ఆయనేమో శివసఖుడు. మరిక వెళ్ళకేం చేస్తాం! వెళ్ళిపోతాం.

నాన్న దగ్గరికి వెళ్ళే ఆగుతాం.

– టి. శ్రీవల్లీ రాధిక

# వెలుతురు వైద్యం!

క్రీ.శ. రెండవ శతాబ్దంలో, రెండువేల సంవత్సరాలకు పూర్వం రూపొందిన ఈ అమరావతి శిల్పం బుద్ధుని జీవితంలోని కథను అజరామరం చేసింది.



మాటను శిరోధార్యంగా భావించే మనుషులు చుట్టూ ఉన్నారు. సైగలకు స్పందించేవారూ ఉన్నారు. చక్కని రాజసౌధంలో అమరనిది ఏదీ లేదు. అయినా ఒక కలత. రాజవైద్యుడు అన్ని పరీక్షలూ చేసాడు. శరీరంలో ఏ లోపమూ లేదు. వ్యాకులత వదలదే! ఒకటా, రెండా, కొన్ని రోజులు, మాసాలు ... నిద్దుర రాదే!

వైదేహి పుత్రుడు, బింబిసారుని కుమారుడు మగధ రాజు అజాతశత్రుని అవస్థ అది. రాజవైద్యుడు జీవకుడు అజాత శత్రునితో ఇలా అంటాడు: నేను వైద్యుడను మాత్రమే. బుద్ధుడు భవరోగవైద్యుడు. ఆయనను సందర్శిద్దాం. నిశ్చయంగా మీ ఆరోగ్యం కుదుట పడుతుంది!

బుద్ధుడు తనకు దర్శనం ఇస్తాడా? తన సమస్యను తొలగించగలడా! తానెవరు? ఇతడు బతికుండగా తాను సింహాసనం ఎక్కలేనని భావించి, తండ్రిని కారాగారంలో బంధించినవాడు. తండ్రిని ఆయుధంతో చంపకూడదు అనే నియమాన్ని పాటిస్తూ ఆహారం అందకుండా చేసినవాడు. శిరోజాలలో ముడివేసుకుని, పాదరక్షలలో దాచుకుని, దేహానికి మూడు పూతల తేనె పూసుకుని కారాగారంలోని తండ్రికి తన తల్లి కోసల దేవి ఆహారం ఇస్తున్నదని తెలిసి అడ్డుకున్నవాడు. చెరసాల కిటికీ నుంచి బుద్ధుడు భిక్కులతో విడిది చేసిన వనం కన్పిస్తుందని, ఆ వీక్షణం తండ్రికి మృత్యువును దూరం చేస్తున్నదని, కిటికీని మూయించినవాడు. తండ్రి తొడలకు కత్తితో లోతైన గాట్లు పెట్టించినవాడు. ఉప్పు కూర్చించినవాడు. వేడి నూనెలో ముంచిన వస్త్రాలతో కట్టు కట్టించినవాడు. తండ్రి విగతుడయ్యేలా చేసినవాడు.

తండ్రికి తానంటే ద్వేషమా? లేదు. ఎంతగా ప్రేమించాడో! బాల్యంలో తన చిటికెన వేలికి విషపు వ్రణం మొలిచింది. నిరంతరం చీమునెత్తురులు స్రవించేవి. ఏ కట్టూ వాటిని ఆపలేకపోయేది. కిందపడితే రోగవ్యాప్తి. తన చిటికెన వేలుని తండ్రి దివారాత్రాలు నోటిలో ఉంచుకునే వాడు. చీమునెత్తురులను, ప్రేమతో, లాలనగా పీల్చుకునే వాడు. తండ్రి నోటి వెచ్చదనంతో ఆ గాయం మానిందని, తాను బతికి బట్టకట్టానని తాను తండ్రిని అయ్యాక కదా పెద్దలు తెలిపింది. 'చివికిన వేలు' అని చిన్నప్పుడు ఎందుకు పిలిచేవారో ఇప్పుడు కదా తెలిసింది. తనను ఏ నరకము శిక్షించగలదు... నిద్రకు వెలియైన అజాతశత్రునికి జీవకుడు బుద్ధునివైపు వేలు చూపించాడు.


ఒక పౌర్ణమి రోజు, ఏనుగుల అంబారీలపై అంతఃపుర కాంతలతో, దాసదాసీ జనంతో అజాతశత్రుడు బుద్ధుని సందర్శించేందుకు బయలుదేరాడు. జీవకుడు బౌద్ధసంఘానికి సమర్పించిన మామిడి తోటలో వేయిమంది భిక్కులతో బుద్ధుడు వేంచేసి ఉన్నాడు. అంతమంది నివసించే చోట చిన్న అలికిడి లేదు. ఒక తుమ్ములేదు. దగ్గులేదు. పండువెన్నెలలో ప్రకృతి మౌనం రాగం తప్ప! 'జీవకా, నన్ను శత్రువులకు అప్పగించే కుట్ర ఏదైనా అమలవుతున్నదా?' అంటాడు తన సహజస్వభావంతో అజాతశత్రుడు. 'ఈ అటవీ గర్భంలో మిమ్మలనే కాదు, ప్రపంచాన్ని తేజోమయం చేయగల వెలుగు ఉన్నది, నిశ్చింతగా ముందుకు అడుగు వేయండి' అంటాడు జీవకుడు.

వెన్నెల ఇతడి నుంచే కదా వెలుగు చూస్తోంది, అన్పించేలా ఆసీనుడై ఉన్నాడు బుద్ధుడు. ఆయన ముందు అజాతశత్రుడు తన చీకటిని పరుస్తాడు. బుద్ధుడు ఇలా అంటాడు: 'చీకటి ఎందుకు ఉంది? అజ్ఞానం ఎందుకు ఉంది? స్వార్థం ఎందుకు ఉంది? ఇవి అర్థం లేని ప్రశ్నలు. అవి ఉన్నాయి. నీ గత జీవితం అటువంటిదే. ఇప్పుడు నీవు దీపం పట్టుకుని ఉన్నావు. ఈ పశ్చాత్తాపపు వెలుగే లేకపోతే నీవు ఒక చీకటి ప్రపంచపు రాజువు మాత్రమే అయ్యేవాడవు. జ్ఞాన స్రవంతిలో చేరగలిగిన పాయవు మాత్రము కాగలిగేవాడవు కావు. పశ్చాత్తప్త హృదయుడా! ధర్మదీపాన్ని ధరించిన వాడా! చింతించకు. ప్రయాణించు. నీ ప్రతి అడుగూ ప్రజలకు బతుకు దీపం అవుతుంది'

అదీ కథ! ఈ కథకు ముసలి తనము, మృత్యువు (జరామరం) రాకుండా చేసారు అమరావతి శిల్పులు. అమరావతిలోని దీపాలదిన్నె స్థూపం చుట్టూ ప్రహరీ ఉండేది. వర్తులాకారపు ఆ ప్రహరీలో ఒక అంచెలోని దూలంపై వెలుపలకు కన్పించే శిల్పం ఇది. క్రీ.శ. రెండవ శతాబ్దంలో, రెండువేల సంవత్సరాలకు పూర్వం ఈ శిల్పం రూపొందింది. 65.5 సెం.మీ వ్యాసం కలిగిన, కమలపు అంచు గల వృత్తంలో, 25 సెంటీ మీటర్ల మందం కలిగిన 'పల్నాడు మార్బుల్'పై చెక్కిన శిల్పం: అజాతశత్రుడు సపరివారంగా బుద్ధుని దర్శించుకోవడాన్ని కళ్లకు కడుతోంది. అంతా బాగానే ఉంది, బుద్ధుడేడీ అన్పిస్తోందా! మరోసారి ముచ్చటించుకుందాం!

సర్ వాల్టర్ ఇలియట్ క్రీ.శ.1845లో చేసిన తవ్వకాల్లో అమరావతిలో ఈ శిల్పం వెలుగులోకి వచ్చింది. లండన్‌లోని ఎగ్జిబిషన్ రోడ్‌లోని ఇండియా మ్యూజియంకు తరలింది. క్రీ.శ. 1879లో ఇండియా మ్యూజియం మూతపడింది. ఇందులోని కళాసంపదను బ్రిటిష్ మ్యూజియం– ద సౌత్ కింగ్‌స్టన్ మ్యూజియం (విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియం)లు పంచుకున్నాయి. క్రీ.శ. 1880 నుంచి బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న ఈ శిల్పం ప్రస్తుతం ప్రదర్శనలో లేదు. భవరోగవైద్యుని సందర్శించే భాగ్యం కలగాలని ఆశిద్దాం!

– పున్నా కృష్ణమూర్తి



# ఉండవల్లి గుహాలయం

## బహుముఖ ఆంధ్ర సంస్కృతీ ముఖద్వారం

తొలిసంధ్యా సమయంలో భూపాలరాగంతోనో, వేకువ జామున సుప్రభాత గీతంతోనో భగవంతుడికి మేలుకొలుపు పలకడం మన సంప్రదాయం. ఉండవల్లి గుహల్లో నల్లసేనపురాయిపై మలిచిన భారీ విగ్రహమూర్తి– అనంత పద్మనాభస్వామి ముందు నిలబడితే ఒక సత్యం బోధపడుతుంది: దేవుడి కోసం పాడే ప్రభాత గీతం మనలో నిద్రాణమైన శక్తులకే మేలుకొలుపు అని. సందర్శకులకి ఇటువంటి వైతాళిక అనుభవం ఇచ్చే ఉండవల్లి గుహలు – ఒక ఆధ్యాత్మిక కేంద్రం, కృష్ణా తీరాన ఆహ్లాదభరితమైన ఒక పర్యాటక ప్రదేశం, 1500 ఏళ్ల నాడే వెల్లివిరిసిన మన ఆంధ్రుల నాగరికతకు అద్దం పట్టే చారిత్రక నిలయం, నాటి మన సృజనాత్మక చిత్రకళా వైశిష్ట్యాన్ని చాటి చెప్పే కళా ప్రాంగణం. ఇంత బహుముఖీనమైన సాంస్కృతిక క్షేత్రం క్రీ.శ. 4, 5 వ శతాబ్దాలకి చెందినదని చరిత్రకారుల అంచనా. ఈ గుహాలయాలు క్రీ.శ. 420 నుండి 620 వరకు సాగిన విష్ణుకుండినుల కాలానికి చెందినవి వారు లెక్కలు తేల్చారు. వీటి నిర్మాణ శైలి బౌద్ధ విహారాల శైలిని పోలి ఉంటుంది.

నాలుగు అంతస్తులలో రాతిని స్థంబాలుగా తొలచి, వాటిపై అందమైన లతలు చెక్కి సుందరమిన ఆలయాలు చేశారు. ఆ ఆలయాల్లో త్రిమూర్తులు అయిన బ్రహ్మ, విష్ణువు, శివుడు, ఇతర దేవతల ప్రతిమలు కూడా చెక్కి ఉంటాయి. ఈ పర్వత గుహలలో పెద్దదైన ఒక గుహాలయంలో పాతిక అడుగుల ఏకశిల అనంతపద్మనాభస్వామి వారి ప్రతిమ ఉంటుంది. ప్రతిమ పొడవుగా శేషపానుపు పొడుగూతా కమలాసనుడైన బ్రహ్మ, సప్తర్షులు, ఇతర దేవతల విగ్రహాలూ ఉంటాయి. దీని వెలుపల, గుహాలయ పైభాగములో సప్తఋషుల విగ్రహాలు పెద్దవిగా చెక్కారు. ఇలా ఒకే పర్వతాన్ని గుహలుగానూ, విగ్రహమూర్తులుగా తొలిచిన మన శిల్పుల ప్రతిభ మనల్ని అప్రతిభుల్ని చేస్తుంది.

ఈ గుహల నుంచి ఆనాటి కాలంలో మంగళగిరి వరకు సొరంగ మార్గం ఉండేదని, ఈ మార్గం నుండి రాజులు తమ సైన్యాన్ని శత్రు రాజులకు తెలియకుండా తరలించేవారని ప్రచారంలో ఉంది. అయితే, దానికి ఆనవాళ్లు ఇప్పుడు మాత్రం కనిపించవు. పచ్చని పంటపొలాల మధ్య సమున్నతంగా నిలిచిన కొండ, ఆ కొండని తొలిచి చెక్కిన దేవతల, ఋషుల విగ్రహాలు సందర్శకుల్ని మరో లోకంలో విహరింపజేస్తాయి.

## ఉండవల్లి గుహలకి మార్గం ఇలా...

ఉండవల్లి గుహలు విజయవాడకు నైరుతి దిక్కున 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ప్రకాశం బ్యారేజి దాటగానే తాడేపల్లి సెంటర్ వస్తుంది. ఆ సెంటర్ నుండి అమరావతి వెళ్లే దారిలో ఉండవల్లి గుహలు సమున్నతంగా కనిపిస్తాయి. ఇక్కడికి చేరుకోవడానికి విజయవాడ నుంచి కారు, ఆటో వంటి అనేక ప్రయాణ సాధనాలున్నాయి. కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ కారణంగా ప్రకాశం బ్యారేజి మీద బస్సుల రాకపోకలు లేవు.

## సదుపాయం

దేశంలోని అతి పెద్ద రైల్వే జంక్షన్లలో ఒకటైన విజయవాడకి దేశం నలు మూలల్నుంచీ రైలు, బస్సు, విమాన సౌకర్యాలు ఉన్నాయి. వసతికి విజయవాడలో స్టార్ హోటళ్ల నుంచి సగటు పర్యాటకులకు అందుబాటులో ఉండే సత్రాల వరకూ అనేకం ఉన్నాయి.

కృష్ణా నదీ తీరాన, అందమైన పరిసరాలు కనువిందు చేసే రీతిలో సౌకర్యవంతమైన విడిదికి ఏపీ ప్రభుత్వ పర్యాటక శాఖ (ఏపిటిడిసి) ఆధ్వర్యంలో నిర్మించిన హరిత బెరమ్ పార్క్– డీలక్స్ రిసార్ట్స్ పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. కొండల మధ్య చూడచక్కని పచ్చటి అహ్లాదకరమైన వాతావరణంలో లక్సరీ సౌకర్యాలతో ఉండే ఈ రిసార్ట్స్ నుండి ప్రకాశం బ్యారేజ్ మీదుగా నదిని దాటితే, నదీ తీరంలో మూడు కిలోమీటర్లలో ఉంటాయి ఉండవల్లి గుహలు.

కృష్ణా నది మధ్యలో ఉన్న భవానీ ద్వీపం (భవానీ ఐలాండ్)లో ఎపిటిడిసి వారి రిసార్ట్స్ లో కూడా నాన్–ఏసీ, ఏసీ గదులు ఉన్నాయి. ప్రతి వాటికి పరిసరాలను తిలకించే విధంగా బాల్కనీలున్నాయి. ఫెర్రీలో నది దాటి అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఉండవల్లి చేరుకోవచ్చు.

బెరమ్ పార్క్ వసతి ఆన్ లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. లేదా +91 9951 96 8100 నెంబర్ కు ఫోన్ చేసి బుక్ చేసుకోవచ్చు.

అదే విధంగా భవానీ ఐలాండ్ లో బుకింగ్ కోసం +91 9848 77 9685 నెంబరులో సంప్రదించవచ్చు.

## ప్రత్యేక ఆకర్షణలు


ఉండవల్లి పరిసరాల్లో లెక్కలేనన్ని ఆకర్షణలున్నాయి. భవానీ ద్వీపం నుంచి హౌస్ బోట్లలో విహారం చెప్పుకోదగింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నదిలో వాహ్యాళి మరిచిపోలేని అనుభూతి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు సాంస్కృతిక రాజధానిగా పేరొందిన విజయవాడ పాత పేరు బెజవాడ. ఇప్పుడు నవ్యాంధ్ర పరిపాలనా కేంద్రంగా ఉన్న విజయవాడలో మొగల్రాజపురం గుహలు, భవానీ ద్వీపం, విక్టోరియా మ్యూజియం, మహాత్మా గాంధీ హిల్ వంటి ప్రదేశాల సందర్శనం పర్యాటకులకి మంచి అనుభూతినిస్తుంది.

– జాస్తి గోపాల ప్రసాద్



## కట్టిపడేసే కదిలేబొమ్మ

ఈ కాలంలో ఏదైనా తెలియకుండా ఉంటుందేమో గానీ, సినిమా అంటే మాత్రం తెలియని వాళ్లు ఉండరు కదా పిల్లలూ. ఇప్పటి ప్రపంచంలో సినిమా మనందరికీ ఒక కనీస అవసరం, నిత్యావసర వస్తువు అయిపోయింది కదూ. పాత కళారూపాలు నాటకాలు, నృత్యాలు, కథాకాలక్షేపాలు, బొమ్మలాటలు, కవితలు వంటి ఎన్నో కళలను ఒకటిగా కలిపి సైన్స్ సృష్టించిన ఒకే ఒక కళారూపం సినిమా. పెట్టుబడి, వ్యాపారం, రాజకీయం, మనోవిజ్ఞానం, సృజనాత్మకత, కొంత నిజం, కొంత ఊహ, కొంత మాయాజాలం... ఇలా ఎన్నో అంశాలు కలిసి తయారైన ఈ సినిమా టెక్నిక్ తెలుసా మీకు? వివిధ దృశ్యాల్ని ఫొటోగ్రాఫిక్ ఫిల్ము రీలుపై చిత్రీకరించి, ఈ రీలుని ప్రొజెక్టర్‌లో సెకనుకి 24 ఫ్రేములు వెండితెరపై పడేలా గిరగిరా తిప్పుతారు అంతే. సినిమా తెరపై ఒక దానివెంట ఒకటిగా శరవేగంగా పడే నిశ్చల చిత్రాలన్నీ కలిసి, ఆయా వస్తువులు/మనుషులు నిజంగా కదులుతున్నారు. అన్న భ్రమ మనకు కల్గుతుంది. మొదట ఏ శబ్దమూ లేకుండా ప్రారంభమైన సినిమాలకు తరువాత శబ్దం తోడయ్యింది. ఆ తర్వాత సప్త వర్ణాలు, ఇప్పుడు కంప్యూటర్లు, డిజిటల్ టెక్నిక్కులు, యానిమేషన్ వంటి హైటెక్కు హంగులతో మనల్ని కట్టిపడేస్తుంది ఈ కదిలేబొమ్మ!



దారి కనుక్కోండి


## చిన్నారి 'చిత్రం'



**డి. అఖిల్**
2వ తరగతి,
హైదరాబాద్




చిన్నారుల పెయింటింగ్స్‌ను
apchiefeditor@gmail.comకు
ఈ మెయిల్ చేస్తే ప్రచురిస్తాం.



చుక్కలు కలపండి

రంగులు వేయండి






# భిన్నమైన ఆలోచనలు విజయాలకు సోపానాలు



ఒక గ్రామంలో ఉన్న పాఠశాల స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయి. విదేశాల్లో, దేశంలోనే అనేక నగరాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొనడానికి వచ్చారు. అందరూ ఎంతో ఉత్సాహంతో తమ చిన్ననాటి అనుభవాలను ముచ్చటించుకుంటున్నారు. పాతిక సంవత్సరాల నుండి అక్కడ పనిచేస్తూ ప్రతి విద్యార్థితో వాళ్ళ తల్లిదండ్రులతో అత్యంత ఆత్మీయ సంబంధాలు నెలకొల్పుకోవడాన్ని ఒక అలవాటుగా మార్చుకున్న ప్రధానోపాధ్యాయుడు ఇలా ఉపన్యసించాడు:

"ఈ పాఠశాలలో చదువు పూర్తిచేసుకొని పై చదువులు చదవటానికి వెళ్ళే విద్యార్థులందరూ ఉన్నతంగా ఎదగాలని నేను రోజూ దైవాన్ని ప్రార్థించేవాడిని. ఇవ్వాళ పూర్వ విద్యార్థులందరినీ ఒకే చోట చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. ఇక్కడ వున్న చైతన్య అనే పూర్వ విద్యార్థి చదువులో ఎప్పుడూ వెనుకబడి ఉండేవాడు. అతని పట్ల నేను, ఇతర ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనపరచేవారం. అతను బొటా బొటీ మార్కులతోనే ఉత్తీర్ణుడయ్యేవాడు. ఇరవై సంవత్సరాల తర్వాత అతన్ని కలిసి మాట్లాడినప్పుడు నేను ఆశ్చర్యంతో, సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. అతనిప్పుడు వేలకోట్ల రూపాయిలు సంపాదించగల్గాడు. వినోద్ అనే విద్యార్థి తల్లితండ్రులు ఏమీ చదువుకోలేదు. కాని వారికి చదువుల ప్రాధాన్యత తెలుసు. వినోద్ కు సరైన దుస్తులు వుండేవి కావు. మధ్య మధ్యలో పొలం పనులకు వెళుతుండేవాడు. అతని ఇప్పుడు ఒక సాఫ్ట్ వేరు కంపెనీ అధినేత. ఆ కంపెనీకి ఇరవై దేశాల్లో కార్యాలయాలున్నాయి. సురేష్ అతి పెద్ద కాంట్రాక్టరు. గ్రామంలో అనేక మందికి అతను ఉపాధి కల్పిస్తున్నాడు. అతను నన్ను తరచు కలుస్తుంటాడు. ఈ పాఠశాల కోసం ఏం చేయమంటారని ప్రశ్నిస్తుంటాడు.

"వీళ్ళు ముగ్గురు కాకుండా దేశంలో ప్రభుత్వ సంస్థలలో ప్రైవేటు రంగంలో ఉన్నత ఉద్యోగాలు నిర్వహిస్తున్న అనేక మంది ఇక్కడ వున్నారు. అలాగే అనేక వ్యాపారాలు నిర్వహిస్తున్న వారున్నారు. అలాగే ఈ గ్రామంలోనే స్థిరపడి వ్యవసాయంపై ఆధారపడి అనేక కష్టాలు పడుతున్న పూర్వ విద్యార్థులు కూడా ఇక్కడ వున్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిభా విశేషాలను, వ్యక్తిత్వాన్ని సునిశితంగా పరిశీలించే నాకు కూడా, వీరిలో ఎవరు జీవితంలో ఉన్నతంగా ఎదగగలరన్నది తెలియదు. చదువులో కనపరిచే ప్రతిభ వేరు, ఉన్నత స్థితికి చేరుకోవడానికి దోహదపడే అంశాలు వేరు. ఈ అంశాలు ఏమిటన్నది నాకు కూడా తెలియదు. కాని వాటిని ఆకళింపు చేసుకొని జీవితంలో ఉన్నతంగా ఎదిగే నా పూర్వ విద్యార్థులను చూసి గర్వంతో సంతోషంతో పొంగిపోతుంటాను."

అతికొద్దికాలంలో వేలకోట్ల ఆస్తి సంపాదించిన చైతన్య తన అనుభవాలను ఇలా వివరించాడు. "జీవితానికి పునాదిగా పేర్కొనదగిన ఈ పాఠశాలలో చదువుకొనే రోజులలో ఉపాధ్యాయులంతా ఒకే విషయం చెప్పేవారు. మీరు బాగా చదువుకుంటే మీకు పెద్ద ఉద్యోగం వస్తుందని నూరిపోసేవారు. నాకు చిన్నతనం నుండి ఉద్యోగం చేయాలన్న ఆసక్తిలేదు. ఏం చేయాలో కూడా తెలియదు. మన ఊరి నుండి పట్టణానికి వెళ్ళేచోట ఆ పట్టణాన్ని అనుకొని కుడివైపు దెయ్యాలదిబ్బ అని వుండేది. అక్కడ పెద్దగా మొక్కలు, చెట్లు ఉండేవి. అక్కడ అత్యంత విషసర్పాలు ఉంటాయని, దెయ్యాలు ఉంటాయని అందరు భయపడుతూ దాని జోలికి వెళ్ళేవారు కాదు. నేను కాలేజీలో చదివే రోజుల్లో ముగ్గురు మిత్రులను తీసుకొని అక్కడికి వెళ్ళాను. అక్కడ పాములు లేవు, దెయ్యాలూ లేవు. కాని నడవటానికి వీల్లేకుండా ముళ్ళపొదలున్నాయి. అందరూ వ్యతిరేకించినా మన ఊళ్ళోవున్న కొద్దిపాటి పొలాన్ని అమ్మివేసి ఆ దెయ్యాలదిబ్బను కొనడానికి సిద్ధపడ్డాను. అందరూ వ్యతిరేకించారు. శాపనార్థాలు పెట్టారు. నేను వెనుతిరగలేదు. అతితక్కువ ధరకు దానిని కొన్నాను. చేతిలో డబ్బులేమీ మిగల్లేదు. అక్కడ వున్న చెట్లన్నింటిని కొట్టించి వేసి కలప అమ్మితే అనుకోనంత అధికమొత్తం వచ్చింది. ఆ దెయ్యాల దిబ్బను చదును చేయించి అక్కడ అపార్టుమెంట్లు కట్టించాను. అతి తక్కువ ధరకు, అన్ని సౌకర్యాలతో అపార్టుమెంట్లు కట్టించడం ప్రారంభించాను. అప్పటి నుండి ఇక వెనుతిరిగి చూడలేదు. అతికీలక ప్రాంతాల్లో స్థలాలు వున్నవారు అపార్టుమెంట్లు కట్టమని నా వెనకాల పడుతున్నారు. బ్యాంకులు ఋణాలిస్తున్నాయి. అపార్టుమెంట్లు కొనదలచినవారు ముందుగా అడ్వాన్సులు ఇస్తున్నారు. అపార్టుమెంట్లు కొనేవారు ఎలా ఆలోచిస్తారానే దృక్కోణం నుండి నేనూ ఆలోచించడం వల్లన పోటీలో నేను అగ్రగామిగా నిలవడమే కాకుండా విపరీతంగా లాభాలు వచ్చిపడసాగాయి," అని తన విజయగాథను వివరించాడు.

"ఇంజనీరింగ్ పూర్తిచేయ్యగానే నాకు ఒక సాఫ్ట్ వేరు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఒక సంవత్సరంలోగానే మరొకంపెనీకి మారాను. కొన్ని నెలల్లోనే మరో కంపెనీలో జేరాను. ఏ ఉద్యోగంలోనూ స్థిరంగా వుండవని నా మిత్రులందరూ ఎగతాళి చేసే వారు. ఆయా కంపెనీల్లో ఉన్న మెరికల్లాంటి యువకులతో ఒక సమావేశాన్ని నిర్వహించి స్వంతంగా ఒక కంపెనీ పెట్టాలని నిర్ణయించాను. ఒక నెల రోజుల్లోనే అనేక ఆర్డర్లు వచ్చిపడ్డాయి. ఇక వెను తిరిగి చూడలేదు. మా కంపెనీ విస్తరించుకుంటూ పోయాము. అనేక దేశాల్లో దాని శాఖలు నెలకొల్పాము," అని వినోద్ తన అనుభవాన్ని వివరించాడు.

"పెద్దపెద్ద కాంట్రాక్టర్లు చేయ్యకుండా వదిలివేసిన పనులను చేయడం ద్వారా నేను కాంట్రాక్ట్ పనులు మొదలుపెట్టాను. వాళ్ళు ఎందుకు వదిలివేశారు? దానిలో క్లిష్టత ఎక్కడ వుంది? దానికి పరిష్కారమేమిటి? అని ఆలోచించేవాడిని. నాకు తెలియని చోట ఇతర నిపుణుల సలహాలు కోరేవాడిని. ఎప్పుడైతే అతి క్లిష్టమైన పనులను పూర్తిచేయగలనన్న విశ్వాసం నాపై కలిగిందో, ఆ వెంటనే ప్రభుత్వంలో వున్న ఇంజనీర్లు నాకు రకరకాల పనులు అప్పగించడం మొదలుపెట్టారు. దాంతో ఎంతో లాభం వస్తుందని కాకుండా, దానిలోని క్లిష్టతను ఎలా పరిష్కరించాలి? తక్కువ కాలంలో ఎలా పూర్తిచేయాలని ఆలోచించేవాడిని, అందువల్లనే నేను చేయగలిగిన వాటికంటే అధికంగా కాంట్రాక్టులు వచ్చి పడుతుంటాయి," అని సురేష్ తన అనుభవాలను వివరించాడు. ఈ ముగ్గురి విజయగాథలు తేల్చి చెబుతున్న విషయం ఒక్కటే! చుట్టూ వున్న వారికంటే భిన్నంగా ఆలోచించడం, ప్రతికూల ఆలోచనలను దరికి చేరనీయకపోవడం, సరైన లక్ష్యాలను ఎంచుకోవడం వీరి విజయాలకు మూలకారణాలు.

– సి నరసింహారావు
మనోవైజ్ఞానిక విశ్లేషకులు

కవనవనం

# నా మట్టి గుర్తొచ్చినపుడల్లా


ఈ దేహం రూపాంతరం చెందుతోంది
ప్రాంతాలు దాటి
మట్టి గుండెను చీల్చుకుని
వేరొక చోట పుష్పించటం
అనివార్యమైంది .

ప్రేమపంచిన నా ఊరు
కళ్ళ ముందు నడుస్తుంటే
నగరంలో
ఒంటరి రాగం ఊపిరి పోసుకుంటుంది
కాసేపు అలా రెప్పలు తెరిస్తే చాలు
కళ్ళ వాకిలి ముందు
పరుగులతో అలసిపోతున్న
దేహాలు సుడులు తిరుగుతుంటాయి

ఆశల ప్రపంచంలో
నిదురపోని
మనుషుల ప్రవాహాలుంటాయ్
పలకరింపులు
వాట్సప్‌ల గానో ఫేస్‌బుక్‌ల గానో
సమయంలేని సందర్భాలవుతాయ్
కొలమానాలు ఆర్థిక భాషలే గానీ
అంతరంగాల్లో గూడుకట్టుకున్న
కథలను వినిపించలేమ్

దూరాలు కదిలినా
నాలో ప్రవహిస్తున్న
నా మట్టి గుర్తొచ్చినపుడల్లా
అనుబంధాల దొంతరల్లో
ఈ దేహం కన్నీళ్ళై ప్రవహిస్తుంది
ఆపుకోలేని భావాలు దుఃఖ తరంగాలై
ఘోషిస్తాయ్.

– గవిడి శ్రీనివాస్



## నా కళ్ళ ముందే!

నా కళ్ళ ముందే నా
సంతోషం
బాధల సముద్రాన్ని ఈదుతోంది
సహనం నా ఊపిరి
అని అబద్ధాల గుడిలో
పూజిస్తున్నా
రెక్కలులేని పక్షిని కాను నేను!
వదిలిన ఆ అడుగులు మళ్ళీ
తొక్కుతున్నాను
అసలు హృదయానికి దాచుకొనే
చోటులేదు
అన్ని బంధాల్నుంచీ విడుదల
విడుదల –
కొత్త ఆశలను ఆవిష్కరించే
సమయం
వొదిలిన ఆశలే కొత్త గుర్తుకి
విభూతై
ముందుకు మళ్ళించా –
రాయని కవిత కవిత ఎలా కాదో
ఏదికూడా నేను రాయలేదు !!

– చెళ్ళపిళ్ళ వెంకట సురేశ్ బాబు
ఫిలడెల్ఫియా



# కష్టం ముసిరే వేళ...

కష్టాలు కట్ట కట్టుకుని వస్తాయి. మబ్బులు ముసిరే వేళ ఆకాశం దిగులు పడ్డట్టు కనిపిస్తుంది. గాలి కూడా తోడైతే, పెనుగాలులు వీస్తుంటే కొంత భయమూ కలుగుతుంది. చినుకుగా వర్షం ప్రారంభమైతే చిరు చీకట్లో వెలుగు దారాలు క్రిందకు దిగుతున్న వైనం ఆనందం కలిగిస్తుంది. క్రమక్రమంగా వర్షం శబ్దిస్తూ శృతిలయాతీతంగా భీతిని గొలుపుతుంది. ఉధృతి నెమ్మదించి, గాలులు సన్నగిల్లి, వర్షం శమిస్తున్నప్పుడు, మనసు నిస్తంద్రమంద్రంగా హాయిని అనుభవిస్తుంది. భయమూ అంతే! భయం పుట్టగానే అది తీవ్రంగా, గాఢంగా, చిక్కగా ఉంటుంది. క్షణాలుగా కాలం నడుస్తున్నప్పుడు, భయం పలచనౌతుంది. మనిషి జీవితంలో ఏర్పడే ఈ సందర్భాలు ఎన్నో! ఎన్నెన్నో! ఎప్పటికప్పుడే ఒక వింత అనుభవం! కావలసింది కాస్త నిగ్రహం, మరికొంత ఓర్పు, చిగురంత ధైర్యం; చిన్ని ఆశావహ వైఖరి!

ఒక హరిణం నిండు గర్భిణి. కొద్ది నిమిషాలలో బుల్లి లేడిని ప్రసవించ బోతున్నది. తన సమీపంలోనే ప్రవహిస్తున్న నదిని, దానికి దగ్గరలోనే ఒక చేను, ఎంతో భద్రతను, రక్షణను తోపిస్తున్న అభయ ప్రదేశంగా ఉన్నయ్. తల్లి కాబోతున్న లేడి మనసంతా తాను ప్రసవించబోతున్న పిల్ల లేడి గురించే!

ఇంతలో ప్రసవ క్రమం ప్రారంభమైంది.

అదే సమయంలో ఆకాశం ముసురేసింది. మేఘాలు వేగంగా కదులుతున్నయ్. మెరుపులు ఆగకుండా గాలిలో సంతకాలు చేస్తున్నయ్. అవి భయపెడుతున్నయ్. లేడి తన కుడి ఎడమల దిక్కు తోచక దృష్టి సారించింది. దగ్గరలో ఉన్న చేలో నుంచి మంటలు పొడసూపి, తీవ్రమౌతున్నయ్. లేడికి తోచటం లేదు. ఇంతలో మరొక ప్రమాదకర దృశ్యం కంటిని తాకింది. వేటగాడు ఆశగా ఆబగా తనవైపు విల్లు ఎక్కుపెట్టి, సిద్ధంగా ఉన్నాడు. ఆ క్షణంలోనే ఆకలిగొన్న సింహం తన ముందు వెనుకలను గమనించుకుంటూ సమయం కోసం కాచుకుని ఉంది.

దిక్కుతోచని స్థితి. ప్రసవ వేదన తీవ్రమౌతున్నది. చుట్టూ భయానక పరిస్థితి. దిక్కులేదేమో, దారి దొరకదేమోనన్న భీతి! అసలే భీతహరిణి! ఏమౌతుంది?

లేడికి బతికి బట్టగట్టే అవకాశముందా?

ప్రసవ క్రీడ సక్రమంగా సాగేనా?

మాటలు చుట్టుముట్టి, తనను మట్టు పెడతయ్యా?

వేటగాడి బాణాహుతికి మరణం తప్పదా?

ఆకలిగొన్న సింహం తనను కబళిస్తుందా?

దారంతా మూసుకున్న పరిస్థితి.

ఆగని వర్షం, ఆరని మంటలు, ప్రవహిస్తున్న నది, వేటగాడు, సింహం... లేడి ఏం చేయాలి?

ఏం చెయ్యగలదు!

నిర్ణయించుకుంది. తను ముందు ప్రసవించాలి. మరొక జీవికి పురుడు పోయాలి. అంతే! మరొక ఆలోచనకు తావీయక, మనసును స్థిమిత పరుచుకుంది.

ఆ క్షణమే లేడికి ప్రధానం!

ఇంతలో ఏం జరిగింది? ఆశ్చర్యం!

ఆకాశంలో మెరుపులు వేటగాడి కళ్ళను కమ్మి, క్షణకాలం వాడి చూపుని అరికట్టినయ్, వాడు వదిలిన బాణం గురి తప్పి సింహాన్ని తాకింది.

తీవ్రమైన వర్షం మంటలను ఆర్పింది.

ఆ క్షణమే లేడి బుల్లిలేడిని ప్రసవించింది. అంతా సుఖాంతం!

దెబ్బ తిన్న సింహం వేటగాణ్ణి చంపి ఈడ్చుకెళ్ళింది.

మన జీవితమూ అంతే!

ఒక్కొక్కసారి పరస్పర విరుద్ధమైన ఆలోచనలు, నిర్వేదం, భయం, అనిశ్చితి... వంటి ఎన్నో, ప్రతికూల భావాలు చుట్టుముడతయ్. మనల్ని ఓడిస్తయ్. మనల్ని మరణం వైపు నడిపిస్తయ్. ఆ క్షణాన్ని ఆపాలి!

ఆ లేడికి వేరే దారి లేదు. తాను ఏ మాత్రం పారిపోయే ప్రయత్నం చేసినా వేటగాడి వేటు ఆగదు. సింహం తన వేట ఆపదు. ఒక వైపు తరుముకొస్తున్న మంటలలో కాలటం తథ్యం, మరొక వైపు ప్రవహిస్తున్న నదిలో దూకితే కొట్టుకు పోవటం తప్పదు. తాను మనస్సును, ఆలోచనలను, ఆందోళనను నిగ్రహించుకుని, నిలకడ చెందింది. ప్రకృతీ సహకరించింది. సర్వం శుభమైంది. మనమూ జీవితాన్ని, తథ్య-మిథ్యల మధ్య ఉన్న విరామకాలంగా జీవించాలి. తత్తరపాటు లేని సత్వర నిర్ణయం తీసుకోవాలి.

ఎంత కాలం వర్షం కురుస్తుంది, మెరుపులు మెరుస్తయ్?

అంతా తాత్కాలికమే?

ముసిరిన కష్టాలను, మెరిసిన మెరుపుల వెలుగులుగా చూడాలి! అన్నీ సర్దుకుంటయ్.

నిజానికి జీవితమే పెద్ద సర్దుబాటు! దిద్దుబాటు అనివార్యం!!

- వి.యస్.ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

ఓషధీ ప్రస్థానం

# ఆస్వాదించినవారికి ఆస్వాదించినంత!







అడవుల్లో చిక్కుకున్నవారు ఆయా ప్రదేశాలలో పెరుగుతున్న మొక్కల్లో ఏది తినవచ్చో, ఏది తినకూడదో తెలిస్తే కొన్నాళ్ళపాటు ఎలాగోలాగ బతికేయవచ్చు. వేలాది మొక్కల పంచాంగాలు రుచి చూసిన అనుభవంతో ఈ వ్యాసాల ద్వారా ఈ దిశగా కొంత గిరిజన విజ్ఞానాన్ని పరిచయం చేసాను. మరికొంత ఇదిగో. ఆస్వాదించినవారికి ఆస్వాదించినంత!

పెను జిట్టు తీగ (మార్స్డెనియా టెనసిసిమా): లేత ఆకు కూర వండుకుని తింటారు.

చిన్ని తుప్ప (మెటెనస్ ఇమార్జినేటా): పండ్లు తింటారు.

బొనొ గులాబి (మెలస్టోమా మలబాథ్రికం): పండ్లు తింటారు.

వుప్ప చెట్టు/నాగకేసరం చెట్టు (మెసువా ఫెర్రా): పండ్లు తింటారు.

కొరాడియా కోళి ( మేనా స్పైనోజా): లేత ఆకు కూర చేసుకుంటారు. పండ్లు తింటారు.

కూన మొక్క (పోలిగోనం గ్లేబ్రం– గులాబి రంగు పూలమొక్క; పోలిగోనం బార్బేటం– తెల్ల పూల మొక్క): లేత ఆకు కూర వండుకుంటారు.

వరగోగు చెట్టు (సాల్వడారా పెర్సికా): పండ్లు తింటారు.

రక్ష మాను (జాంథోజైలం రచ్ఛా): లేత ఆకులు కూర వండుకుంటారు. కాయలు కూరల్లో మసాలా ద్రవ్యంగా వాడతారు.

బొక్కడి చెట్టు (ట్రెమా ఓరియంటాలిస్): పండ్లు తింటారు.

బరామసీ సాగ్/చిలక తోటకూర (అమరాంథస్ విరిడిస్): ఆకు కూర వండుకుంటారు.

కుందేటికామ (కారల్లమా అటెన్యుయేటా ఢ కారల్లమా అడ్సెండెన్స్): కాడ(కొమ్మ)లను పచ్చడి చేసుకు తింటారు.

తెల్ల పొలికి (గివటియా రాట్లరిఫార్మిస్): కాయలోని పప్పు తింటారు. దీని కర్రతో కొండపల్లి బొమ్మలు చెక్కుతారు.

బరపుటం (ఇండిగోఫిరా గ్లాండ్యులోజా): గింజలను పిండి చేసి రొట్టెలు/అట్లు చేసుకు తింటారు.

కొర్ర సేద తీగ (డయోస్కోరియా బల్బిఫెరా): దీని దుంపలు చక్రాల్లా తరిగి, చెన్నంగి చెట్టు (లాగర్స్ట్రోమియా పార్విఫ్లోరా) ఆకులతోబాటు ఉడకబెట్టి తింటారు. చెన్నంగి ఆకులు దుంపల్లోని దురద గుణాన్ని పోగొడతాయి.

కాసర తీగ (మొమోర్డికా ట్యూబరజా): లేత కాయ కూర వండుకుంటారు. ఊరగాయ కూడ పెట్టుకుని తినవచ్చు.

గంజీకాందా (కర్క్యుమా సూడోమోంటానా): మొక్క ప్రధాన వేరు దుంపలతో 'పాల గుండ' చేసుకుని పాయసం కాచుకుంటారు. వేరు చివరలో వచ్చే గడ్డలను కూడ తినవచ్చు.

కలెకాయ (కరిసా స్పైనారం): ఇది వాక్కాయ (కరిసా కరందస్) కుటుంబానికి చెందినది. కాయల రుచి కూడ వాక్కాయ రుచే. వాక్కాయ బదులుగా వాడుకుంటారు.

తీగ వాక్కాయ (కరిసా ఇనర్మిస్): ఇది చాలా పొడవుగా– 5–10 మీటర్లు అల్లుకుపోయే, వాక్కాయ కుటుంబానికి చెందిన తీగ. ఒక్కొక్క పండు చిన్న నిమ్మకాయ పరిమాణంలో, గుండ్రంగా, వాక్కాయ రుచీ, రంగులతో ఉంటుంది. గుజ్జు ఎక్కువ. ఇది ఇంతవరకు మన పండ్ల వ్యాపారుల కండ్లలో పడకపోవడం శోచనీయం! వెంటనే దీనిని ద్రాక్ష తోటల మాదిరి ఎక్కువ వైశాల్యంలో ప్రవేశపెట్టవలసి ఉంది. అటెన్షన్ యూనివర్సిటీస్ ఆఫ్ అగ్రికల్చర్!

– కొప్పుల హేమాద్రి

సైన్సు సంగతులు

# వైద్య చికిత్సలో కొత్త ఆవిష్కరణలు



గాయపడ్డ శరీర భాగాలను కొన్ని సందర్భాలలో శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సి వస్తుంది. ప్రమాదాల వల్లనో, మధుమేహం ముదరబెట్టడం వల్లనో అవయవాలు ఆపరేట్ చేయవలసిన అవసరం లేకుండా ప్రాణ వాయువుతో వాటికి స్వస్థతను చేకూర్చేందుకు 'హైపర్ బారిక్ ఆక్సిజన్ చాంబర్'లో చికిత్స చేసే పద్ధతిని సింగపూర్‌కు చెందిన వైద్య పరిశోధకులు రూపొందించారు. ఈ చాంబర్‌లో అధిక పీడనంలో ఆక్సిజన్ ఉంటుంది. రోగిని ఇందులో ఉంచేసరికి అతని గాయపడిన శరీర భాగాల్లోకి ఆక్సిజన్ ప్రవేశించి వాటికి స్వస్థతను అందించడం ఈ చికిత్సలోని ప్రత్యేకత. ఇప్పుడు దీనిని మరింత అభివృద్ధి పరచారు.

పారదర్శకమైన గాజు చాంబర్‌లో కంప్రెస్డ్ ఆక్సిజన్ గల శిరస్త్రాణాలను వ్యాధిగ్రస్తులకు అమరుస్తారు. రెండు గంటలపాటు స్వచ్ఛమైన ప్రాణవాయువును వారి శరీరాల్లోని ప్రతికరణానికి సరఫరా అయ్యేలా చూస్తారు. ముప్పయినుండి నలభయి తడవలు ఇలా చేయాల్సి వస్తుంది. ఆక్సిజన్ అందించడంతో పాటు వ్యాధిగ్రస్తుల గాయాలను పరిశుభ్రం చేస్తూ వారికి పోషక పదార్థాలను అందిస్తారు. ఈ వైద్య చికిత్స గాయాలకే గాక కార్బన్ మోనాక్సైడ్ పాయిజనింగ్, రేడియేషన్ వల్ల దెబ్బతిన్న ఎముకలకు కూడా ఈ చికిత్స చేయవచ్చు.

మొత్తం పన్నెండు రకాల ఆరోగ్య సమస్యలకు ఇది వైద్య చికిత్సగా ఉపయోగపడుతోందని ఆ వైద్య పరిశోధకులు ప్రకటిస్తున్నారు.

## వెన్నుపూస చికిత్సకు కొత్తపద్ధతి

దెబ్బతిన్న వెన్నుపూసను బాగు చేసేందుకు సరికొత్త చికిత్సా పద్ధతిని అమెరికన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ పద్ధతిలో రెండు ప్లాస్టిక్ శ్లాబ్స్‌ను ఒకదాని మీద ఒకటి పెట్టి (శాండ్‌విచ్ మాదిరిగా) న్యూరాన్లను వృద్ధి చేస్తారు. రెండు శ్లాబ్స్‌ను మెల్లిగా దూరం జరిపేకొద్ది న్యూరాన్లను కలిపి ఉంచే యాక్సాన్లు సాగుతాయి.

పదిరోజుల తరువాత అర అంగుళం పొడవు వున్న మందపాటి న్యూరాన్లు ఏర్పడతాయి. వెన్నుపూస దెబ్బతిన్నప్పుడు చికిత్స కోసం వీటిని ఉపయోగిస్తారు. దెబ్బతిన్న భాగంలో ఏర్పడిన ఖాళీలను ఇవి పూరిస్తాయి. దానితో మళ్లీ న్యూరాన్ల మధ్య సంకేత ప్రసారం జరుగుతుంది. జంతువులలో ఈ పద్ధతి ద్వారా వెన్నుపూసకు చికిత్స చేయడంలో పరిశోధకులు సఫలమయ్యారు. సాధారణంగా యాక్సన్లు సాగినప్పుడు దెబ్బతినే ప్రమాదం ఉంది. పరిశోధకులు రూపొందించిన పద్ధతిలో లోపరహితమైన న్యూరాన్లు వృద్ధి చెందుతాయి.. ప్లాస్టిక్ శ్లాబ్స్‌ను కదిలించేందుకు పరిశోధకులు ప్రత్యేక మోటారును తయారు చేశారు. ప్రతి అయిదు నిముషాలకు శ్లాబ్స్ 3.5 మైక్రోమీటర్లు కదులుతాయి. పదిరోజుల్లో యాక్సిన్ అర అంగుళం పెరుగుతుంది. ఈ న్యూరాన్లను దెబ్బతిన్న వెన్నుపూసలోకి ప్రవేశ పెట్టగానే అవి చాలా వేగంగా అల్లుకుపోతాయి.

## వ్యాక్సీన్

వెన్నుముక గాయానికి గురైనప్పుడు, దెబ్బతిన్న భాగంనుంచి అది పరిసరాల్లోని నాడీకణాలకు, ఫైబర్లకు వ్యాపించి పక్షవాతానికి దారి తీస్తుంది. ఒక వైపు గాయానికి చికిత్స చేస్తూ ఉండగా, మరో వైపు దాని దుష్ప్రభావం చాపకింద నీరులా ఇతర భాగాలకు విస్తరించడం వైద్య పరిశోధకులకు సవాల్‌గా పరిణమించింది.

ఇజ్రాయిల్‌లోని వైద్య పరిశోధకులు వెన్నెముకపై విస్తృత పరిశోధనలు నిర్వహించారు. అందులో భాగంగా తాము రూపొందించిన వ్యాక్సిన్ ఎలుకలపై సత్ఫలితాలు ఇచ్చిందని వెల్లడించారు. వెన్నుముక గాయానికి గురైన వెంటనే ఈ వ్యాక్సీన్ ఇవ్వడం ద్వారా శరీరంలోని వ్యాధి నిరోధక శక్తి వృద్ధి చెందుతుందని, గాయం వలన ఏర్పడిన ప్రకంపనలు వెన్నుముకను ఆనుకుని వున్న ప్రాంతాలకు వ్యాపించకుండా అరికట్టడం వీలవుతుందని పరిశోధకులు గుర్తించారు.

వెన్నుముక దెబ్బతిన్న మూషికాలకు ఈ వ్యాక్సీన్ ఇవ్వగానే అవి ఆ బాధను తట్టుకుని నడవగలిగాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పాక్షిక గాయాల్లో ఇది శక్తి మంతంగా పనిచేస్తుందని వివరిస్తున్నారు.

## వేసక్టమీ

కత్తిగాటు అవసరం లేని సంతాన నిరోధక శస్త్రచికిత్స త్వరలో అందుబాటులోకి రానుంది. కుటుంబ నియంత్రణ కోసం స్త్రీలకు చేసే స్టెరిలైజేషన్ కన్నా ఇది సురక్షితమైనదని అమెరికన్ పరిశోధకులు ప్రకటిస్తున్నారు.

ప్రస్తుతం పురుషులకు నిర్వహించే వేసక్టమీలో వీర్యనాళాలను కత్తిరించి వాటి కొనలను ముడివేసే పద్ధతి అవలంబిస్తున్నారు. అయితే కత్తిగాటుతో పని లేకుండా ఈ ప్రక్రియను అల్ట్రాసౌండ్ సహాయంతో శరీరం వెలుపలి నుంచి నిర్వహించే పద్ధతిని ఈ పరిశోధకులు రూపొందించారు.

దీనిలో శస్త్ర వైద్యుడి అవసరం ఉండదు. నొప్పి, ఇన్‌ఫెక్షన్ వంటి ఇబ్బందులు ఎదురుకావు. తొలి విడతగా కుక్కలపై నిర్వహించిన అల్ట్రాసౌండ్ పరీక్షలు విజయవంతమయ్యాయి. జంతువులపై మరిన్ని ప్రయోగాలను చేపట్టిన అనంతరం వేసక్టమీకి ప్రత్యామ్నాయంగా ఈ చికిత్సను మనుషులపై నిర్వహిస్తామంటున్నారు పరిశోధకులు.

– సి.వి సర్వేశ్వర శర్మ


# పృధ్వీ మూలరాజు కొండవీటి (మూడో) రాగిరేకు శాసనం

అప్పటి పురావస్తు శాఖ సంచాలకులు డా.వి.వి కృష్ణశాస్త్రి 1987 లో గుంటూరు జిల్లా, కొండవీడు నివాసి వెంకట్రాం నుంచి మూడు గుత్తుల రాగిరేకు శాసనాలను సేకరించారు. ఈ శాసనాలను పరిశీలించి 'త్రీ గ్రాంట్స్ ఆఫ్ పృధ్వీమూల రాజ ఫ్రం కొండవీడు' అన్న పుస్తకాన్ని, పురావస్తు శాఖ, ఏపి గ్రాఫికల్ సీరీస్–20 గా హైదరాబాదు నుంచి 1992 లో ప్రచురించారు.

ఎప్పుడూ విజయాన్ని చేకూర్చే నందివర్ధన నగరం నుంచి విడుదలైన ఈ శాసనం (క్రీ.శ ఆవి శతాబ్దికి చెందిన) పృధ్వీ శ్రీమూల రాజు, ఆయన తండ్రి ప్రభాకర మహారాజుల గుణ గుణాలను పేర్కొంటుంది. పృధ్వీ శ్రీమూలరాజు ఎల్లప్పుడు ప్రజలను రక్షిస్తూ పుణ్యాన్ని సంపాదించుకొన్నాడని, మునుపటి రాజులు నిలబెట్టిన ధర్మాన్ని అతిక్రమించని వాడనీ, అనేక యుద్ధాల్లో జయించిన వాడనీ, ప్రజలకు చంద్రునిలా ఆహ్లాదాన్ని కలిగించే వాడనీ, సుద్రునిలా గంభీరుడనీ, మూడు సంధ్యల్లోనూ దేవతలను ఆరాధించేవాడని, గోవులు, భూమి, బంగారం, కన్యలను దానం చేయటం ద్వారా మనసును, శరీరాన్ని సఫలీకృతం గావించుకొన్నాడనీ, బ్రాహ్మణ్యుడనీ, పరమ మహేశ్వరుడనీ కీర్తించబడినాడు.

గుణపాశపురంలోని కొండకు తూర్పుగా అతను నిర్మించిన ప్రపంచ ప్రఖ్యాత మహా విహారంలోని 18 నికాయాలకు చెందిన 14 ఆర్యభిక్షు సంఘాల అవసరాలైన చీవరాలు, భిక్ష, పడకపంచాలు, కుర్చీలు సమకూర్చటానికి తాళపాక విషయంలోని అట్టలువుటు అనే గ్రామాన్ని సర్వభాధా పరిహారంగా దానం చేసి మహా విహారం బాగోగులు చూచుకోవటానికి నాగార్జున కొండకు చెందిన ఒక బౌద్ధ శిల్పిని నియమించినట్లు తెలిపే ఈ శాసనాన్నిపృధ్వీ శ్రీ మూలుడు తాను సింహాసనమెక్కిన 40 వ సంవత్సరంలో విడుదల చేశాడని ఉంది. క్రీ.శ 6 వ శతాబ్ది చివర, 7వ శతాబ్ది ప్రారంభ కాలానికి చెందిన ఈ శాసనంలో న, ద, య, గ, యవత్తులు, తెలుగు అక్షరాలకు చాలా దగ్గరగా ఉండటం, కారకుండ (కారుకొండ) వేల్గొండ (వేల్పుగొండ), పల్లవెంచ (పాల్వంచ), తాలుపాక (తాటిపాక) మొదలైన తెలుగు ఊర్ల పేర్లు యధాతథంగా, సంస్కృత శాసనంలో ఉండటం గమనించాల్సిన విషయం.

**నాలుగో రేకు–మొదటి వైపు**




21. బలయోషిత్త పశ్విన: యాగతి స్వాభవత్తస్యహరతశ్చాసనాంకితం

22. తామేవ రక్షతో యత్నాన్నిబోధ కృతిన: ఫలం నేక కల్పి సహస్రాణి దివి

23. దేవైస్సహ దివ్యతి! భూమి దానా త్పరందా నన్ను భూతా (తో)న్న భవిష్యతి

24. తస్యైవ హరణాన్నా పంన భూతా(తో)న్న భవిష్యతి షష్టిం వర్షసహ

**నాలుగో రేకు – రెండోవైపు**




25. స్రాణి స్వర్గే తిష్టితి భూమిద: ఆప్తే చానుమంతాచ తాన్యేవ

26. నరకే వసీత్ స్వదత్తం పరదత్తం వాయోహరేత వసుంధరా

27. స విష్ఠాయాం క్రిమిర్భూత్వా పితృభిసహపచ్యతే బహభి

28. ర్వసుధా దత్తా బహభిశానుపాలితా యస్యయస్య యదా భూమి

**ఐదో రేకు**



29. తస్య తస్య తదా ఫలం ప్రవర్ధమాన విజయ రాజ్య సంవత్సరే త్ర చతుర్వింశతి వర్తమానే ఫాల్గుణ మాస శుక్లపక్షస్య తృతీయాయాం వర్తమానాయాం శాసనం అంకితం చంద్రార్కో దధ్ధయో యావత్ యావచ్ఛేయం వసుంధరా ఆజ్ఞా శ్రీమూలరాజ్య తావత్పాతు మహిం ఇమాం.

– డా ఈమని శివనాగిరెడ్డి – స్థపతి

# వెండితెర వెనుక

## బాపు మెచ్చిన డైలాగులు



చిత్రరంగంలో ఉన్న సుగుణం ఏమిటంటే, ఏ విభాగంలోనైనా కొత్తదనానికి కాస్త ప్రజాదరణ లభించిందంటే, ఇక అటువంటి ప్రయోగాలకు తిరుగే ఉండదు. ఉదాహరణకు ప్రముఖ రచయిత ముళ్లపూడి వెంకటరమణ 'పడికట్టు' సంభాషణలకు భిన్నంగా – రచనలో ప్రయోగాలు చేస్తూ ఉండేవారు. అవి ఎలాంటివంటే– "మొగుడూ పెళ్లాం సమానం...కానీ మొగుడు కాస్త ఎక్కువ సమానం..," "అసూయ అసలైన ప్రేమకు ధర్మామీటరు..." 'వాడికి డబ్బు చేసింది,' 'ఆమ్యామ్యా,' 'తుత్తి' వంటి ఉదాహరణలు ఎన్నయినా చెప్పవచ్చును. అలాగే 'ముత్యాలముగ్గు' లో రావు గోపాలరావు డైలాగులు– "మడిసన్నాక కూసింత కలాపోసనుండాల...ఊరికే తిని తొంగుంటే మడిసికీ గొడ్డుకీ తేడా ఏటుంటాది," "ఆకాశంలో ఏదో మర్డరు జరిగినట్టుంది కదూ" వంటివి చాలాఉన్నాయి. ఒక సందర్భంలో దర్శకులు బాపుగారు కూడా ముళ్లపూడి డైలాగుల్లో తమకు బాగా నచ్చినవాటిని కొన్ని చెప్పమంటే, మచ్చుకి రెండు సినిమాలలోనివి ప్రస్తావించారు. ఒకటి 'స్నేహం' చిత్రంలో రావుగోపాలరావు, హలం మధ్య సంభాషణ– హలం విసుగ్గా "ఆబోతోడా...నీకూ నాకూ ఏట్రా సంబంధం? " అంటే, రావుగోపాలరావు "నీ మొగుడొదిలేశాడు...నా పెళ్లాం లేచిపోయింది. అది సాల్దేటి" అంటాడు. అలాగే 'ముత్యాలముగ్గు'లో శోభనం నాడు భర్త (శ్రీధర్) భార్య (సంగీత)ను "ఇంతకుముందు నువ్వెరినైనా ప్రేమించావా? "అని అడుగుతాడు. అప్పుడామె– "ప్రేమంటే నాకు తెలియదు. కన్నెపిల్ల మనసు అద్దంలాంటిది. చాలామంది కనిపిస్తుంటారు. పెళ్లవగానే అది మొగుడిబొమ్మతో పటంగా మారిపోతుందని మా అమ్మమ్మ అనేది " అంటుంది. ఇవన్నీ కొత్త తరహా డైలాగులే!.

## తొలి కథానాయిక!

ప్రపథమ భారతీయ మూకీ కథా చిత్రం 'రాజాహరిశ్చంద్ర' తీయడానికి దాదాఫాల్కే ఎన్ని కష్టాలు పడ్డారో సినిమా అభిమానులకు తెలిసిన విషయమే. ఈ సినిమాలో హరిశ్చంద్రుడి భార్య చంద్రమతి పాత్ర ధరించడానికి అప్పట్లో మహిళలు ఎవరూ ముందుకు రాకపోవడం ముఖ్య సమస్యగా మారింది. ఆ రోజుల్లో రంగస్థలం మీద కూడా స్త్రీ పాత్రలను పురుషులే ధరించేవారు. ఐతే, ఫాల్కే తన చిత్రంలో స్త్రీ చేతే చంద్రమతి పాత్రధారణ చేయించాలనే పట్టుదలతో ఎన్నో ప్రయత్నాలు చేశారు. చివరికి వేశ్యావాటికలకు కూడా వెళ్లి అడిగితే, వాళ్లు "మాకు యాక్టింగ్ రాదు..పొమ్మని " కసిరి పంపించారు. ఇక గత్యంతరం లేక సాలుంకే అనే యువకుణ్ణి ఆ వేషం వేయమని మరీ మరీ బ్రతిమాలి అడిగితే, అతను అంగీకరించాడు. కానీ తీరా షూటింగ్ సమయంలో మీసాలు తీయాలంటే, అతను ఒప్పుకోకుండా లబోదిబోమన్నాడు. వాళ్ల సంప్రదాయం ప్రకారం – తండ్రి మరణిస్తేనే,




మీసాలు తీస్తారట. దాంతో ఫాల్కేగారు మళ్లీ కాళ్లా వేళ్లా పడి మీసాలు తీయించి, ఆ పాత్రలో నటింపజేయాల్సి వచ్చింది. ఇదండీ భారతీయ తొలి మూకీ చిత్రనాయిక కథ!

## స్టార్ అయిన తర్వాత నటనలో శిక్షణ!

'ఇష్టం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ఉత్తరాది నటి శ్రీయ – తెలుగు, తమిళంలోనే కాదు హిందీ చిత్రాల్లోనూ బాగా రాణిస్తోంది. విశేషం ఏమిటంటే, దాదాపు 20 చిత్రాల్లో నటించి పెద్ద 'స్టార్' అనిపించుకున్న ఆమె – ఆ మధ్య ముంబైలోని కిశోర్ నమిత్‌కపూర్ యాక్టింగ్ అకాడమిలో చేరింది.




తన నటన మరింత మెరుగుపడాలన్న ఉద్దేశ్యంతో! అప్పట్లో ఆమె క్లాస్‌మేట్–నేటి ప్రముఖ హీరో రామ్ చరణ్ తేజ. శ్రీయ యాక్టింగ్ క్లాసులకు వెళ్లడం చూసిన ఆమె ఫ్రెండ్స్– "నువ్వు స్టార్ అయ్యావు కదా.. ఇక కొత్తగా నేర్చుకునేది ఏమిటి? " అని విస్మయంతో అడిగారు. అప్పుడామె చెప్పిన సమాధానం. "నటన అనేది ఓ అంతులేని కథ. ఎప్పుడూ నేర్చుకోడానికి ఎంతో కొంత మిగిలే ఉంటుంది. అందుకే హాలీవుడ్‌లో అగ్రతారలు సైతం – నటనలో కొత్త విషయాలు నేర్చుకోవడం కోసం, అప్పుడప్పుడు 'రిఫ్రెషర్' కోర్సులకు హాజరవుతూ ఉంటారు. అలాంటప్పుడు నేను యాక్టింగ్ అకాడమీలో చేరడం వింతేమీ కాదు!"

## భారీ చిత్రం 'చంద్రహారం' ఎందుకు 'ఫ్లాప్' అయింది?

ఒక పెద్ద సూపర్ హిట్ చిత్రాన్ని నిర్మించిన సంస్థ ఆ తర్వాత అంతకంటే భారీ చిత్రాన్ని తీస్తే, అది ఇదివరకటి చిత్రం కంటే గొప్ప హిట్ అవుతుందనే గ్యారంటీ లేదు. ఘోరపరాజయం పొందిన సందర్భాలు కొన్ని ఉన్నాయి ఉదాహరణకు 'షోలే' (హిందీ) అంతటి పెద్ద హిట్ చిత్రాన్ని అందించిన రమేశ్ సిప్పీ – ఆ తర్వాత అంతకంటే పెద్దతారాగణంతో 'షాన్' చిత్రం తీస్తే, అది 'సూపర్ ఫ్లాప్' అయింది!

'పాతాళభైరవి'వంటి విజయవంతమైన జానపద చిత్రాన్ని తీసిన విజయావారు ఆ తర్వాత తీసిన మరో భారీ జానపద చిత్రం 'చంద్రహారం'. కమలాకర కామేశ్వరరావు దర్శకుడుగా పరిచయమైన ఈ భారీ చిత్రంలో ఎన్టీఆర్ హీరో. ముఖ్యపాత్రలో ఎస్వీ



రంగారావు నటించారు. జూనియర్ శ్రీరంజని నాయికగా, సావిత్రి వ్యాంప్‌గా నటించారు. ఈ చిత్రం ఎవరూ ఊహించని విధంగా దారుణంగా 'ఫ్లాప్' అయింది. ఆ తర్వాత 'చంద్రహారం' గురించి నిర్మాతలలో ఒకరైన చక్రపాణి వ్యాఖ్యానిస్తూ "హీరో ఎప్పుడూ నిద్రపోతూ ఉంటే, ఆ సినిమా ఎలా హిట్ అవుతుంది?" అన్నారు. మరి ఆ విషయం స్క్రిప్టు దశలో తెలియరాలేదా? అన్నదే ఎవరికీ కొరుకుడుపడని విషయం!

– బి.కె. ఈశ్వర్




వేష భాషలేకాదు, తిండి కూడా ప్రాంతాన్ని ప్రతిబింబింపచేస్తుంది. అంతేకాదు, నడక, శరీర భాషలను నిశితంగా గమనించి ఎక్కడివారో పోల్చుకోవచ్చు. శ్రీనాథుడు విస్తృతంగా రాచకార్యాలమీద పర్యటించాడు. దక్షిణాది రాష్ట్రాల భోజన భాజనాల గురించి, సొంత మండలంలోని వివిధ సీమల సంస్కృతి గురించి ఆశువుగా ఎన్నో పద్యాలు చెప్పాడు. కొందరిని ఒప్పించాడు, మరికొందరిని మెప్పించాడు, ఇంకొందరిని నొప్పించాడు. ఒకనొక సందర్భంలో, " కుల్లాయుంచితి, గోకజుట్టితి, మహాకూర్పాసాన్ని.." ధరించాను... అంటూ వాపోతాడు. ఈ విచిత్ర వేషధారణంతా కన్నడ రాజ దర్శనానికి విధిగా వుండాలి. సొంత రాజ్యంలో అయితే పట్టుధోవతులు, ఉత్తరీయాలు తనకు నచ్చినట్టు ధరించవచ్చు. ఇంకా అదే సందర్భంలో ఎదురైన కష్టాలను వల్లిస్తూ, 'చల్లాయంబలి ద్రాగితిన్, రుచుల దోసంబంచు బోనాడితిన్ దల్లీ! కన్నడ రాజ్యలక్ష్మి! దయలేదా? నేను శ్రీనాధుడన్!' అంటూ ప్రాథేయపడ్డాడు. గడ్డ పెరుగు తప్ప చల్ల యెరుగని భోగి. సన్న బియ్యపు అన్నం తినే వారికి అంబలి తాగడం ఎంత కష్టం. శోత్రియుడు వెల్లుల్లి ముట్టడం అనాచారమే. నా సొంత రుచులన్నీ వదిలేశాను. నన్ను దయచూడమని ప్రార్థించాడు. ఇక్కడే ఆ నాటి ఆయా ప్రాంతాల ఆచారాలు అలవాట్లు కళ్లకు కడతాయి. ఇప్పుడు హద్దులు చెరిగిపోయాయి. అన్ని ప్రాంతాల వారూ అన్ని రకాల దుస్తుల్ని, ఆహారాలను సొంతం చేసుకున్నారు. ఈ వెల్లువలోనే సొంత భాష కూడా కొట్టుకుపోడం మొదలైంది. ఈ నష్టాన్ని అందరూ అడ్డుకోవాలి.

– సంపాదకుడు

## మన సామెతలు




"సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు" అని నానుడి. ఆమెత అంటే విందు. పలు సందర్భాలకు విందులు చేసే గృహస్థు ఆనందంగా వుంటాడు. విందు సౌభాగ్య చిహ్నం. ఆరోగ్య ప్రతీక. సామెత కూడా అలాంటిదే. పలికినవారికి సంతోషం, వినేవారికి అహ్లాదం. చెప్పేసంగతి సామెత వల్ల సూటిగా నాటుకుంటుంది. అందుకే ప్రాచీన సాహిత్యంలోకి సామెతలు చొచ్చుకుపోయాయి.

- వేణ్ణీళ్లకు కొంపలు అంటుకోవు – భావగర్భితమైన సామెత యిది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు, ఆ సమస్య వదంతి వల్ల పుట్టినపుడు ధైర్యం చెబుతూ యీ సామెత వాడతారు. వేడి నీళ్లకు వేడి లక్షణం వుంటుందేమో గాని, అవి అగ్నిలా కొంపల్ని అంటించ లేవు. ఏమీ పర్వాలేదని వెన్నుతడతారు.
- ఇటైతే కందిపప్పు అటైతే పెసరపప్పు – చాలా ప్రాంతాలలో శుభకార్యాలలో కందిపప్పు వడ్డిస్తారు. అశుభాలకు పెసరపప్పు వండుతారు. ఈ సాంప్రదాయాన్ని చాలా లౌక్యంగా చెబుతుంది సామెత.
- ఆమ్నాయ కళానిధికి ఆదిలోనే హంసపాదు – నేపథ్యం పూర్తిగా తెలిస్తే గాని యీ సామెత బోధపడదు. ఒక వాక్యాన్ని రాసేటప్పుడు కొత్తగా చేర్చిన పదాన్ని ఒక గుర్తు వేసి అక్కడ రాయడం రివాజు. ఈ గుర్తునే హంసపాదు అంటారు. వెనకటికి నేలటూరు పార్థసారథి అయ్యంగారు (నెల్లూరు పండితుడు, వెంకటగిరి రాజా ఉన్నత పాఠశాల ఆంధ్రాధ్యాపకులు) ఆమ్నాయ కళానిధి పేరులో, ఆంధ్ర మహాభారతం ఉద్యోగ-స్త్రీ-శాంతి పర్వాలకు టీక రాసి ప్రచురించారు. మొట్టమొదట వచ్చే "శ్రీయన గౌరి నాబరగు..." అనే పద్యంలో గౌరికి అర్థం చెప్పకుండా దాటవేశారు. అయ్యంగారు అచ్చులు వేసుకున్న శ్రీ వైష్ణవుడు. మొదట్లోనే గౌరి ప్రస్తావన ప్రశస్తి దేనికని గంతు వేసి వుంటారని అంతా భావించి వదిలేశారు. దీనిపై నాటి సాహిక విమర్శకులు పూండ్ల రామకృష్ణయ్య తమ "అముద్రిత గ్రంధ చింతామణి" పత్రికలో తీవ్రంగా విమర్శించారు. ఆ విమర్శకు వారు పెట్టిన శీర్షిక "ఆమ్నాయ కళానిధికి ఆదిలోనే హంసపాదు" అయితే, రాను రాను వాడుకలో " ఆదిలోనే హంసపాదు"గా ప్రాచుర్యం పొందింది.

వేమన సామెతల పుట్ట. వాటిని వాడడంలో దిట్ట. చాలా పద్యాల్లో ఒక పాదం చక్కని సామెతగా యిమిడి, విశ్వదాభిరామ వినురవేమ మకుటం వస్తుంది. తొత్తుతొత్తె గాని దొరసాని కాబోదు (తొత్తు అంటే సేవకురాలు, దాసి ) తలలు బోడులైన తలపులు బోడులా, పుట్టమీద కొట్ట భుజగంబు చచ్చునా, కామి గాక మోక్షగామి కాడు, నొసలు భక్తుడైన నోరు తోడేలయా, (తోడేలు మోసకారి. భక్తి ఆచారాలను సూచించే బొట్లు నొసటన పెట్టుకుంటారు) ఇవి కొన్ని వుదాహరణలు మాత్రమే. అలవోకగా చలోక్తులను కూడా సామెతలుగా ఆటవెలదుల్లో పొదిగాడు. అందుకే వేమన ప్రజాకవి, తెలుగు జాతిసిరి.

## కోలాటంలో పొడుపు కథలు

జానపద సాహిత్యం ఎన్నిరకాల పూలు పూసిందో! ఎన్ని రకాల కాయల్ని పండ్లని యిచ్చిందో లెక్కేలేదు. ఆధునిక సాహిత్యంలో ఎంతో నవ్యత చూపించామనుకునే కవులకు అంతకు మించిన ఆధునికత జానపదాల్లో కనిపిస్తుంది. ఆనాటి విజ్ఞానం, వినోదం, కాలక్షేపం సమస్తమూ వారు కట్టుకున్న పాటల్లోనే యిమిడి వుండేవి. ఈ కోలాటం పాటలో పొడుపులు విడుపులు వున్నాయి. కోలాటపు నడక వుంది. చమత్కారమూ వుంది. (ఇది ఒకప్పుడు రాయలసీమ గ్రామాల్లో వినిపించేది.)

నాలుగూ వర్ణాల కాయన్నా సీతాభిరామా

నారు లేనీ పూత పూసెనన్నా!

సందకాడా సమర్తాయె సగం పొద్దుకి వేకటాయె

కోడి కూసే కొడుకు బుట్టే తెల్లవారే పేరు బెట్టే

దీని అర్థామేమొగానీ– తెలుసుకోండి జ్ఞానులైతే!

....దీని పేరే పాలు పెరుగూ

ముక్కూ మొగమూ లేని పక్షీ

ముప్పై ఆరు గుడ్లు పెట్టే

డభైయారు సుట్లుదిరిగే ఇరవైయ్యారు పిల్లల్ లేపే

దీని యర్థామేమొగానీ – తెలుసుకోండి జ్ఞానులైతే!

....దీని పేరే కుమ్మరి సారే.



మంచిదీ ఒక మృగము వుందన్నా
మళ్లీ మళ్లీ వేయగా ఓ యన్నా
వేసినంత మింగి వేయూ మేసినంతా వెళ్లగక్కూ
దీని యర్థామేమొగానీ – తెలుసుకోండి జ్ఞానులైతే!
....దీని పేరే విసుర్రాయి (తిరగలి)

## అచ్చమైన తెలుగు కవి

అడిదము సూరకవి (1720–1785) అచ్చమైన తెలుగుకవి. ఈయన కళింగదేశపు కవి. సూరకవి రచించిన "రామలింగేశ శతకం" ప్రసిద్ధం. ఇంకా చంద్రాలోకము, ఆంధ్రనామ శేషము, కవిజన రంజనము, శ్రీరామదండకము యీ కవి ఇతర కృతులు. సూరకవి తన శతకంలో భక్తిని ప్రబోధించలేదు. అతిగా నీతులు దట్టించలేదు. లోక రీతిని తేట తెలుగులో, వేర్వేరు ఛందాలలో చెప్పారు. ఒక న్యాయం వుంది. దాన్ని ధర్మశాస్త్ర పరిభాషలో "వైకారియస్ లయబిలిటీ" అంటారు. అలాంటి దోషాలను వివరించే సీస పద్యమిది. రామలింగేశ శతకం లోనిది.

పసరంబు రాగైన పసులకాపరి తప్పు
ప్రజలు దుర్నాయులైన ప్రభువు తప్పు
భార్య గయ్యాళైన ప్రాణనాధుని తప్పు
తనయుండు ధూర్తైన తండ్రి తప్పు
అశ్వంబు రాగైన నారోహకుని తప్పు
దంతి దుష్టయిన 'మా వంతు' తప్పు
సైన్యంబు చెదిరిన సైన్యనాధుని తప్పు
కూతురు చెడుగైన మాత తప్పు
ఇట్టి తప్పు లెరుంగక యిచ్చ వచ్చి
నట్టు చరియించు వానికి హాని వచ్చు
నాడికలు గల్గునది నిక్కమరసి చూడ
రామలింగేశ రామచంద్ర పురవాస.

రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల నడిచిందని సామెత వుంది. గుర్రాన్ని నడిపే వానిని రౌతు అంటారు. ఏనుగుని నడిపించే మావటే మావంతు అంటారు. మావటీ ఎంతటివాడైనా ఏనుగుకి అంకుశం వుండాలి. అంకుశం అంటే సన్నని పొడవైన ఇనప చువ్వ. ఏనుగు చెవిపక్కనే కాల్చిన పుండు వుంటుంది. అది ఎప్పటికీ పచ్చిపుండుగానే వుంటుంది. ఏనుగును అదిలిచ్చాలంటే అంకుశంతో పుండును పొడుస్తారు. ఎంతటి మదగజమైనా బాధతో భయంతో దారికి వస్తుంది.

## తెలుగింటి ఉగాది

కాసిని ఆనందాలను, మరి కాసిని సమస్యలను, కొంచెం సుఖాలను, ఇంకొంచెం ఇబ్బందులను రుచి చూపిస్తూ మన్మధ వెళ్లిపోయింది. అదిగో దుర్ముఖి కొత్త సింగారాలతో వచ్చి తెలుగు గడపలో నిలిచింది. మన చాంద్రమానాన్ని పాటిస్తాం. అందుకని చైత్ర శుద్ధ పాడ్యమితో నూతన తెలుగు సంవత్సరం అమల్లోకి వస్తుంది. నిండు మనసుతో శ్రీ దుర్ముఖి గారికి స్వాగతం పలుకుదాం. దేశం సుభిక్షంగా వుంటుందనీ, అన్ని రాశులవారు సుఖ సంతోషాలతో ఆరోగ్య ఐశ్వర్యాలలో వుంటారనీ దుర్ముఖి పంచాంగం భరోసా యిస్తోంది. మరిక ఏం కావాలి. సర్వేజనా, సుఖినోభవస్తు!

ఈ పండగకి ఒక ప్రత్యేకత వుంది. ఉగాది కోసం ప్రకృతి కొత్తదుస్తులు ధరిస్తుంది. చైత్ర వైశాఖాలు వసంత రుతువు. చెట్లు చిగిర్చి పూలు పూయును – చిన్నప్పటి నుంచీ బాల శిక్షలో చదువుకుంటున్నాం. తోటలు, వనాలు కొత్తపూల నెత్తావులలో ఘుమ ఘుమలాడుతున్నాయి. తుమ్మెదలు తీర్థానికి తరలినట్టు వస్తున్నాయి. అంతా సంత సందడిగా




వుంది. పూదోటలు పానశాలలను తలపిస్తున్నాయి. నేల తల్లి యీ వసంత వేళ పెళ్లి కూతురులా ముస్తాబవుతుంది. పోచంపల్లి, వెంకటగిరి జరీ నేతల మధుపర్కాలు ధరించినట్టుంటుంది. ఉప్పాడ వల్లెవాటు వేసుకుంటుంది. మామిడి తోపులు కోయిల స్వరాలతో పెళ్లిమండపాలు అవుతాయి. ఉగాది శుభవేళ పంచాంగ శ్రవణం వుంటుంది. భవిష్యత్తు తెలుసుకోవాలని ఆసక్తి అందరికీ వుంటుంది. ఆదాయ వ్యయాలు, సన్మాన అవమానాలు అన్ని రాశుల వారికీ పంచాంగం వివరిస్తుంది. శుభాశుభాలు, గ్రహణాలు, యింకా అనేక విశేషాలను వివరిస్తుంది. మన తెలుగు నేలపై అనాదిగా ఎందరో పంచాంగ గణికులు ప్రవర్తిల్లుతున్నారు. ఘడియ, విఘడియలతో సహా కాల నిర్ణయం, ముహర్త నిర్ణయం చేయగల ఘటికులు మన పంచాంగవేత్తలు. దుర్ముఖిలో పవిత్ర కృష్ణానదికి పుష్కరాలు వస్తున్నాయి. ఇదొక మహాపర్వం. ఇప్పటికే మన ప్రభుత్వం పుష్కర ఘట్టానికి సమయత్తమవుతోంది. పితృదేవతలను సంస్మరించుకుంటూ వారికి శ్రద్ధా భక్తులతో తర్పణాలు విడిచే పవిత్ర పర్వం.

ఉగాది మంగళ వేళ కవి కోయిలలు స్వీయ కవితలను గానం చేసి జాతిని వుత్తేజ పరుస్తాయి. ఉల్లాస పరుస్తాయి. కవి సమ్మేళనాలు, కవి సన్మానాలు వూరు వాడా జరుగుతాయి. వసంత రుతువుని, ఉగాదిని వర్ణించని తెలుగు కవి లేడంటే అతిశయోక్తి కాదు. తెలుగు కవిత్వంలో నవ్యధోరణులకు ఆద్యులు రాయప్రోలు. ఆయన "రమ్యాలోకం" కావ్యాన్ని ఆరంభిస్తూ "మామిడికొమ్మమీద కలమంత్ర పరాయణుడైన కోకిల స్వామికి మ్రొక్కి యీ అభినవ స్వరకల్పన కుద్యమించితన్" అన్నారు. ముక్కోటి దేవతలుండగా వారందరినీ పక్కనపెట్టి కోకిల స్వామికి తొలివందనం చేశారు. తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువాది ఒక ప్రత్యేకముద్ర. నవ్యాంధ్ర మహారాష్ట్రానికి పీష్వా మా జాష్వా! వసంతాన్ని పరోక్షంగా పలకరిస్తూనే, జాతికి ఒక సందేశం యిచ్చారిక్కడ–

రుతురాజు ధారుణీ సతికి సొమ్ములు వెట్టి
పులకించుపని మానుకొనగలేదు
పవలు రేలును తీరుబడిలేక ఘోషించు
తోయధీశుని గొంతురాయలేదు
..........................
మూర్ఖ హృదయమా దినమెల్ల ముగియలేదు
దీపమున్నది హృదయంబు దిద్దుకొనుము.

విశ్వనాథ కల్ప వృక్షంలో రామ సోదరులు పెద్దవారవుతున్నారని చెప్పడానికి–

"తిరిగి వసంతకాల మరుదెంచె వినుత్న శిఖి ప్రభాశిఖ హరణము వోలెనొప్పె జవురాకుల తుట్టతుదల్ జిగా జిగుల్..." యిలా నడిపించారు పద్యాన్ని.

వసంత శోభని వర్ణించని తెలుగుకవి లేడు. మన ఉగాదికి మరో ప్రత్యేకత కూడా వుంది. ఉగాది వచ్చిందంటే కల్యాణ శుభముహర్తం ఆలయాలకు లోగిళ్లకు ఆవహిస్తుంది. శ్రీ సీతారామ కల్యాణం కోసం వేదికలు, పందిళ్లు సిద్ధం చేసుకోమని ఉగాది పండుగ హెచ్చరిస్తుంది. తొందర పెడుతుంది.

శ్రీ దుర్ముఖి అందరికీ సర్వశుభాలు చేకూర్చాలి!

– శ్రీరమణ


## మనవి

మన ఉగాది ప్రసాదంలో షడ్రుచులుంటాయి. మన తెలుగు భాషలో కూడ షడ్రుచులున్నాయి. ఆనందించడానికి , అర్థం చేసుకోవడానికి, ఆవేశపడడానికి, ఆదేశించడానికి మన తెలుగు అనువైంది. ఈ వసంత వేళ కొత్త చిగుళ్లతో, పూలతో తెలుగుతోటను పరిమళింప చేద్దాం.

– సంపాదకులు
ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక

# కొత్తపుస్తకం

## కలం యోధులకు దిశానిర్దేశం!




కవిసేన మేనిఫెస్టో, ఆధునిక కావ్యశాస్త్రమ్
వెల : రూ.300/- పేజీలు: 250, ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రాలు. ఫోన్ : 94410 70985

అసలు కవిత్వం అంటే ఏమిటి? అది ఎలా రాయాలి? ఎందుకు రాయాలి? ఎవరి కోసం రాయాలి?...ఇటువంటి తాత్విక అంశాలపై చర్చను మన ప్రాచీన లాక్షణీకులు ఏనాడో ప్రారంభించారు. ఆ తరువాత గ్రీకులు, అరబిక్, రష్యన్, యూరోపియన్ భాషల్లో ఈ చర్చ మొదలైంది. అయితే, ఆధునిక సాహిత్య చరిత్రలో ఈ అంశంపై తెలుగులో వెలువడిన ప్రామాణిక గ్రంథం 'కవిసేన మేనిఫెస్టో'. ప్రాక్పశ్చిమ లాక్షణికుల వాదాలను ఆమూలాగ్రం అధ్యయనం చేసి, సమకాలీన సమాజాన్ని సారస్వతాన్ని సన్నిహితంగా పరిశీలించి, తన అద్వితీయ ప్రతిభాసంపత్తితో బహుముఖ భాషా పరిజ్ఞానంతో ప్రపంచ స్థాయి మేధావిగా విశ్లేషించి తన కుసుమ కోమల సదృశమైన సౌజన్యహృదయంతో ఆద్యంతం అనుభూతి చెంది స్వర్గీయ గుంటూరు శేషేంద్ర శర్మ నలభై ఏళ్ల క్రితమే అక్షరీకరించిన ఆధునిక వైజ్ఞానిక ఉద్యమ కావ్యశాస్త్రం 'కవిసేన మేనిఫెస్టో'! కవిత్వ కళలో శబ్దం పోషించే పాత్రను గుర్తిస్తూనే, కవిత్వం కేవలం శబ్ద శిల్పం కాదని, కవితా స్పర్శ లేకుండా అనంత శబ్దజాలం అలా పొంగి పొర్లడమే కవిత అనే సంప్రదాయ ధోరణిని తిరస్కరిస్తుంది కవిసేన మేనిఫెస్టో!

అలా అని, శేషేంద్ర ప్రాచీన కవిత్వాన్ని ప్రక్కన పెట్టలేదు. ఆధునిక కవిత్వాన్ని నెత్తిన పెట్టుకోలేదు. ఈ రెంటిపై నిష్పాక్షికంగా న్యాయవిచారణ చేశారు. మానిషాద శ్లోకంలోని జీవ చైతన్యంతో పాటు జయదేవుని ఆలంకారిక దృష్టిని, మయకోవస్కీ, అరిస్టాటిల్, గోర్కీల అత్యాధునిక అభ్యుదయ దృక్పధాన్ని, సంస్కృత, పర్షియా ఉర్దూ, ఇంగ్లీషు, రష్యన్, స్పానిష్ భాషల్లోని కవిత్వ తత్వ సార సంగ్రహాన్ని సమీక్షించి, రానున్న కవి కుమారులకు సరికొత్త రహదారులు నిర్మించారు శేషేంద్ర. 1977లో మొదట ప్రచురింపబడి, 1992లో రెండవ ముద్రణ, ఇప్పుడు 2015లో తాజాగా మూడవ ముద్రణ జరిగిన 'కవిసేన మేనిఫెస్టో'– నేటి తరం రచయితలందరూ అధ్యయనం చేయవలసిన అధునాతన అభ్యుదయ సులక్షణ సారం!


కవిత్వంలో భాష గురించి, రొమాంటిక్, ఆత్మాశ్రయ, ప్రేమ, ఉద్యమ కవిత్వాల ప్రస్థానాల గురించి, కవి జగత్తుతో తాదాత్మ్యం పొందవలసిన అవసరం గురించి, కవి కమిట్‌మెంట్ గురించి ఈ మేనిఫెస్టో విస్తృతంగా చర్చించింది. కవిత్వమంటే జన్మత: వచ్చే ప్రతిభ కాదని అది ఒక విలక్షణ అనుభూతి అని తీర్మానించింది. భాషా పరంగా చూసినప్పుడు ఇంగ్లీషులో సమస్త ఆధునిక కాలమూ ఉంది. సంస్కృతంలో సమస్త ప్రాచీన కాలమూ ఉంది. ఈ రెంటిని కలిపి దేశ కాలావిచ్ఛిన్న మానవ స్వరూపాన్ని దర్శించుకోవాలి జ్ఞాని అయిన కవి – అంటారు శేషేంద్ర.. "కవే దేశానికి అసలు నాయకుడు. రాజకీయవాది కాదు. రాజకీయ వాది నాయకత్వాన్ని కవిసేన తిరస్కరిస్తుంది. రాజకీయ భవనాల్లో పెంపుడు కుక్కల్లా బ్రతికే కవి నాయకుల్ని గర్హిస్తుంది" అని నిర్ద్వంద్వంగా ప్రకటించారు శేషేంద్ర.

కవిత్వం, కవి పాత్ర భాషా పరంగా ముగిసిపోకుండా క్రియాపరంగా అన్వయం అయితేనే దానికి అర్థం ఉంటుందని ఆశించే శేషేంద్ర...నదులు, కవులు భూగోళపు రక్త నాళాలంటున్నారు. సమాజ సంక్షేమం కోసం నడుం బిగించే అక్షర యోధులకు దిశా నిర్దేశం చేయడానికై ఆ మహోన్నత సౌందర్య స్వాప్నికుడు రూపకల్పన చేసిన వైజ్ఞానిక ఉద్యమ వేదికపై ఆవిర్భవించిన సారస్వత దీప స్తంభమే కవిసేన మేనిఫెస్టో!

– డా. వెనిగళ్ళ రాంబాబు

---

## ఇది చదవడానికే కాదు, పాడటానికూడా!




దాశరథి సినిమా పాటలు, వెల: రూ. 150/-
పేజీలు: 123, ప్రతులకు: రవి పబ్లిషింగ్ హౌస్, 2ఒ 7/4, 3 ఫేజ్, కె.పి.హెచ్.బి కాలనీ, హైదరాబాద్.
ఫోన్ : 9000938291


ఉద్దండ పండితుల కవిత్వం ఉద్గ్రంథాలలో సురక్షితం. పాటలు మాత్రం ప్రజాజీవనంలో మమేకం. అదేం చిత్రమో పనీపాటులను పనీపాటలుగా పొరపడేంతగా ప్రభావితం చేశాయి. ఇక చలన చిత్రరంగంలో మాటలతో పాటే పాటా ప్రవేశించింది. సినీ కవులందరూ చిత్రగీతాల ద్వారానే ప్రజలకు పరిచితులు, అభిమాన పాత్రులూ.

సినీ సంగీత ప్రియులకు చిరస్మరణీయుడైన దాశరథిని అభిమానులకు మరింత చేరువ చేసే తాజా ప్రయత్నమే– 'దాశరథి సినిమా పాటలు' సంకలనం. దాశరథికి సన్నిహితుడు, స్వతహాగా కవి అయిన కోమల ప్రభాకర్ సంకలన కర్త. ఇందులో బహుళ జనాదరణ పొందిన, కావ్య పరిమళాలు గుబాళించే రసగుళికలు ఏర్చి కూర్చడానికి సంకలన కర్త శ్రమా, కృషీ అపారం. అక్కడక్కడ చిన్న చిన్న తప్పులు తప్ప లేదప్పటికే. ఉదా: 'నీకేలా...ఇంత నిరాశ' వివరాలు. సినిమా విజయానికి ప్రధాన కారణంగా భావించబడేది సరళంగా ఉండి జనానికి చేరువకావడం. కథైనా మాటలైనా పాటలైనా. అదే ప్రామాణికత పాటించి రాయడం పరిపాటి. అందులో దాశరథి ఘనాపాటి అనివేరుగా చెప్పనక్కరలేదు. మంటలు రేపే నెలరాజా! ఈ తుంటరి తనం నీకేలా? అనీ చందమామను మందలించుట ఎంత ముచ్చటైన భావన? సాంద్ర విషాదమందూ కావ్య రసాస్వాదన. పైగా అందరూ మురిసిపోయి పొగిడేసే జాబిలిని ముద్దు ముద్దు చిన్ని చిన్ని మాటల్తో తిట్టిపోయడంలో కవి పట్టు ఉట్టి పడుతోంది. హృదయాన్ని పట్టి కుదుపుతోంది. ఇలాంటి వెన్నెన్నో!

వేదికల మీద పాత పాటలు పాడటం ఇప్పుడు చక్కటి వినోదమైంది. దాని కనుగుణంగానే పలువురు కొత్త గాయనీ గాయకులు తయారౌతున్నారు. వారికి అందుబాటులో ఇలాటి సంకలనాలుండటం సౌలభ్యం. తమలో తాము గున్‌గునాయించుకొనువారికి, సంభాషణల్లో సందర్భానుసారం వినియోగించుటకూ, భాషను బలపర్చుకో యత్నించుటకు ఉపకరించే పుస్తకమిది. చదవొచ్చు. ఆహా! పాడొచ్చుకూడా!

– రాము ఇటిక్యాల్

# సంగీతయాత్రలో ముచ్చట్లు




అసమాన అనసూయ,
డా॥ అవసరాల అనసూయాదేవి, వెల : 250,
పేజీలు: 300, ప్రచురణ: వంగూరి
ఫౌండేషన్, ప్రతులకు : నవోదయ బుక్స్

ఎందుకో తెలుగులో స్త్రీల ఆత్మకథలు తక్కువ. కొన్ని సినీమా తారల ఆత్మకథా కథనాలు పుస్తకాలుగా వచ్చాయి కానీ, అవి అన్నీ ఆయా నటీమణుల చిత్ర విజయాల జ్ఞాపకాలు. సంగీతంలో పేరు తెచ్చుకొన్న విదుషీమణుల ఆత్మకథలు తెలుగులో లేనే లేవు ఇప్పటి వరకూ. కాని అనసూయ గారి ఆత్మకథ 'అసమాన అనసూయ' ఈ లోటును తీర్చింది. 1920 లో పుట్టి 10 సంవత్సరాలకే జానపద గీతాల రికార్డు ఇచ్చి, లలిత సంగీతానికీ, జానపద గేయసేకరణ ప్రచారం, స్వరపరచటంలో అసమాన కృషి చేసిన ఆవిడ జీవితం అధిరోహించిన సోపానాలు ఒక వైపున చెబుతూనే, సాధారణ గృహిణిగా ఎలా జీవితం సాగిస్తూ వచ్చిందో ఈ సంగీత యాత్రలో తారసపడిన ప్రముఖులు ఎలా తన సంగీతాన్ని ఆదరించారో కథలుగా, స్మృతులుగా చదివించేలా చెప్పటం ఈ పుస్తకం ప్రత్యేకత.


కలిసొచ్చిన అదృష్టంతో బాటు, మొక్కవోని కృషి ఉంటేనే గాని అనసూయలా తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంగీత స్వరకర్తగా జానపద గాయనిగా పేరు, ఖ్యాతి తెచ్చుకోలేరు. కృష్ణశాస్త్రిగారి మేనకోడలిగా, నటుడు, పద్మశ్రీ గ్రహీత వింజమూరు నరసింహారావు గారి కూతురిగా పుట్టినంత మాత్రాన అందలాలు ఎక్కలేరు. సంగీత దర్శకత్వానికి జానపదాలు పాడటానికి, ఆద్యులలో ఒకతెగా చెలామణీ కావటానికి గొంతులోను కొన్ని గొప్పతనాలు కలిసిరావాలి. ఆకాశవాణి మద్రాసులో కొన్నాళ్ళు సంగీత శాఖలో ఉద్యోగం చేసినా, కొన్ని సినిమాలకి పాటలకి సంగీతం సమకూర్చినా, సంగీతంలో తొలిమహిళా ఉపాధ్యాయులుగా కళాశాలలో పనిచేసినా రాణించాలంటే మరేదో అసమాన విద్యలాంటి వెలుగు, నిరంతరం శరీరంలో, గాత్ర శరీరంలో – రెండింటా ప్రవహిస్తూ ఉండాలి. ఈ ప్రవాహాల్ని ఆవిడా ఎలా నడుపుకుంటూ వచ్చిందో చెప్పిన కథ ఇది. ఈ నిచ్చెన మెట్లనీ, ఆమె స్వరరపరచిన పాటల గుర్తుల్నీ, మసలిన ప్రాంతాలనీ, ఇరుగుపొరుగులనీ గుర్తుకు తెచ్చుకుంటూ వివరించడం నిజంగా విద్యే. అనసూయ పాడని వేదికలేదు. సముఖాన సంగీతకచేరీ చేయని రాజకీయ, విద్యరంగ నాయకుడు లేదు.

కాకినాడలో జన్మించి మద్రాసు చేరినా కుటుంబాన్ని పోషించడానికి ఆవిడే సంపాదించటం, స్వతంత్ర భావాలు పెంచుకోవటం, సినీమాల వాతావరణం, రికార్డింగులూ, అయిదుగురి సంతానం భవిష్యత్తు – అన్నీ ఎంతో తేలికగా సరదాగా చెప్పినట్లు చెప్పారు. సంగీతంలో చేస్తున్న కృషికి అడ్డుపడే భర్త అభిప్రాయ భేదాలు, మళ్ళీ తేలికగా రాజీలు అన్నీ పూసలుగాగుచ్చారు. హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయకి హార్మోనియం వాయించటం, ఆయనతో కలసిపాడటం, బుచ్చిబాబుగారి బంధువుల పెళ్ళికి వెళ్తూ సూర్యకుమారిని లారీలో కలుసుకోవటం, నవ్వితే నవరత్నాలు సినిమాకి అనసూయ పిన్నమ్మ కథ ఇవ్వటం, ఈవిడకు కోపం వచ్చిందని కృష్ణశాస్త్రిగారు సిగరెట్లు మానివేయడం, బొమ్మలాట సినిమాకి సంగీతం – ఇలా ఎన్నో కబుర్లు పొగులు పొగులుగా నేశారు.


ఇందులో ఈవిడ ప్రతిభ చిన్నప్పుడే చూసిన జానపద గాయక వసిష్ఠుడు వట్లూరి జగన్నాథరావు గారి అభిమానం, శాస్త్రీయ సంగీతం నేర్పిన మునుగంటి వెంకటరావు ముచ్చట్లు – ఇలా ఎన్నో ఉన్నాయి. కాంచనమాల ఉత్తరాలు, సి.ఆర్. రెడ్డి గారి లేఖలు, సుభాష్ చంద్రబోస్ వంటి గొప్పవారి సంతకాలు ఛాయా చిత్రాలూ అనుబంధంగా, 150 పేజీలు ఇందులో జతపరిచారు. 150 పేజీల ఆత్మకథకి ఇవి బంగారు మురుగులు. 95 సంవత్సరాలు నిండి ఇంకా అమెరికా, యూరపులలో సభలకు వెళ్తూ జానపద గీతాలు లలిత గీతాలు పాడుతూ ఆనందంగా ఉన్న అనసూయ అనే అపురూప ఆంధ్రవనిత ఆత్మకథ ఇది. పాఠకులని ఆనందం కల్గిస్తుంది. పెద్ద జీవితయాత్రలో అనేక తాకిడుల ముచ్చట్లు చదవండి.

– పన్నాల సుబ్రహ్మణ్య భట్టు

# స్వీకారం




**ఒక ఏకాంత సమూహంలోకి**
**రామా చంద్రమౌళి కవిత్వం**
వెల : రూ. 80/–
పేజీలు : 105
ప్రతులకు : జె.వి పబ్లికేషన్స్, హైదరాబాద్ , ఫోన్: 8096310140; నవోదయ బుక్ హౌస్ అన్ని కేంద్రాలు.




**పరస్పరం**
**భమిడిపాటి జగన్నాథరావు**
వెల : రూ. 150/– పేజీలు : 198
ప్రతులకు : చినుకు పబ్లికేషన్స్, 26-7-11, గరికపాటివారి వీధి, సురేష్ మూవీస్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ – 520003, ఫోన్ : 9848132208
విజయవాణి ప్రింటర్స్, నవోదయ, విశాలాంధ్ర బుక్ హౌస్




**వ్యాస వివంచి**
**డాక్టర్ డి.గాయత్రి**
వెల : రూ. 90/–
పేజీలు : 124
ప్రతులకు : గాయత్రి పబ్లికేషన్స్, ఎల్.ఐ.జి –1, 170, న్యూ ఎ.పి.హె.బి. కాలనీ, బి.క్యాంపు, కర్నూలు –2, ఫోన్ : 8341385811.




**పొరలు**
**శ్రీపాదస్వాతి కథలు**
వెల : రూ. 100/–
పేజీలు : 126
ప్రతులకు : 301, యమున అపార్ట్ మెంట్స్, విశాల్ మార్ట్ పక్కన, రామంతపూర్, హైదరాబాద్ – 500 013, ఫోన్ : 8297248988, మరియు అన్ని పుస్తక కేంద్రాలు

శ్రీరమణీయం

# శ్రీదుర్ముఖి పంచాంగ ఫలితాలు




నూతన సంవత్సరం అమోఘంగా వుంది. పాడిపంట సమృద్ధిగా లభిస్తాయి. పాలు అనేక బ్రాండ్లతో చిరుపొట్లాలలో ఎప్పటిలాగే గుమ్మంలోకి వస్తాయి. కంపెనీ ముద్రలతో రకరకాల సన్నబియ్యాలు సంచీలతో ఇంటింటికీ వస్తాయి. డబ్బులుండాలేగాని కొండమీద కోతి దిగివస్తుంది. ఆదాయం వున్నవారికి కోరినన్ని క్రెడిట్ కార్డులు జేబులోకి వస్తాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు వర్ధిల్లుతాయి. ఇకపై మనుషుల స్పేర్ పార్టులు అమ్మే అంగళ్లు విరివిగా అందుబాటులోకి వస్తాయి. కళ్లు, కాళ్లు, వేళ్లు, గోళ్లు, పళ్ళు యిలా అన్నింటినీ కృత్రిమమైనవి గాక సహజమైనవి మార్కెట్ ధరకు దొరుకుతాయి.

రాజకీయాలలో కొంత స్తబ్ధత వుంటుంది. నావ నడి సముదంలో వున్నందున, యింకా ఎన్నికలకు వ్యవధి వున్నందున యీ పరిస్థితి నెలకుంటుంది. కేవలం పేరు వుచ్చరించినంతనే లైన్లోకి వచ్చే, "పిలిస్తే పలుకుతా" సెల్ మోడల్స్ అందుబాటులోకి వస్తాయి. విద్యావ్యాపారం చిలవలుపలవలుగా విస్తరిస్తుంది. భక్తికి గిరాకీ హెచ్చుగా వుంటుంది. స్వాములకు బాబాలకు అనుకూలం. కొత్త దేవుళ్లు రంగప్రవేశం చేసే అవకాశాలు మెండుగా వున్నాయి. కొత్త జండాలు, కొత్త ఎజండాలు వచ్చే అవకాశం దుర్ముఖిలో లేదు. ఛానెల్స్‌లో ముందు నుంచీ నడుస్తున్న సీరియల్స్ నిరాటంకంగా కొనసాగుతాయి. కాబట్టి ప్రేక్షకులకి ఆయా పాత్రలతో వున్న చిరకాల సంబంధం అలాగే కొనసాగుతుంది. పత్రికలలో రోజూ వచ్చే వార్తల్లో కావల్సినంత వైవిధ్యం వుంటుంది. నగరాలు మూడు వంతెనలు, ఆరు ఫ్లై ఓవర్లుగా విస్తరిస్తాయి. పల్లెటూళ్లు వృద్ధుల ఆవాసాలుగా మారతాయి. ఈ సంవత్సరం కూడా వీధి కుక్కలకు అనుకూలమైంది. మొత్తం మీద అంతా సవ్యంగానే సాగుతుంది. చిన్న చిన్న తేడాలున్నా సర్దుకుపోయే "సహనం" వుంటుంది.

## శ్రీదుర్ముఖి రాశిఫలాలు

**మేషం: ఆదాయం: 9 వ్యయం: 12 అప్పు: 5**

వీరికీ యీ సంవత్సరం అనుకూలం. ఆదాయాన్ని మించిన ఖర్చు వున్నా అప్పులు పుడతాయి కనుక చింతలేదు. ఈ రాశి ద్విచక్ర వాహన దారులు శిరస్త్రాణాలు ధరించాలి. లేకుంటే ధన వ్యయం.

**వృషభం: సుఖం:9, దు:ఖం: 2, ఓదార్పు: 11**

రాశి పేరులో బలం వుంది గాని రాశిఫలంలో అంత దమ్ము లేదు. ఈ రాశి పురుషులు సిగరెట్లు తాగడం, స్త్రీలు సెల్ వాడడం తగ్గించాలి. ఫేస్‌బుక్ స్నేహాలు పిచ్చిగా పెరుగుతాయి. కుజగ్రహ సానుకూలతకు గాను ఆ గ్రహాన్ని తొమ్మిది రోజుల పాటు కోకాకోలాతో అభిషేకించండి.

**మిథునం: సౌఖ్యం: 6 అసౌఖ్యం: 9 ఓర్పు: 5**

అందువల్ల ఓర్పు కూడా వున్నందున అంతా సాఫీగానే నడుస్తుంది. దుర్ముఖిలో మీరు కొత్త అపార్ట్‌మెంట్లు చూస్తారు. పిల్లలు తరగతులు మారతాయి. ఏప్రిల్ మే నెలల్లో అధిక వ్యయం. అయినా తట్టుకుని నిలబడతారు. ధైర్యలక్ష్మిని స్మరించుకోండి.

**కర్కాటకం: పట్టు: 9 విడుపు: 11 రాజీ: 6**

ఈ రాశి వారికి అడ్డంగా నడవాలనిపించినా అట్లా నడవరాదు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించడం శ్రేయస్కరం. రోడ్డు పక్క బండ్లమీద పానీపూరీలు, మిర్చి బజ్జీలు పుష్కలంగా తినే యోగం వుంది. మీ ఇష్టదేవతకి శనివారం పిజ్జా నైవేద్యం పెట్టండి. సత్ఫలితాలిస్తుంది.

**సింహం: కోపం: 9, శాంతం: 7, భంగపాటు: 4**

అనవసరంగా అతిగా గర్జించి భంగపడవద్దు. ఆచితూచి అడుగు వెయ్యండి. దూకుడొద్దు. ఈ రాశివారికి చమురుఖర్చులు అధికంగా వుంటాయి. పెట్రోలు డీజిల్‌తో పాటు ఇంట్లో సెంటు నూనెల వాడకం కూడా అధికమవుతుంది. సెలవు రోజుల్లో స్వచ్ఛభారత్‌లో పాల్గొంటే జాతకం బావుంటుంది.

**కన్య: విజయం: 6 అపజయం: 9 డ్రా: 4**

దుర్ముఖిలో కన్యారాశి వారికి అద్భుత ఫలితాలు గోచరిస్తున్నాయి. పట్టిందల్లా బంగారం అవుతుంది. అట్లాగని తెలిసీ తెలియకుండా షేర్ మార్కెట్లోకి వెళ్లద్దు. చేతనైతే వుపకారం చేయ్యండి గాని ఎవరికీ అపకారం తలపెట్టవద్దు. ప్రతి బుధవారం వినాయకుడికి ఐస్ క్రీం నివేదించి భక్తితో స్వీకరించండి. మేలు జరుగుతుంది.

**తుల: ఆకలి: 9 అన్నం: 9 అజీర్తి : 9**

తుల రాశివారికి తూకం వేసినట్టు అన్నీ సమంగా వుంటాయి. మిశ్రమ ఫలితాలు కలిగి వుంటారు. తరచు ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతాయి. చాకచక్యంగా బయట పడతారు. ట్రయిలర్లు చూసి, నమ్మి సినిమాలకు వెళ్లి మోసపోతారు. జాగ్రత్తగా వుండండి. టి.వి వాల్యూమ్ తగ్గించి పెట్టుకోండి. దీనివల్ల గొడవలుండవు.

**వృశ్చికం: సహనం: 0 అసహనం: 8 టెన్షన్ : 4**

సమస్యలను సమర్థవంతంగా జయించి ముందుకు వెళతారు. మీరు ఎక్కలేని ఎత్తులకు యెదుగుతారు. బహుశా పదహారో అంతస్తు ఫ్లాటుకి మారతారు. చల్లని ఫ్రిజ్ వాటర్‌తో శివునికి అభిషేకం చేయండి. శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి మిమ్మల్ని వత్తిళ్ల నించి బయట పడేస్తాడు.

**ధనస్సు: కీర్తి: 4 అపకీర్తి: 6 సాంత్వన: 2**

దుర్ముఖి యీ రాశివారికి అంతా మేలే చేస్తుంది. ఎన్నో శుభకార్యాలకు హాజరవుతారు. బంధుమిత్రులను దర్శిస్తారు. మధ్య మధ్య పుణ్యక్షేత్రాలకు కూడా వెళ్తారు. పరాయివారితో జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకపోతే ప్రమాదం. సెప్టెంబరు మాసం ఆరోగ్యం జాగ్రత్త!

**మకరం లాభం: 5 నష్టం: 1 పన్ను: 0**

ఈ సంవత్సరం అంతా లాభసాటిగానే వుంటుంది. ఇంట్లో శుభకార్యం జరుగుతుంది. ఆగష్టు నెల పుణ్యతిథులు నిర్వహిస్తారు. చిన్న చిన్న అనారోగ్యాల వల్ల పెద్ద పెద్ద ఖర్చులు అవుతాయి. పాస్‌పోర్ట్ రెన్యూ చేయించుకోండి. ఐఎఎస్ అధికారులకు విదేశీ ప్రయాణం.

**కుంభం: సత్యం: 1 అసత్యం: 9 ఫలితం: 0**

కుంభరాశివారికి మిక్కిలి అనుకూలమైన సంవత్సరం. పిల్లలు పెద్దల మాట వింటారు. ఆర్థికంగా అనుకూలం. మీ సెల్ ఫోన్లో తరచుగా రాంగ్ నెంబర్లు వచ్చే అవకాశం వుంది. తగిన గ్రహశాంతి చేయించుకోండి. ప్లాస్టిక్ సంచుల్లో వచ్చిన వేపీ తినకండి. ఎక్కడా నోరు జారద్దు.

**మీనం: నేరం: 11 శిక్ష: 6 బెయిల్: 4**

ఈ రాశి వారికి ఆరు నెలలు దివ్యంగానూ, ఆరు నెలలు సవ్యంగానూ వుంది. తలపెట్టిన పనులు జరుగుతాయి. కోర్టు వ్యవహారాలు ముగుస్తాయి. న్యాయం గెలుస్తుంది. దేనికీ బాధ పడద్దు. అంతా దైవలీల!

– శ్రీరమణ

# ఇంట నిల్చి... రచ్చ గెల్చి

అసెంబ్లీ సమావేశాల కోసం హైదరాబాద్‌లో బస చేసిన ముఖ్యమంత్రి అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న దృశ్యాలు.

**ఛాయాచిత్రం 1:** లండన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి సందర్శించి, నివాళులు అర్పించారు.

**ఛాయాచిత్రం 2:** అమరావతి వెలగపూడిలో శరవేగంగా సాగుతున్న సచివాలయం పనులను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

**ఛాయాచిత్రం 3:** హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి న్యాయాధికారుల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి. చిత్రంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఏ ఆర్ దవే, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఉన్నారు.

**ఛాయాచిత్రం 4:** అసెంబ్లీ బడ్జెట్ సెషన్ సందర్భంగా ఆవరణలో కలుసుకున్న మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే బాలకృష్ణ.












Regd. No.HD - 962/2015-17
Published on 01-04-2016

ఆంధ్రప్రదేశ్

RNI No. 10926/1957
Posting: 4th & 5th

# నీరు-చెట్టు

'నీరు-చెట్టు' కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం. పేదరిక నిర్మూలన చేద్దాం. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందిద్దాం.

మనమంతా ఒక్కటిగా నిలుద్దాం.

వర్షాన్ని ఒడిసిపట్టి నిలుపుదాం.

భూగర్భ జలాలను పెంపొందిద్దాం.

తాగునీటిని, సాగునీటిని సమకూర్చుకుందాం.

పచ్చదనాన్ని పెంపొందిద్దాం.

పర్యావరణాన్ని కాపాడదాం.

కరవు రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేద్దాం.



ప్రతి నీటి బొట్టును ఆదా చేస్తూ
భూగర్భ జలాలను పెంచుతూ, జల సంరక్షణ,
సమర్థ నీటి నిర్వహణ, చెట్లు నాటి పర్యావరణాన్ని
కాపాడుతూ కరువు రహిత హరితాంధ్రప్రదేశ్‌ను
నిర్మిద్దాం.

ఊరూరా నీరు-చెట్టు పథకాన్ని
చిత్తశుద్ధితో అమలుచేద్దాం.
మనమంతా ఒకటిగా నిలుద్దాం.

## నీరు-చెట్టు కార్యక్రమం

- వాలు కట్టలు, చెక్ డ్యామ్‌లు, చిన్న ఊట నీటి కుంటలు, నీటి కుంటలు మొ॥ వాటి ద్వారా నీటిని భూమిలోకి ఇంకించడం
- పూడిక తీత మట్టిని వ్యవసాయ భూములకు వాడడం
- చెరువులకు మరమ్మతులు నిర్వహించడం
- చెరువు పరీవాహక ప్రాంతాల్లో పూడికతీయడం

## ప్రయోజనాలు

- నీరు అందని 17 లక్షల ఎకరాలకు నీటి సరఫరా, అదనంగా 28 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు
- బిందు సేద్యం, తుంపర సేద్యం ద్వారా 20 లక్షల ఎకరాలకు నీరు
- మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ

గోదావరి
మహా పుష్కరం 2015

**శ్రీ నారా చంద్రబాబు నాయుడు**
ముఖ్యమంత్రి

నీటిపారుదల & ఆయకట్టు అభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

జారీచేసినవారు: కమీషనర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



mohan
PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథనిలయం

అజంతా హోటల్ ఎదుట, కోటగుమ్మం,
రాజమహేంద్రవరము - 533101.
ఫోన్ : 0883 - 2462565
e-mail : mohanpublications@gmail.com

# మావద్ద లభించు గ్రంథములు



## వ్రత కథలు - పూజలు

| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీ వినాయక వ్రతం | వెల రూ. | 10-00 |
| 2. | శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం | | 30-00 |
| 3. | శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్త్యంతో) | | 10-00 |
| 4. | సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం | | 30-00 |
| 5. | వరలక్ష్మీవ్రతం | | 10-00 |
| 6. | కేదారేశ్వర వ్రతం | | 10-00 |
| 7. | త్రినాధ వ్రతం(కలర్) | | 10-00 |
| 8. | త్రినాధవ్రతం(సాదా) | | 5-00 |
| 9. | క్షీరాబ్ధి వ్రతం | | 12-00 |
| 10. | మంగళ గౌరీవ్రతం | | 10-00 |
| 11. | వైభవలక్ష్మీవ్రతం ఫోటో యంత్రంతో | | 25-00 |
| 12. | శ్రీలక్ష్మీకుబేర వ్రతం (ఫోటో యంత్రంతో) | | 25-00 |
| 13. | కనకమహాలక్ష్మీవ్రతం (కామేశ్వరీపాటతో) | | 25-00 |
| 14. | సంతోషీమాతా వ్రతం | | 25-00 |
| 15. | ఏడు శనివారాల వ్రతం | | 25-00 |
| 16. | సత్యనారాయణవ్రతం | | 25-00 |
| 17. | శ్రీ సువర్చలాహనుమద్దీక్ష | | 30-00 |
| 18. | శివదీక్ష | | 10-00 |
| 19. | కాత్యాయనీ వ్రతం | | 20-00 |
| 20. | సౌభాగ్య గౌరీవ్రతం | | 20-00 |
| 21. | తిరుప్పావై (ధనుర్మాసవ్రతం) | | 36-00 |
| 22. | స్త్రీల వ్రతకథలు | | 36-00 |
| 23. | స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారి) | | 54-00 |
| 24. | పెళ్ళి పాటలు - స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో) | | 36-00 |
| 25. | సర్వదేవతా పూజావిధానం | | 25-00 |
| 26. | ఆరువ్రతాలు | | 30-00 |
| 27. | రాహుకాలంలోదుర్గాదేవీపూజా | | 10-00 |
| 28. | తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు | | 10-00 |
| 29. | శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్ | | 36-00 |
| 30. | శ్రీచక్ర పూజావిధానం(పెద్దది) | | 36-00 |

| | | |
|---|---|---|
| 31. | లక్ష్మీ - గౌరీ నిత్యపూజ | 10-00 |
| 32. | శ్రీ సరస్వతీ నిత్యపూజ | 10-00 |
| 33. | శ్రీ దుర్గానిత్యపూజ | 10-00 |
| 34. | కాలభైరవ నిత్యపూజ | 10-00 |
| 35. | శివపూజ | 10-00 |
| 36. | వీరభద్ర పూజ | 10-00 |
| 37. | ఆంజనేయ నిత్యపూజ | 10-00 |
| 38. | నాగేంద్ర స్వామి పూజ | 10-00 |
| 39. | సుబ్రహ్మణ్య నిత్యపూజ | 10-00 |
| 40. | రామదేవుని కథ | 10-00 |
| 41. | శివదేవుని కథ | 10-00 |
| 42. | లక్ష్మీనరసింహపూజ | 10-00 |
| 43. | వేంకటేశ్వరపూజ | 10-00 |
| 44. | బ్రహ్మంగారి నిత్యపూజ | 10-00 |
| 45. | సూర్య నిత్యపూజ | 10-00 |
| 46. | నవగ్రహ నిత్యపూజ | 10-00 |
| 47. | రుక్మిణీ కల్యాణం | 25-00 |
| 48. | ఉమామహేశ్వర వ్రతం | 36-00 |
| 49. | శ్రీ కామేశ్వరీ వ్రతం | 36-00 |
| 50. | 16 సోమవారముల వ్రతము | 25-00 |
| 51. | పార్వతీకల్యాణం | 25-00 |
| 52. | సహస్రకమలవర్తి వ్రతము | 25-00 |
| 53. | పంచముఖ ఆంజనేయ పూజావిధానము | 36-00 |
| 54. | అష్టనాగపూజ | 36-00 |
| 55. | పూజలు ఎందుకుచేయాలి ? | 36-00 |
| 56. | ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి? | 36-00 |
| 57. | ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి? | 36-00 |
| 58. | ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి? | 36-00 |
| 59. | ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ? | 36-00 |
| 60. | హనుమద్ వ్రతం | 36-00 |
| 61. | పంచాయతన పూజ | 63-00 |
| 62. | 28 వ్రతములు | 120-00 |
| 63. | కలశపూజలు (9ఒకేసారి) | 150-00 |
| 64. | కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో) | .... |
| 65. | హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో) | .... |
| 66. | గోమాత | 40-00 |



# స్తోత్రాలు సహస్రనామములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు<br>పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం | 45-00 |
| 2. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,, | 50-00 |
| 3. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,, | 50-00 |
| 4. | స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్) | 99-00 |
| 5. | లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మి | 63-00 |
| 6. | స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్ | 108-00 |
| 7. | సర్వదేవతా స్తోత్రమంజరి | 120-00 |
| 8. | సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63) | 24-00 |
| 9. | విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్) | 25-00 |
| 10. | లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్) | 36-00 |
| 11. | లలితా సహస్రనామములు | 24-00 |
| 12. | లక్ష్మీసహస్రనామములు | 24-00 |
| 13. | దుర్గా సహస్రనామములు | 24-00 |
| 14. | ఆంజనేయ సహస్రనామములు | 24-00 |
| 15. | శివ సహస్రనామములు | 24-00 |
| 16. | విష్ణు సహస్రనామములు | 24-00 |
| 17. | గణపతి సహస్రనామములు | 24-00 |
| 18. | సుబ్రహ్మణ్య సహస్రనామములు | 24-00 |
| 19. | గాయత్రి సహస్రనామములు | 24-00 |
| 20. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు | 24-00 |
| 21. | శ్రీరామా సహస్రనామములు | 24-00 |
| 22. | సరస్వతి సహస్రనామములు | 24-00 |
| 23. | సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం | 24-00 |
| 24. | శ్రీవేంకటేశ్వరసహస్రనామములు | 24-00 |
| 25. | మణిద్వీపవర్ణన (పెద్దది) | 24-00 |
| 26. | సంధ్యావందనం | 24-00 |
| 27. | మంత్రపుష్పమ్ | .... |
| 28. | త్రిభాషా హనుమాన్‌చాలీసా | 15-00 |
| 29. | హనుమాన్ చాలీసా | 10-00 |
| 30. | మణిద్వీపవర్ణన (పాకెట్) | 10-00 |
| 31. | ఆరు చాలీసాలు | 10-00 |
| 32. | శివారాధన (శివస్తోత్రాలు) | 10-00 |
| 33. | వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్) | 10-00 |
| 34. | ఆరుదండకాలు | 5-00 |
| 35. | వేంకటేశ్వర గోవిందనామములు | 5-00 |

| | | |
|---|---|---|
| 36. | అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్ | 10-00 |
| 37. | దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో) | 10-00 |
| 38. | సుందరకాండ (పాకెట్) | 10-00 |
| 39. | భగవద్గీత మూలం | 27-00 |
| 40. | రామరక్షాస్తోత్రమ్ | 15-00 |
| 41. | స్తోత్ర రత్నావళి | 36-00 |
| 42. | పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ) | 10-00 |
| 43. | పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ) | 10-00 |
| 44. | పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్ | 10-00 |
| 45. | పురాణపండ ఆదిత్య హృదయం | 10-00 |
| 46. | మంత్రపుష్పం (మినీ) | 10-00 |
| 47. | శివానందలహరి-సౌందర్యలహరి | 36-00 |
| 48. | కుజదోషం | 10-00 |
| 49. | కాలసర్ప దోషం | 10-00 |
| 50. | మీ అప్పులు తీరాలా? | 10-00 |
| 51. | దృష్టిదోషాలు నివారణ | 10-00 |
| 52. | పంచసూక్తములు | 10-00 |
| 53. | సంధ్యావందనం | 10-00 |
| 54. | రుద్రనమకమ్-చమకమ్ | 10-00 |
| 55. | గాయత్రీమంత్రాలు | 10-00 |
| 56. | హయగ్రీవ స్తోత్రమాల | 10-00 |
| 57. | దక్షిణామూర్తి స్తోత్రమాల | 10-00 |
| 58. | ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో | 10-00 |
| 59. | శ్రీసూక్తం పురుష సూక్తం | 10-00 |
| 60. | నవగ్రహస్తోత్రమాల | 36-00 |
| 61. | మహాన్యాసమ్ | 36-00 |
| 62. | సుందరకాండ గానామృతం | 36-00 |
| 63. | గోమాతపూజావిధానము | 10-00 |
| 64. | ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల | 108-00 |
| 65. | ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి | 108-00 |
| 66. | ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల | 108-00 |
| 67. | శ్రీ కాలభైరవ రక్షా కవచమ్ | 63-00 |
| 68. | అర్చన | 40-00 |
| 69. | నిత్యదేవతార్చన | 40-00 |
| 70. | సర్వదేవతా స్తోత్ర నిధి | 99-00 |
| 71. | శ్రీచక్ర నవవరణార్చన | 63-00 |
| 72. | చండీ సప్తశతి పారాయణ క్రమం | 99-00 |
| 73. | శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో | 99-00 |
| 74. | వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్ | 63-00 |
| 75. | శ్రీ కాలభైరవ వ్రతము | 63-00 |



# శ్రీ సాయి దత్త గ్రంథములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ సాయిబాబా సచ్చరిత్ర | 120-00 |
| 2. | సంపూర్ణ శ్రీ గురు చరిత్ర | 120-00 |
| 3. | శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం | 120-00 |
| 4. | శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్) | 63-00 |
| 5. | శ్రీ గురుచరిత్ర (క్రౌన్) | 63-00 |
| 6. | నవనాథ చరిత్ర | 99-00 |
| 7. | శ్రీసాయిచరిత్ర (భైండు) ప్రయాణపుపారాయణగ్రంథం | 63-00 |
| 8. | శ్రీగురుచరిత్ర (భైండు) ప్రయాణపుపారాయణగ్రంథం | 63-00 |
| 9. | సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో | 30-00 |
| 10. | అనఘాదేవీ వ్రతం | 30-00 |
| 11. | భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు | 30-00 |
| 12. | శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో) | 25-00 |
| 13. | శ్రీ సాయిభజనమాల | 20-00 |
| 14. | శ్రీ సాయి భజన్స్ | 20-00 |
| 15. | శ్రీ సాయిభక్తి గీతాలు | 20-00 |
| 16. | శిరిడిహారతులు (భావంతో) | 20-00 |
| 17. | "శ్రీసాయి"కోటి | 27-00 |
| 18. | "శ్రీసాయిరామ్"కోటి | 20-00 |
| 19. | శ్రీ సాయినాథ స్తోత్రమంజరి | 10-00 |
| 20. | శ్రీ సాయివేయినామాలు | 8-00 |
| 21. | శ్రీ సాయి హారతులు (పాకెట్) | 15-00 |
| 22. | శ్రీ సాయి స్తవనమంజరి | 10-00 |
| 23. | హిందీ శ్రీ సాయి హారతులు | 15-00 |
| 24. | శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం | 63-00 |
| 25. | ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు | 15-00 |
| 26. | షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం | 99-00 |
| 27. | సాయిసత్యవ్రతం | 30-00 |
| 28. | సాయి అనుగ్రహమ్ | 120-00 |
| 29. | నవగురువారాల వ్రతకల్పము | 15-00 |
| 30. | శ్రీదత్తలీలామృతము | 99-00 |
| 31. | హృదయంలో సాయి | 15-00 |
| 32. | శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్చరిత్ర) | 120-00 |
| 33. | గజాననమహారాజ్ చరిత్ర | 99-00 |



# జ్యోతిషాలు

| | |
|---|---|
| 1. 'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ) | 72.00 |
| 2. గ్రహభూమి పంచాంగము (గార్గేయ) | 108.00 |
| 3. ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి) | 63.00 |
| 4. ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి) | 45.00 |
| 5. ములుగు వారి రాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి | 12.00 |
| 6. కాలచక్రంజ్యోతిషక్యాలండర్ | 30.00 |
| 7. గ్రహబలం క్యాలండర్ (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి) | 30.00 |
| 8. శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్ | 30.00 |
| 9. సాదా క్యాలండర్ | 5.00 |
| 10. పాకెట్ క్యాలండర్ | 15.00 |
| 11. తాజకనీలకంఠీయమ్ | 100-00 |
| 12. కేరళ జ్యోతిష రహస్యాలు | 180-00 |
| 13. జ్యోతిష బ్రహ్మ రహస్యాలు | 180-00 |
| 14. మానసాగరి జాతకపద్ధతి | 180-00 |
| 15. వరాహమిహిర జాతకపద్ధతి | 180-00 |
| 16. వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు | 99-00 |
| 17. సింపుల్ రెమిడీస్ | 180-00 |
| 18. శంభు హోరప్రకాశిక | 250-00 |
| 19. పూర్వ పరాశరి | 100-00 |
| 20. పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం | 200-00 |
| 21. ప్రశ్న సింధు | 99-00 |
| 22. నక్షత్ర విశేష ఫలితాలు | 63-00 |
| 23. సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా? | 180-00 |
| 24. దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా? | 180-00 |
| 25. ఆయుర్దాయ నిర్ణయం | 63-00 |
| 26. జాతక గణిత ప్రవేశిక | 63-00 |
| 27. జ్యోతిషమర్మబోధిని | 63-00 |
| 28. జ్యోతిష ప్రశ్నోత్తరమాల | 63-00 |
| 29. ముహూర్తం నిర్ణయించడంఎలా? | 63-00 |
| 30. జాతక మకరందం | 63-00 |
| 31. జ్యోతిష సరస్వతి | 63-00 |
| 32. మీజననకాల విశేషాలు | 63-00 |
| 33. ముహూర్త విజ్ఞాన భాస్కరం | 63-00 |
| 34. జ్యోతిష స్వయంబోధిని | 63-00 |
| 35. శుభముహూర్త శిరోమణి | 63-00 |
| 36. నక్షత్ర ఫలమంజరి | 36-00 |
| 37. పంచాంగం చూసే విధానం | 36-00 |
| 38. సర్వార్థ జ్యోతిషం | 36-00 |
| 39. ప్రాథమిక జ్యోతిషం | 36-00 |
| 40. నవరత్నములు శుభయోగములు | 36-00 |

| | | |
|---|---|---|
| 41. | శుభశకునాలు | 30-00 |
| 42. | హస్తరేఖాఫలితాలు | 36-00 |
| 43. | సంఖ్యల్లో భవిష్యత్ | 36-00 |
| 44. | ముహూర్త దీపిక | 99-00 |
| 45. | పుట్టుమచ్చలు ఫలితాలు | 30-00 |
| 46. | కలలు ఫలితాలు | 30-00 |
| 47. | జాతక చక్రం వేయడం ఎలా? | 36-00 |
| 48. | మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు | 250-00 |
| 49. | జ్యోతిషశాస్త్ర చిట్కాలు | 120-00 |
| 50. | గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050) | 999-00 |
| 51. | ప్రశ్నచండేశ్వరమ్ | 63-00 |
| 52. | ద్వాదశభావ ఫలచంద్రిక | 250-00 |
| 53. | జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు) | 120-00 |
| 54. | అంగసాముద్రికం | 36-00 |
| 55. | హస్త సాముద్రికం | 63-00 |
| 56. | లాల్ కితాబ్ | 99-00 |
| 57. | శకునశాస్త్రం | 63-00 |
| 58. | ఆధునికప్రశ్నశాస్త్రం | 120-00 |
| 59. | పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం | 180-00 |
| 60. | అష్టకవర్గు (కొండపల్లి) | 63-00 |
| 61. | బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ) | 250-00 |
| 62. | లగ్నరత్నాకరం | 63-00 |
| 63. | షట్పంచాశిక | 120-00 |
| 64. | 40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి | 270-00 |
| 65. | 40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి | 180-00 |
| 66. | 40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం | 180-00 |
| 67. | 40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు | 270-00 |
| 68. | 40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి | 250-00 |
| 69. | మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి) | 270-00 |
| 70. | కె.పి.జ్యోతిషం (పరిచయం) | 63-00 |
| 71. | ముహూర్తచింతామణి | 99-00 |
| 72. | సూర్యచంద్ర గ్రహణములు | 63-00 |
| 73. | ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప) | 180-00 |
| 74. | అదృష్టరెమెడీస్ | 144-00 |
| 75. | గ్రహసంచార ఫలనిర్ణయదీపిక | 63-00 |
| 76. | జ్యోతిష రెమిడీస్ | 300-00 |
| 77. | జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి) | 250-00 |
| 78. | జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి) | 250-00 |
| 79. | నాడీజ్యోతిషం | 63-00 |
| 80. | నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | 63-00 |

| | | |
|---|---|---|
| 81. | లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | 63-00 |
| 82. | గౌతమసంహిత | 63-00 |
| 83. | హోరారత్నమాల | 63-00 |
| 84. | జాతకఫల మణిమంజరి | 200-00 |
| 85. | పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25) | 560-00 |
| 86. | దశాభుక్తిఫల నిర్ణయం | 250-00 |
| 87. | వింత జోష్యములు | 63-00 |
| 88. | షోడశవర్గులు | 200-00 |
| 89. | రవిగ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 90. | చంద్ర గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 91. | కుజ గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 92. | బుధ గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 93. | గురు గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 94. | శుక్ర గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 95. | శని గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 96. | రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు | 99-00 |
| 97. | ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు | 99-00 |
| 98. | ముహూర్తమార్తాండం | 63-00 |
| 99. | లఘుజాతకం | 63-00 |
| 100. | జాతకాలంకారము | 63-00 |
| 101. | మేషలగ్న ఫలితములు | 99-00 |
| 102. | వృషభ లగ్న ఫలితములు | 99-00 |
| 103. | మిధున లగ్న ఫలితములు | 99-00 |
| 104. | కర్కాటక లగ్న ఫలితములు | 99-00 |
| 105. | సింహలగ్న ఫలితములు | 99-00 |
| 106. | కన్యలగ్న ఫలితములు | 99-00 |
| 107. | తుల లగ్న ఫలితములు | 99-00 |
| 108. | వృశ్చిక లగ్న ఫలితములు | 99-00 |
| 109. | ధనుస్సు లగ్న ఫలితములు | 99-00 |
| 110. | మకర లగ్న ఫలితములు | 99-00 |
| 111. | కుంభ లగ్న ఫలితములు | 99-00 |
| 112. | మీన లగ్న ఫలితములు | 99-00 |
| 113. | నారద సంహిత | 200-00 |
| 114. | పంచాంగపీఠికలేఖికాగణితం | 250-00 |
| 115. | తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప) | 99-00 |
| 116. | సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా) | 200-00 |
| 117. | రాహు కేతువుల యోగము | 99-00 |
| 118. | ఛాయాగ్రహములు | 99-00 |
| 119. | జ్యోతిషవిజ్ఞాన దీపిక | 63-00 |

## బి.వి.రామన్ గారి గ్రంథములు

| | |
|---|---|
| 120. జ్యోతిష విద్యారంభం | 50-00 |
| 121 గ్రహభావ బలములు | 50-00 |
| 122. కాలచక్రదశ | 50-00 |
| 123. అనుభవ ప్రశ్నాజ్యోతిషం | 50-00 |
| 124. జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు | 50-00 |
| 125. పురోగామి జాతకం | 50-00 |
| 126. భావార్థరత్నాకరం | 75-00 |
| 127. భారతీయజ్యోతిష సర్వస్వం | 75-00 |
| 128. అష్టకవర్గ పద్ధతిః | 75-00 |
| 129. జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు | 75-00 |
| 130. ప్రశ్నతంత్ర | 75-00 |
| 131. ముహూర్తం | 75-00 |
| 132. విశిష్ట జాతకములు | 125-00 |
| 133. భారతీయఫలితజ్యోతిషం | 125-00 |
| 134. 300 ముఖ్యమైన యోగములు | 125-00 |
| 135. జాతకంపరిశీలించడంఎలా ? | 300-00 |

## రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

| | |
|---|---|
| 136. బృహత్పరాశరహోరాశాస్త్రము-1 | 200-00 |
| 137. బృహత్పరాశరహోరాశాస్త్రము-2 | 200-00 |
| 138. బృహత్పరాశరహోరాశాస్త్రము-3 | 200-00 |
| 139. బృహత్పరాశరహోరాశాస్త్రము-4 | 200-00 |
| 140. భావార్థరత్నాకరము | 100-00 |
| 141. ముహూర్త చింతామణి | 100-00 |
| 142. ముహుర్త చింతామణి-పార్టు2 | 200-00 |
| 143. స్వప్న శాస్త్రము | 36-00 |
| 144. శతయోగమంజరి | 50-00 |
| 145. వ్రతనిర్ణయకల్పవల్లి | 250-00 |
| 146. దైవజ్ఞవల్లభం | 75-00 |
| 147. వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం) | 250-00 |
| 148. వాస్తుశాస్త్రవివేకము-1 | 100-00 |
| 149. వాస్తుశాస్త్రవివేకము-2 | 200-00 |
| 150. వాస్తుశాస్త్రవివేకము-3 | 100-00 |
| 151. వాస్తుశాస్త్రవివేకము-4 | 200-00 |
| 152. అనుభవసులభవాస్తు - 1 | 50-00 |
| 153. అనుభవసులభవాస్తు - 2 | 100-00 |
| 154. పంచాంగ వివేకము | 99-00 |
| 155. వశిష్ఠ సంహిత | 360-00 |
| 156. పంచపక్షి శాస్త్రం (కేస్‌బైండ్) | 200-00 |



# వాస్తులు

| | | |
|---|---|---|
| 1. | 40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి | 180-00 |
| 2. | వాస్తుశాస్త్ర రహస్యములు | 200-00 |
| 3. | వాస్తునుబట్టి మీ ఇల్లు | 63-00 |
| 4. | మీరూ మీ వాస్తు | 63-00 |
| 5. | గృహవాస్తు చిట్కాలు | 63-00 |
| 6. | వాస్తు పూజ | 63-00 |
| 7. | వాస్తు సూత్రములు | 63-00 |
| 8. | వాస్తుశాస్త్ర రహస్యాలు | 63-00 |
| 9. | గృహవాస్తు వర్గులు | 99-00 |
| 10. | విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు | 63-00 |
| 11. | విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు | 99-00 |
| 12. | విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా) | 180-00 |
| 13. | ఆధునిక గృహవాస్తు | 99-00 |
| 14. | శుభవాస్తు | 270-00 |
| 15. | వాస్తుయంత్ర రత్నావళి | 120-00 |
| 16. | వాస్తుశాస్త్రం | 120-00 |
| 17. | హౌస్ ప్లాన్స్ | 63-00 |
| 18. | గృహనిర్మాణ వాస్తు | 63-00 |
| 19. | వాస్తు రెమెడీస్ | 63-00 |
| 20. | గృహవాస్తు దర్పణం | 63-00 |
| 21. | జ్యోతిష-గృహవాస్తుచంద్రిక | 200-00 |
| 22. | వాస్తురత్నాకరం (కొండపల్లి) | 63-00 |
| 23. | వాస్తుశిరోమణి ,, | 120-00 |
| 24. | వాస్తుసంగ్రహమ్ ,, | 63-00 |
| 25. | పంచవాస్తు పారిజాతం ,, | 120-00 |
| 26. | వాస్తుడిండిమమ్ ,, | 63-00 |
| 27. | వాస్తుదుందిభి ,, | 120-00 |
| 28. | విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్) | 250-00 |
| 29. | కృష్ణవాస్తుశాస్త్రము | 63-00 |
| 30. | జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్) | 99-00 |
| 31. | మయవాస్తు (గోరసవీరభద్రాచార్య) | 120-00 |
| 32. | వాస్తు జ్యోతి | 63-00 |
| 33. | మన ఇల్లు-మనవాస్తు | 99-00 |
| 34. | వాస్తవ వాస్తుపూజావిధానము | 108-00 |
| 35. | వాస్తు దర్పణం | 120-00 |



# మంత్రశాస్త్రాలు



| | | |
|---|---|---|
| 1. | మంత్రసాధన | 63-00 |
| 2. | తంత్రజాలం | 63-00 |
| 3. | మంత్రశక్తి | 63-00 |
| 4. | దత్తాత్రేయ తంత్రవిద్య | 63-00 |
| 5. | దత్తాత్రేయ మూలికాతంత్రమ్ | 63-00 |
| 6. | తాంత్రిక పంచాంగం | 63-00 |
| 7. | యక్షిణీ తంత్రం | 63-00 |
| 8. | మంత్రానుష్ఠాన చంద్రిక | 63-00 |
| 9. | సర్వదేవతా మంత్రకవచములు | 63-00 |
| 10. | మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు) | 63-00 |
| 11. | సర్వదేవతా మంత్రరత్నావళి | 63-00 |
| 12. | సదాచార దీపిక | 63-00 |
| 13. | యోగినీ-వామకేశ్వరతంత్రం | 63-00 |
| 14. | ప్రపంచసారతంత్రం | 63-00 |
| 15. | బదనిక తంత్రమ్ | 63-00 |
| 16. | ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్ | 63-00 |
| 17. | గుప్త సాధన తంత్రం | 63-00 |
| 18. | గంధర్వ తంత్రమ్ | 63-00 |
| 19. | సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి) | 63-00 |
| 20. | యంత్ర మంత్ర తంత్ర | 63-00 |
| 21. | పాశుపత తంత్రం | 99-00 |
| 22. | పంచదశ మహాఖడ్గ తంత్రం | 99-00 |
| 23. | రుద్రాష్టాధ్యాయః | 99-00 |
| 24. | మంత్రసిద్ధి | 120-00 |
| 25. | పరశురామతంత్రమ్ | 108-00 |
| 26. | శ్రీలలితావిలోమ పంచదశీ | 108-00 |
| 27. | శ్రీ గురు తంత్రం | 108-00 |
| 28. | గాయత్రీ తంత్రమ్ | 108-00 |
| 29. | మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు | 150-00 |
| 30. | శ్రీ దుర్గ తంత్రమ్ | 200-00 |
| 31. | మహామృత్యుంజయఅమృతపాశుపతమ్ | 200-00 |
| 32. | సర్ప (నాగ)తంత్రం | 250-00 |
| 33. | హవన తంత్రం | 250-00 |
| 34. | షోడశనిత్యతంత్రం | 250-00 |
| 35. | శాక్తేయతంత్రం | 250-00 |

| | | |
|---|---|---|
| 36. | రుద్రయామళతంత్రం | 250-00 |
| 37. | లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 38. | హిరణ్యశూలినీ తంత్రమ్ | 250-00 |
| 39. | మాయాప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 40. | శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 41. | స్వర్ణాకర్షణభైరవతంత్రం | 250-00 |
| 42. | కాశీవిశాలాక్షి తంత్రం | 250-00 |
| 43. | శాంతితంత్రమ్ | 250-00 |
| 44. | యంత్రసిద్ధి | 360-00 |
| 45. | శ్రీ లక్ష్మీ తంత్రమ్ | 360-00 |
| 46. | మంత్రమహోదధి (స్త్రీదేవతాకల్పమ్) | 360-00 |
| 47. | మంత్రమహోదధి (పురుషదేవతాకల్పమ్) | 360-00 |
| 48. | మంత్రశాస్త్రం (గ్రంథము) | 360-00 |
| 49. | ప్రత్యంగిరాకృత్యాతంత్రం | 360-00 |
| 50. | కామధేనువు తంత్రం | 360-00 |
| 51. | శూలినీదుర్గాతంత్రం | 360-00 |
| 52. | శ్రీవిద్య రహస్యం | 290-00 |
| 53. | కులార్ణవ తంత్రమ్ | 150-00 |
| 54. | ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్) | 390-00 |
| 55. | సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం) | 63-00 |



## గ్రంథాలు - ఆరాధనలు

| | | |
|---|---|---|
| 1. | భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం | 54-00 |
| 2. | భగవద్గీత (వచనం) | 99-00 |
| 3. | భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్ | 72-00 |
| 2. | గణేశ ఆరాధన 1 | 99-00 |
| 3. | గణేశోపాసన 2 | 99-00 |
| 4. | నవగ్రహవైభవం | 99-00 |
| 5. | నవగ్రహ రెమెడీస్ | 99-00 |
| 6. | నవగ్రహ వేదం | 99-00 |
| 7. | శనిగ్రహారాధన | 99-00 |
| 8. | ఆదిత్యారాధన | 99-00 |
| 9. | సుబ్రహ్మణ్యారాధన | 99-00 |
| 10. | శ్రీ శివ ఆరాధన | 99-00 |
| 11. | లక్ష్మీ ఆరాధన | 99-00 |
| 12. | హనుమదారాధన | 99-00 |
| 13. | లలితారాధన | 99-00 |

| | | |
|---|---|---|
| 14. | శ్రీ చక్రారాధన | 99-00 |
| 15. | గాయత్రీ ఆరాధన | 99-00 |
| 16. | వీరభద్రారాధన | 99-00 |
| 17. | కుజగ్రహారాధన | 99-00 |
| 18. | భైరవారాధన | 99-00 |
| 19. | దైవారాధన | 99-00 |
| 20. | గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత) | 99-00 |
| 21. | శ్రీవేంకటేశ్వరాధన | 99-00 |
| 22. | హయగ్రీవారాధన | 99-00 |
| 23. | లక్ష్మీనరసింహారాధన | 99-00 |
| 24. | శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం | 99-00 |
| 25. | దేవీ లీలామృతం | 99-00 |
| 26. | పురాణపండ సుందరకాండ వచనం | 99-00 |
| 27. | పురాణపండ రామాయణం | 99-00 |
| 28. | పురాణపండ భారతం | 99-00 |
| 29. | పురాణపండ భాగవతం | 99-00 |
| 30. | (సూరి) వాల్మీకి రామాయణం | 99-00 |
| 31. | కాలసర్ప యోగం | 99-00 |
| 32. | నిత్య జీవితములో రుద్రాక్షలు | 99-00 |
| 33. | నిత్య జీవితములో నవరత్నాలు | 99-00 |
| 34. | వేదసూక్తములు | 99-00 |
| 35. | వేమన పద్యసారామృతం | 99-00 |
| 36. | పండగలు పర్వదినాలు | 99-00 |
| 37. | సూక్తిరత్నాలు | 99-00 |
| 38. | హనుమచ్చరిత్ర | 99-00 |
| 39. | నవగ్రహ దర్శనమ్ | 99-00 |
| 40. | నిత్యజీవితంలో నవగ్రహాలు | 99-00 |
| 41. | సాలగ్రామములు | 99-00 |
| 42. | గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ | 99-00 |
| 43. | శనిగ్రహరెమిడీస్ | 99-00 |
| 44. | జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని | 99-00 |
| 45. | వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి) | 99-00 |
| 46. | మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,, | 99-00 |
| 47. | మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,, | 99-00 |
| 48. | న్యూమరాలజీ రెమిడీస్ | 99-00 |
| 49. | మూకపంచశతీ | 99-00 |
| 50. | శ్రీరామకర్ణామృతం | 99-00 |
| 51. | రహస్యకుక్కుటశాస్త్రం | 300-00 |
| 52. | ఉపాసన విధానం | 99-00 |
| 53. | పంచమవేదం మహాభారతం | 99-00 |

| | | | |
|---|---|---|---|
| 54. | దేవుళ్ళు డాట్ కామ్ | | 99-00 |
| 55. | గణపతిభాష్యం | | 99-00 |
| 56. | యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి | | 99-00 |
| 57. | నవయోగులు | | 99-00 |
| 58. | ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు | | 99-00 |
| 59. | సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో) | | 99-00 |
| 60. | సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్) | | 216-00 |
| 61. | సకలదేవతా సహస్రనామములు | | 99-00 |
| 62. | ఆధ్యాత్మిక సూక్తి నిధి | | 99-00 |
| 63. | బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు | | 99-00 |
| 64. | సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు | | 99-00 |
| 65. | శ్రీ లక్ష్మీసన్నిధి | | 99-00 |
| 66. | శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం | | 99-00 |
| 67. | మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి) | | 99-00 |
| 68. | మ్యాజిక్‌గైడ్ | | 99-00 |
| 69. | చదరంగం | | 99-00 |
| 70. | పంచముఖ హనుమత్ వైభవం | | 63-00 |
| 71. | గరుడపురాణం | | 40-00 |
| 72. | మాఘపురాణం | | 36-00 |
| 73. | శివపురాణం | | 36-00 |
| 74. | వైశాఖపురాణం | | 36-00 |
| 75. | కార్తీక పురాణం | | 36-00 |
| 76. | కార్తీక పురాణం (చిన్నది) | | 25-00 |
| 77. | సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ | | 63-00 |
| 78. | పెద్దబాలశిక్ష | | 50-00 |
| 79. | గాయత్రీ మహిమ | | 36-00 |
| 80. | వృక్షదేవతలు | | 63-00 |
| 81. | యాజుష స్మార్త సంస్కార చంద్రిక | | 200-00 |
| 82. | సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్ | | 150-00 |
| 83. | చతుర్వేదములు | | 120-00 |
| 84. | నవగ్రహారాధన | | 120-00 |
| 85. | తాళపత్ర సమాహార గోపురం | | 120-00 |
| 86. | మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు) | | 250-00 |
| 87. | మానవధర్మములు | | 120-00 |
| 88. | వేదమంత్ర సంహిత | | 120-00 |
| 89. | సహస్రలింగార్చన | | 120-00 |
| 90. | శ్రీ శివగీత | | 120-00 |
| 91. | ద్వాదశఉపనిషత్తులు | | 120-00 |
| 92. | పురాణపండవారి సౌందర్యలహరి | (కేస్‌బైండ్) | 250-00 |
| | (శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో) | సాదా | 120-00 |
| 93. | బృహత్ శివ స్తోత్ర రత్నాకరము | | 200-00 |
| 94. | బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము | | 200-00 |
| 95. | బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము | | 200-00 |

| | |
|---|---|
| 96. కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు | 63-00 |
| 97. దక్షిణావృత శంఖములు | 63-00 |
| 98. 108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని | 36-00 |
| 99. ధర్మసింధువు(కేస్‌బైండింగ్) | 270-00 |
| 100. భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని | 99-00 |
| 101. చిలుకూరి బాలాజీచరిత్ర | 36-00 |
| 102. భగవత్‌స్తుతి | 63-00 |
| 103. సూర్యోపాసన | 36-00 |
| 104. కాశీఖండం | 250-00 |
| 105. దేవీభాగవతం | 360-00 |
| 106. శ్రీ ఆంజనేయం | 216-00 |
| 107. ధర్మసందేహాలు | 216-00 |
| 108. ఆధ్యాత్మిక దైవిక వస్తువులు | 250-00 |
| 109. రామాయణం | 600-00 |
| 110. పోతన భాగవతం | 900-00 |
| 111. శివమంత్రములు | 63-00 |



## వైద్య గ్రంథాలు

| | |
|---|---|
| 1. ఆహారం ఆరోగ్యం | 36-00 |
| 2. మూలికావైద్య చిట్కాలు | 36-00 |
| 3. ఆయుర్వేద వైద్య చిట్కాలు | 30-00 |
| 4. గృహవైద్య రహస్యాలు | 36-00 |
| 5. గృహవైద్యసారం | 36-00 |
| 6. హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స) | 63-00 |
| 7. ప్రకృతివైద్యం | 36-00 |
| 8. ఆహారం-వైద్యం | 99-00 |
| 9. సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం | 99-00 |
| 10. ఆయుర్వేదమ్ | 36-00 |
| 11. ఆయుర్వేద మూలికావైద్యదీపిక | 99-00 |
| 12. దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు) | 99-00 |
| 13. ఏకమూలికావైద్యం | 99-00 |
| 14. అష్టాంగ హృదయం (4భాగాలు) | 1200-00 |
| 15. రహస్యసిద్ధయోగవైద్యసారమ్ | 99-00 |
| 16. ప్రాథమిక హోమియోవైద్యం | 99-00 |
| 17. ఒబెసిటీ | 99-00 |
| 18. హెల్త్‌గైడ్ | 99-00 |
| 19. ఆయుర్వేదం-జీవనవేదం | 99-00 |
| 20. ఫుడ్‌థెరపి | 63-00 |

| | | |
|---|---|---|
| 21. | న్యాచురల్‌థెరపి | 99-00 |
| 22. | సంపూర్ణఆరోగ్యానికి 20ని॥ | 63-00 |
| 23. | కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే... | 99-00 |
| 24. | యోగామంత్ర | 63-00 |
| 25. | యోగా మండే టు సండే | 63-00 |
| 26. | హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే | 99-00 |
| 27. | హెల్త్‌ఫైల్ | 108-00 |
| 28. | వస్తుగుణపాఠం | 250-00 |
| 29. | రసాయన వాజీకరణ తంత్రం | 150-00 |
| 30. | వస్తుగుణ మకరందం | 400-00 |
| 31. | నాటువైద్యం -(కేస్‌బైండ్) | 360-00 |
| 32. | నాటువైద్యం (చిన్నది) | 99-00 |
| 33. | ప్రాణాయామము-యోగ | 63-00 |



## అయ్యప్ప - భవానీ రకాలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ అయ్యప్ప లీలామృతం | 30-00 |
| 2. | శ్రీ అయ్యప్ప భజనపాటలు | 63-00 |
| 3. | శ్రీ అయ్యప్ప పూజాకల్పం | 20-00 |
| 4. | శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు | 20-00 |
| 5. | హారతిగైకొనుమా | 40-00 |
| 6. | శ్రీ అయ్యప్ప దీక్ష F | 10-00 |
| 7. | శ్రీ అయ్యప్ప భజనమాల F | 10-00 |
| 8. | శ్రీ అయ్యప్ప నిత్యపూజ P | 10-00 |
| 9. | శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P | 10-00 |
| 10. | భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం) | 36-00 |
| 11. | దేవీలీలామృతం | 99-00 |
| 12. | శ్రీ దేవీ పూజాకల్పం | 20-00 |
| 13. | దేవీ భక్తిగీతాలు | 20-00 |
| 14. | భవానీదీక్ష P | 10-00 |
| 15. | దేవీ భక్తిమాల F | 10-00 |
| 16. | శ్రీ అయ్యప్ప భజనావళి | 120-00 |
| 17. | అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో) | 24-00 |



# భజనలు - కీర్తనలు

| | | |
|---|---|---|
| 1. | అన్నమయ్య కీర్తనలు | 20-00 |
| 2. | శ్రీరామదాసు కీర్తనలు | 20-00 |
| 3. | సర్వదేవతా మంగళహారతులు | 20-00 |
| 4. | వసుంధర మంగళ హారతులు | 25-00 |
| 5. | సౌభాగ్య దేవతా మంగళహారతులు | 36-00 |
| 6. | సర్వదేవతా భజనలు | 36-00 |
| 7. | చిట్టి పొట్టి పాటలు | 10-00 |
| 8. | జాతీయ గీతాలు | 10-00 |
| 9. | దేశభక్తి గీతాలు | 36-00 |
| 10. | పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు | 36-00 |
| 11. | గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు | 36-00 |
| 12. | అన్నమయ్య సంకీర్తనలు | 99-00 |
| 13. | పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు | 36-00 |
| 14. | భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్) | 36-00 |
| 15. | సర్వదేవతాభక్తిమణిమాల | 36-00 |
| 16. | బతుకమ్మ ఉయ్యాల పాటలు | 36-00 |
| 17. | అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు) | 270-00 |



# హిట్ సాంగ్స్



| | | |
|---|---|---|
| 1. | ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత | 36-00 |
| 2. | ఎస్.పి.బాలు భక్తిగీతాలు | 36-00 |
| 3. | ఘంటసాల సుమధురగీతాలు | 99-00 |
| 4. | పి. సుశీల సుమధురగీతాలు | 99-00 |
| 5. | ఎస్.పి. బాలు సుమధురగీతాలు | 99-00 |
| 6. | ఎస్.జానకి సుమధురగీతాలు | 99-00 |
| 7. | వేటూరి సుందరరామమూర్తిహిట్స్ | 99-00 |
| 8. | సర్వదేవతా సినీభక్తిగీతాలు | 99-00 |



# స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీకాంతామణి వంటలు (వెజ్) | 63-00 |
| 2. | శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్) | 63-00 |
| 3. | శాకాహార వంటలు | 30-00 |
| 4. | మాంసాహారవంటలు | 30-00 |
| 5. | చిట్టిచిట్కాలు | 30-00 |
| 6. | అందానికి చిట్కాలు | 30-00 |
| 7. | పిల్లల పేర్లు (పెద్దది) | 30-00 |
| 8. | పిల్లల పేర్లు (చిన్నది) | 10-00 |
| 9. | లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్ | 36-00 |
| 10. | లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్ | 36-00 |
| 11. | చిన్నారులకు చిరుతిళ్ళు | 30-00 |
| 12. | పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు | 30-00 |
| 13. | పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు | 30-00 |
| 14. | వేపుళ్ళు-ఇగుర్లు | 30-00 |
| 15. | బ్రేక్‌ఫాస్ట్ వంటలు | 30-00 |
| 16. | పండుగలలో చేసుకొనే పిండివంటలు | 30-00 |
| 17. | మైక్రోవోవెన్ వంటలు | 99-00 |
| 18. | సర్వదేవతాభక్తిమాల | 36-00 |
| 19. | పిల్లలపేర్లు (బాబు) | 36-00 |
| 20. | పిల్లలపేర్లు (పాప) | 36-00 |
| 21. | మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్) | 36-00 |
| 22. | మోడ్రన్ పిల్లలపేర్లు | 99-00 |
| 23. | నోరూరించే నాన్‌వెజ్‌వంటలు | 99-00 |
| 24. | మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్) | 99-00 |

# వివిధ రకములు

| | |
|---|---|
| ఎందరోమహానుభావులు | 270-00 |
| యోగాసనాలు | 36-00 |
| సూర్యనమస్కారములు | 36-00 |
| పొడుపు కథలు (చిన్నవి) | 10-00 |

| | |
|---|---|
| హిందీ-తెలుగు-స్వబోధిని | 20-00 |
| ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని | 20-00 |
| జనరల్ నాలెడ్జ్ | 20-00 |
| నూరు ఎక్కాలు | 10-00 |
| 1-100 టేబుల్ బుక్ | 10-00 |
| 1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు) | 4-50 |
| శ్రీరామకోటి | 27-00 |
| శ్రీశివకోటి | 27-00 |
| మేజిక్ | 30-00 |
| అంకెలతో గారడీ | 30-00 |
| హృదయస్పందన (కవితలు) | 30-00 |
| వాత్స్యయన కామసూత్రాలు | 36-00 |
| ఎ.పి.టూరిస్ట్ గైడు | 36-00 |
| ఇంద్రజాల రహస్యాలు | 30-00 |
| మహేంద్రజాల రహస్యాలు | 30-00 |
| శరీరభాష (బాడీ లాంగ్వేజ్) | 99-00 |
| క్రియాయోగం | 36-00 |
| ఆనందంగా జీవిద్దాం | 99-00 |
| హరిశ్చంద్ర నాటకం | 50-00 |
| వాత్సాయనకామసూత్రాలు | 99-00 |
| పంచసాయకం | 99-00 |
| రతిరహస్యాలు | 99-00 |
| అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్) | 99-00 |
| శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్) | 99-00 |
| గాయత్రీవిజ్ఞాన్ | 99-00 |
| చింతామణి (నాటకం) | 50-00 |
| బాలనాగమ్మ | 50-00 |
| కాళహస్తి స్త్రీల వ్రతకథలు | 36-00 |
| కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి) | 50-00 |
| కాళహస్తి గోవింద నామాల భగవద్గీత | 36-00 |
| కాళహస్తి గృహవాస్తు చింతామణి | 99-00 |
| కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు) | 63-00 |
| రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు) | 90-00 |
| ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా | 10-00 |
| ఎం.ఎస్.ఆర్.సుందరకాండ | 80-00 |
| బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల) | 125-00 |
| శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం | 40-00 |
| కాశీరామేశ్వర మజిలీ కథలు | 63-00 |
| శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం) | 600-00 |

| | | |
|---|---|---|
| ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు | | 595-00 |
| ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు | | |
| విశ్వకర్మ ప్రకాశము | | 80-00 |
| ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన | ,, | 250-00 |
| నారద సంహిత | ,, | 150-00 |
| వాస్తురాజవల్లభము-మూలానువాదము | ,, | 60-00 |
| మయమతము - వచనము | ,, | 80-00 |
| బృహత్సంహిత - వచనము | ,, | 160-00 |
| వాస్తువిజ్ఞానజ్యోతి | | ...... |
| పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య) | | .... |
| విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు | ,, | .... |
| వాస్తు విజ్ఞాన చంద్రిక | ,, | .... |
| మహాదశా పారిజాతం | ,, | .... |
| వాస్తు నారాయణీయం | ,, | 120-00 |
| యోగావళీఖండం | ,, | 120-00 |
| ముహూర్తసింధువు | | 150-00 |
| సర్వార్థచంద్రిక (4భాగాలు) | | 1208-00 |
| మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్) | | 370-00 |
| నిర్ణయసింధు (2భాగాలు) | | 590-00 |
| సాయి... | ,, | 45-00 |
| శ్రీ దుర్గానందలహరి | ,, | 200-00 |
| ఆరతిసాయిబాబా | ,, | 11-00 |
| ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి) | | 500-00 |
| తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర | | 100-00 |



## సుమారు 100 సం॥రాలు నాటి ప్రాచీన ప్రతులు (జిరాక్స్ ప్రింట్)

| | |
|---|---|
| శ్రీరామ మంత్రానుష్ఠానము | 300-00 |
| శ్రీరామనవరాత్రోత్సవకల్పః | 300-00 |
| సీతారామ కథా సుధ అయోధ్యకాండ | 200-00 |
| సీతారామ కథా సుధ బాలకాండ | 150-00 |
| అరణ్యకాండ | 100-00 |
| శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు | 200-00 |
| స్మార్త కాపర్ది కారికలు | 200-00 |
| నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి | 200-00 |
| విషవైద్య చింతామణి | 200-00 |
| హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః | 300-00 |
| సర్వమూలికా గుణరత్నాకరం | 300-00 |
| ఆపస్థంబీయ ధర్మసూత్రాలు | 300-00 |
| సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం | 200-00 |

## మావద్ద లభించు గ్రంథములు...మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం,రాజమహేంద్రవరం.

| | |
|---|---|
| గణకరంజని | 200-00 |
| సంతాన దీపిక | 200-00 |
| తిథినిర్ణయ కాణ్డః | 250-00 |
| ముహూర్త దర్పణం | 200-00 |
| జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి) | 250-00 |
| లఘుతాచకము | 200-00 |
| శ్రీ వైఖనస పైతృమేధిక ప్రయోగః | 300-00 |
| స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం) | 400-00 |
| జాతకామృతతసారం | 300-00 |
| జాతక బోధిని | 300-00 |
| సంగీత విద్యాదర్పణం | 300-00 |
| సంగీత సర్వార్థసారసంగ్రహం | 300-00 |
| ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం) | 450-00 |
| జాతకరహస్యం | 200-00 |
| రాజమార్తాండం | 200-00 |
| ఆయుర్దాయదీపిక | 200-00 |
| వైద్యామృతం | 200-00 |
| అనుపానమంజరీ | 200-00 |
| నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః | 200-00 |
| చికిత్సరత్నము | 200-00 |
| స్వరచింతామణి | 200-00 |
| ద్వాదశలోహ భస్మవిధానం | 200-00 |
| దైవజ్ఞయశో విభూషణం | 200-00 |
| అనుపాన రత్నకరము | 200-00 |
| కాలామృతము | 250-00 |
| దైవజ్ఞకర్ణామృతము | 300-00 |
| రసేంద్ర చింతామణి | 300-00 |
| రసరత్న సముచ్చయం | 300-00 |
| వస్తుగుణరత్నాకరము | 300-00 |
| హోరానుభవదర్పణము | 360-00 |
| విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము | 250-00 |
| స్త్రీజన కల్పవల్లి | 450-00 |
| సంగీత సర్వార్థ సంగ్రహం | 300-00 |
| సంగీత సుధాసంగ్రహము | 250-00 |
| అర్క ప్రకాశము | 200-00 |
| సంగీత మార్తాండము | 200-00 |
| సంగీత ప్రథమబోధిని | 200-00 |
| వైద్యకల్పతరువు | 200-00 |
| రసప్రదీపిక | 250-00 |
| గణకానందము | 250-00 |